భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

ఫిబ్రవరి 1963

సంపుటము 40 : సంచిక 2

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1963

మన్మథ చందనము

జమదగ్ని

గుత్తుల్ గుత్తులు పూచి సౌరభము దిక్కుల్ నిండ లో వెల్గు మై
పొత్తుం జూపెడి నాగమల్లి యొకఁడున్ పూజార్థమై పుట్టి వ్యా
వృత్తంబౌ నవమల్లికా తతియు పర్వెన్ తెల్గు పూఁదోట నీ
చిత్తం బేచిన మన్మథాబ్దమున సచ్చిత్సౌఖ్య రూపా! శివా!

నిలువెల్లన్ తలపూవు సౌరభముతో నీ వెల్గు మైపూతకై
పొలిచెన్ చందన భూరుహం బొకఁడు వేల్పుం దోట జాత్యంకురం
బిలకుం దెచ్చితివేమొ, యా పరిమళం బేమందు! భోగీంద్రమం
డలికిం బ్రాపయి నింగి నల్దెసల పట్టన్ రాక వ్యాపించెడిన్.

మూలం బందున శంభుదానతయు విప్పం గొప్పపై రెమ్మలో
శ్రీ లాస్యమ్మును వేంకటేశ్వర మహాకీర్తియై రమాకాంతు మై
త్రీ లాభంబును గల్గి సాధువగు నీ శ్రీచందనాగమ్మ ని
న్నోలాడించిన దాత్మలో నిలిపి నిత్యోద్గారి సౌగంధ్యమై!

పలుకు వెలంది మై పసిడి వన్నియ గ్రొంజిగి హెచ్చు కమ్మతా
వుల వలపుల్ గుబుల్కొను నపూర్వ పరిష్కరణాంగరాగ చ
ర్చలకయి యూరియూరి తఱుచై పదనేచిన మేటిమ్రాను, ని
ర్మలతర చారుమూర్తి హిత మన్మథచందనమున్ నుతించెదన్.

అరువది యేడువత్సరములైన శతాయువు నిండఁ జేయు క
ల్లరివయి మోసగింపకుము, లాభము గూబలలోనఁ దేలు, తెం
పరు లిఁక ముందువాగు, పిలువందలపోయరు, విందవౌదువే?
కరుణను తెల్గుతోట తొలికానుపులన్ నవకమ్ము నింపవే!

చార్విక్యమ్ము ముగింపకే యొకటిగా నీశా! చందనాగమ్మ, నీ
యర్చానిష్ఠయు, తావి పెల్లుబుకు మేలై నిల్వ మన్నింపవే!
చర్చా సుందరమూర్తిపై సుమముల శ్రాంతంబు నర్పించి నిన్
వార్చున్ గూర్చును నాగమల్లి, యిడు దేవా! సౌష్ఠవాయుష్యముల్.

కవుకొండలా, అడవి; పింగళి కాటూరి; నాయని, కవులు

డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

4

ఆధునికాంధ్ర కవులలో కవుకొండల వెంకటరావుగారిదీ అడవి బాపిరాజుగారిదీ కొత్తగొంతు. వీరిరువురూ కూల్డ్రే పండితుని శిష్యులు. తన శిష్యులలో ఆవిర్భవించే రచనాచైతన్యానికి దోహదముచేసి పెంచడమూ సహోపాధ్యాయుల నేర్పును గుర్తించి గౌరవించడమూ కూల్డ్రేదొర శీలమునకు రెండు కళ్ళు. ఆ చల్లనిగురువు ప్రబోధమును అందుకొని కవితారచన సాగించినవారు కవుకొండలవారు. కూల్డ్రేదొర వసతిగృహావరణలో వారము వారమూ జరిగే కళాగోష్ఠిలో వీరు తమరచనలను వినిపిస్తుండినప్పుడు వీరిని కూల్డ్రేదొర 'కవీ'అని సంబోధించేవారట. అప్పుడే వీరు 'కవికొండల'వారుగా మారినారని నా ఊహ. కవుకొండల గ్రామనామము, 'కవికొండల'కాదు.

ఆంగ్లకవితా ప్రభావమూ, రవీంద్రకీర్తి జ్యోతీ వీరిని కవితా రచనోన్ముఖుల గావించినవని నా కనిపిస్తుంది. వర్డ్స్వర్త్ కవీ, బర్న్సుకవీ రచించినట్లుగా పల్లెపట్టు సౌందర్యాన్నీ సరళస్వభావసౌందర్యాన్నీ ఆంధ్రకవులు ధారాళంగా వర్ణించక పోవడమూ, భారతీయకవికి ప్రపంచము జోహారు అర్పించడమూ గుర్తించి ఉత్సాహితులై కావ్యరచన కుపక్రమించినవారిలో కవికొండల వారొకరంటాను. 1916వ సంవత్సరములో వీరి వివిధ కుసుమావళి (Flower gathering) వచ్చింది. ఈ పేరు రవీంద్రుని (Fruit gathering)ని జ్ఞాపకము చేస్తుంది. వీరి 'ప్రకృతిచందనము' 'కలరుతము' 'శేషఫణితి' (విశేషించి) 'నెలబాలుడు' రవీంద్రుని కావ్యమాలల పేర్లను స్ఫురింప జేసేటివే. రవీంద్రునివలెనే వీరూ తమరచనలకు అంకెలనే శీర్షికలుగా ఇచ్చినారుకాని చివరిపుటల్లో పేర్లుకూడా ఇచ్చినారు. 'నెలబాలుడు' వీరికికుమారుడు కలిగిన ప్రమోదాన్నే కాక రవీంద్రుని నెలబాలుని ప్రభావాన్నికూడా భావాలలోనూ ఖండకావ్యాలలోనూ, పుణికి పుచ్చుకొని రూపొందినది. వీరి 'ద్విపళ లాక్ష' రవీంద్రుని (Stray birds) ని జ్ఞప్తికి తెస్తుంది. రాగరంజితములైన సూర్యాస్తమయాలూ, దారిపక్కల కన్నువిచ్చే శాద్వలసుమాలూ రవీంద్రుని రచనలలోవలె వీరిరచనలలోనూ తరుచు గోచరిస్తాయి. రవీంద్రునివలెనేవీరూ నాటకాలూ, నవలలూ, చిన్నకథలూ చాలారచించారు. అయితే వర్డ్స్వర్త్ కవికివలె వీరికినీ పల్లెపట్టులోనూ జానపదులలోనూ గోచరించే సరళసౌందర్యముమీదనే మొగ్గు. చిన్న అందము స్ఫురిస్తే చాలు దాన్ని ఒక కులకముగా రచిస్తారీయన. 'ఎఱ్ఱచిగిర్చిన రావిచెట్టూ, వరదలో కొట్టుకుపోయే అరటిచెట్టూ, పచ్చిక బీడుమీది ఆరుద్రపురుగు, ఎగిరేతూనీగ, విహారానికి పోయి కూర్చునేచోటుచుట్టూ కానవచ్చే దృశ్యాలూ, ఒకేవూరివార్ని ఇంకొకవూరిలో కలుసుకున్నప్పుడు తోచే చిరునవ్వూ, కలల్ని మరిచిపోవడమూ, గొడ్ల గిట్టలు రేపేధూళిని కడుక్కునే గొల్ల పిల్లవాడూ, వృద్ధదాసి బ్రతుకుతలపోతలూ, తాత యౌవనపు స్మృతులూ, తింటూనే ముష్టికి తిరిగే మధూకర భిక్షుకుడూ, యదాలాభముగా విన్నగీతములోని వింతమాటా, దుస్తుల్ని బురదచేసుకునే పిల్లవాడూ, పిల్లలు పరిగెత్తితే కన్నములో దాగుకునే యెఱ్ఱపీతభీతి, వృద్ధుని జీవితాభిమానమూ, రెండెడ్ల తిరుగుబండిమీద వచ్చే వెలగపండ్లమ్మే చిన్నదానినవ్వు, చెఱువు నీళ్లలో నిలువునా కంపించే ఎర్రకలువపూవూ, పొడుపుటేటి తొకతొకరుతీ, నదీతీరపు తెల్లపూత సయ్యాటమూ గుర్తించి రచిస్తారీయన. నాదమూ వర్ణమూ చలనమూ లలితమైన అందముతో కనిపిస్తాయి వీరిరచనలలో. వీరిమాటలలో 'జీవనము సన్నజాజిమొగ్గ', దినదినమూ జ్ఞానమనెడు తెలిరేకులు విడుచునట; 'జీవనము చిట్టిమేఘము' చిరునగవను ఇంద్ర

ధనుస్సు సింగారమిస్తుందట; 'జీవనము తెఱచావను బోవు చిన్ననావ', 'మృదుమధురము దానితేనె, సదమలంబు దానిచినుకు వదలకుండుదానిగాలి, స్వచ్ఛందము జీవనంబు సౌఖ్యదంబు జీవనంబు' అని ఈయన సందేశము.

'ప్రాణికోటి బ్రతుకుసందడి' ఈయన రచనాసామగ్రి ఈ రీతిగా వీరికవితనవ్యమే. మానవేతర ప్రకృతిసౌందర్యమేకాక మానవప్రకృతి సౌందర్యముకూడ వీరికవిత్వపు తెరమీద గోచరిస్తుంది. నిర్మలమైన వానదడిసి వింతచెలువముదాల్చు ఆకుమడీ పొడుగు చెట్లు నిల్చినట్టులె నిల్చి కోమలత బాయునీరెండ, తుమ్మచెట్ల వెనుక దొగరు ప్రొద్దుఱిగు, దూరాన్న సన్నబడే తోయు సుదీర్ఘపువీథి, దారంట గడ్డినిరుక్కుని చూసే గడ్డి పూవులూ, రాళ్లలో పరువుళ్లు తొక్కే నల్లనీళ్ల కృష్ణవేణీ, ఏటేటా చిగురుపట్టి ఏటేటా పూతపూతపూసి కోటివత్సరాల ప్రేమకూడ బెట్టే చెట్ల వాత్సల్యమూ, దోచుకొని పోయినట్లు కనబడే వట్టి పంటకళ్లమూ, అసురసంజలో అపరదిక్సతి తిలక మనిపించే చుక్కా ఒకవైపున వర్ణిస్తూ ఇంకొకవైపున అవ నుండి జీవనదిగ జాలువారు ఊటనీట తాటిపట్టె వంతెనకడ రేవులోన బచ్చగడ్డి తడుపుతూ పకపకనవ్వే మాలెతల్లి, తన పాట పెద్దవారి చెవినిబడిందన్న బిడియతో అలాఅలా కొబ్బరి మ్రాకుల చాటుననే నడబాటకు వడిదాటుచు తనవారలలో దబ్బున కలుసుకునే కూలిపడుచూ, మూపులను పెనుమోకు లూనుచు బరువులాగుతూ పాలిండ్ల పగడపు గుండ్లపేరునెంచే కూలియన్నల కుతుకమూ చిత్రిస్తారువీరు.

మద్దాలి సూర్యప్రకాశరావుగా రన్నట్టుగా ఈయన 'మనకవి'. తెలుగునాటి సౌందర్యమూ, తెలుగు జానపదుల సరళశీల సౌందర్యమూ వర్ణించారు ఈయన. గోదావరీ ప్రవాహమూ, వశిష్ట సాగరసంగమమూ, కాపవరపు చెఱువులో ప్రతిఫలించే కోరుకొండ లక్ష్మినరసింహస్వామి ఆలయపు తెలుపూ, ఆచెఱువు గట్టునవున్న వటవృక్షమూ, రాజమహేంద్రవరపు పొలిమేరల నున్న ప్రకృతి ప్రశాంత సౌందర్యమూ వర్ణించారీయన. ఇది మనచుట్టూ కనబడే సౌందర్యము. ఈయనమనకవి.

ఈయన రచనలు అసంఖ్యాకములు. గీతములూ, గీతికలూ వందలలోనే లెక్క. శివరాత్రిప్రభ, రాళ్లపడవ, కూలియన్నల కుతుకము, కోతపాట, ఎర్రకలువపూవు, నాగస్వరము, ఏలపాట వంటివి పదిపండ్రెండు ఖండకావ్యాలు వీరిరచనలల్లో మాణిక్యాల్లాగ మెరుస్తాయి. తక్కినవి ఎన్నో తగలకుండావే దాటుకుపోతాయి. కవి అన్నవాడికి ఊహలూ ఉద్దేశాలు తట్టుతూనే వుంటాయి. వాటినాతడు గుర్తుగా వ్రాసుకుని ఎప్పుడో సంతోషఘడియలో తీసి చక్కగా అల్లి ఖండకావ్యంగా తయారుచేస్తాడు. వెంకటరావుగారి అసంఖ్యాక రచనలు వారికవిత్వపు డైరీనుంచి నేరుగా అచ్చుకెక్కిపోయినవా అనిపిస్తాయి. లేకుంటే గ్రాంథికములోనూ కాక వ్యావహారికంలోనూకాక 'మా యిష్టం వచ్చినట్లుంటాము' అన్నట్లు ఎందుకుంటాయీ వీరిగీతికలూ ? దీనినిచూడండి, 'గోదావరి వడినొక్క ఓదొ పక్షియాకె యీదరికి గొట్టుకొంచే గుదేలి, జేసాచి యొకగుఱ్ఱతీసి దానితుడిచి వాసిమై బరికించె వ్రాయుటకో ? "ఓసి కనుమనుండొ నాసికా త్ర్యంబక వాసంబు నుండియోవచ్చి" తనుచు.' యీదరి అని నొక్కిచెప్పడంలో వ్యంజకశక్తి ఏదీ కానరాలేదునాకు. నాసిమై వ్యర్థపదము, ఖండము వేలెడులేదు, దానవ్యర్థ పదాలుకూడాను ! వ్రాయుటకో ?— సందేహమే ! సందేహమువల్ల ప్రయోజనములేదు: చదువరి దృష్టిని బలవంతాన ఎటో మళ్లించడముతప్ప. "ఓసి (పాపి) కనుమనుండొ వాసికాత్ర్యంబక వాసంబు నుండియోవచ్చి తనుమ", "నీవు వచ్చినది చేరుననున్న కనుమనుంచేనా నాసిక నుంచా" అని, దూరస్ఫురణవల్ల చిన్న వస్తువుల నలముకొనే ప్రాముఖ్యమును చదువరికి స్ఫురింప జేయవలెనని యత్నము. ఈ భావానికి ముందుగల రచన ప్రవాహమువలె దీనినే తాకేటట్లు ఉండాలి. రచనమీద చదువరిదృష్టి నిలవరాదు. వాసిమై, కో ?, వాసంబు అన్న పదాలు చదువరిదృష్టిని రచయిత తడబాటువైపు— లేదా అశ్రద్ధవైపు— మళ్లిస్తున్నా యంటాను. ఇలాటి రచనలెన్నైనా ఉన్నాయి. పద్యఛందస్సూ గేయఛందస్సూ ఈయనకు బాగా స్వాధీనమైనట్లు కానరాదు. లయ అక్షరాలనుబట్టి నిలువదు. గ్రాంథికమూ వ్యావహారికమూకాని పదాలు వాటి యిష్టమువచ్చినట్లు యిష్టమువచ్చిన చోట్ల ప్రవేశిస్తాయి, వాటికి ఈయన అదుపున్నట్లు గోచరించదు. వీరు డైరీలలో వ్రాసుకున్న కవిత్వపు తునకలు— గనిలోనుంచి వచ్చే ముడిపదార్థంవలె— వీరిప్రచురణలలోనికి అలాగే దిగిపోయినవా అనిపిస్తాయి. "నా మొదలియూహ యెల్లప్పుడు నలువ సృజన నయన యుగళి గనుగొని యాక్రమ రూపముల నూరక యర్చించుటె" అన్నారు ఈయన. "నా పిదప యూహయీ క్రియనిటు పాటపాడి చాటుటమహి" అన్నారు. ప్రతికవీ కవిత్వపు నోట్సు వ్రాసుకుంటాడూ, తరవాత తరిమెణపట్టి ఖండకావ్యముగా తయారుచేస్తాడు. అది హృదయాన్ని జల్లుమనిపిస్తుందా అని చూసుకుని బాగులేకుంటే తీసిపారవేస్తాడు. వీరిదగ్గర అట్లామానుకునే న్యూనతలేదు. వ్రాసినవన్నీ అలాగే యిచ్చేస్తారు మెఱుగేపెట్టకుండా. కనుకనే ఎన్నో గీతికలు చదువరులను పలకరించకుండా వాటిదారిని అవి వెళ్లిపోతాయి.

శ్రీ శ్రీ అన్నట్టుగా కవికొండలవారికి అత్యవసరము ఒక ఎడిటరు. వారుమాత్రము సనేమిరా వల్లకాదు అంటారని నా కనిపిస్తుంది· లేకుంటే తోచిందంతా వ్రాయడమూ వ్రాసిందంతా ప్రచురించడమూ ఎవరుచేస్తారూ ?

ప్రచురణలో ఎంపిక లేనట్లే మాటలను ఏరుకోవడములో కూడా వీరికి ఎంపిక లేనట్లే గోచరిస్తుంది. సృష్టిలోని ప్రతిజీవి పవిత్రమైనదేనని పరిశీలించి కావ్యగీతమ్ చేసినట్లే, ప్రతిమాటా శక్తివంతమేనని ఉపయోగిస్తారు కాబోలు. కనుకనే చిన్నయసూరి ఉవాచ పక్కనే యెంకి పలుకులు చేరి వినబడతాయి వీరిరచనల్లో. అలాగే కొండయేటి చాలుల్లోలాగు లోతులూ ఇసుక తిన్నెలూచేరి కనబడతాయి భావాల్లో. మాటల పొహళింపుని సర్దుకొనట్టే భావాల గమనాన్ని సర్దుకోరువీరు. అందువల్ల వీరిరచన ప్రకృతిదృశ్యంవలెఇక్కడ అందంగా ఆకర్షకంగానూ అక్కడ అతి సామాన్యంగా పేలవంగానూ వున్నట్టు అనిపిస్తుంది.

అడవిబాపిరాజుగారుకూడా జానపద జీవిత నిసర్గ సౌందర్యాన్ని చూచి ఆనందించి ఆ సౌందర్యాన్ని చిత్రించ యత్నించిన వారే. కవికొండలవారిని ఆకర్షించినది గ్రామీణ ప్రకృతి సౌందర్యము. ఆ సౌందర్యపు పాయలుగానే వారికి కూలిపడుచులూ పడవకళాసీలు గోచరించారు. బాపిరాజుగారిని ఆకర్షించినది జానపదుల (నైసర్గికసరళ) స్వభావ సౌందర్యము. వానకోసము మనవిపాటలు పాడే బిచ్చగాళ్ళూ, వెళ్లే పిల్లసొగసుమీదపదాలు అల్లే పడవసరంగూ, అంధయాచక దంపతులూ, వృద్ధ కైవర్తుడూ, గంగెద్దుదాసూ, ఆయావృత్తుల బిడ్డలూ, ఆ వృత్తుల చైతన్యానికి ప్రతీకలూను. బాపిరాజుగారు పై వృత్తులను చిత్రించడములో ఈ దృష్టియే మొలకనుంచి వృక్షము వరకూ వారిలో పెరిగిందనిపిస్తుంది నాకు.

'తొలకరి'లోవి తమ తొలిపలుకులు వ్యాకరణాన్ని వదల లేని గ్రాంథికభాషలో వ్రాశారు బాపిరాజుగారు. వాతావరణము జనపదాలదేకాని భాష, ఊహలూ మాత్రము విద్వజ్జనులవి అయినవి. వేడి నీలాకాశము, మండు ఎఱ్ఱిఇసుక, దాదాపు ఎండమావి, కోపంపు సూర్యుడు, వంటి పండిత సమయాలూ, వరుస పొగొట్టే పాదాలూ వారితొలిరచనలను బలహీనముచేసేశాయి. అప్పటికి మాత్రాచ్ఛందస్సు వారికి సరిగా స్వాధీనముకాక 'కంచె పయినా శిల్పచాతుర్యంబు కలమెవర్ణింప' వంటి విపరీత ప్రయోగాలూ ప్రవేశించాయి. ఏదో చెప్పవలెననే సరదాయేగాని అందముగా చెప్పే యత్నము ఆనాడువారిలో తక్కువ. దీనిని గుర్తించ్చకునే కాబోలు "చిన్నపిల్లవానివలెను— చిట్టికుఱ్ఱివానిబోలి, నిముషమ్మున్నవ కొక్కమాట— నేను చెప్పగోరుచుంటి, పిన మంత జంకులేదు— కానంతయు సిగ్గురాదు, కనంబడిన వారి కెల్ల, వినిపింతును వెఱ్ఱిముక్క" అన్నారాయన. ప్రకృతి సౌందర్యము ఈయన కన్నులవఱకే చేరినదికాని హృదయ తంత్రులను కదలించినట్లు కానరాదు.

'గోధూళి'లో పల్లెజనుల నిసర్గ సారళ్యము ఈయన హృదయానికి చక్కగా తాకినట్లు కానవస్తుంది. 'తొలకరి'లో గంగిరెద్దువరకే చేరి దాన్ని చిత్రించినదృష్టి, 'గోధూళి'లో గొల్లసెల్లాయి కూతుర్నీ, పాపికొండల అడవుల నీడలలో వరుగులెత్తే కోయపడుచునీ, దేముడిచ్చిన పాపతో బయల్దేరిన ముష్టిదాన్నీ, అడవిచెట్లను జడలలో తురిమిన గోదావరినీ చిత్రించింది. వ్యాకరణము కల్పించిన రాళ్లలో సాగలేని వీరితొలకరి రచనలవాగు గోధూళిలో జానపదుల భాషనుపట్టి సరస్వతియై ప్రవహించింది. గేయాలవరుస తెంపుల్లు పడకుండా రూపక, త్రిశ్ర, ఖండ, చతురశ్ర, మిశ్రగతులలో సాగింది. గేయాలు రెండు మూడు చరణాలపైనా చక్కగా ప్రవహించాచాయి. పైన చెప్పిన పాటలూ శశికళలోని 'మన చెలిమి', రసవాహినులు. చివరివరకూ చైతన్యాన్ని చూపించాయి.

తొలకరిలో సౌందర్యం కోసము వెతుక్కుంటూ తిరిగిన వీరి దృష్టి 'గోధూళి' కాలానికి వేణుగానము దూరమునుంచి వినబడే సొగసునీ, యెన్నెల యెలుగుల్లోన యేటి మరగల్లోన తెల్లని తెరసాపెత్తి తియ్యని గొంతుకెత్తిన సిన్నవాణ్ణీ, 'ఇది పైడిరేకా ఇది యెండి రేకా యెండినీరాజంట పైడి నీవమ్మా', అని హెచ్చవేసే సోదె అక్కనీ, సొగవిసాలూ సొంపు తలపాగా ఊగే వాళ్ళూ రాగాల గొంతూతో గూడెత్తి విరుపోసే లచ్చుమామనీ, గోపికనీ, తోటమాలి కూతుర్నీ, గొల్ల సెల్లాయ్, కూతుర్నీ, కోయపడుచునీ, గట్టి గుండెల బిచ్చకత్తెనీ, ఒంటెద్దు బండివాణ్ణీ పట్టి జాతి సుఖజీవనానికి చిహ్నాలయిన చైతన్యాల సౌందర్యాన్ని చిత్రించినది. అయితే బాపిరాజుగారు వేయి యిళ్ళ పురోహితుడూ, వేయి గుళ్ల పూజారినీ. కవులలో చిత్రకారులు, చిత్రకారులలో కవినీ. వీరిద్దరీ సమావేశాల్లో గాయకులూ, కులపతీ! అన్ని కళలలోనూ ఈయన చేయిపెట్టినా, ఏఒక్క కళా ఈయన శ్రద్ధకు నోచుకోలేదు. కనుకనే గొప్ప చిత్రాలు రానట్టే గొప్ప గేయాలూ రాలేదు ఈయన నుంచి. ఆనాటి సముద్రగుప్తుని చేతులలో ఈనాటి వీణ పెట్టినారీయన. మళ్లీ శిల్పాలు ఎరగరా అంటే అన్నీ చూచినవారే. సముద్రగుప్తుని నాణెముల మీది బొమ్మ చూచినా తెలిసియుండును ఆనాటి వీణ రూపము. వీరి చిత్రాలలోలాగే గేయాల్లో కూడా ఊహారేఖలై తీగలు సాగుతుంది గాని

చక్కగా అల్లుకోదు. వారి చిత్రాల్లోని వక్తుల వెనకాల ఏవో ఉన్నాయిలే అనిపించే తెరలే గాని ప్రకృతి ఉన్నట్టు తోచలేదు నాకు. అలాగే వారి గేయాల్లో కూడా 'లేపాక్షి బసవయ్య లేచి రావయ్య' వంటి పల్లవులు లాగినంతగా తక్కిన చరణాలు లాగవనిపిస్తుంది. కారణము అశ్రద్ధ కాక ఇంకేమి కాగలదు? కథలలో చేసినంత కుంచె పని గేయాల్లో చెయ్యరు బాపిరాజు గారు. "పట్టెడన్నం పెట్టమంటూ" గుండె పిండిన ముష్టి దాని పలుకులు సానబెట్టి సానబెట్టి రసిక హృదయమువీూద విసరక, ఆ పలుకులు విని తామే కళ్ల నీళ్లు తుడుచుకుంటూ తెల్లబోతారు! ఏటిలోయనుంచి "ఉబికే వాగుల్లోకి ఉయ్యెల లూగుతు పోయి, వీపు వెనకాల ఎక్కడో సందరాన పుడు తూన్న సెందురూని సేరుకో" నెంచుతారు! (వాగులు ఏట్లో కలుస్తాయి గాని ఏట్లోంచి వాగులు పుట్టవుగదా! ఏట్లోంచి వాగుల్లోకి పోయేవారు వెనకవైపు సందరాన పుడుతూన్న సెందురూని చేరుకోవడ మెలాగ?) 'తులను తూగు', మేక గొఱ్ఱె మందలు, వంకరలను బారు వాహినుల ధవుడు, నిగనిగంబను చందన వగలకత్తె, అందాలకాడా అన్న ప్రయోగాలు చదువరుల దృష్టిని తమమీదకి మళ్లిస్తాయని చూసుకోరు. 'వీస మంత జంకులేదు', జంకడము కర్మమేమి?

'శశికళ' బాపిరాజుగారిలో వింత మెరుగు. వారి తొలి గేయ రచనలలో శశికళ గోచరించదు. కథలలో మాత్రము శిల్పసుందరి నెవతెనో ఆయన వెతికినట్లు కనిపిస్తుంది. 'శశికళ' ను ఆయన 'నా ఆశయమూర్తి, నా ఆత్మపూజా పీఠస్థ శిల్ప కళాలక్ష్మి' అన్నారు. ఈయన కవితాశిల్పానికీ చిత్రకళా శిల్పానికీనే గాని రూపశిల్ప నిర్మాణానికని యత్నించినట్లు నే నెరుగను. "ఆశగానే నిల్చిపోయిన శిల్పకళాలక్ష్మియే ఈయన శశికళ అయివుండునా?" అన్న అనుమానము కలిగింది నాకు. కాని గేయము లన్నిటినీ చూచిన తర్వాత శశికళ అనగా 'తప్పటడుగుల కులికి తలుపుదాటిన వయసు' నించీ ఈయన అన్వేషించిన సౌందర్యమేనని తెలిసింది. తన జీవిత కాలములో నొక దశలో, తానే నిర్మించుకున్న తంత్ర మంత్రములతో నీయన శశికళాదేవతా ప్రత్యక్షము కోసము కన్యా పూజను కూడా చేసినట్లు వింటాము. కనుక బాపిరాజుగారు యోగి కూడాను. 'బ్రతుకే ఒక యోగ'మయ్యెనని చెపుతున్నారు ఈయన.

అయితే ఈ యోగానికి లక్ష్య మేమిటో తొలుదొల్త నీయన నిర్ణయించుకున్నట్టు లేదు. కనుకనే 'వేచియుంటి ఎవరికొఱకో, కాచియుంటి ఏమిటనకో' అంటారు. ఎవరివో 'కలస్వనములు' వినబడ్డవి. తరువాత 'ఎవరో ఒక దివ్యరూప' విరమిట్లయి మెరసిందట. ఆమె ఎవరో కాదు, ఆమెయే "శశికళాఖ్య'. ఆమె 'చంద్రలోకం తూర్పు దెసలో, సూర్యలోకం పశ్చిమంలో ఉన్న చిన్ని లోకాన్ని ఏలే కన్నె రాణియట. ఈ రీతిగా బిడ్డను లాలించే ప్రేమంపుతల్లి ఊహాగానాలన్నీ బాపిరాజుగారు శశికళకు అంకితము చేయుట చూడగా శశికళ అన్నది కేవల మొక సంకేత నామమే ననిపిస్తున్నది. సార్థక నామమేమీ కాదు. ఆమె 'సూర్యసుత', 'చంద్రబాల', బాపిరాజుగారి 'తపస్సిద్ధి'. ఈమె నుద్దేశించి కవిగారు చాలా గేయము లల్లినారు. అయినా ఈ గేయాలు ఆయనగారి శశికళామూర్తి ప్రలోభాన్ని బింబించినంతగా ఆమె సౌందర్య ప్రకాశమును చేయడము లేదు. మన దృష్టిలో బాపిరాజుగారు శశికళను వర్ణించే కవిగా కాక ఆమె నన్వేషించే కళామజ్నూగా నిల్చిఉంటారు. ఏమంటారా? ఆయన తన యోగానికి ప్రతిఫలమైన శశికళ సాహచర్యముతోనే తన్మయులై సర్వమూ శశికళే అంటారు! అయినప్పటికీ ఆమెను నగ్నబాలగా, ప్రేమసఖిగా, రాణిగా, బాలికగా, దేవిగా, టక్కులాడిగా, ప్రాణప్రియగా ఊహించుకోవడమే ఈయన వ్రతము. అందువల్ల జగన్మోహన సౌందర్య వేషముతో దాటుకుపోయే శశికళను వెంటాడుతూన్న బాపిరాజుగారు "ఇటు తిరగ"మని అరిచేసరికి ఆమె ఇట్లు తిరిగి ఆయనగారి ఆరాధ్య ప్రేయసిగా మనకు దర్శన మిస్తుంది, "హితు లందరికీ వారి ఇష్టదేవులు యెంకి, హృదయేశ్వరి, కిన్నెరసాని, ఊర్వశి కలరు, నా బ్రతుకు శ్రుతి కలిపి వలపించు సతి యీమె" అని తన కవితాసృష్టికి కారణమైన ఆ మోహినిని మనకు పరిచయము చేస్తారు బాపిరాజుగారు. నృత్య సంగీత అలంకారశాస్త్ర పారిభాషికా పదనుమములతో 'దేశిక' అని ఆ 'ఖేచరీ గంధర్వ' 'బాల' 'నాట్యము'ను పట్టుదలతో అర్చిస్తారు. అయితే ఆమె ప్రచ్ఛన్న మేమీ కాదు; వారు ఊహలతో నిర్మించుకుని అర్చించిన స్త్రీమూర్తి. ఈయనను రంజించడము కోసము ఆమె 'పూర్ణ నగ్నయై, చూర్ణకుంతలా లాడగ' ఎదుట నిలుస్తుంది 'ఒక్క కౌగిలి ఒదిగిస్తుంది', 'ఒక ముద్దును కికురిస్తుంది', 'చతుర గీతాలు పాడుతుంది'. అయితే ఈ భౌతికానందాలు పొందీ కూడా తన ఈ రమణిని కవిగారు 'మధుర మందానిల పరీమళము, మధుమత్త శారదాత్మిక సుషమ', 'కాదంబినీ వక్షనటశంప, హిమజ యమునా గమన గానము' అంటారు. ఈ మాటలు నమ్మడానికి మనమంతా గట్టి యత్నము చేద్దాము. శశికళ చేతిలో కవిగా రుంచిన డమరుకపుధ్యానములో కన్నులు కానని రూపాలూ, ప్రత్యూష చాలా ధరారుణిమలూ, బ్రతుకంతా నిరీ

క్షణమూ మతి యంతయు వీక్షణమైన నిలువరములూ, తీపి బరువుల గీతములూ, వేసవిని పుట్టిల్లు వెడలిరా నలసించు వాహినులూ, అదృశ్యములై నిలబడిపోయినవి. బాపిరాజుగారి ధీర లలితులు, సౌందర్యాధి దేవత ఖండిత నాయిక, మరి వారిరువురికీ సయ్యోధ్య ఎట్లు ?

అయితే ఈయన మొండి ప్రేయసుడు. 'శశికళ' ఈయన యెడ జూపిన కూరిమి ఎంతపాటిది అయినా ఈయన తపస్సు మాత్రము గొప్పది. జీవితమంతా కాలికి బలపము కట్టుకొని ఆమె వెంట తిరిగినా రీయన. వీరు అక్షర నిక్షేపము చేయగలిగిన సౌందర్యము కంటె అందిపుచ్చుకున్న ట్టానందించుకున్న సౌందర్యరాశి పెద్దదే కావాలి, వీరిని ముందుకు నడిపించినది. ఓపికా సంయమమూ సుందర కావ్య రచనకు వలసినంత లేవు. కనుక ఈయన గేయాలు కొండవాగులవలె ఒకచోట జలపాతాన్ని భోరుమని వినిపించి జారుకుంటాయి. వీరి పెద్ద కథలు మాత్రము పొడూగునా తీర్చిదిద్దిన రాధారి వలె సాగిపోతాయి. ఆవేశ సమయాల్లో ఈయనను కికురించి దాటుకుపోయే 'శశికళ' కథానికా రచన కాలంలో ఈయన సహచారిణి. వీరి శైలబాల, తిరుపతి కొండమెట్లు, నాగలి, విశ్వసాహిత్యపంక్తిలో పీట వేయవలసిన కథలు.

పింగళి కాటూరి కవులు

'కవితాసామగ్రి' అనే ఖండకావ్య రచనతో నవకవుల పంక్తిలో పీట వేసుకున్నారు. వీరు తిరుపతి వేంకటేశ్వర కవుల శిష్యులు. జంట గూడుటలో గురువుల ననుకరించినారు. రామిరెడ్డి, అబ్బూరి, రాయప్రోలు కవులకు ఉండినంత మాత్రపు సంస్కృతపద వ్యామోహమునూ వీరు చూపలేదు. వీలైనంతగా తెలుగు మాటలను వాడే యత్నమే చేశారు 'తొలకరి' అనే ఖండకావ్య సంపుట రచనలో. వీరి గొంతు పల్లెటూరి కాలిబాటవలె సరళసుందరము. వీరి 'కవితా సామగ్రి' ని నవకవులు తమ కావ్య పఠనాలలో పాడి వినిపించడము ద్వారా ఏ ఒక్క ఖండకావ్యానికీ లేనంత ప్రఖ్యాతిని తెచ్చారు. అసలే చక్కని ఖండకావ్యము, దానికి తోడు సభా పఠన సౌకర్యము బంగారానికి మెరుగు! బందరు పేటలలో పికాంగనాగాన నిస్వనము, కుందనపు తళుకు, కలువరేకుల మెత్తందనమ్ము, మలయ పర్వతపు కమ్మ తెమ్మెరలు, వెన్నెల తేటనిగ్గు, పచ్చకప్పురపుతావి, పటీర జలము, పూవుదేనె, అమ్మజూపుతాడు కవితా సామగ్రిగా బేహారి. కావ్య కృన్నామసాధన చింతాపరు డొక్కడు వీధికి వచ్చి ఆ కవిత్వపు సామగ్రిని విచ్చి 'ఇవేటి వస్తువులు వర్తకుడా' అని నవ్వుతాడూ, కవిత్వమంటే ఎరుగనివాడవని హేళన చేస్తాడు. తక్కినవారు ప్రౌఢ సమాసకల్పనమూ, శ్లేష కవిత్వ మంజూష, ఆశుకవిత్వ మంత్రములూ, ఫారసీమట్లు వ్రాయబనికివచ్చు వస్తువూ ఉంటే బయట బెట్టుమని ఎగబడతారు. సెట్టి అంగడిని సర్దుకొని 'మందు మాకు లీ యంగడి యందు లేవు, సుకవి, భోజ్యమ్ములీ వస్తువులు వీని కలచివైచి నలిపివేయకు'డని వెళ్లిపోతాడు. అమ్మకపు కేకతో చదువరుల్ని, శ్రోతల్ని ఆకర్షించి, తిక్కయజ్వ, పింగళి సూరన్న, చేమకూర వెంకన్న, తిరుపతి కవులూ ఈ సరకే వాడినారన్న వింతవార్త వినిపించి, కావ్య కృన్నామ సాధన పరులకు రుచిని బయటబెట్టి, అదనపు సామగ్రిని ఉటంకించి గుత్తమైన నిర్మాణము చేసినారు కవులు ఈ ఖండకావ్యంలో. ఇది వినబడేవరకూ, తెలుగు రసికులను ఉన్నచోటులోనే చెయిపట్టి కావ్యసంచార మార్గంలోనికి తీసుకుపోయి మెప్పిస్తూ ఆశ్చర్యములోనికి విసిరే ఖండకావ్యము—కథనము చేసేదీ పద్యాలలో ఉన్నదీ—మరియొకటి వినబడి యుండ లేదు (గురజాడ కన్యక, పూర్ణమ్మా, ముత్యాలసరాలూ పద్యాలలో లేవు) కనుక ఈ ఖండకావ్యము ఆపాతమధురమై తెలుగు వారి నలరించినది. దీనిలో ప్రస్ఫుటముగా కనిపించే ప్రకృత్యభిమానము నవకవితాభిమానులకు ఆదరపాత్రమై ఈ కావ్యాన్ని వారి మేనిఫెస్టోగా మార్చింది.

అయితే ఇలాటి చక్కని కథాకల్పన వీరి తొలకరిలోని తక్కిన రచనల్లో కానరాదు. వాటిని చదివితే రామిరెడ్డిగారి 'కృషీవలుడు'లోని సంచార పద్ధతి జ్ఞాపకానికి వస్తుంది. తొలకరి ప్రచురించేసరికి కృషీవలుడు వచ్చిందీ నవ కవితాభిమానుల్ని ఆకర్షించింది కూడాను. 'తొలకరి' లోని కవి శిశువు, కోకిల, సంక్రాంతి, 'ఎత్తిన తలవంచకయె వియత్తలమున దృష్టి నిలిపిన కవిని కాక సంచారముచేసే కవిని చూపిస్తాయి. 'కోకిల' లోని శైలి తిన్నగా వచన పద్ధతిలో సాగిపోతూ పింగళి లక్ష్మీకాంతముగారి వచన రచనను జ్ఞప్తికి తెస్తున్నది. సంక్రాంతిలో ఆ పండుగకు కనబడే సుందర సామగ్రి ఉన్నది గాని రచన సుందరముగా లేదనిపిస్తోంది. "జొన్నచేను" లో చిన్నివానికీ చిన్నదానికీ జరిగిన సంభాషణలో చిన్నవాని మాటలు ఎక్కువగా సాగిపోయి చిన్నదాని చేష్టలను మరుగుపరచినవా అనిపిస్తున్నది. లేకుంటే "సెనగపూరైక దొడిగిన చిన్నదాన!" అని జొన్నచేనిపై నుంచి అర్తిత్తి చూచు చిన్నవాడు మన కింకా సానుభూతిపాత్రుడై యుండును. ఇది అందమైన ఖండకావ్యము.

చివ్వరి పది పంక్తులూ చిన్నవాని అపేక్షను చక్కగా చూపిస్తున్నాయి మనకి, కాని కొన్ని మాటలూ వాక్యాలూ

సంస్కారము కోరుతున్నాయి. 'ఎడబాటు' లో భావసూత్రము నిరంతరాయముగా సాగిపోలేదు. 'జరియింప రట్టి నీ పెంటిని బాపి' ఎట్టి పెంటిని ? 'ప్రయత్నింపడుగా .... బరిక్షింపడుగా... వాసింపదుగా' అన్నచోట్ల రచనా సామరస్యము సాధించే తమ కము రచనా సౌందర్యాన్ని తోశివేస్తున్నది. 'తెలికన్నుల', 'తెలినులిరెక్కల' చెల్వము బాగా నచ్చినందువల్లనే కాబోలు నీరు కూడా ఎనిమిదోపద్యములో 'తెలినీరు' అయింది. ఈ కావ్యాన్ని (రెండో పద్యములో) చక్రవాకసం బోధనతో ప్రారంభముచేసి నడిపేరు ఏడోపద్యందాకా. ఎనిమిదోపద్యంలో సంబోధనమార్చి 'రాములు నీకూ ఉన్నారురా నిశాచరా !' అన్నారు. ఆపిమ్మట సంబోధనను చదువరులవైపు త్రిప్పి 'అకటా ! మనజక్కవ పెంటి.... ఏడనున్నదో' అన్నారు. కొసాకిమళ్లీ 'కోకమ తెల్లవార దనుకోకుమ' అన్నారు. ఒక్కఖండములో ఇంత కృతకమా ? కవులు ఇద్దరుకనుక ఇద్దరమూ కలసితిరుగుతూ వ్రాశామని మనకు స్ఫురింప జెయ్యడానికే కాబోలు 'పోయివచ్చెదము, చూతుము' అన్నారు ఈ కావ్యంలో. 'రసాలము'లో ఏకవచన ప్రయోగమేచేశారు. ఇద్దరికి భావైక్యత కుదరదు. 'అజ్ఞాన కృతము' అపురూపకల్పన ! పూలతీవ–, పూవుగవ–, చల్లగాలి–, భృంగ కుమారుడూ–, మాదిప్రేమ మామూలు శ్రుతినిమించి ఉచ్ఛస్థాయిలోకి వెళ్లిపోయింది. జంటపూవులలో ఒకదానిని కోసిన వెంగలిపుత్రుని కటికితనముచూచి కవికి భయమైన దట. 'కన్నుల నీరిడకమ్మ (!) తీవముత్తైదువ ! పెద్దదానవుగదా కలకాలమునీకు మేలగున్' అంటున్నారు దేశికులు. రాయప్రోలు వారి 'తీవచెల్లెంద్రు' ముదిరి ఇక్కడ ముత్తైదువ లైనారు ! యుక్తమేకదా ? 'రసాలము' మామిడిచెట్టునుచూచి చెప్పిన పద్యాలు. వీటిలో రసాలమును చూచినందువల్ల కలిగిన భావాల కంటె అల్లిన ఊహలే ఎక్కువ కనబడుతున్నాయి. కాలవశము చేత జిగిదూలిన యెలమావి ఆ కాలవశమ్ముచేతనె వికసించెనట· తేనె దొన్నెలట మామిడికి ! 'లతాంత రజమ్మను కుంకుమమట' ఈ ఊహలు ప్రబంధకాలమునాటివి. మామిడిని చూచిన నాటివికావు. ఇది నవకవిత్వముకాదు. 'కాకపోతే ఏమి మునిగినదీ' అంటే నాకేమీ అభ్యంతరములేదు. కాదని మాత్రమే ఇక్కడ చెప్పబోయినది. తక్కిన రచనలలోని 'క్షీరసాగరవీచికాకపోల మున (!) శీతకరు తొలిముద్దు (!) వలన వెల్లివిరిసిన యెలసిగ్గు', 'ద్విజకుల వనితలార, పలుకుజవరాలి వీణతో గలిపి యొక్క మంగళము పాడరమ్మ' అన్న కల్పనలు కవులు దర్శించిన సౌందర్య మునుకాక కలలుగన్న సౌందర్యమునే చూపుతున్నాయి. కవి దర్శించి వర్ణించిన సౌందర్యము చదువరుల సౌందర్య చైతన్యాన్ని పెంచుతుంది. ఉత్ప్రేక్షలతో కవినిర్మించిన సౌందర్యము కవి చేసి రంగులువేసిన కొయ్యబొమ్మవలె ఎదట నిలబడుతుంది. దాని నిర్మాణాన్ని మెచ్చుకుంటాము కాని, అది అనుభవము కాక పోడమువల్ల జల్లుమనము. 'ఎవరు నీవు' రాయప్రోలు స్వప్న కుమారము వంటిది. పొడుపుకథలను జ్ఞాపకముచేస్తోందినాకు. 'బోనులోని సింగము' ఇదివరకు చెప్పిన వచనాలకుతోడు మరి యొక వచనము. దీనినిండా పురాణాలు చెప్పేకబురులు, సింహ దర్శనము లేపే భావాలుకావు. 'కాంతారమునకు సార్వభౌముడవై (మృగరాజు కాంతార సార్వభౌముడయాడు !). 'మత్తహస్తి మస్తిష్క మారగించి' సమశిలా సింహపీఠి' మీద కూర్చున్నదట సింహము. సింహపీఠి అంటే ఇటూఅటూ సింహాలు తీర్చియున్న పీఠి. ఇక్కడి సింహపీఠి ఏదీ ? సింహముకూర్చున్న పీఠిని సింహపీఠి యనవద్దా అంటే మరి జవాబులేదు. ఇంకావినండి 'మను జమర్కటమా ! నీకు మంచికాదు సింగపున్ స్వేచ్ఛ హరియింప.' 'విడిచిపుచ్చుము సింగము విడిచిపుచ్చు మనుజుడా'. ఉపాధ్యాయుడు బెత్తముపట్టి చెపుతూన్నట్టు వినపడుతోంది నాకు. 'రక్తతిలకము'లోని 'ఏటికీ గతిని గిరాత బాణహతిగారియా పాలొనరించినాడనే', 'నీకు నామీద దయగలుగదె ?') 'దీనికి గడవులేదె ?', 'గట్టెలగొట్ట జేసితే', 'కాంతారమ్ము పాల్పే పితే ?' అన్నపలుకులు పద్యము పద్యానికీ చివ్వరకవి వాక్యాల్లాగ చేరుతూ భావానికి ప్రవాహగతి రాకుండా అడ్డుతున్నాయి. 'అజిద్రెళ్లుచు' ! (ఎంతసేపుంటారు అజిద్రెళ్లే స్థితిలో ?' 'మజ్జనకు నాజ్ఞ' (సంబోధన మారింది. ఎవరితో అంటు న్నట్టూ ఈ మాటలూ ? స్వగతంలో 'మజ్జనకు నాజ్ఞ' అంటు నాడు !) వంటివి అల్లడానికి యతించే వేళ్లను చూపి స్తున్నాయి అడుగడుక్కీ. ''అక్కడ యేటి కింత'' నాటకంలో స్వగతం పద్యాలలోని అల్లరి అంతా దీనిలో ఉనుది. అక్కడ సీను, పూసలకోటు, పొదరుపూత, కొంత ఏమారుస్తాంతి గాని యిక్కడో ?

ఈ కావ్యము పేరు 'తొలకరి'. నవకవులు ఎంచుకునే పేరుల్లాంటిది. దీనిల అనుభవాల నవ్యత, హృదయాలి కది లించేది నా కంతగా కానరాలేదు. జల్లు జల్లు మనిపించే మాన వత్వము కాక, మానసత్వమే నిండియునట్టు తోస్తునది నాకు. ఆధునిక కవిత్వములోని నవ్యత వీరి కంతగా పట్ట లేదనే నా నమ్మకము. అందుకే చిరకాలము వీరు మళ్లీ కావ్య రచన చేయలేదు. వీ రిద్దరి స్వభావాలు వలెనే రచనారీతులూ భేదమైనవే. నే నెరిగినంతవరకు లక్ష్మీకాంతముగారికి ఆధునిక కవిత్వమను కిట్టదు, దానివైపు వారు జూడరు; వారి శిష్యుల్ని కొందఱి చేరి వా రధ్యక్షులుగా ఆధునిక కవిత్వము ఆంధ్ర కవిత్వమునకు వేరుపురుగని—ఈనాడు కాదు—1934 లోనే

వాల్తేరులో తీర్మానించారు. వెంకటేశ్వరరావుగారికి అందముగా ఉన్న కవిత్వ మేదైనా నచ్చుతుంది. కాబట్టి వారికి ఆధునికుల సాహచర్యము తప్పలేదు. ఈ యిద్దరు కవుల వైయక్తిక రచనల పరిశీలనమునకు ఈ పరిచయము చాలు ననుకుంటాను.

పింగళివారిది ముఖ్యముగా విమర్శనాదృష్టి. విమర్శకునన్నా కవితా రచనకున్నా అంతగా పొత్తు కుదరదనుకుంటాను నేను. విమర్శకు మానసత్వము—ఆలోచన— ఎక్కువ అవసరము. కవిత్వ రచనకు మానవత్వము—అనుభవించగల శక్తి—ఎక్కువ అవసరము. ఆలోచనలకు వైయక్తిక ముద్ర బలంగా ఉంటుంది. చదవగానే చదువరిలో విమర్శనాదృష్టి మేలుకుంటుంది. భావాలకు మానవ సామాన్యమైన హృదయముద్ర ఉంటుంది, తక్కిన హృదయాలను జల్లు మనిపించే శక్తి ఉంటుంది. 'నీ బండచెవికి శూలములవలె నాటినచో మఱొక్క మెడకు బోరాదె?' దిక్కులేనట్టి వారికి దిక్కు దేవుడనెడి వాక్యము సత్యమే యైనయెడల 'బరభృతంబది నీచేత బడకమున్నె భూత నిర్మాణ కర్తయే ప్రోచుదాని' అన్నవి ఆలోచనలే, భావాలు కావు. 'అన్ని పండువులందు ముఖ్య మిది గాన సత్తువారింటికేగుమో కొత్త పెండ్లి కొమరుడా' అన్నది తర్కము. 'పెద్దదానవు గదా?' (సింహముతో) 'సత్యమునకు గట్టువడి యిటులుంటివే కాని నిన్ను గట్టివేయగ నెవనికి గలదు శక్తి?' అన్నవి వైయక్తికములైన ఆలోచనలు. విమర్శను మేలుకొలుపుతాయి, అనుభవాన్ని కాదు.

కాటూరి వేంకటేశ్వరరావుగారిది ఆర్ద్రహృదయం. అక్కడనుంచి ఏది వచ్చినా కోమలంగా వస్తుంది. కోలవెనువారు బందరు జాతీయ కళాశాలను విడిచిపోయేనాటి వీడ్కోలు పద్యము వినండి: "ఈ యెలమావి నీడ వసియింపక వేసవి మండు టెండకున్, చేయొక టడ్డు జేసికొని చెమ్మట లోడగ ముండ్ల బాటలన్, పోయెడు బాటసారి రసపూరము నీ మది లేత వెన్నెలల్ గాయునొ, నీ యుపాంగమున గావురమున్న వియో వసంతముల్." వీడ్కోలు పద్యం ఇంతకన్నా హార్దికంగా ఉండగలదా? 'ఆంధ్ర గీర్వాణ కవిరాజు లాంగ్ల సుకవులల రవీంద్రుడు సలుపు గావ్య సుమమాలలు తలదాల్చుకొనెడు పాటి సరసత ఘటిల్లె. జాలు నీ జన్మమునకు' అని హాయిగా మెదలకుండా జీవితము గడిపే తత్వము వారిది. అయితే, అప్పుడప్పుడు 'చేసి యెరుంగ దేవతల సేవలు, తీర్థములాడ, క్షేత్ర సంవాస మొనర్ప, విపుల సపర్య లొనర్పను .... దానము ధర్మ మెరుంగ ....' నంటూ కళవళపడే ఘడియల తర్వాత, నీ 'ఇంద్ర కీలాద్రి కందరాకృతవాస, శిఖరీకృత శీత మయూఖరేఖ, కృష్ణవేణ్యావగాహ క్షాళితాంఘ్రి కమల'నో, 'అరుణగిరి కందరావృత .... స్వామి'నో స్మరించి కీర్తించి నిలద్రొక్కుకుంటూ ఉంటారు. ఆ పద్యాలు నీలాకాశంలో ప్రసరించే బలాకా రేఖల్లాగ మనకి హాయి గొల్పుతాయి. నిండు మనస్సు నవ్య నవనీతమూ పల్కు ఇక్షు రస ఖండమూను. మరి హాయికి లోటేమిటి? 'కాలు పెట్టినట్టి నేల నెల్లనా గడ్డజేయ నేర్తు' రట కమ్మవారు. హల ముఖాన పల్లియ నొనంట భాగ్యరేఖ దిద్దినారట. 'కష్ట సుఖములందు గలివి లేములయందు బంచి కుడుచునాటి పల్లె బ్రదుకు కనుమొఱగె' నట. 'ఎద మెదిలెడి బాధ వెలికి నిటు లుబ్బిన' దట. అగ్రజునకు ఈయన తుద కిచ్చినది 'నిష్ఠురాగ్ని సంస్కార'మట! మెత్తని మాటలతో చలనశీలములైన వృత్తములతో వెంకటేశ్వరరావుగారు పౌలస్త్య హృదయము, గుడి గంటలు రచించినారు. మొత్తముమీద వీరి కవిత్వానికి చెప్పే వద్దతే జీవము, వస్తు నవ్యత కాదనిపిస్తుంది నాకు. వూహలవల్ల నలరించు యత్నమే గాని భావములతో తాకి జల్లు జల్లు మనిపించే యత్నము కాదేమో వీరిది? పరిశీలించం డంటున్నాను. వీరిది ప్రాచీన కవుల సంప్రదాయమే, వీరి బలము పురాణ గాథా సర్వస్వమే, వీరి స్వామి మాణిక్య కిరీట కాంతిని చయాంధీభూత సప్తాశ్వుడే, ఆయన చరణములు అబ్ధిజాప్రభృతుల పాణి సరోరుహ సేవితమ్ములే.

నాయని సుబ్బారావుగారు

తన అనుభవాన్నే ప్రపంచించి సౌభద్రుని ప్రణయయాత్రా, మాతృగీతాలూ వ్రాశా రంటారు తెలిసినవారు నవ్య కవిత్వ పాదుర్భావదశలో శరీరాల స్పృహవల్ల కలుషితమ్ము కాని ప్రేమను రాయప్రోలు కీర్తిస్తే నవ్య కవిత్వపు టుచ్చదశలో నాయని సుబ్బారావుగారు ఆ ప్రేమకి కారణమైన ప్రేయసిని విహాయస పథాలకెత్తి (పరుల కర్థమ్ముకాని) భావగీతాలతో అర్చించారు. వత్సల ప్రేమావిల హృదయమునక్క జలజబాంధవు నిదుర మేల్కొలుపు బులుగులూ, గీతమ్ము లొలుకు పికమూ, కాల మేఘము నంటియే క్రాలు కలికి మించు, చందమామను చేరు రోహిణీతార, ప్రేమనే చిలుకుతూన్నట్లు తోచుతుంది. కవి దృష్టిలో ఆమె తలపుల్నీ 'వలపు'లే. అయినప్పటికీ ఆ తలపులలోనూ, సౌభద్రుని నిర్వేద 'గీతము'లలోనూ వాటిలో వాటిని చేర్చి పట్టే భావసూత్రము లేదని నా అనుమానము. ఒక పద్యము తీసినా, (అలాటిదే) ఇంకొక పద్యము వేసినా మార్పు రాదు. ఇవి ప్రేమగీతలు. వీటికి మొత్తపు కావ్యము మేలుకొలువవలసిన భావ ఝరిపై మమత లేదు. వర్ణనా సౌందర్యము మీదనే వీటి మొగ్గు.

కవుకొండలా, అడవి; పింగళి కాటూరి; నాయని, కవులు

"అది నడచు వేళల నేల జీరాడు కుచ్చె, రేపు దుమ్మున నొక త్రసరేణువునయి, దాని తనువున బుట్టు స్వేదమున గలసి కరగిపోదును రూప మేర్పరుపరాక' అన్నప్పుడు వాచ్యార్థము బలంగా స్ఫురించి చిరునవ్వు గొల్పినా, వ్యంగ్యార్థము—ఆమె మీద ప్రేయసుని మమత—వల్లనే ఈ వర్ణన నిల్రదొక్కుకోవాలి. వాచ్యార్థము ఇంకా బలమై "అది యుషస్స్నానమొనరించి యంత గట్టుకొనిన పచ్చని పట్టు దుకూలమందు నార్ద్రమగు లే జరీయంచునై తదీయ దేహమున గగుర్పాటులు దిద్దుకొందు" నన్న పంక్తులలో వలె వ్యంగ్యార్థాన్ని జరీ మెరుగులలో ముంచేస్తే ఈ వాచ్యార్థాన్నే చూచి, చదువరి, ఈ వింత ప్రేయసుని కుతుకమునకు అక్కజపడతాడు. వాచ్యార్థమును ఇంకా పెంచి పరాభవలె 'రవికందున గుచ్చబడి స్వర్గద్వయంబు మధ్య నూగాడుచున్న పార్కర్ కలంబుగా నున్న నేను, నా రక్తాన్నే సిరాగా పోస్తాను' అని వ్రాస్తే ఆ ప్రేయసుని కుతుకమే పైకి తేలిపోయి నవ్వించేస్తుంది చదువరిని.

ఉత్ప్రేక్షాలంకారమును వాడడములో ఈ చిక్కు. చదువరికి స్ఫురించవలసిన వస్తు సౌందర్యము కంటె, వర్ణనా వైశిష్ట్యము సాధించడానికి కవి పడే తంటాలే పైకుబికి కనపడడము—చక్కగా తెలుస్తుంది. ప్రబంధకవుల ఉత్ప్రేక్షలు ముప్పాతిక మూడుపాళ్లు ఇలాటివే. నాయనివారి ఉత్ప్రేక్షలు వర్ణించే వస్తువుయొక్క సౌందర్యాన్ని విడిచి ఆయన చేసే కల్పనలను సూచించేటంత దూరంగా వచ్చేస్తున్నాయనిపిస్తోంది నాకు. వత్సల 'ప్రియు డొసంగిన వలపుల విరిసరమ్ము చిత్తపేటిక దాచిరే కొత్తకుండ రాగ రసమున' ప్రతిదినమూ తడిపెద ననుకొన్నదట. ఇంకొకచోట 'హృదయ పుస్తకమం దదికింపబడిన ప్రేమగీతాల పుట జింపివేయు టెట్లు? చినుగు వెంబడి పైకెగజిమ్ము రక్తమున గలసి ప్రాణముల్లేచి పోవకుండ' నంటారు. అసలు జరిగిన సంఘటన కంటె ఆలంకారికపు టూహాయే సత్య మంటున్నారా అనిపిస్తుంది. "ముడుచుకొనియున్న హృదయంపు మొగ్గ విరియ వలపు దేనియ "యిదే" జాలువారుచుండె" నని ఏదో వాలికిపోతున్నట్టు ఇంకొకచోట. ప్రళయరుద్రుని కేళికారామమైన ఈ భయావహశూన్యమందు' అని ఆకాశాంతరాళాన్నీ, 'పులకరించినది గట్టులు పొర్లు సెలయేటి కౌగిలింతలకు కంకర పొలమ్ము' అని పొలాన్నీ వర్ణిస్తే సరేగానీ, 'ప్రణయినీ! స్వప్నవారిధిపైని లేచు నీ వియోగ కథా వీచికా విలోల పంక్తు లావళి దరినుండి వచ్చి వచ్చి నా హృదయతీరమున యందు నాట్య మాడు' ననీ, 'దృఢాలింగ నాన వాస్వాదమత్తతను యుగమ్మ సమ్మోహనో దధివిలోల వీచికాడోల నూగుచో' అనీ, దృఢాలింగన సుఖాన్ని అంతకంటే అపరిచితమైన ఆసవపానంతో పోల్చి అనుభవాల వర్ణనకు ఉత్ప్రేక్షాలంకారాన్ని దింపడాన్నీ చూస్తే ఈ నవ్య సౌభద్రుడు "వలపు 'కీ' పూర్తిగా నీయబడిన" ప్రేమ అలారము గడియారమా అనిపిస్తుందీ, అభిమన్యుడిలాంటి ప్రేయసుణ్ణి "ప్రేయసీ, అనురాగహాలికునిచేత చక్కగా దున్నబడిన నాస్వాంత భూమి నీ వలపు వాన చినుకులు త్రావి త్రావి, అవ్యయావ్యక్త భావ సస్యము లీను' ననిపిస్తే, ఎవరో ఉత్ప్రేక్ష జీవితకారుడు అభిమన్యుడి వేషము వేసుకొచ్చిన ట్లనిపిస్తుంది.

అయితే, చిత్రమంతా ఎక్కడున్నదంటే, నాయని సుబ్బారావుగారికి ఇదంతా తెలుసునా అన్న అనుమానంలో, వారు ఆలంకారిక వాతావరణాన్ని క్రమక్రమంగా పెంచినారూ, చివ్వరికి ఆలంకారిక ప్రపంచాన్నే నిలిపి మేడలు కట్టినారు. ఈ ఎంపికను గుర్తిస్తే వారు ఆలంకారిక సామగ్రితో వింత' ప్రపంచాన్ని నిర్మించ యత్నించినారా అన్న అనుమానము తట్టుతుంది. 'పడవ పగిలిన' అన్న ఖండము వినండి: 'ఇది పగిలిపోవునను భయ మ్మింతవరకు, ఈ తలంపున ఆనందమిపుడు పొంగు, పగిలిపోయిన చెక్కల పట్టు విడువ, కీవు పాథోనిధానము వీదె దవని!' పడవ అనగా ఈయన యత్నాలు కావాలి. ఆ యత్నాలు పగిలిపోతే ఆ చెక్కలతో ఆమె పాథోరాశి నీదుటేమి? ఇది సౌభద్రుని ప్రణయయాత్ర కదా? ఆయన పడవలో యాత్రచేసి ఆమెను చేరవలెను. పడవ అనగా జీవితమే కావచ్చును. జీవితమే శిథిలమైపోతే, ఆ జీవితపు తునకలు తనకు ప్రేమపాత్రములు కనుక ఆ స్మృతులతోనే పాథోధి వంటి తన జీవిత శేషాన్ని ఆమె తరిస్తుందా? ఇదే కవి ఉద్దేశ్యమైతే "తునిగిపోయిన చెక్కలతో పయోధి గర్భమున రత్నరథ మీవు కట్టెద"వన్న ఊహ ఏమి? ఆమెకు తన ప్రణయయాత్ర కథ చక్కగా తెలిసినదనీ, తాను ఇక యేమయ్యిపోయినా ఫరవాలేదనీనా? అయితే 'విరిగిపోయిన చెక్కల దరికి జేర్చి నీ చితికి కాష్ఠములుగ మన్నించెదవని' అనగా ఏమిటి? తన ప్రేమ యత్నాల స్మృతితోనే ఆమె కూడా అంతమవుతుందనా? వాచ్యార్థము 'చెక్కలు' 'కాష్ఠములు' అన్న మాటలతో యెబ్బెట్టుగా ఉన్నట్టు కనిపిస్తూ ఆమె తన ప్రేమను గుర్తించినదన్న భావము కన్న, తన ప్రయత్నపు పడవ చెక్కలతో యీదుననీ, వాటితో రత్నరథము కట్టుననీ, వాటిని కాష్ఠములుగ మన్నించుననీ, అన్న ఊహలే కవికి ఎక్కువ ఇష్టము కాబోలు అనిపిస్తాయి. 'తూర్పిడి' అన్న కులకములో వ్యంగ్యార్థము ఇంకా కప్పబడిపోతూవున్నది.

"తావకామృత స్నిగ్ధ మధుర హృదయముప నికరమ్ము (అయిన దేది అని) ఊహించు వాన నేను ఇన్ని క్రంతల జల్లెడ చేత జూనితి" నంటాడు సౌభద్రుడు. చేటతో తూర్పారబట్టి, జల్లెడతో ధాన్యాన్ని వేరుచేస్తారు. ఈయన 'అమృతస్నిగ్ధ మధుర హృదయము'ను ఎందుకు తూర్పారబట్టవలసి వచ్చినదీ అన్న ప్రశ్న అలాగ మిగిలిపోతుంది. ఇక 'పొల్లునందు ధూళి ధూసరితగాత్రుడను' 'జల్లెడయును గళితమ్మయినుము' 'ఇక కొంత గాలి యుంచుకంత యనుకూలమ్మైన' అన్న అలంకారిక భాషలకు వ్యంగ్యార్థమేమి ? అని వెతుక్కోవలసి వస్తుంది. వాటిని వెతకకుండా తూర్పారబట్టి ప్రతికూల పవనము ఉగ్రముగా వీచినను, చేత జల్లెడ జారిపోయినను, నికరమ్మైన హృది చూచే ప్రయత్నముతో క్రంతల జల్లెడ పట్టిన యువక ప్రేమికుని చూచి ఆనందించుకోడమే మేలు. కల్పనా ప్రపంచాన్ని బలం చేసేసి, వ్యంగ్యార్థాన్ని ఆచ్ఛాదించే యత్నము కాదా మరి ఈయనది ? 'నిత్య క్రీడ' యట ఇది ఒక్కటి వినండి వా యత్నాన్ని చక్కగా చూపిస్తుంది : "ఉదయ సంధ్యా నవాంశువు లదుమ దద్దరిల్లి ఆశాంతములమండి మెల్లమెల్ల కుంచుకొనిపోవు నీ నీడ కొనలవెంట చేరుకొందును నీ పదాంభోరుహములు. ప్రబల మధ్యాహ్న తీక్ష్ణాతపమున కలగి అలసిపోయిన నీ నీడ గలసిపోయి ప్రణయ భావాలె మధుర విశ్రాంతి కొరకు నీ శరీరాంచలము లంటి నిలిచియుందు. అపర సంధ్యార్ద్ర రోచుల నమృతరాగ మంజు రంజితమై సాగి మరల దెసలు క్రమ్ముకొనిపోవు నీ నీడ గలసి వెడలి ఆయనంత దిగంతముకే లావరింతు". ఇదంతా కల్పనా ప్రపంచమే. వాస్తవ ప్రపంచములో దీని అర్థమేమో తెలుసుకోడము అసాధ్యము. ఇదేదో స్వప్నలోకపు దృశ్యము. ఈ రకపు దృశ్య నిర్మాణము కోసము ఉత్ప్రేక్షను కరిగించి కరిగించి యత్నము చేశారా చూడండి అంటాను.

నాయనివారి పద్య రచనాధార నిరాఘాటమైనదీ మెత్తనిదీను. వచనరీతి తల చూపనే చూపదు ఎక్కడా. "కడలి వరకు వాకలు కట్టి 'పారు' గిరి కుమారుని ప్రేమ గీతాల పొంగు" వలె వీరి పద్యాలు ప్రవహిస్తాయి. వీరి మాతృ గీతాలు ఆనాటి ప్రేయసీ గీతాల నడుమ సర్వ జనాదరణము పొందినవి. తల్లి అందరికీ అభిమానపాత్రురాలే కదా ? 'పోయినది పార్వతీదేవి' అన్నారుట మరణించిన ఈయన తల్లిని కనుటకు వచ్చిన జనము. ఈయన అంటారు "మరల నీ వచ్చు టెన్నడో మంట మండు నా కడుపులోన కుడుము లుంద్రాళ్ల వడియు చలువ లూరించు టెన్నడో తెలియబడదు, జగతి నింక వినాయకచవితి లేదొ" అని. పరుగెత్తే, భావన చివరి ఊర్పులో సువాసనలు నింపే ఈ గుణము సౌభద్రుని ప్రణయ యాత్ర 'కృష్ణ యొడ్డున' లో కూడా కానవస్తుంది.

ప్రేమతరంగ గామియైన సౌభద్రుని ప్రణయ యాత్రలో వినవచ్చే అలంకార ఘంటా నినాదము మాతృ గీతముల నైసర్గిక నిర్వేద నిశ్శబ్దములో వినరాదు. రెండు గ్రంథములూ ఇంచుమించు ఒకేకాలపు రచన లన్నారు విశ్వనాథ వారు పరిచయవాక్యాలలో.

'శ్రేయోభిలాషులు'

శ్రీ ఆదివిష్ణు

వారం రోజులనుంచీ డైరీలో కాగితాలు కాళీగా ఉన్నాయి. రాయడానికి వార్తంటూ దొరకడంలేదు జానకిరామయ్యగార్కి. దానికితోడు బద్ధకం ఒకటి జతయ్యింది.

వెనుకపేజీలు తిప్పడం మొదలుపెట్టారు.

'ఈ రోజు అసలేం తోచడంలేదు. పిల్లల ఆరోగ్యం ఎలావుందో ఏమో. బొత్తిగా ఉత్తరాలు రాయడమే మానుకున్నారు. రేపు, నాలుగుచివాట్లు పెడుతూ ఉత్తరాలు రాయాలని ఉంది.'

మరికొన్ని పేజీలవెనక—

'పొద్దుటనుండీ జోరునవర్షం. ఇంట్లోంకాలు బయట పెట్టలేదు. అంతా వెలితిగావుంది. ఇంకాఎన్నాళ్లు యీ బ్రతుకు వెలిగించాలో ఏమో !—'

'పెద్దబ్బాయి ఉత్తరం రాశాడు. ప్రమోషన్ ఎక్స్పెక్ట్ చేస్తున్నాట్ట. వాడిదేం— రాజాలాటి మనిషి. అదృష్టవంతుడు. వాడి భవిష్యత్తుమీద నాకు మంచి నమ్మకంవుంది. పోతే— నా దిగులంతా చిన్నాడిమీదనే.'

'కోడలికి సుస్తీగా వుందని రాశాడు చిన్నాడు. వస్తుథా ఆ పిల్ల అనారోగ్యపిల్ల. సరైనమందులు వాడుతున్నాడో లేదో. అయినావాడు ఆచోట ఉద్యోగం చెయ్యకపోతే కలిగే నష్టమేమిటో నా కర్థంకావటంలేదు.'

చాలా పేజీలు తిప్పారు. ఏ పేజీలోనూ ప్రత్యేకత కనుపించడంలేదు. బ్రతుకంతా చప్పగా, చేదుగా వున్నట్టుంది. ఎందుకనోమరి—

ఒక్కోసారి జానకిరామయ్యగారి ఆనందానికి అవధులుండవు. జీవితంలో తీపిదనమంతా తనఒక్కడి సొత్తని మురిసిపోతారు. అప్పుడనుకుంటారాయన—

'మరో పాతికేళ్లు బ్రతికితే ఎంత బావుండును—'
—గోడగడియారం నాలుగుసార్లు మూలిగింది.

కాలానికి కళ్లెంలేదుట. తన పరిచయస్థుల్లో ఎవరో అంటూండేవారు. ఎవరతడు ? ఎవళ్లో, జ్ఞాపకానికి రావడం లేదు. ఎవరైనా— ఆ మాటన్నవాడు యోగ్యుడేను. చాలాబాగా చెప్పాడు. ఇలా ఒక్కోగంటా ఖర్చైపోతే—చివరికి—ఛా.... ఇవ్వాళేమిటి ఆలోచనలు ? చేతినిండా పనిలేకపోతే యింతేమరి.

తను సర్వీస్‌లో వుండగా ప్రతివాడూ అనేవాడు 'ఆనెస్టు ఆఫీసర'ని. సరిగ్గా వేళకి ఆఫీసుకి వెళ్లేవాడు. బాగా రాత్రిపడిన తర్వాతగాని యింటికి వచ్చేవాడుకాదు. ఆఫీసుపనితప్ప, అప్పట్లో మరో వ్యాపకమంటూ వుండేదికాదు.

బాగా జ్ఞాపకం— ఆఫీసులో సుందరమనే 'స్టెనో' వుండేవాడు. కుర్రాడు. కొత్తగా పెళ్లయింది. త్వరగా యింటికి చేరుకోవాలని వుండేది. కాని— సాక్షాత్తుతను ఫైళ్లు ముందేసుకు కూర్చుంటే, ఆఫీసరునొదిలి ఎలావెళ్లగలడు. వెళ్లాలనివుండీ, వెళ్లాలని అడగలేక దిగాలుపడిపోయి పనిచేస్తుండేవాడు. 'ఈపీడ ఎప్పుడు విరగడౌతుందిరా భగవంతుడా ?' అని అతను చాలా సార్లు అనుకునేవుంటాడు. పాపం— ..

మరో విషయం.... చాలామంది గుమాస్తాలు, తోటి ఆఫీసర్లుగూడాను, తనని ఛండశాసనుడని అనుకునేవారు. నిజమే మరి—డ్యూటీ ఫస్టనేజాతివారి ప్రముఖులు, సోమరితనం దూరంగా వుంచుకోమని ప్రతివాడికీ చెప్పేవారు. పనిచెయ్యనివాడి ప్రాణాలు తోటి, మంచిదారిలో పెట్టడానికి సర్వవిధాలా ప్రయత్నించేవారు. అవకతవక వేషాలువేస్తే తగినశిక్ష విధించేవారు. అలాంటప్పుడు తను ఛండశాసనుడు కావడంలో ఆశ్చర్యంలేదు.

కాని తన మనసుని తెలుసుకోడానికి 'ఏ ఫూలా' ప్రయత్నించలేదు.

ఈ తత్త్వం బాగా అలవాటైపోయింది. స్ట్రిక్ట్ ఆఫీసరంటే యమధర్మరాజుకి ఏజంటులాచూస్తుంటారు. ఇన్ని స్కేండల్స్ వాడినెత్తిన రుద్దుతారు.

తన యిన్నేళ్ల సర్వీస్‌లోనూ—ఆ ఒక్క ఎక్కౌంటెంటే తనకు నచ్చాడు. అవునూ— అతనిప్పుడు ఎక్కడున్నాడు— ఎంతమంది పిల్లలో, ప్రయోజకులైయ్యారో లేదో— పాపం— ఇరవైనాల్గుగంటలూ ఆఫీసుపనిలోనే మునిగిఉండేవాడు. ఒక్కోసారి భోజనానిక్కూడా వెళ్లేవాడుకాదు. అప్పుడు తనకి జాలివేసేది. తను వెళ్లమనిచెప్తేగాని యింటికివెళ్లేవాడుకాదు.

అదీ అలావుండాలి. ఉద్యోగస్థుడైనతర్వాత డ్యూటీకంటె మించింది మరొకటిలేదనేవాడే పైకొస్తాడు. దొంగలెప్పుడూ దొంగలగానే స్థిరపడిపోతారు.

దొంగలంటే గుర్తుకొచ్చింది. విశ్వనాథం తనతోటి ఉద్యోగేగా, ఏమయ్యిందతనికి. అతనిముందు అతన్ని అందరూ పొగిడిపారేసేవాళ్లు. వెనకమాటున బూతులు తిట్టేవారు. విశ్వనాథం వస్తుథా అమాయకుడేమో, వాళ్లమాటలన్నీ నమ్మాడు. నిజంకాబోలని పుబ్బిపోయాడు. వాళ్లంతా పట్టెదొంగలు, చాతకాని వెధవలూ అని తెలుసుకోలేకపోయాడు. ఫలితం అనుభవించాడు.

అందుకనే 'పనిదొంగల్ని' ఎప్పుడూ నమ్మకూడదు. మాటలు చెప్పుకు (బతికేవాళ్లకి వాత పెడుతూనేవుండాలి. అప్పటిగ్గాని బుద్ధిరాదు వెధవలకి.

అయినా యిప్పుడీ విషయాలన్నీ ఎందుకసలు ?

గతించింది గుర్తు చేసుకుంటూంటే చాలా బాధగానూ, హాయిగానూ, చేదుగానూ, తీపిగానూ ....

"ఇదిగో విన్నే! కాస్త కాఫీతగలెద్దూ. తలనొప్పితో చస్తున్నాను."

ఈ యింటావిడ వట్టిబద్ధకంమనిషి. అవతల మగాడికి ఎప్పుడు ఏదికావలసి వుంటుందోనన్న జ్ఞానంకూడాలేదు. ఏదైనా, చెప్తేనేగాని, అదీకాస్త ఆలస్యంగాగాని, చెయ్యడం చాతకాదు. అబ్బబ్బ.... యిలాంటి మనిషితో యిన్నేళ్లకాపురం ఎలా....

"విన్నే.... చెవిటిమాలోకం.... పిలిస్తే పలకవుగదా.... కాఫీ...."

"ఇదిగో తాతయ్యా !" సుగుణ కాఫీతెచ్చింది.

"నువ్వు బళ్లోకి వెళ్లలేదుటే సుగుణా...."

"లేదు తాతయ్యా...."

"ఎందుకనిట ?"

"నేనే వుండిపొమ్మని చెప్పాను. ఈ అంకంత యింట్లో ఒక్కదాన్నీ వుండలేక, ఏదో పసిపిల్లతో కబుర్లైనా చెప్పుకుందామని నేనే వొద్దన్నాను." అన్నారావిడ.

"చాల్లే నిర్వాహకం. సంతోషించాలి. ఇందుకోసమేనా అది తల్లీతండ్రుల్ని వదిలి యింతదూరం వచ్చింది ?"

"మీది మరీ విడ్డూరం !"

"లేకపోతే ఏవిటిది ? నాలుగుముక్కలు వంటపడతాయి గదానివాడు దీన్నిక్కడికి పంపిస్తే, చదువుకి ఎగనామంపెట్టమని నువ్వా సలహాలిస్తావు ? చిన్నపిల్లలకి చెప్పే బుద్ధులివేనా ?" జానకి రామయ్యగారు విసుక్కున్నారు.

"పోనిద్దురూ— ఇది యిప్పట్నుంచే చదివి ఏమి ఉద్ధరించాలి గనుక ? ఏడేళ్లయినా నిండలేదాయె."

"ఆ.... నువ్వు చెప్పటానికేమిలే మహబాగాచెప్తావు. నీ అలుసు తీసుకునేగా చిన్నాడు యిప్పుడు ఎందుకు పనికిరాని గుమాస్తాగిరికి నోచుకున్నాడు. సుగుణమ్మతల్లీ ! దాని మాటలు విని చదువుమానుకోకేం ? రోజూ బడికివెళ్లాలి. పాఠాలు నేర్చుకోవాలి. మీ నాన్న నిన్నుచూసి మురిసిపోవాలి. తెలిసిందా ?"

"మరినువ్వో తాతయ్యా—"

"నా తల్లిగాదె.... నా మాటమరిచిపోతున్నానా కన్నతల్లి.. చూడవేమాడు.... నా తల్లికి నేనంటే ఎంత ప్రాణమో." సుగుణ తలని లాలనగా నిమురుతూ భార్యవైపు గర్వంగా చూశారాయన.

—బడికి వెళ్లలేదని సుగుణని మందలించడంమాని, ఆ పిల్లతో కబుర్లాడటం మొదలుపెట్టారు జానకి రామయ్య. ఇదిచూస్తూ నిలబడ్డ యింటావిడ వచ్చేనవ్వుని ఆపుకుంటూ అన్నారు—

"అవతల కాఫీ చల్లారిపోతుంది. ముందుకాఫీతాగి ఆనక మనవరాలితో ముచ్చట్లాడండి."

"అవునవును. కాఫీతెచ్చావుగదూ.... మరినువ్వు తాగావా చిట్టీ !" అని మనవరాలిని అడిగారు.

"ఓ....నాన్నమ్మ నా కెప్పుడో యిచ్చింది."

చిన్నపిల్లలు కాఫీ తాగరాదనే ఆరోగ్యసూత్రం అప్పటిగ్గాని ఆయనకు గుర్తురాలేదు.

"నీకు నానమ్మ కాఫీయిచ్చిందా.... ఇదిగో వింటున్నావా? పసిపిల్లకి కాఫీ యిస్తావూ.... నీకేమైనా మతివుందా? అసలు చూస్తూవుంటె నువ్వు పిల్లల్ని చెరపడానికే పుద్దరించినట్టు కనుపిస్తున్నావే ? నీకు బుద్ధిఅనేది వుందా ? అలారాయిలా నిలబడకపోతే సమాధానంచెప్పరాదూ."

"కాఫీ యిచ్చినంత మాత్రాన—"

"ఇంకఆప్టె మాటడకు. కాఫీయిస్తుందట కాఫీ.... ముచ్చటయితే—మొన్నహార్లిక్సు తీసుకొచ్చాను.' అది యివ్వగూడదూ.... మనిషికి ఒకసారిచెప్తే అర్థంచేసుకునే జ్ఞానం వుండాలి.... ఇదిగోచిట్టీ ! నువ్వెప్పుడూ కాఫీతాగకు. అది నీ ఆరోగ్యాన్ని పాడుచేస్తుందమ్మా !"

"నువ్వూ తాగుతున్నావుగా తాతయ్యా.... మరి నీ ఆరోగ్యం పాడవుదూ...."

తాతయ్య తత్తరపాటు చెందారు. నానమ్మ నవ్వారు. ఆవిడ నవ్వుచూస్తుంటే ఆయనకు తలకొట్టేనంత పనయింది. 'ఆసి భడవా !' అని లోలోన అనుకుని, తనని సమర్థించుకుంటూ ఓ కుంటి సమాధానం చెప్పారు.

"మేము, పెద్దాళ్లంగదూ.... కాఫీ తాగుతే ఏమా ఆరోగ్యం పాడవదు. నువ్వు చిన్నపిల్లవి కాబట్టి నువ్వుతాగుతే ఆరోగ్యం పాడవుతుంది."

"అచ్చం తండ్రిపోలికలు. పెద్దాడుమాత్రం యింతే గదుటండీ !"

"అవునేవ్.... ఇలాంటి చిక్కుప్రశ్నలడగటంలో వాడు గజమొండి. ప్రతిచిన్నవిషయాన్నీ అంతశ్రద్ధ చూపించి అడిగే వాడుకాబట్టి వాడిప్పుడు యింతహోదాలో వున్నాడు." పెద్ద కొడుకు గుర్తుకురాగానే చాలావిషయాలు కదిలాయి....

"నీకు గుర్తుందో లేదోగాని, వెధవాయి నన్ను వొక్షణమైనా విడిచిపెట్టి వుండేవాడుకాదు. పైగా— ఆఫీసునుంచి యింటికిరాగానే వాడితోనాకు చక్కటి కాలక్షేపం గూడాను.— ఏం ఉద్యోగాలో ఏమో.... విసిరిపారేసినట్టు మనకిదూరంగా అడవిలో వుంటున్నాడు. చూశావ్ ఉద్యోగాల్లోవున్న గమ్మత్తే యింత. సెంట్రల్ ఎక్సైజ్ సూపర్నెంటైనంతమాత్రం, తల్లి

దండ్రుల దగ్గరుండాలని ఎక్కడుంది. ఉద్యోగధర్మానికి యీ అను బంధాలు అడ్డురాకూడదు. అన్నీ మరిచిపోవాలి. అందర్నీ వదులు కోవాలి.... అయినా మనపిచ్చిగానీ, వాడికేంతక్కువ ? మంచి హోదా, చేతినిండా డబ్బు, ప్రాణంలాంటి భార్య, రత్నాల్లాంటి పిల్లలు.... అవునూ.... శేషు యింకా యింటికి రాలేదేమిటి ?''

చిరంజీవి శేషువిషయం గుర్తుకురాగానే— పొద్దున్నుంచి జ్ఞాపకానికి రాకుండా దూరంగా తిరుగుతున్న ఓ అతి ప్రమాద మైన సంగతి, దానంతటదే గుర్తుకొచ్చింది.

''వాడు.... వాడేం చేశాడోతెలుసా ? వెధవాల్.... ప్రేలెడుతాడు

''ఏం చేశాడండి.''

ఆయన చివాలునలేచి నిలబడ్డారు. 'అది' తలుచుకుం టూంటె కోపంవస్తోందిమరి.

''ఏం చేశాడా ?.... చేస్తాడు. వాడిష్టంవచ్చింది భయం భక్తీ లేకుండాచేస్తాడు. ఇదంతా నీ భరోసా చూచుకునే చేస్తు న్నాడు. నీ గారాబంవల్లనేవాడు భ్రష్టుడవటానికి సిద్ధపడు తున్నాడు. ఈ సంగతి వాళ్లనాన్నకి తెలుస్తే యింకేమైనావుందా? 'తాతవైవుండి వాడు చెడిపోతుంటె చూస్తూ వూరుకుంటావా. నాన్నా !' అని నాముఖంముందె నాలుగూ కడిగేస్తాడు.''

''ఇంతకీ ఏంచేశాడో చెప్పరేం ఖర్మం !''

''మరిటా— వాడు నీముద్దుల మనవడు, పెద్దాడి కొడుకు.... వుండు.... వాడొచ్చేవేళయిందిగా వాడినోటితోనే చెప్పిస్తాను. చదువుకుని బాగుపడరాబాబూ అనిచెప్పి వాడిని కాలే జీకి పంపుతే వాడుచేసేపని యిదా ?''

''ఎందుకలా వాడిమీద మండిపడిపోతారు. అసలే కుర్ర కుంక. నిండా పదిహేనేళ్లయ్యి—''

''వప్పుకుంటావ్ గదా.... ఆ కుర్రకుంకటా, సాక్షాత్తు వాడి మాష్టరుముందే సిగరెట్టు కాల్చిపారేశాట్ట.''

''ఆ......''

''మరేవిటనుకున్నావ్. ఇవ్వాళ సిగరెట్టు కాల్చాడు. రేపేమో రేపు.... నాకీ సంగతి ఉదయమే గుర్తుకొచ్చివుంటే అప్పుడే వాడి చర్మం వల్చేసివుందును. ఏమిటనుకుంటున్నాడో ఏవిటో. తాతయ్యేగదా.... ఆ ఫూల్ నన్ను నెత్తిమీద పెట్టుకుంటాడు గదాఅని ధీమా ? చూపిస్తానా తడాఖా !''

''చాల్లెద్దురూ.... పసివాడు ఏదోతెలీక....''

''అవునే .... పసివాడు. ఇలా అనే చిన్నవాడిని చెడిపేశావ్. వెధవ, గుమాస్తాగిరిలో సతమత మవుతున్నాడు.''

''మాటకిముందు చిన్నాడిమీద అలా నోరు చేసుకుంటా రెందుకసలు ? వాడికేం ? పదిమందిలోనూ 'భేష్' అని పించుకుంటున్నాడు. మొన్న వాడు రాసిన కథకి ప్రైజ్ కూడా వచ్చిందని—''

''విన్నాం. విని ఏం చెయ్యమంటావ్ ? ఎగిరి గంతు లెయ్యమంటావా ? సిగ్గులేదూ. వాడిని వెనకేసుకు వస్తు న్నావ్. పెద్దాడికీ, చిన్నాడికీ భేదం తెలీడంలేదు నీకు? వాడేమో సూపరింటెండెంటా ? వీడు కానికి పనికిరాని గుమాస్తానా ? ఎవడ్ని చూసి సంతోషించమంటావ్ ?''

''ఎవరదృష్టం కొద్దీ వాళ్లు పైకొస్తారు.''

''గాడిద గుడ్డేం కాదూ. అదృష్టమట. అదృష్టం! వల్లకాదు ! కృషే, కృషి. కృషి కావాలి. అంతేగాని జులాయి వెధవలా తల్లిదండ్రుల్ని ఎదిరించి తిరిగేవాడు బాగుపడతా డనుకున్నావా ?—ఇప్పుడు కాదు, రేపు నలుగురు పిల్లలు పుట్టిన తర్వాత తెలుస్తుంది వాడి అవస్థ. పెద్దాడి సంగ తంటావ్—దేవుడు కనికరించి యిప్పటికి ఇద్దర్ని ప్రసాదిం చాడు. పదిమంది కలిగినా, వాళ్లందరికీ రాజభోగాలు అమర్చ గలడు.''

''దేవుడి దయవల్ల ఇప్పుడు మనకున్నదే చాలు. నిశ్చిం తగా నాలుగు తరాలు గడవటానికి. చిన్నాడు మాత్రం యిబ్బంది పడాలని ఎక్కడుంది ? వాడి వాటా వాడి కిచ్చే స్తేమా,' వాడూ అనుభవించగలడు అన్ని భోగాలూను.''

''అంటే నీ ఉద్దేశ్యం ?, ఇప్పుడు ఆస్తి పంపకం జరగా లంటావా ? అది నా బొందిలో ప్రాణం ఉండగా జరగదు.''

''మన అబ్బాయిలకీ అభిమానం ఉంది.''

''అందుకని ఇప్పుడేమంటావ్ ?''

ఆవిడ ఏమీ అనలేదు. ముగుణను తీసుకుని వంట గది లోకి వెళ్లింది.

ఇలాంటి గలాటాలు ఆ యింటో గత ఏడెనిమిది సంవ త్సరాలనుండీ అలవాటేను. వాటికో కారణమంటూ ఉండక్క ర్లేదు. అమాత్రం లేకపోతే—యీ చివరి రోజులు ఏం సంద డిగా గడుస్తాయి ? అదీ గమనించాలి మరి.

జానకిరామయ్యగారు శేషు విషయం పూర్తిగా మరిచి పోయారు. చిన్నవాడి గురించి ఆలోచించడం మొదలుపెట్టారు. లేచి నిలబడినవారు మళ్లీ పడక కుర్చీలో నడుం వాల్చారు.

పక్కనున్న కాఫీ పూర్తిగా చల్లారిపోయి పది నిముషా లయ్యింది.

—సరిగ్గా అయిదు గంటలకి గుమ్మం బయట సైకిలు బెల్లు వినిపించింది. బెల్లు వినిపించగానే భార్య నుద్దేశించి అన్నారు గట్టిగా—

''శేషు వచ్చేడేవ్ ....''

శేషు లోపలికి వస్తూనే అన్నాడు,

''తాతయ్యా, ఇవ్వాళ నీకో గుడ్‌న్యూస్ చెప్తాను. చెప్పనా ?''

''ఏమిటో అది ?''

"చెప్తే ఏమిస్తావ్ ?"

"చెప్పరా భడవా ! చెప్పిన తర్వాత నీ ప్రెజంటేషన్ ఆలోచిస్తాను."

వీడు మరీను. పెద్దాడి మల్లే ప్రతి విషయానికీ 'సస్పెన్స్' తగిలిస్తాడు. ఆ సమయానికి ఇంటావిడ గూడా అక్కడికి వచ్చారు.

"శంకరం బాబాయ్ ఉత్తరం రాశాడు."

"వూ .... రాస్తే—"

"అందరూ వినండహో .... అతి త్వరలో నాకూ, చి. సౌ. చెల్లాయి సుగుణకీ—ఒక చక్కటి తమ్ముడు పుట్ట బోతున్నాడు."

ఆ వార్త వినగానే మనవడ్ని కావులించుకుంది ఇంటావిడ. వాడి తలని నిమురుతూ అన్నారు—

"నా బాబే .... ఎంత మంచి వార్త చెప్పావురా నాయనా"

"వరేయ్ .... వరేయ్ .... ఆ ఉత్తరాన్ని ఇలా .... ఇవ్వరా" కుర్చీలోంచి ఒక్కసారిగా లేచి నిలబడి తడబడుతూ, ఆ ఉత్తరాన్ని అడిగారు జానకిరామయ్య—కళ్లజోడు సర్దుకుంటూనే శేషు యిచ్చిన ఉత్తరాన్ని పూర్తిగా చదివారు. ఇంటావిడ కోరిక మీద బిగ్గరగా చదవాలసి వచ్చింది.—

'చిరంజీవి శేషుని, మీ బాబాయి ఆశీర్వదించి వ్రాయునది. మీ పిన్నికి వారం రోజులనుండి వంట్లో బావుండుట లేదని, మొన్న హాస్పిటల్‌కు తీసుకువెళ్లాను. అక్కడ డాక్టర్లు మీ పిన్నిని పరీక్షించారు. త్వరలో నీకూ, నీ చెల్లాయికీ ఒక చక్కటి తమ్ముడు పుట్టబోతున్నాడని చెప్పారు. అన్నట్టు కూడా యివ్వేళనే ఉత్తరం రాస్తున్నాను. ఈ విషయం తాతకీ, నాన్నమ్మకీ నువ్వే చెప్పు. కానీ—ఒక షరతు— వాళ్లు నీకేదైనా ప్రెజెంట్ యిచ్చేంతవరకూ ఈ విషయం చెప్పకు. తాతయ్యకీ, నాన్నమ్మకీ నా వందనా లందజేయి. చెల్లాయికి నా ముద్దులని చెప్పు. బాగా చదువుతున్నా వనుకుంటాను. ఉత్తరాలు రాస్తూండు.'

ఉత్తరం చదివి, దాన్ని జేబులో పెట్టుకుని శేషుతో అన్నారు.

"నీ కొక్కడికే ఉత్తరం రాయడంలో వాడి ఉద్దేశ్య మేమిటో ?"

"మా బాబాయి సంగతి మీ కెవరికీ తెలీ దసలు. మన మంటే ప్రాణం. ప్రతీ సంగతీ ముందుగా మనకు తెలియాల్సిందే."

"సంతోషించాంలే .... ఎలాగైతేనేం మంచి బాబాయి నీ కొక్కడికే దొరికాడు. ఆ .... ఇదిగో ముందు ఆ విషయం ఆలోచించు."

ఆ విషయ మేదో తనకి గుర్తు రావడానికి ఓ క్షణం పట్టింది. ఆ క్షణం తర్వాత అన్నారు భార్యతో.

"అసలే ఆ పిల్లకి అనారోగ్యం. వాళ్ల పుట్టింటి మాటంటావా ? వట్టి పల్లెటూరి మాలోకం. అందుచేత ఆ అమ్మాయిని మనింటికే తీసుకొద్దాం. ఇక్కడ మంచి డాక్టర్లున్నారు. ఈ విషయమే రేపు వాడికి రాస్తాను. ఏమిటో, దేవుడి కిన్నాళ్లకి వాడిమీద దయ కలిగింది. ఓ నలుసు నిస్తున్నాడు. అదే చాలు. ఇదిగో నే చెప్పే దేమైనా వినిపించుకుంటున్నావా ?"

"నన్నలా విసిగించకపోతే, మీరు చెప్పేదేదో చెప్పరాదుటండీ ! నేనూ వాడి విషయమే ఆలోచిస్తున్నాను."

"అదే .... ఆ పిల్ల నిక్కడికి తెస్తామనుకో. అంత వరకూ బాగానే ఉంది. కాని—వాడు హోటల్లో చెయ్యి కడుక్కోవలసి వస్తుందిగదా. పైగా—యీ హోటలు భోజనం వాడి శరీర తత్వానికి సుతరామూ పడదాయె ఖర్మ."

"సెలవు పెట్టి వాడిని గూడా యిక్కడికి వచ్చేయ మనండి."

ఆయన ఫక్కున నవ్వారు.

"నీ కేమైనా మతి పోయిందా ఏమిటి? ఎన్నాళ్లని సెలవిస్తారు. అదేమైనా ఆఫీసనుకున్నావా లేక ధర్మసత్ర మనుకున్నావా, అడిగినన్ని సెలవు లివ్వటానికి." ఆయనకు తన ఆఫీసరుగిరీ గుర్తు కొచ్చింది. అంతలోనే కొడుకు దుస్థితి (గుమాస్తా గిరీ) మీద జాలివేసింది.

"అసలా బోడి గుమాస్తా గిరికి రాజీనామా యివ్వమని రాస్తాను. వాళ్లిచ్చే నూటేభై నేనే యిస్తాను. వాడు ఇంటిపట్టున మన కళ్లముందుంటే అంతే చాలు. పిచ్చి వెధవ—ఎంత బాధపడుతున్నాడో ఏమో."

"అలాగే చెయ్యమనండి. పెద్దతనంలో ఉన్నామా—పాడు మనసు పిల్లల మీదికి పోతోంది."

"నువ్వూ ఒప్పుకున్నావ్ కదూ—కాని .... వాడితో వచ్చిన చిక్కేమిటంటే, నామాట వినిపించుకోడు. పైగా ఉద్యోగం పురుషలక్షణ మంటారు. ఒకపని చేస్తే, వచ్చే సంక్రాంతికి నువ్వూ, నీ భార్యా యిక్కడికి రావలసిందని రాస్తాను. వాడు వచ్చిన తర్వాత ఏదో విధాన వాడిని ఒప్పించి రాజీనామా యిప్పిద్దాం. సరేనా—" అంటూ ఆయన అప్పటికే ఇంటిగుమ్మం దాటారు.

"తాతోయ్, నా ప్రెజంటేషన్ మాటేం జేశావ్" అన్నాడు చిరంజీవి శేషు.

"మీ మామ్మ దగ్గర ఓ పది రూపాయలు పుచ్చుకో ... మంచి పెన్ను లేదని గోల పెడుతున్నావ్‌గా" అని చెప్పి గబగబా నడుచుకుంటూ వెళ్లిపోయారు.

శ్రేయోభిలాషులు

"ఏమిటో చిత్రమైన మనిషి. క్షణానికో విధంగా మారి పోతూంటారు." అనుకుంది ఇంటావిడ.

*　　*　　*

రోడ్డుమీదికి వచ్చిన తర్వాత శేషు సిగరెట్టు కాల్చి నట్టు మళ్లీ జ్ఞాపకానికి వచ్చింది జానకిరామయ్యగారికి. నవ్వు కున్నారు.

ఇప్పుడు, తనకు మనవడు పుట్టబోతున్నాడనే శుభ వార్త ముఖ్యంగా సుబ్బరాజుకి చెప్పాలి. కనిపించినప్పుడల్లా అడుగుతాడు. 'మీ రెండోవాడికి పిల్లలా ?' అని. ఇప్పుడు గర్వంగా చెప్పాలి. ఉత్తరాన్ని అతని ముఖంమీద గిరాటు వెయ్యాలి.

సుబ్బరాజు తన శ్రేయస్సుని కోరే మనుషుల్లో ఒకడు. అత నంటాడు— "నీ కేమిటోయ్— రామలక్ష్మణుల్లాటి యిద్దరు కొడుకులు. ఇప్పటికీ నీ మాట జవదాటరు. రత్నా ల్లాటి మనవలు, తరగని ఆస్థి. మనిషికి ఇంతకంటె కావలసిం దేమిటోయ్.'

నిజమే. మనిషికి యీ ఆనందం కంటె విలువైనది ఏముంది ?

లోకంలో ఎంతమంది పిల్లలు లేరు. అనుక్షణమూ, అన్నమీద తమ్ముడు—తమ్ముడి మీద అన్న కత్తులు నూరుకో డమే నాయె. అలాంటిది తన పిల్లలు ఎంత అన్యోన్యంగా ఉంటారని. ఇప్పటిగ్గూడా అన్నయ్యంటే చిన్నాడికి ఎంతో భక్తీ, విశ్వాసమూను. వాడికి అన్నయ్యమీదున్న గౌరవం నాన్న మీద లేదు. లేదంటే పూర్తిగా లేదని కాదు. గాని, అప్పు డప్పుడూ తన మాట కెదురు చెప్పడం కద్దు—

అందునా, పెద్దవాడి తర్వాత వరుసగా ముగ్గురాడ పిల్లలు పుట్టి పోయిన తర్వాత చిన్నాడు పుట్టాడేమో—— వాడిమీద 'గారాం' చూపించారు. కొద్దో గొప్పో 'అలుసుతనం' నేర్పారు. అందుచేతనే వాడు యిలా తయారయ్యింది.

వాడు శ్రద్ధగా చదివి ఉంటే ఈసరికి మంచి హెూదాలో ఉండేవాడు.

నాటకాలూ, కథలూ మీద ఉన్న 'గురి' చదువుమీద ఉండేది కాదు. ఎంత చెప్పినా వినిపించుకునేవాడు కాదు. చదువు కునేవాడు వీటికి దూరంగా ఉండాలని ఎన్నో నీతులు చెప్పినా, వినిపించుకున్నట్టే నటించి తనకు తెలియకుండానే స్టేజి ఎక్క డమో, కథలు రాయడమో చేస్తుండేవాడు. ఒకనాడు ఏమయ్యిందని—

ఏదో ఫంక్షనికి తనకి ఆహ్వానం వస్తే వెళ్లారు. ఫంక్షను ముగిసిన తర్వాత నాటక మన్నారు. తెర ఎత్తేసరికి స్టేజిమీద శంకరం ప్రత్యక్ష మయ్యాడు. ఆ వేషంలో వాడెంత అందంగా ఉన్నాడని. నిజానికి ఆరోజు వాడు చాలా బాగా నటించాడు. ఎంతోమంది వాడిని ప్రశంసించారు. వస్తూత్రా వాడు చక్కటి వటుడాయె మరి.

గమ్మత్తేమిటంటే వాడితోపాటు తనని గూడా చాలా మంది అభినందించారు. తనకు బలే సిగ్గనిపించింది గూడాను. ఆమాటకొస్తే తన సర్వీసులో గూడా యింతటి 'ప్రశంస' తనకి ఎదురు కాలేదు !

ఆ కాసేపూ తనూ కొంత ఆనందించారు కాని—'నాట కాల్లో దిగిపోతే వాడు చెడిపోతాడేమో' నన్న దిగులు పేవుల్ని మెదులుతూనే ఉంది.

కథలు రాయడంలో గూడా వాడు మంచిపేరు సంపా దించుకున్నాడు. అయితేనేం—తను అనుకున్నట్టే చివరికి వాడు బి. ఏ. తప్పడం, చదువుకి స్వస్తి పలకడమూ జరిగాయి.

ఏమైనా—పెద్దవాడి ముందు వీడు భ్రష్టుడేను !

—సుబ్బరాజు యింటికి వెళ్లేసరికి బాగా చీకటి పడింది. గేటు తలుపు తెరుచుకుని యింటి ఆవరణలోకి అడుగు పెట్టారు. సుబ్బరాజు కోడలు కాబోలు తనని చూస్తే అన్నది.

"మావయ్య వూరు వెళ్లారండీ."

మనసు చివుక్కుమన్నది. తిరిగొచ్చేస్తూ అనుకున్నారు.

"శుభవార్త తెలియజేద్దామని వస్తే వీడు లేకపోయె. మళ్లీ ఎప్పుడు వస్తాడో ఏమో ..... "

—ఇంటికి చేరుకున్నారు. భోజనాలు అయ్యాయి కాబోలు, శేషు తన గదిలో కూర్చుని బుద్ధిగా చదువుకుంటు న్నాడు. 'వ్హాటీజ్ దిస్ లైఫ్ యిఫ్ ఫుల్లాఫ్ కేర్.'

జానకిరామయ్యగారు భోజనం ముగించి డైరీ రాసు కున్నారు. కాసేపు వడక కుర్చీలో నడుం వాల్చి 'చుట్ట' కాల్చుకున్నారు.

'శేషు సిగరెట్టు కాల్చాడు'—మళ్లీ శేషు చేసిన తప్పు గుర్తుకు వచ్చింది—కాని ఇప్పుడు వాడి చదువు పాడుచేయడ మెందుకని మౌనం వహించారు. ఏదో పుస్తకం తీసి చదువు కోడం ప్రారంభించారు.

గోడ గడియారం తొమ్మిది కొట్టింది.

'వ్హాటీజ్ దిస్ లైఫ్....యిఫ్....ఫుల్....ఆఫ్ .... కేర్.'

శేషుకి నిద్ర వస్తోంది కాబోలు. పరీక్షలు ఎప్పుడో గదా—ఇప్పట్నుంచే ఇంత కష్టపడి చదవకపోతేనేం. ఇలా నిద్ర మేలుకుని చదువుతే ఆరోగ్యం పాడవదూ.

ఈ పి. యు. సి. లో క్లాసు రాగానే ఏ ఇంజనీరింగ్‌కో పంపాలి. అంతేగాని బి. ఏ. లు, బి. కాంలూతో పనిలేదు. ఆ డిగ్రీ లకి ఈ రోజుల్లో బొత్తిగా విలువ లేదు.

శేషు గదిలోంచి ఏ శబ్దమూ రాకపోయేసరికి వాడు నిద్రపోతున్నాడేమోననిపించింది. జానకిరామయ్యగారు శేషు గదిలోకి వెళ్లారు.

చదువుతూన్న పుస్తకాన్ని గుండెలమీద పెట్టుకుని నిద్ర పోతున్నాడు శేషు.

జానకిరామయ్య గారికి ఆ 'పిచ్చి వెధవ' మీద జాలి వేసింది.

శేషు గుండెలమీద నుండి జాగ్రత్తగా పుస్తకాన్ని తీసి టేబిల్‌మీద పెట్టారు. దుప్పటి కప్పుతుండగా శేషు వళ్లు వెచ్చగా తగిలింది. జానకిరామయ్యగారు ఉలిక్కిపడ్డారు.

వయస్సుకి మించిన శరీర సౌష్టవం ఎవళ్లనైనా ఆకర్షిస్తుంది. శేషుమీద ఎవరి దృష్టయినా తగిలిందో ఏం పాడో! అస లిలాంటి విషయాలన్నీ ఇంటావిడ చూచుకోవాలి. ఛ .... వట్టి బద్ధకం మనుషులు.

చిన్నాడు గూడా తన పద్దెనిమిదో ఏటనే, ఓ పాతికేళ్ల యువకుడిలా కనుపించేవాడు. వాడి పోలికే అబ్బింది శేషుకి.

శేషుకి దుప్పటి కప్పి లైట్ ఆఫ్‌జేయ బోతుండగా వాడు ఉలిక్కిపడి లేచాడు. తన గుండెలమీద ఉండాల్సిన పుస్తకం లేదు. ఎదుట తాతయ్య నిలబడి ఉన్నాడు.

"పుస్తకం—"

"నిద్రపోవోయ్ .... అస్వమానం చదువేనా ?"

"ఎల్లుండి మా క్లాసు ఎగ్జామినేషన్ తాతయ్యా."

"అవుతే—దానికోసం రాత్రంతా చదువుతావా ఏమిటి? పడుకో ముందు."

* * *

"మొన్న ఎగ్జామినేషన్లో ఫస్టు మార్కు నాకే వచ్చింది. ఇప్పుడు గూడా రావాలంటే—"

"పోరా భడవా ? ఆరోగ్యం కంటె చదువేం గొప్పది కాదులే. నిద్రపో .... నీలాటి బ్రిల్లియంట్ స్టూడెంట్ చదవక పోయినా ఫస్టు మార్కే తెచ్చుకుంటాడు."

తనమీద తాతయ్యకు గల నమ్మకానికి చిరంజీవి శేషు మురిసిపోయాడు. వాడి కళ్లు ఆనందంతో మెరిసిపోయాయి.

"మీ ఫాదర్‌గ్గూడా ఎప్పుడూ ఫస్టు మార్కులే వచ్చే విరా శేషు! ఒక్కనాడు గూడా వాడి చదువు విషయం అడిగే వాడిని కాదు. స్వయంగా శ్రద్ధ తీసుకుని వాడే చదువుకునే వాడు. చదువుమీద వాడి కంత గౌరవం ఉంది కాబట్టే ప్రయోజకు డయ్యాడు. ఆ గౌరవం లేదు కాబట్టే మీ బాబాయి అలా తయారయ్యాడు."

"మాటకి ముందు బాబాయిని అంటావ్‌గాని, బాబాయి కెంత పేరుందో నీకు తెలీదు తాతయ్యా. మా ఇంగ్లీషు లెక్చరర్ బాబాయిని తలవని రోజు లేదు. ఆయన గూడా కథలు రాస్తాడులే. బాబాయికి ప్రైజ్ వచ్చిందని తెలిసి ప్రతి వాళ్లూ బాబాయి వివరాలు నన్ను అడగటమే. చెప్పలేక చస్తూన్నా ననుకో. ఇప్పుడు బాబాయి పేరు ఆంధ్రదేశ మంతటా తెలుసు!"

తాతయ్య మీసాల చాటున నవ్వుకున్నారు! శేషు ప్రక్కన కూర్చుని వాడి భుజం తట్టుతూ అన్నారు.

"బాబాయి మీద నీకెంత ప్రేమరా ? వాడిని ఒక్క మాట గూడా అననివ్వవుగదా! నువ్వు పెద్దాడివై మీ నాన్నంత ఉద్యోగం చేస్తావనుకో .... అప్పుడు గూడా బాబాయిమీద యింత ప్రేమ చూపిస్తావా ?"

"పో .... తాతా" శేషు సిగ్గు పడిపోయాడు.

"నీకు పెళ్లయి, పెళ్లామొచ్చి పిల్లలు పుట్టినా బాబాయిని మరచిపోకూడదు. బాబాయి, పిన్ని, మీ నాన్నా, అమ్మా, నీ తమ్ముళ్లూ, చెల్లాయిలూ వీళ్లందరి క్షేమాన్ని తెలుసు కుంటూ ఉండాలి. అందరూ సుఖంగా బ్రతకాలి" జానకి రామయ్యగారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి— '

"మీ అందర్నీ చూసే భాగ్యం—" ఆయన అక్కడ ఆగిపోయి, కళ్లు తుడుచుకుని మళ్లీ అన్నారు.

"మీ బామ్మ నాతో చాలాసార్లు అందిరా శేషు. మాకు దేవుడు వందేళ్లు ఆయుస్సు ప్రసాదిస్తే—మిమ్మల్నందర్నీ చూస్తూ—ఇది నీకు నవ్వుగా ఉంటుందనుకో— మీ పిల్లల్ని పెంచుతూ హాయిగా కృష్ణా, రామా అనుకోవాలని దాని కోరిక. వట్టి పిచ్చిబాగుల మనిషి. దీంతో ఇన్నేళ్లు ఎలా కాపురం చేశానా అని ఆశ్చర్యంగా ఉంటుంది."

"నాన్నా, బాబాయివాళ్లు సంక్రాంతికి తప్పకుండా వస్తారా తాతయ్యా!"

"రమ్మని రేపే ఉత్తరాలు రాస్తాను. రాకపోతే మీ బాబాయి, మీ నాన్న—ఇద్దరి చర్మాలూ వలిచేస్తానని రాస్తాను. సరేనా—అయ్య బాబోయ్ అప్పుడే తొమ్మిదిన్న రవ్వొస్తోంది. చిన్నవాళ్లు ఎక్కువసేపు మేలుకోగూడదు."

శేషుని పడుకోబెట్టి, లైట్ ఆఫ్‌జేసి తన గదిలోకి వెళ్లారు జానకిరామయ్య. పక్కమీద నడుం వాల్చిన తర్వాత మళ్లీ గుర్తుకు వచ్చింది శేషు సిగరెట్టు కాల్చాడని. 'భడవ! తప్పించుకు పోతున్నాడు.' తనలో తను అనుకున్నాడు. ఇంటావిడ మందుసీసాతో లోపలి కొచ్చింది. ఆవిడను చూడగానే అడిగాడు —"నువ్వింకా నిద్రపోలేదా ?"

"సుగుణతల్లి. నన్ను నిద్రపోనిస్తేకదా. కథలు చెప్ప మని నా ప్రాణాలు తోడేసింది పిచ్చితల్లి. ఒక పట్టాన నిద్ర పోదండి. వట్టి మంకు ....."

"మరి .. అచ్చం నీ పోలికే సుమా." ఆయన గబగబా నవ్వేశారు.

ఆవిడ సిగ్గుపడి పోయింది.

"ముందు ఈ మందు తాగండి. తర్వాత నవ్వుకుందురు గాని."

ఆవిడ యిచ్చిన మందు తాగారు.

"ఏమిటో యాంత్రికంగా జీవితం గడుస్తోంది." అన్నారు.

ఆవిడ ఆయన పాదాల దగ్గర కూర్చుంది.

"ఒక్కోసారి యిదంతా వట్టి మాయా ప్రపంచమనీ, మరోసారి ఇదంతా నిజమనీ అనిపిస్తుంది. బాధ్యతలూ, త్యాగాలూ చాలా రుచి చూశాం. నువ్వు గమనించావో లేదో గాని మన పెళ్లయిన కొత్త రోజులకీ ఈనాటికీ చాలా భేదం కనుపిస్తోంది. అప్పట్లో నువ్వు నాకోసం, నేను నీ కోసం అన్నట్టు ఉండేవాళ్లం. ఇప్పుడా భావం దూరమయ్యింది. మనిద్దరం కలిసి మరికొందరి శ్రేయస్సు కోసరం బ్రతుకుతున్నట్టున్నది. ఇదంతా నీకు చిత్రంగా కనుపించడంలేదు.'

ఆవిడేమీ మాటాడలేదు.

ఆయనే అన్నారు—

"పెద్దాడు పుట్టిన మరుక్షణం నుంచి ఈ క్షణం వరకు తీరుబడి లేనంత కార్యక్రమాల్లో మునిగిపోతున్నాను. పెళ్లయిన కొత్తలో రెండు సంవత్సరాలపాటు సరదాగా కాలక్షేపం చేశా వనుకుంటాను. ఆ తర్వాత బాధ్యతలు పెరిగాయి. ఆఫీసుపని, పిల్లల పెంపకం, తీరుబడిలేని యీ కార్యక్రమాల్లో విసిగిపోయాను పార్వతీ! ....."

'పార్వతీ' అనే పిలుపు మళ్లీ ఇన్నేళ్లకి చోటు చేసుకోవడంతో అటు జానకిరామయ్యగారు, ఇటు పార్వతీ— యిద్దరూ ఆశ్చర్యపోయారు. వెంటనే ఇద్దరూ ఏమీ మాటాడలేక పోయారు.

"విధి నిర్వహణలో చాలా విషయాలు పట్టించుకుని పట్టించుకోనట్టు చూడవలసి వస్తుంది. నా ప్రవర్తన నిన్నెప్పుడైనా బాధపెడితే నన్ను క్షమిస్తావు గదూ పార్వతీ!"

"మీ రేదో కొత్తగా మాటాడుతున్నారు. నాకు బాధేమిటీ, మిమ్మల్ని క్షమించేపాటి దానినా నేను. ?"

ఆయన పేలవంగా నవ్వారు!

"పిల్లల్ని పెంచి పెద్దవాళ్లను చెయ్యడంలో ఉన్న ఆనందం బహు కొద్దిమందికే లభిస్తుంది. నేను అదృష్టవంతురాలిని. నాకే దిగులూ లేదు. దేవుడిలాంటి మీరు, ముత్యాల సాటి పిల్లలూ. స్త్రీకి ఇంతకంటె కావలసిం దేముంది చెప్పండి ?"

పార్వతి చేతిని ప్రేమతో నిమిరారు జానకిరామయ్య.

ఆదే సమయంలో—

వీధి తలుపు తీసిన చప్పు డయింది.

"ఏమిటది ?" ఆత్రంగా అడిగారు జానకిరామయ్య.

"శేషు సినిమాకి వెడుతున్నాడు కాబోలు."

"వ్హాట్." ఆయన క్కోవం వచ్చింది.

"పోనిద్దురూ .... పసివాడు. సాయంత్రం నుండీ నా ప్రాణం తీసి చివరికి నన్ను ఒప్పించ గలిగాడు. అదీగాక యివ్వాళ శుభవార్త తెచ్చాడాయె..... వాళ్ల స్నేహితు లందరూ కలిసి ఏదో యింగ్లీషు సినిమాకి వెడదామని అనుకున్నార్ట ...." ఆవిడ చెప్పవలసినదంతా చెప్పింది. అంతా విని కోపం పట్టలేక అన్నారు జానకిరామయ్య—

"ఇలా సెకండ్ షోలకి వెడితే ఆరోగ్యం పాడవదూ.... వాడినని లాభంలేదు. అంతా నువ్వు చేస్తున్నావ్. నీకు పిల్లల్ని పెంచడం చాతకాదు. ఇంకా ఎప్పుడు నేర్చుకుంటావో ఏమో. వుండు .... వాడినీ .... రేపుదయం గుర్తు చెయ్యి. వెధవాయి చర్మం వల్చేస్తాను .... సినిమాకి వెడతాడు. సినిమాకి ...."

చివరికి తేలిన విషయం :

చిరంజీవి శేషు పైన తను తీసుకోవాలిసిన క్రమశిక్షణ చర్య రేపు ఉదయానికి వాయిదా వేయబడింది.

దశావతార చరిత్ర

శ్రీ శివలంక శ్రీరామచంద్రమూర్తి

రసహృదయ ద్విరేఫమునకు ఆంధ్ర సారస్వతోద్యానమున రాయలయుగ మొక సుపుష్పిత లతానికుంజము. ఆ కుసుమ రసాస్వాదనమున జొక్కిన ఆ భ్రమర మింకను స్వాదిష్ఠ రస భరిత కుసుమ మంజరులకై సహజముగ ముందుకు సాగి పోవును. మధ్యే మార్గమున అడ్డ తగులు గడ్డిపూవుల ద్రోచి కొని పోవుచుండ వాని నడుమ తావులు వెదజల్లుచు నొక్క పుష్పమంజరి ఆ భ్రమరము నాకర్షించును. ఆ భ్రమరమున కట్లు ఆమె తలగూర్చు ఆ పుష్పమంజరియే దశావతార చరిత్ర.

వివిధ వర్ణనా సంవలితము, రసపేశలము, విభిన్న శైలీ సంయుతము నైన ఈ దశావతార చరిత్రకు కర్త ధరణిదేవుల రామయమంత్రి. ఈతడు సుమారు 18 వ శతాబ్ది వాఁడు. ఈ కృతి మగదల కృష్ణ మంత్రికి నంకిత మీయబడినది. ఈతడు నెల్లూరి మండలములోని ప్రళయకావేరీ పట్టణమున నౌలాందా వారి కడ ద్విభాషిగ నుండెడువాఁడు. రామయమంత్రి "సంస్కృతాంధ్రభాషా వినుతుఁడు, దినైక ప్రబంధ విరచన దక్షుఁడు", "సంస్కృత ప్రాకృతాద్యష్ట భాషా కవిత్వ తత్త్వ సంవేది." అందుచేతనే యీతనికి కవిత్వముపై సువిశాలమగు భావము గలదు. ఏ యొక్క అంశముచేతను గాక సర్వాంగీణముగా బుష్టమైనదే కవిత్వమని యతని యభిప్రాయము. "శృంగార వధూకమైన కవితా సామ్రాజ్య మేలంగ నేర్చిన విద్వత్కవిరాజ రాజు" లీతని స్తుతికిఁ బాత్రులైనారు. ఇది యీతని శృంగార రసముపై గల మక్కువకు దార్కాణము.

సర్వాంగీణమైన పుష్టికి అవకాశ మొసగు కథావస్తువు గలది యగుటచే కాఁబోలు కవి దీనిని పరిగ్రహించినది. ఈ దశావతార చరిత్రను తన సర్వతోముఖ పాండితీ ప్రకటనకనువుగ మలచికొనినాడు. అసలు ఈ దశావతార గాథాసంపుటీకరణమునకు భాగవతము ప్రధానాధారము. దశావతారములుగ మత్స్య కూర్మ వరాహ నృసింహ వామన భృగురామ రామ బలరామ కృష్ణ బౌద్ధ కల్క్యవతారములు వర్ణితములైనవి.

ఈ కవి మంచి భావనాపటిమ గలవాడు. ఈ భావనాపటిమ ఈతని వర్ణనలకు జీవమైనది. ఒకే వస్తువుగాని, దృశ్యముగాని యీతనిలో రమ్యములగు విభిన్న భావనలను రేకెత్తించును. ప్రకృతిని కథాసందర్భముతో లగించి రమ్యమగు వర్ణన నొనరించును. సంధ్యా సమయముతో దితి చెలువమును మేళవించి హృదయాహ్లాదియగు వర్ణన నొనరించి వాడు—

సీ. "చంకనత్రుత్న తాటంకంబు లిరువంకఁ గనుపట్టు చంద్రభాస్కరులు గాఁగ
నలతి పయ్యెదలోని హారము ల్బిలువ వెన్నెలలోని తారకావళులు గాఁగ
వలిపెంపు కుసుమ పూవన్నె చేల మెఱుంగు జగజంపు సంజ కెంజాయ గాఁగు
గంకణ మేఖలా కటక ఝుళంఝుళ లమిత విహంగ నాదములు గాఁగు

తే. గనుబొమ లనంగుఁడూను సింగాణి గాఁగ
విప్పుఁ గన్నులు విరిగల్వ విరులు గాఁగ
బటువు గుబ్బలు ముకుళితాబ్జములు గాఁగ
సంజ చెలువునఁ బతిఁ జేరి కంజవదన." (3—28)

సంధ్యాసమయము రుద్రతాండవ వేళ. ఆకాశము రుద్రమూర్తి. సంధ్యాసమయమందలి ఆకాశముతో దితి యిట్లుఁ బోల్పఁబడుటచే నామె రుద్ర ప్రభావిత యైనదని రమణీయ భావాంతరము. రుద్ర ప్రభావిత యగుటచేతనే రుద్రునంశచే గల్గు రాక్షస సంతానము నామె కాంచినది. ఇది చక్కని ఔచితితో గూడిన చమత్కారము.

వర్ణ్య విషయాధిక్యమును స్ఫురింపఁ జేయుట కీతడు అతిశయోక్తి నాశ్రయించును. అయితే ఆ అతిశయోక్తి విషయాధిక్యమును, స్ఫురింపజేయు జాలి యుండునే కాని వ్యర్థము కాదు. అదియే అతిశయోక్తి పరమార్థము. దినదిన ప్రవర్ధమాను డగుచున్న హిరణ్యాక్షుని వర్ణన చూడుడు—

సీ. "అంగుష్ఠమున నిల్చెనా కిరీటము దాఁకి పటపట బ్రహ్మాండభాండమగలు
నట్టె చేతులు సాచెనా పూర్వ పశ్చిమ చంద్ర దినేంద్రులఁ జంక నిఱుకు
వడిగాఁగఁ నాలుగై దడుగులు నడిచెనా ధారుణీతలము పాతాళమంటు
నొకయింత ఘనముగా నొడలుబ్బఁజేసెనా హరిదంతరము లెల నవియఁ బార్ష్ణ

తే. గడిది నిట్టూర్పు గాడ్పుల గ్రహగణంబు
లొక్క మూలకుఁ జిక్కు నత్యుగ్రదృష్టి
సెగుడు చోటెల్ల నిగురులై యెగయు నట్ట
హాస మొనరింప విధి గుండె లవియుచుండు
వాని యౌద్ధత్య మెన్న నెవ్వారి తరము." (3.176)

పెరిగి పెద్ద య్యెనంత వీడే కదా సర్వంసహా నొక చాప చుట్టగా సముద్రమున బడ(ద్రోయుట కుద్యమించినాడు. ఆ వ్యవహార పరిష్కారమునకు పురాణి కట్టిన ట్లున్నదీ వర్ణన.

ఇట్టే సన్నివేశ సాక్షాత్కృతి యీయని వర్ణనలం దొక ప్రధానాంశము. కవి వర్ణ్యవిషయమును ప్రత్యక్షముగను మనోవీధియందును, లేదా కేవలము మనోవీధియందేనో దర్శించును. ప్రత్యక్షముగ జూచెనేని దానిని తన భావనా బలముచే మరింత రమ్యముగ రూపొందించి మన యెదుట ప్రదర్శించును. కాక మనోవీథియందు దర్శించెనేని ప్రత్యక్ష వస్తు సముదాయముతో మనోగతభావమును లగించి రమ్యతరముగ సాక్షాత్కరింపజేయును. కవి ప్రతిభ ననుసరించి యిట్టి సజీవ వర్ణనలు వెలువడు చుండును. ఇట కవి తన భావ వీథి విటంకమున సురనూత తపోమూర్తిని వివిధావస్థలలో దర్శించి తన కల్పనా బలముచే మన ప్రమోల నెట్లు సాక్షాత్కరింప జేసెనో చూడుడు—

సీ. "అతి ఘోర గహన మధ్యమున వర్తించుచో వేషంబు
లోని క్రొమ్మెఱుంగు కరణిఁ
జలికాలమున జలాశయమున నుండుచోఁ గొలనిలో
రాయంచ క్రొగవు పగిదిఁ
గడఁగి పంచాగ్నుల నడు చిక్కి నిలుచుచో లలితమౌ
పసిఁడి సలాక పోకఁ
బడమిఁ బాదాంగుష్ఠమున నెలకొన్నచోఁ బాదులో
లేఁ దీఁగె బాగు వీఱ

తే. జిలుక పలెఁ గోయిల విధాన ఫలము పర్ణ
ములు మెసఁగుచుఁ గన్నాళ్ళు జలము మొదలు
గ్రోల కిప్పుడు రత్న పాంచాలి లీలఁ
దపము సలిపెడు సురనూత దైత్యనేత!" (5—32)

వర్ణ్య విషయ ప్రభావాధిక్య ప్రకటనకు గవితాద్గుణ్యము నాశ్రయించును. తాద్గుణ్యము నాశ్రయించుటలో చమత్కారయుతముగ వర్ణ్య విషయ ప్రభావాధిక్యము మనసునకు దట్టును. ఇట్టి సందర్భములందు రామయమంత్రి సంవాద శైలి నాశ్రయించును—

శా. "ఏమే జాహ్నవి యేమి రాఘవ యదేమే వైరినెన్నేవుని
నేమీ నా సవతిం గణించెద వదేమీ నీవు కాళిందివా
యామే నేటికిఁ దెల్లనాయె జలధీంద్రా తిమ్మ మంత్రీశ్వర
శ్రీమత్కీర్తులు గ్రమ్మెఁగా వనిన నాశ్లేషించు హారంబునన్." (పీఠిక—26)

ఇట్లు పీఠికయందే చక్కని చమత్కారముతో తాద్గుణ్యమును ప్రదర్శించినాడు కవి.

ఈతని వర్ణనలకు భావ వ్యక్తిలోని ఒడుపు మరింతగ మెరుగు పెట్టినది. ఇందులకు గవికి "వర్ణ వ్యంజక ప్రక్రియా' పరిజ్ఞాన మావశ్యకము. ఇట్టిది రచనలో సిద్ధహస్తమునకే సాధ్యము. శ్రీ విష్ణు సంగంబుచే జెలువొందుచున్న గృహవర్ణన యిది :

మ. "కలితస్తంభము కామినీ హసన రంగచ్చంద్రికాస్విన్నశీ
తల రుక్కాంత సమేత కుడ్యము సరత్నశ్రేణి వైవర్ణ్యము
త్సల మారంద మదభ్రశుభ్రమద కపోల ద్వంద్వమై సర్వమై
చెలువయ్యెన్ గృహలక్ష్మి సాత్త్వికముచే శ్రీవిష్ణుసంగంబునన్." (3—127)

శృంగార రసాధినేత గృహము కాపునసే యట్లున్నది. గృహమే అట్లున్న ఇంక ఆ గృహమందున్నవా రెంతటివారో! ఇంటినిజూచి కదా యిల్లాలిని జూడు మనినారు.

సందర్భోచితములైన చక్కని నవ్వులకు తిక్కన అద్యుడు. అంతటి స్థాయి నందుకొనలేక పోయినను రామయ మంత్రి తన నవ్వులకు రవ్వ వృద్ధభావనలతో జీవమును, సౌందర్యమును నాపాదించినాడు. "మంద మరుత్కిశోరకులలోలాకాశ గంగా తరంగ నికాయంబులు దమ్మిపైఁ బొరలు పొంకం బెంతయున్ వింతగా నునులే నవ్వు." నవ్వించినాడు దితిచేత. సీతచేత పువ్వులవంటి నవ్వుల గురిపించినాడు.

ఇంక స్త్రీ వర్ణనము ఆపాద మస్తకమును పెక్కు తావులందు గావింపబడినది. క్షీరసాగరోద్భూతలగు నప్సర స్త్రీల వర్ణనను, జల సంబంధి యుపమేయముల సహాయముతో—

"అప్సు నిర్మథనాదేవ రసస్తస్మాద్వర స్త్రియః
ఉత్పేతు ర్మనుజశ్రేష్ఠ తస్మా దప్సరసో౽భవన్."

అను వాల్మీకి ప్రవచనమును ప్రపంచించి సందర్భశుద్ధిగ గావించినాడు. (2—243) కాని మిగిలిన పెక్కు చోట్ల స్త్రీ వర్ణన అతివేలముగ నడచినది.

సుకుమారములైన ఊహలు, చిత్రములైన కల్పనలు ఈ కవి ప్రతిభ నుగ్గడింపజాలి యున్నవి. వీనికి తోడు శిల్పపు మెలకువ లీతని ప్రతిభకు మరింత మెరుగు పెట్టినవి. ఇట్టి శిల్పపు మెలకువ కీతని యీపద్య మొక తార్కాణము—

ఉ. "అంతట హంసమాత్రమయి
యాపయి నుక్ష సదృశ్యమై గజం
బంతయి యంతమీఁదఁ దుహినా
చలమంతయి ఈ జగంబు నా
ద్యంతము దానయై సిత సమంచిత
గాత్రము దారపోత్రమున్
దంతుర దంష్ట్రలుం దనర
దంభ కిశోంద్రము దారుణంబుగన్" (3—188)

వరాహావతారమున వరాహౌద్ధత్య వర్ణనము ప్రస్తుతాంశము. ఇట అంగుష్ఠమాత్రమై ప్రభవించిన యాకిటి పెరుగుచు పెరుగుచు జగమంతయు నాక్రమించుకొనెను.

ఆ పెరుగుటలో నొక క్రమ పరిణామము జూపుచు, మన కన్నుల యెదుట ఆ పెరుగుదలను సాక్షాత్కరింప జేసినాడు. ఇది యొక చక్కని శిల్పపు మెలకువ.

ఇట్లు ఈతని వర్ణనలు పెక్కులు సామయికములు, సన్నివేశ సాక్షాత్కృతీకరణ సమర్థములు, మృదుభావనా విలసితములు, రమ్యకల్పనా సంకలితములునై కవి ప్రతిభకు దార్కాణములై సహృదయ హృదయంగమములై యున్నవి.

వర్ణనల తరువాత కవి దృష్టి శైలియందు నెక్కొనినది. కవి, "శ్లేషాది పదములు చెలువు నూపఁగ", "ఘన శబ్దము ల్వెలయ", "ఘన శబ్దభ" మనుచు నారంభించి నంతనే కవి దృష్టియందు శాబ్దిక పటాటోపమున కెక్కుడు స్థానము గలదని తెలియుచున్నది. ఈ శాబ్దిక వ్యామోహము సర్వ సాధారణముగ గవి ప్రతిభను గుంఠిత పరచును. కవి సంయమనబుద్ధిని నష్టపరచును. రామయమంత్రి ప్రతిభ కూడ కొంత ఈ కారణముగ మొక్కపోయినది. అయితే శాబ్దిక పటాటోప మాత్రమునేకాక, శాబ్దిక సౌందర్యమును దృష్టి యందుంచుకొనినకవి యగుటచే హృద్యములైన శైలులను సాధింప గలిగినాడు. అందుల కీతని ఉభయ భాషా పాండిత్యము చక్కగ నుపకరించినది. తెలుగు పలుకుబడిలోని జీవము, సంస్కృతోక్తిలోని చాలన కుశలతల మవగతము చేసికొని రెండు భాషలందును, జక్కని రచనల జేసినాడు. సర్వ సాధారణముగ నీతడు శైలీ విన్యాస ప్రకటనకు సీసములను ఏం కొనినాడు.......ఒక్కొక్కచో బాదమంతయు నొకే సంస్కృత సమాసముగ రచించి, శాబ్దిక సౌందర్యముచే దాని కొక వింత చెలువు గూర్చును. సంస్కృత పద సమాశ్రితమై, శంపాలతికవలె సాగిపోవు ఈ క్రింది సీసమందులకు తార్కాణము.

సీ. "రంభోరు రంభాది గంభీర పుంభావ
సంభోగ సంభూత సంభ్రమములు
శృంగార భృంగాళి రంగాది తుంగాబ్జ
గంగా తరంగావ గాహనములు
పారావతారావ ధీరారి వారావ
తైరవతారోహ గౌరవములు
బాలా నిలాలోల జాలావనీ లాస్య
లీలా వనాలోల ఖేలనంబు...." (5—27)

సంస్కృత సమాసపు నడకలతో కారక వైచిత్రి నిమిడ్చి మరియొక శైలిని ప్రదర్శించినాడు. ఈ రకపు శైలికి శ్రీనాథుడు పెట్టినది పేరు. శ్రీనాథునకు బూర్వపు కవులును ఈ కారక వైచిత్రిని గుర్తించినారు. ఐనను దాని కొక ప్రత్యేకస్థానము నొసగి రమ్యత జేకూర్చినవాడు శ్రీనాథుడు. ఈ శైలి తర్వాతి కవులకు పెక్కుర కుపాదేయమైనది. రామయ మంత్రియు నట్టివారిలో నొకడు. అయితే ఈతనిది కేవల మనుకరణ పరాయణతకాదు. ఉద్దిష్టమే. అందులకు నిదర్శనము కేవల సంస్కృత సమాసములతోడనే కాక, అచ్చ తెనుగు పలుకుబడులతోను, ఈ కారక వైచిత్రిని సాధించుటయే.

సీ. చిన్నిప్రాయము దానిఁ జిన్నారి పొన్నారి
యంచ రానడల సోయగము దాని"
అను పద్యమును, (2—10)

సీ. మణి కిరీటమువాని మరకత ప్రత్యుప్త మకర
కుండల దీప్తి మహిమవాని" అను పద్యము

నిందుల కుదాహరణీయములు.

సంస్కృత పద సంవలితమైన పద్యము నెంత హృద్యముగ నడపునో, అచ్చ తెనుగు పద్యములను గూడ నంత హృద్యముగ నడుపును. ఎత్తుగడలో ఎంత బిగువు, ఒడుపు ప్రదర్శించునో దాని నన్ని పాదములందును కుంటువడకుండ సాధించును. సంస్కృత పద సమాశ్రిత పద్యము లనేకము లుదాహరణీయములు. తెలుగు పలుకుబడులతో చెన్నుమీరు పద్యములందు "కడపన్నె తళుకు బంగరుకోట కెంజాయ సంజ కెంజిగి రంగు సవదరింప" అను సీస మొకటి రమ్యతరము. (1—263)

సర్వ సాధారణముగ బద్యమును రసోచితముగ నడుపును. రస స్ఫురణకు శైలి కొంత దోహదమిచ్చును. ప్రతిభగల కవి యది గమనించి రసస్ఫూర్తిని మరింత పుష్టమొనరించుకొనును. అట్టిది రామయమంత్రియందు దర్శనీయము. వీర రౌద్ర రస స్ఫూర్తుల కనువైన శైలికి ఈతని శాబ్దిక విన్యాస చణత కొంత తోడైనది. శృంగార రసస్ఫూర్తికీ ఇని లలిత పద ప్రయోగ నైపుణి కూర్మావతారమందలి జగన్మోహినీ వర్ణనమున గన్పట్టును.

ఈతని రచనా మార్గములందు మనోహరమైనది మరియొకటి సంవాద శైలి. ఒకే పద్యమున నిరువురి సంభాషణల నిమిడ్చి దీనిని సాధించినాడు. ఇందుగల విశేషము పద్యపు నడకలో సమత తెగకుండుట. లీలావతిని హరించి పలాయితుడగుచున్న ఇంద్రునకు, నారదునకు జరిగిన సంభాషణ ఇది—

ఉ. ఈ వనినాక్షి యెవ్వతె సురేశ్వర నారద మీరెఱుంగరే
దానవ సార్వభౌము వనితామణి యాతని సంగరంబులో
నాని జయించితే నహసె నాతడు ఘోరతపంబుచేత న
జ్ఞానివె నొత్తురే తపము సల్పున వార లెఱుంగవేమియున్
(4—58)

కేవల మేదో సంభాషణను పద్యములో పొదిగిన మాత్రమున సంవాద శైలియందు రమ్యతరాదు. ఒక చమత్కృతినో, ఒక వ్యంగ్య విలసనమునో అందు గూర్చిన రమ్యముగా నుండును. చమత్కృతికి — పీఠిక: 26 — పద్య ముదాహరణీయము. వ్యంగ్య విలసనము ప్రస్తుత పద్యమందు ప్రస్ఫుటము. హిరణ్యకశిపుడు తపోనిష్ఠ యందుండగా ఇంద్రుడు బలిమి నాతని పత్ని బట్టి తెచ్చుచున్న విషయము నారదున కజ్ఞాతముకాదు.

అయినను, "ఆతని సంగరంబులో నాని జయించితే" యని వ్యంగ్యముగ నెత్తిపొడిచి ఆతని యకృత్యము నిరసించుచున్నాడు నారదుడు. పైకిమాత్రము తానమాయకముగ నడుగుచున్నట్లు గనపడును. నారదుడు సామాన్యుడుకాడు. గడుసుదనమున ధర్మ రాజంతవాడు. ఆతని గడుసుదన మంతయును దన యీ పద్య మున బుంజీకృత మొనర్చినాడు రామయమంత్రి.

మొట్టమొదట మత్స్యావతారగాథలో ఈ కవియం దను ప్రాస ప్రవణత కానవచ్చును. ఈ యనుప్రాసయు నెక్కువ చోట్ల భాగవతము దలపింపజేయును. అనుప్రాస ఘటితమైన శైలీ చాలనమున కీతడు ముఖ్యముగ కందములు, ఆటవెల దులవంటి చిన్నచిన్న పద్యముల నేరుకొనును. అయితే క్రమ ముగ ఆ శైలి కనుమఱుగై యన్యవిధములగు పోకడలకు చోటిచ్చినది. అసలు ఉచితజ్ఞుడైన కవి సందర్భానుసారముగ బద్యముల నేరుకొనును. విశిష్టవ్యక్తి వర్ణనపట్ల నీతడు సీస ముల నెన్నుకొని ఒక ప్రత్యేకశైలిలో నడుపును. వివిధ క్రియా సమ్మేళన సమాసాదితమైన సందర్భమున కందములవంటి చిన్న చిన్న పద్యములను స్వీకరించును. ఉదాహరణకు సీతను బెండ్లి కూతుగ జేయునప్పుడు చెలికత్తె లామెకుజేసిన శృంగారములు కందములు గీతములువంటి చిన్నచిన్న పద్యములతో వర్ణించినాడు. అదే విష్ణు వర్ణన యనుసరికి "మణికిరీటము వాని మరకత ప్రత్యుప్త మకరకుండలదీప్తి మహిమవాని" నని హృద్యమైన శైలిలో సీసపద్య మెత్తుకొనినాడు.

ఈతని స్తుతులన్నిట నొకేవిధపు శైలికానవచ్చును. అది ఉత్పలమైనను, సీసమైనను మఱియే ఛందమైనను నొకే మూసలో దయారైన దానివలెనే యుండును. ఈ స్తుతు లందు బెక్కుటికి భాగవతపు శైలి పోహణ. కొన్నికొన్ని చోట్ల నివి శబ్దాలంకార సంయుతములుగను తరుచు ముక్త పదగ్రస్త ములుగను నుండును.

ఇట్లు కమనీయ వర్ణనలు, నానావిధ శైలీ శైలూషీ విన్యాసములు దర్శించినపిదప రసప్రకటనా సామర్థ్యము దృష్టికి వచ్చును. ఇందుకుగారణము రచనయందు ముందుగ నా రెంటికి స్థానము గల్పింపబడుటయే. మొదటనే పెద్దపీట వేసి కూర్చుండ బెట్టవలసినదానికి బదులు రససూర్తికి మూడవ సాన మొసగినాడు రామయమంత్రి (పీఠిక—11). అయితే యిందుచేత కవికి రసముపై దృష్టి లేదనుకొనుటకు వీలులేదు. కావ్యమధ్యమున వైశంపాయన మునిచే నొకసారి (1—229), ఇంద్రునిచే నొకసారి (2—150) అవసరమున్నను లేకున్నను "ఘన జాంఘిక నవరసార్థ గంభీరోక్తిన్" బలికించుచున్నట్లు పేర్కొనినాడు.

కాని రసము పోషింపబడవలసిన తీరుగా మాత్రము పుష్టముకాలేదు. శృంగారము పెక్కుచోట్ల అతివేల శృంగార మైనది. ఒక్కొక్కచో రసస్థాయిని జేరనేలేదు. అసమయ ప్రవృద్ధమైన దితిశృంగారము గాని, అన్యాయత్తమైన అహల్యా సంక్రందనుల శృంగారముగాని ధర్మబద్ధములు కాజాలవు. ఇక జగన్మోహిని, బలి— వీరిరువురిది శృంగారముకానేరదు. అదియొక మాయ, అదియొక రసాభాసము. కూర్మావతార మందలి లక్ష్మీ విష్ణుల నాలంబనముగ జేసికొని వర్ణితమైన శృంగారము మాత్రము చక్కగ బుష్టమై రసస్థాయిని జేరు కొనినది.

శృంగారరస సందర్భమేమి వచ్చినను కవితన్ను దాను మఱచిపోవును. ఔచిత్యము, పాత్రత ఇవి యాతని దృష్టికి దగినంత దగ్గఱలో నుండవు. ఎక్కడలేని అతివేలతయు వచ్చిపడును. ఇందులకు బ్రముఖ తార్కాణము రామావతార మందలి అహల్యా వృత్తాంతము. పాపము మహర్షియైన విశ్వా మిత్రుని కర్మమేమోగాని దక్షిణాంధ్రయుగ ప్రభావధర్మమో యని ఇందు తనకుదానై శృంగార కథాఖ్యాన మొనర్చుటయో లేదా నవీన రచనలందువలె తన శృంగార లీలలను స్థానాస్థాన గణనలేక మఱియొకరు వర్ణించుచుండగా నాకర్ణించుటయో అనునంత క్రిందకు గుంజివేయబడినాడు. కాకున్న అహల్యా వృత్తాంతమున కిట రామావతారమున అంత అనవసర ప్రాధాన్య మెందులకు ? అది యిటనొక "మధుర అహల్యా సంక్రందన" మైనది.

కాకున్న రామయమంత్రి యందొక సుగుణముగలదు. పౌరాణిక పాత్రలం దెట్టిలోటునులేని పూజ్యములైన పాత్రము లకు నిట్టి యనుచిత శృంగారపు బూతబూయడు. ఇందులకు లక్ష్మీ విష్ణువులు, సీతారాములు తార్కాణములు.. కాక అట్టి లోటేమైనకల సాధారణ పాత్రమేయగుచో నింక తన ఆత్మీ యత నంతను సాక్షాత్కరింపజేయును. ఇందులకు వరాహావతార మున దితిపాత్ర, రామావతారమున అహల్యపాత్ర తార్కాణ ములు. వరాహావతారమున దితి శృంగార వర్ణనపట్ల ఎంత అతి వేలత బ్రదర్శించినాడో, వామనావతారమున అదితి పాత్రపట్ల శృంగారము నంతగ బరిహరించినాడు. ఇందులకు గారణము దితి యనుచిత వాంఛ, తత్ఫలితముగ నామెకు గలుగబోవు దైత్య సంతానప్రాప్తి. కాని యదితి దేవమాత. ఇది దృష్టియం దుంచుకొని యౌచితి బాటించి యామె పాత్రను జాగ్రత్తగ జిత్రించినాడు.

అసలు శ్రీ కృష్ణావతారమున "శృంగార రసమె" యీ రూపయ్యెనని శ్రీ కృష్ణుని స్తుతించినవాడు మఱియొక ప్రతిపాదనను దన గ్రంథమున జేసిన కావ్యమెంతయు శిరోధా ర్యమై యుండెడిది. శృంగార రసము నుండియే యన్య రసము లుద్భూతములయ్యె ననునది పెక్కురు మెచ్చు వక్కణ. శృంగార రసాధినేత శ్రీ మహావిష్ణువు. అట్టి విష్ణ్వవతార దశకమును దశవిధ రస సంవలితముగ దీర్చిదిద్ది యిట్లు రస స్ఫూర్తికి నవతారములకు నొక రమణీయ సమన్వయ మొన ర్చిన ఎంతయు బాగుండెడిది.

దశావతార చరిత్రమందు శృంగార వీరరసములు రస స్థాయికి జేరుకొనినవి. ఇవి పెక్కుచోట్ల ననుభావ్యములు జుగుప్సయు "రమ్యం జుగుప్సిత ముదార మథాపినీచ" మ్మన. శ్లోకమున కుదాహరణగ నీయదగినట్లు పుష్టమైనది. హాస్యము

లక్ష్మణ ముఖోద్భూతమైనది. ఆటనెంత ధ్వని నాశ్రయించి వను అతివేల శృంగారమునకు గుదురై అస్థాన పతితమైనది (7—1—280). ఈ అతివేల శృంగారమునకు గురిజేసి సిక్ష్మణపాత్ర నెంత యన్యాయ మొనర్చినాడో వాల్మీకి లక్ష్మణుని జూచిన విశదమగును. శృంగార లీలావతారయై తారవెడల లగ్గుతో చూపుమరల్చిన లక్ష్మణునిగూర్చి ఆమెచేసిన వాఖ్యానము:—

"అవాఙ్ముఖోఽభూన్మనుజేన్ద్ర పుత్త్రః
స్త్రీ సన్నికర్షాద్వినివృత్తకోపః .....
(కిష్కింధ. 33 సర్గ. 39)

తచ్చాప జానామి యథా విషహ్యం
బలం నరశ్రేష్ఠ శరీరజస్య
జానామి యస్మింశ్చ జనేఽవబద్ధం
కామేన సుగ్రీవ మసక్తమద్య
న కామతన్త్రే తవబుద్ధిరస్తి
త్వంవై యథామన్యు వశం ప్రపన్నః
న దేశ కాలౌహిన చార్థధర్మా
వపేక్షతే కామరతిర్మనుష్యః...."
(కిష్కింధ. 33 సర్గ. 53—55).

అద్భుతాది అన్యరసములు తత్తదుచిత స్థానములందు బుష్టములైనవి. రౌద్రరస స్ఫూర్తికి భృగురామావతారము చక్కని ప్రోదియైనది.

వర్ణనలను, శైలికి, రసమునకు నింతగ ప్రాధాన్య మిచ్చిన రామయమంత్రి కథాకథన పద్ధతిపై నంతగ జూపుంచినాడు కాడు. ఈతని కథాకథన పద్ధతియందు సవ్యగ్విభజన లేదు. కథావధాన మనునది కావ్యేతివృత్తానుసారియై యుండవలయును. విభిన్న కథా సంవలితమగు దశావతార చరిత్ర వంటిది యితివృత్తమైనపుడు ప్రతి అవతార కథను ప్రధానాంశములు వదలక, అనవసర భాగముల బెంచక సమ్యక్రృణాళికా పూర్వకముగ రచించి కథకు న్యాయముచేకూర్చవలెను. అట్టిది యిందు గొరవడినది. ఇందుకు ప్రధాన నిదర్శనములు రామ, కృష్ణావతారములు. రామావతార విషయము ప్రోక్తము. కృష్ణావతారమందంతట కేవలమాతని శృంగారలీలలే వర్ణితములైనవి. మిగిలిన ఆ అవతారకథను ఒకటి రెండు పద్యములలో సూచనాప్రాయముగ జెప్పుచు దాటవేసినాడు. ఒక్కొక్క అవతారము కావ్యధోరణిలోను, ఒక్కొక్క అవతారము పురాణధోరణిలోను నడచినవి. కల్క్యవతారమొకటి చెంగున దూకివేసి నట్లున్నది. కల్క్యవతారము తత్కాల సాంఘిక పరిస్థితుల వర్ణించుట కనువైన పట్టు. ఈ యవకాశమును బురాణాదులు చక్కగ నుపయోగించుకొనినవి. కాని దశావతార చరిత్ర యందట్టిది లేదు.

కథాకథన పద్ధతికి సైదోడైనది పాత్రపోషణపద్ధతి. కవియేయొక్క పాత్రను జక్కగ దీర్చిదిద్దెనని చెప్పలేము కాని ప్రతిభ గల కవియగుటచే నొక్కొక్కపాత్ర మనస్తత్వము దళుకున మెఱపింపఁ జేసినాడు. దితిపాత్రయందొక సాధారణ స్త్రీ మనస్తత్వము ప్రదర్శితమైనది. భర్త అనురాగము కొఱవడినట్లు తోచినసాధారణ స్త్రీ అంతవరకు తన మనస్సులో అణుచుకొనిన లోపముల నన్నిటి నేకరవుపెట్టును. కశ్యపుని ప్రత్యాఖ్యానముచే బాధపడుచున్న దితి యందిట్టి మనస్తత్వము ప్రదర్శించి యామెనొక సాధారణస్త్రీగ జిత్రించినాడు. అదితి పాత్రకు దితి పాత్రకంటె మఱి కొంత యౌన్నత్యముగూర్చి దైత్యమాతయైన దితికిని, దేవమాతయైన అదితికిని ఉండవలసిన యంతరము సుచితరీతిని జిత్రించినాడు.

రామావతారమున నీ పాత్రపోషణపద్ధతి దెబ్బదిననది. రామయమంత్రి దశరథుని, భృగురామునకోడి అంతిపుందల దాచుకొనిన దశరథునిగ దప్ప రామునిగన్న దండ్రిగ జూడలేక పోయినాడు. విశ్వామిత్రపాత్ర, ముఖ్యముగ రామునిపాత్ర తమ గాంభీర్యమును గోల్పోయి శృంగారపు బూజుపట్టిన దక్షిణాంధ్ర యుగపు పాతచింతకాయపచ్చడివలె తయారైనవి. రాముని జీవలక్షణమగు ఇంగితజ్ఞత రామయమంత్రి చేతిలో భ్రష్టమైనది. జనకసభలో శివధనస్సును గురించి రామునినోటినుండి రాలిన ముత్యములివి— "ధరణీశ ! తాతలనాటి పాత పంచారంబు పసలేదు పేటెత్తనిది వృథాస్థూల మిందేది బలము ?"

ఇక మిగత యవతారములలోని పాత్రలుకూడ రసావరణ, శైలీ విన్యాసములలో బడి అవ గుంఠనములోని యవన కాంతాముఖచంద్రబింబ సదృశములైనవి. కవి భావవీథులందీ పాత్రల కంతగ ప్రవేశము లభింపలేదు.

ఈ దశావతార చరిత్రమున చమత్కారములకు, బంధ కవితలకు, చిత్రకవితలకు గొదువలేదు. ఇవి రచనా పాటవ ప్రదర్శకములు. ప్రాకృతాద్యష్టభాషాసంవేదిత ప్రకటించు కొనుటకు "ళచ్ఛిత్థణా హేయలవి అహత్థవయో అపామ్మలో అణలో అవూ అణిజ్జ" (5—49) అనుచు సీసమును రచించినాడు ప్రాకృతమున. సంస్కృతమయ వృత్తాదులు పెక్కులు గలవు. వారిరాశి నర్తనమాడు మత్స్యమూర్తిని బంధకవితతో స్తుతించినాడు. ఇక శాబ్దిక చమత్కారము లెన్నియో గలవు. క్షీర సముద్రోద్భూతమైన తురంగవర్ణన యిది :—

"మొదటనున్న నిజాకారమును త్యజించి
వారిరాశి తరంగము వర్ణసహిత
మై తురంగంబు గాఁబోలు ననఁగఁ బొడమె.....
(2—233

వారి రాశిలోనుండి తరంగము వర్ణసహితమై యశ్వరూపము ధరించెనా యనునట్లు క్షీరనిధినుండి యుచ్చైశ్శ్రవము వెలువడెనని సామాన్యార్థము. తరంగములోని 'త' కారము

ఆ' కారము గోలుపోయి 'ఉ' కార సహితమై, తురంగముయ్యె నని శాబ్దిక చమత్కృతి నాశ్రయించిన అర్థవిశేషము. ఇట్టి చమత్కృతులకీత డొక్కొక్కయెడ శ్లేష నాశ్రయించును. హిరణ్య కశిపుడు తన తనువు "ఖరాయుధ భేద్యము గాకుండ" కోరినవరమునను బ్రహ్మ "నఖరాయుధ భేద్యము నీతను" వని వరమొసగినాడు. ఇటశ్లేషచే తనువు ఖరాయుధ భేద్యము కాదనియు నఖరాయుధ భేద్యమనియు (గోళ్ళనెడు ఆయుధము లచే భేద్యము) నర్థద్వయము.

పెక్కుచోట్ల గవి చక్కని భావస్ఫూర్తికి సంస్కృత లోకోక్తులనో తెలుగు జాతీయములనో మడికారములనో వాడి నాడు. "తప్తయో రుభయోస్సంధి", "నోరెత్తకుండ", "కిమ్మనసీడు", "అలికాలి మంట నడునెత్తికినెక్క" వంటివి పెక్కులిందుకు నుదాహరణీయములు. వీనివలన గలుగు భావస్ఫూర్తి మఱియెన్ని పద్యములనైన గలుగదు.

ఇంక నీ కవి పూర్వుల ననుకరించిన పట్టులును గలవు. ఈతని :—

శా. శ్రీ నారీ కుచకుంభ రమ్యయుగళా శ్లేషంబొ బ్రహ్మాది నా
వా నాకేశ నమస్క్రియాదరమొ వీణామౌని లోకాగ్రణీ
గానా కర్ణనమో వధూనటన శృంగారావ లోకంబొయీ
మీనాకారము దాల్పనేమిపనిస్వామీ నా కెఱింగింపవే"
(1—164)

అనుపద్యము ఆముక్త మాల్యదలోని "గృహసమ్మార్జ నమో జలాహరణమో...." (II—92) అను ప్రసిద్ధ పద్యము దలపింప జేయుచున్నది.

తే. "ఆత్మబుద్ధి సుఖంబిచ్చు నంతకన్న
గురువు సెప్పిన సద్బుద్ధి వరులబుద్ధి
కొదవదెచ్చును స్త్రీ బుద్ధి కులముఁ జెఱచు...."
(5—86)

అనుపద్యము :—

శ్లో. "ఆత్మబుద్ధి స్సుఖంచైవ గురుబుద్ధి ర్విశేషతః
పరబుద్ధిర్వినాశయ స్త్రీ బుద్ధిః ప్రళయంకరీ"

అను శ్లోకమున కనువాదము. కూర్మావతారమందలి "సుదతి యెవ్వరిదాన వీ వెపుడు నెచ్చోనుండు" వను పద్యము భాగవతమందలి "వడుగా యెవ్వరివాడ"వను పద్యము బోలి యున్నది. జగన్మోహినీ బలిచక్రవర్తుల మొట్టమొదటి సంభాషణా సరణి (2—347 నుంచి 349) భాగవతమందలి బలి వామన సంవాద సరణిని బోలియున్నది.

కవి ప్రతి అవతారాంతమందును ఫలశ్రుతి జెప్పినాడు. తను రచించినది కావ్యము. తాను స్వీకరించిన యితివృత్తమువలన దన గ్రంథమునకు గావ్యత్వము సిద్ధింపజేయుటకై సర్వాంగీణ ముగా గావ్యావశ్యక విషయములచే బుష్టమొనర్ప బ్రయత్నించి నాడు. అయితే కేవల కావ్యత్వసిద్ధి మాత్రము నందుటతో నాత నికి దృప్తిగలుగదు. పురాణములవలె దన గ్రంథమును భక్తి ప్రతిపాదకమై, తద్ద్వారమున బాఠకులకు శిరోధార్యమై యుండవలెనని యీతని కోరికకాబోలు. అందులకేనేమో ప్రతి అవతారాంతమునను ఆ ఫలశ్రుతి ప్రతిపాదనము.

కవి నెల్లూరి మండలమువాడు. ఈతనిపై అటు దక్షిణాంధ్ర యుగకవుల శృంగార వ్యామోహము, ఆ నాటి ఔత్తరాహాంధ్ర కవుల శాబ్దిక విన్యాస పరాయణత— యీ రెండిటి ప్రభావములును బార్తిగ గలవు. ఈ రెండిటి యనన్యుక్త భావముచేతను ఈతని గ్రంథమును చివరి రోజులలో దిగజారిన దక్షిణాంధ్ర కవితా ప్రజములో జేర్పవలసివచ్చెడిదే కాని, ఆతని వివిధ వర్ణనాచణత, విభిన్నశైలీ శైలూషీ విన్యాస ప్రదర్శనా పాటవము, రమ్యభావ ప్రకటనా సామర్థ్యము శ్రీగ్రంథమునకు ఉత్తారణములైనవి.

ఆరుగురు కథకులూ - ఒక నాయిక

శ్రీ బుచ్చిబాబు

(గత సంచిక తరువాయి)

కనకానికి కోపం వచ్చినట్లుంది.

"డబ్బు కావల్సి వచ్చిన రోజుల్లో నేను అందరినీ భరించాను. ఇప్పుడు నే నల్లా భరించవల్సిన అవసరంలేదు."

"ఇప్పుడేంకావాలి?"

"పెండ్లి."

నేను మెల్లగా నవ్వేశాను.

"ఏం చేసుకోకూడదా? నాకూ, ఇల్లూ, పిల్లలూ కావాలని ఉండదా, పాపం"

"పిల్లలా."

కనకం ఏడుస్తోంది. ఓదారుస్తూ కన్నీటిని తుడుస్తున్నాను. మెత్తగా, గుండ్రంగా, భుజం తగిలింది. జుటు నిమురుతున్నాను. మొహంనావైపు తిప్పి, నడుం దగ్గరకి లాక్కున్నాను.

"అవేం పనులు. విడిచెయ్యండి. పెండ్లి చేసుకుంటారా?"

"ఏదీ కోరకుండా, ఈ క్షణం ఇల్లా కలిసి ఉండకూడదూ?

"మీరా ఈ మాటలంటున్నది? మీకు శ్యామల కావాలి. ఆమెకి మీరంటే పంచ ప్రాణాలూను. మీ రిరువురూ స్నేహంగా, ఆనందంగావుండి, ఒక ఇంటి వాళ్లయితే, చూసి మురిసిపోదామనే ఈ ప్రయాణానికి ఒప్పుకున్నాను."

కనకం ఏడుస్తోంది. ఎందుకు? నా కర్థంకాదు. ఆమె దూరమైనకొద్దీ, తృష్ణ పెరుగుతోంది.

"శ్యామలని దూరంగా, ఊహలో తల్చుకుని ప్రేమించాలి," దగ్గరకి లాక్కున్నాను.

"ఏం మొగాళ్లబ్బా," అని తోసేసి, లోనికివెళ్లి, తలుపు గడియవేసింది.

ఆ మర్నాడు మధురకి ప్రయాణమయ్యాం.

* * * *

'అంతవరకూ ఏమైందో దిండిగల్‌లో మా థర్‌క్లాస్ పెట్టెలో కొచ్చింది కనకం. నా ముందుసీట్లో ఉంటున్న శ్యామలరావు, మరో సీటులోకి ఫిరాయించాడు. ఆ స్థానం ఆక్రమించింది. మధ్య మధ్య ఆ వెనక పెట్టెలోకెళ్లి అక్కడనుండి, బిస్కెట్లు, యాపిల్సు తీసుకొచ్చి తినేది. నాకది గిట్టదు. అసలు మా పెట్టెలో వాళ్లెవ్వరికీ గిట్టదు.

"చౌదరిగారూ, ఇందండి—" అని బిస్కెట్లు ఇవ్వబోయింది.

"నా కిష్టంలేదు," మొహం తిప్పేసి పత్రిక చదువుకుంటున్నాను.

"పత్రికలో విశేషాలు చెప్తారా?"

"నీ కర్థంకావులే."

"మీవార్ని తీసుకురాలేదేం?"

"నీ కెందుకు? చచ్చింది గనక." అన్నాను కసిగా.

"అయ్యోపాపం."

తనకి కావల్సిన పదార్థాలన్నీ వితంతయ్యతో మెల్లిగాచెప్పి చేయించుకునేది. 'స్నానంచేసి, కాస్త మరుగున కట్టుకోవచ్చుగా బట్ట. మా అందరిముందూ సాగిస్తుంది ఆ తతంగం. దిగి ఊళ్లో కెళ్లాలంటే, తను ముస్తాబయ్యేసరికి, ఆలస్యం అవడం మామూలే. ఇది చాలక, పక్క పెట్టెలో ఒకర్ని, ఈ పెట్టెలోకితెచ్చి కబుర్లు సాగిస్తుంది. నే కూర్చున్నవైపు కిటికీ తలుపువేస్తే తను తెరుస్తుంది.

"మంచిగాలి—చక్కటి పొలాలు అటు చూడండి చౌదరిగారూ."

"నా తలకాయ. రైలుబొగ్గు, నుసి, దుమ్ము—తలుపు మూయ్యి" అన్నాను.

"మీమీదకి రాకుండా అటు గుడ్డకట్టనా?"

"తియ్యడానికి వీల్లేదు" అని గర్జించాను.

"ఎందుకు వీల్లేదు? అసలు మీరంతా ఇల్లా ఎందు కొచ్చినట్లు—నాలుగూ చూడ్డానికేగా. మీ కభ్యంతరం లేకపోతే, మీ వేపుకొచ్చి, కిటికీముందు కూర్చుంటా. ఆ దుమ్మంతా నా మీదే పడుతుంది," అని అనడం ఏమిటి, తనొచ్చి నాపక్క కూర్చోడం ఏమిటి రెండూ ఒకసారే జరిగాయి.

"వీల్లేదు—నేను చాచుకుని పరుంటాను," అన్నాను.

ఆమె కూర్చోకుండా, ముందుకి జరిగి, బిగించి కూర్చుని తలుపు మూసేశాను.

తలుపు తీసిఉంచే హక్కు ఆమెకుందని, ఆమె పక్షం వాదించ సాగారు, శ్యామలరావు, రక్షితలాల్, లక్ష్మణమూర్తి. మూసేసే హక్కు నాకూ ఉందని, రాఘవయ్య, నాగభూషణం, చెట్టిగారు—రెండు పక్షాలై, ప్రాథమిక హక్కులని గురించి ఘర్షణ సాగింది రెండు గంటలు. రైలు నిల్చింది. మధుర చేరుకున్నాం. పదింటికే భోజనాలుచేసి, బస్సులో ఊళ్లోకి బైలుదేరాం. ఫస్టుక్లాస్‌లో కృష్ణమూర్తి మధుర చరిత్ర చెప్పడం మొదలెట్టాడు. పదవ శతాబ్దంలో చోళులు పాండ్య

రాజ్యాన్ని గెలుచుకున్నారుట. నాయక పాలకుల కాలంలో పాండ్య రాజ్యం మహాదశ అనుభవించిందట. విశ్వనాథ నాయకుడు మధురని కట్టించాడుట. రాణి మంగమ్మ వైభవం గురించి చెప్తూంటే కనకం తనే రాణీ అయినట్లు గర్వంగా చూసింది. అది మీనాక్షి ఆలయం. వెనకటి ఆలయాన్ని 1310 లో మలిక్‌కాఫుర్ ధ్వంసం చేశాడు. 1560 లో విశ్వనాథ నాయకుడు కొత్త ఆలయాన్ని ప్రారంభించాడు. అది నూట ఇరవైయేళ్ల తర్వాత పూర్తయింది. పన్నెండు మిలియన్ల రూపాయలు ఖర్చయిందిట.

ఆలయం వైశాల్యం, శిల్పాలుచూస్తే అది చాలా కొద్ది మొత్తమే అనుకోవచ్చు. ముప్ఫై మూడు మిలియన్ల శిల్పాలు, ప్రతిమలు ఉన్నాయి మీనాక్షి ఆలయంలో. వెయ్యి స్తంభాల మంటపంచూసి, సంగీతంపాడే స్తంభాల దగ్గరకొచ్చాం. "చెవి దగ్గరగా పెట్టండి—నాదం విందురుగాని" అని కనకం, నా చెవిని స్తంభాని కానించింది. అదోకలా చూసింది.

"ఎంత బాగుందండి—ఇక్కడేఉండిపోవాలనుంది. నా జన్మ తరించింది." అంటోంది. తరవాత తిరుమల నాయక్ మహల్ చూశాం. హిందూ, ముస్లిమ్, గాతిక్ సంప్రదాయాల వాస్తు శిల్ప సముదాయంట ఆ మహల్. నా కంత నచ్చలేదు. దాన్నిండా గబ్బిలాలు, పావురాల రెట్టలు, ఆఫీసులు, డవాలి బంట్రోతులు, నల్లకోటు ప్లీడర్లు, గుమస్తాలూ తిరుగుతున్నారు. వాళ్లం దర్నీ బైటకి తరిమివేస్తే అది బాగుంటుందేమో, చూస్తేకాని చెప్పలేను.

అలగర్ కోవిలకెళ్లాం. కొందరం ఫస్ట్‌క్లాస్ బృందం వారినుండి విడిపోవాలని. ఏప్రిల్‌మాసంలో మీనాక్షి, సుందరేశ్వరుల కల్యాణం, మధురలో జరుపుతారుట. మీనాక్షి సోదరుడు, అలగర్.

పెండ్లైన మర్నాడువచ్చి, చీకాకుపడ్డ ఉదంతం చెప్పాడు, లక్ష్మణమూర్తి. నా కక్కడి శిల్పాలు నచ్చాయి. వెనక పెద్దకొండ, దిగువున చెట్లు, చల్లటి నీడలు, పరిశుభ్రమైన స్థలం. నా ఒళ్ళు తల తిరుగుతున్నాయి. వాంతైంది. ఆ రాయి మీద పడుకున్నాను. జ్వరం తగిలింది. తల నెప్పి, కళ్లు మూతలు పడుతున్నాయి. లేవలేకపొయ్యాను. మా వాళ్లెవరూ కనిపించడం లేదు. కోవిలలోకి వెళ్లలేకపొయ్యాను. అటు వెళ్లే కుర్రాడిని కేకేసి, ఆలయంలో పెద్దల్ని పిలవమన్నాను. పరుగెత్తుకుంటూ వచ్చింది కనకం. నా స్థితిచూసి ఆశ్చర్యపడింది.

"ఏమిటిల్లాగయ్యారు?"

"జ్వరం కాబోలు."

"నేనే కారణం. రైలు కిటికీ తెరిచాను. ఆ బొగ్గు, దుమ్ము మీకు పడలేదు." అంది కనకం. జాలేసింది. జట్కా బండి పిలిచింది. మెల్లిగా బండిలో కెక్కించారు. హాస్పిటల్‌కి వెళ్లాం. అక్కడి డాక్టర్లు పరీక్షించి మందిచ్చారు. మూడు గంటల కొక మోతాదు పుచ్చుకోమన్నారు. తిన్నగా స్టేషన్‌కెళ్లి ప్లాట్‌ఫారం అవతల నిలబడిన పెట్టిలోకి చేరుకున్నాం. పక్క సర్ది, పడుకోపెట్టి ఒక మోతాదు మందిచ్చింది. సాయంత్రం ఆర్రైంది. చీకటి పడుతోంది.

"ఇక్కడ దీపాలులేవు. ఆ ఫస్ట్‌క్లాస్ పెట్టెలో పరుం టారా? కాస్త కాఫీ కూడా కలుపుతాను."

"ఇక్కడే చస్తాను."

"ఏంమ్మాటలం డవి. నే ఉండగా అంతపని జరగనిస్తానూ."

పక్క పెట్టెలోకెళ్లి కాఫీ తెచ్చింది. జ్వరం దిగజారు తోంది. కాస్త తేలికగావుంది. ఆమె చేతితో నా నుదురు రాస్తోంది.

"నిద్రపొండి."

ఆమె చెయ్యి నా చేతికింద ఇమిడింది. చెయ్యి చల్లగా ఉంది. నా మొహాన కాసేపు తిప్పాను. తను లాగెయ్యబోయింది. ఆమె మెడచుట్టూ చేతులుపెట్టి నా వక్షంమీదికి లాక్కున్నాను.

"ఇట్లాగైతే జ్వరం తగ్గేదెట్లా చౌదరిగారూ?" అన్నది. ఇంకా దగ్గరకి లాక్కున్నాను. తప్పించుకుని, దూరంగా వెళ్ళి కూర్చుంది.

"మీ ఆవిడ జ్ఞప్తి కొస్తోందా, పాపం!" అన్నది. కిటికీ మూసింది. పెట్టెలో జనంవచ్చే అలజడైంది.

"కిటికీ తియ్యి. చల్లగాలి రానీ——అవిగో నక్షత్రాలు," అన్నాను. నిద్ర పట్టేసింది.

* * *

'మండపం స్టేషన్‌నుండి, పాంబన్ స్టేషన్‌వరకూ మధ్య సముద్రంవుంది. ఆ సముద్రంమీదుగా వంతెనవుంది. ఆ వంతెనమీదుగా వెడుతుంది రైలు. రామనాథం ఆ దృశ్యం పెన్సిల్ చిత్రంగాగీస్తున్నాడు. హేమలత నిద్రపోతోంది. కనకం బేబీని జోకొడుతోంది. కృష్ణమూర్తి దృశ్యం చూస్తున్నాడు. నన్నెక్కువగా ఆకర్షించింది ఆ సముద్రంమీదుగా రైలువెళ్ల డమే. అందులో భయమూ, ఆనందమూవున్నాయి. నీలంరంగు అలలు, పెద్దపెద్ద రాతిబండలచుట్టూ కవ్విస్తూ తిరుగుతాయి. వాటిమీద తెల్లటినురుగు కిరీటంలా అలుముకొని వుంటుంది. ఒక్కొక్క కెరటం, ఒక్కొక్క కావ్యం — సౌందర్యంగా వుండ టంతప్ప వేరే సందేశం ఇవ్వదు. రాతిబండమీద నురుగు ఎగిరిన శబ్దంలో ఐకలయ, క్రమం వున్నాయి. పాటుపోట్లు ఒక నృత్యం — అనంత సౌందర్య అంటే అదేననుకుంటా.

రామేశ్వరం స్టేషన్ హాటల్‌లో దిగాంమేం. థర్డ్‌క్లాస్ ప్రయాణీకులు వేరే చౌల్ట్రీలో బసచేసి వంటలు వొండు కున్నారు. శ్రీ రామనాథస్వామి ఆలయం దర్శించేముందు సముద్ర స్నానంచేశాం. సముద్రం వొడ్డున ఇసుకలో చెట్లఆకులు, ఎర్ర పూలు తుట్టలుతుట్టలుగారాలి, నీటిని ఊదారంగుతో కప్పి వేస్తాయి.

ఉభయపెట్టెల ప్రయాణీకులం రామనాథస్వామి ఆల యంలో కలుసుగున్నాం. నాలుగువేల అడుగుల ప్రాకారాలు— గ్యాలరీలకింద, రెండువైపులా విడిపోతాయి. అనేక మూలల నుండి సన్నటివెలుగుపడి గుహలని వింతవింత రంగులతో నింపు తుంది. కనకం, ధనంజయాన్ని నడిపించుకుంటూ ఒస్తోంది

ఆయన ఆయాస పడుతున్నాడు, నడవలేకపోతున్నాడు. దగ్గుతున్నాడు. చేతిలో కఱ్ఱ వూగిపోతోంది. స్నానాలుచేస్తూ బట్టలు తడిసినాయి.

"ఆయనా, ఇట్లా స్నానాలుచేసి తడవడం మంచిదికాదు," అన్నాను.

"నేనూ అదే చెప్తున్నాను. వినడంలేదు మధుసూధనం," అంది కనకం.

"నే నిక్కడ హరీఅంటే, ఎంతోపుణ్యం!" అన్నాడు ధనంజయం, దగ్గు ఆపుగుంటూ.

"మీరిట్లాంటి మాటలంటే, తీసుకెళ్లి స్టేషన్‌లో దించేస్తా మావయ్యా," అంది కనకం.

ఈలోగా మాఆవిడ హేమలత, ఇందిర, ఆమెభర్త కృష్ణమూర్తి వచ్చారు.

"మమ్మల్ని ఏమీ చూడనియ్యదల్చుకోలేదా ?" అంది హేమలత, కనకంతో.

"నేనేం చేశాను ?—"

"నువ్వేం చెయ్యడంలేదు ? కాపరం, మా పెట్టెలో, పడక, సరసాలూ మాపెట్టెలో."

"మీ ఆయనతో ఆడలేదుగా సరసాలు."

"అదొక్కటే మిగిలింది."

"అంత భయమైతే, మొగుణ్ణి కొంగుకి ముడేసుకోలేకపొయ్యారూ ?"

"నీకంటే, మొగుడంటూ అక్కర్లేదు."

ఊరుకోమని హేమలతకి సంజ్ఞచేశాను. దగ్గుతోధనంజయం స్తంభంపక్కన మెట్లమీద వాలిపొయ్యాడు. కనకం ఆయన్ని లేవదీసి కూర్చోబెట్టింది. మళ్లా అందుకుంది.

"నాఖర్మ—ఎవరూ చేసుకుంటూ ననడంలేదు. ఊం అంటే మావయ్యగార్ని ఇప్పుడు చేసుగుంటాను" అంది కనకం, ధనంజయంకేసి చూస్తూ. ఇందిర నవ్వేసింది.

"ఆయన ఈ యాత్రపూర్తిచెయ్యడం ఇష్టంలేదా?" ఈలోగా మెట్టుమీద బేబీజారి దొర్లిపడటం, కనకందాన్ని పట్టుకోడం, ఆ పట్టుకోడంలో ధనంజయంగారి మెడకింద పట్టు ఒదిలెయ్యడం, ఆయన తలమెట్టుకి తగిలిదెబ్బతగలడం, అన్నీ క్షణంలో జరిగాయి. నేనూ హేమలతా గంతేసి బేబీని తీసుకున్నాం. గుక్కపట్టి ఏడుస్తోంది—కాని ఏదెబ్బా తగలలేదు. ధనంజయం నెత్తికి చిన్నగాయంతగిలి, రక్తంవొస్తోంది. కృష్ణమూర్తి కట్టుకట్టాడు.

"వారిని స్టేషన్‌కి తీసుకువెళ్లండి," అన్నాడు కృష్ణమూర్తి.

"నే వెళ్లను. అన్ని స్నానాలు పూర్తికావాలి. చస్తే, ఇక్కడే చస్తాను."

"నా మాట వినండి. మీరీస్థితిలో స్నానాలు చెయ్యకూడదు. మీపెట్టెలో డాక్టర్ నాగభూషణంగారున్నారుగా. మందుతీసుగుని రెస్టుగా పడుకోండి. ధనుష్కోడిలో చెయ్యొచ్చు స్నానం," అన్నాను. బండిని కేకేసి, ఆయన్ని అందులో ఎక్కించాం.

"పద, నేనూవస్తాను." అన్నాను.

"అమ్మో, మీరురావద్దు. హేమలత మండిపడుతుంది," అంది కనకం.

"దాంది, అర్థంలేని చిరాకులే. సత్యభామకోపం. నేన, సర్దుబాటుచేస్తా," అన్నాను. నేనువొస్తే తనుదిగిపోతానంది. ఎవరన్నా డాక్టరుంటే అక్కడ ఆయన్ని చూపించి తిరిగి వచ్చేస్తానని నచ్చచెప్పి, బండిలోఎక్కి బైలుదేరాం. ఆరుతూవున్న చీర తడి నా చేతికి తగుల్తోంది. ఆమె దూరంగా జరుగుతోంది. నా చెయ్యికి ఆమె అరచెయ్యి తగిలింది. నొక్కిపట్టాను.

"హేమలత ఏదో అంది— నువ్వేమీ అనుకోకేం." అని చెయ్యినొక్కాను. తీసేసింది.

"ఇంకెప్పుడూ మీ పెట్టెలోకిరాను," అంది. బండి నిల్చింది. ధనంజయంని డిస్పెన్సరీలో దింపి, బల్లమీద పడుకోబెట్టాం. డాక్టర్‌వస్తాడు కూర్చోమన్నారు. దొడ్డివైపు చెట్టుకింద కూర్చుంది కనకం.

అక్కడనుంచి సముద్రం కనిపిస్తోంది, కెరటాలహోరు వినిపిస్తోంది.

"కోపం వచ్చిందా ?"

"నాకా ? ఎందుకు ?"

"లోపల అంతగా ద్వేషిస్తోంది అనుకోలేదు. మన పరిచయం చెప్పావా ?"

"ఎబ్బే."

"మరింకెవరైనా, ఏవో చెప్పివుండాలి."

"నేనంటె అందరికీ లోకువే. సంసారులతో స్నేహాలకి పోకూడదు."

"అయినవాళ్లు, కానివాళ్లు సావాసంకావాల నొచ్చుగా."

"అది సావాసం కాదని నాకు తెలీకపోతేగా. ఆ కాసేపు, ఆఒళ్లు కావాలి, డబ్బిచ్చి కొనుక్కున్న సావాసం— మీకు తెలీదు గనకనా !"

"నేనింకా జ్ఞాపకంవున్నానా ?" అన్నాను. వెనక, కాలేజీలో చదువుకునేరోజుల్లో ఆమెతో గడిపినరోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

"మీరెంత డబ్బిచ్చారో జ్ఞాపకంవుంటే, ఇదిమాత్రం జ్ఞాపకం వుండదంటారా ?"

"డబ్బు ఖర్చైపోతుంది."

"ఒళ్లుమాత్రం పాడైపోదా ఏమిటి ?"

"నా కళ్లకి ఇప్పుడూ బాగానేవున్నావు," అన్నాను. పరిచయంవల్లనేమో, నాకు ఆమె కొత్తగా కనబడలేదు.

"అముక్క హేమలత ముందు అనగలరా ?" అన్నది. డాక్టర్‌వచ్చి పిలిస్తే, లోపలికెళ్లాం. ధనంజయాన్ని పరీక్షచేసి,

మందిచ్చాడు. వారిద్దరినీ బండిలో ఎక్కించి స్టేషన్‌కి పంపించి, మళ్ళా నేను ఆలయానికెళ్ళాను.

ఆరాత్రి మా బసలోకి కనకంరాలేదు. రాత్రి నిద్రపట్ట లేదు. బైటకుర్చీవేసుగుని స్టేషన్‌లో నిలబడ్డ ఇంజిన్‌కేసి చూస్తూ కూర్చున్నాను. హేమలతవచ్చింది.

"కనకంకోసం చూస్తున్నారా ?"

"ఎందుకట్లా గంటావ్. ఆమె పట్టుకోకపోతే, బేబీ ఏమవును ?"

"పాత స్నేహమా ?"

"అవుతే ఇప్పుడు చేసేదేముంది ?" కోపంతో లోపలి కెళ్ళింది.

ఆ మర్నాడు ధనుష్కోడికి ప్రయాణం అయ్యాం. మా పెట్టెలోకి థర్డ్‌క్లాస్ పెట్టెలో వ్యక్తులు ఎవ్వరూ రాలేదు— ఇందిరతో కబుర్లు చెప్పేటందుకు శ్యామలతప్ప.

రైలు ధనుష్కోడి చేరేటప్పటికి, మధ్యాహ్నం మూడైంది. అక్కడ అంతాఇసుక— మధ్య, అక్కడక్కడ చిన్న మొక్కలు, పొదలు— భూభాగం అంతతో సమాప్తం. చుట్టూ సముద్రం. బంగాళాఖాతము, హిందూమహా సముద్రము, ఏకమయ్యేచోటు. దూరంగా అలలు కొన్ని తూర్పువైపుకీ, మరికొన్ని పడమరకీ వేగంగా ప్రయాణంచేస్తూ తలలు ఢీకొని కలిసి విడిపొయ్యే దృశ్యం భయంకరంగా వుంటుంది. ధనుష్కోడిస్టేషన్‌పక్క, ఒడ్డునే సింహళానికి ప్రయాణమయ్యే వోడ బైలుదేరడానికి సిద్ధంగా వుంది. రైలులో జనం దిగాక, మళ్ళా వెనక్కివెళ్ళి, తూర్పుగా మరో లైన్‌లో రెండుఫర్లాంగు లవతల మాపెట్టెలను విడిచేసింది. అక్కడ సముద్రం ఒడ్డునే, కర్ర అడితీ, ఒక పెంకుటిల్లు వున్నాయి. కెరటాలు గోడకి తగులుతుంటాయి. నుస్తుంటే పీతలు కాళ్ళమధ్య అడ్డంగా కదిలి నీళ్లలోకి జారు కుంటాయి. ఒడ్డుకి నాలుగైదు ఫర్లాంగులు నడవాలి. అక్కడే స్నానాలుట. నడవలేనివాళ్ళు, ఎద్దుబండిలో వెడుతున్నారు. ఒక బండిలో, ధనంజయం, నాగభూషణంగారిభార్య విజయ, చిట్టెమ్మ, కనకం వెడుతున్నారు. అరగంటలో మిగతావాళ్లం అక్కడికి చేరుకున్నాం. అక్కడ టీ దుకాణంవుంది. మంత్రాలు చెప్పే బ్రాహ్మణులున్నారు. బట్టలు మార్చుకునేందుకు రెండు పందిళ్లు, తడకలతో కట్టిన మరుగుస్థలాలు వున్నాయి. స్నానాలు మంత్రాలు జోరుగా సాగుతున్నాయి. స్త్రీలు లోపలికెళ్ల కుండా, ఒడ్డునే కూర్చుని చెంబులతో నీళ్లుతీసుకుని స్నానాలు చేస్తున్నారు.

నేనూ, హేమలత, ఇందిర, రామనాథం, శ్యామలరావు, కుడివైపున జనసమర్ధంలేని చోటుకివెళ్ళి, స్నానాలు చేస్తున్నాం.

"ఫస్టుక్లాస్‌వాళ్ల స్నానాలుకూడా వేరే ఫస్టుక్లాస్ సముద్రంలో చెయ్యాలికాబోలు" అని చౌదరి అందరూ వినే టట్లు అన్నాడు.

"నేను మీతోనే వున్నానండోయ్" అన్నాడు కృష్ణ మూర్తి.

"నేను వీరితోనే వున్నానండీ" అన్నాడు థర్డ్‌క్లాస్ ప్యాసెంజర్ శ్యామలరావు.

"నేను ఏ పార్టీలోనూ చేరను. వేరే చేస్తాను" అని కనకం, కాస్త దూరంగావెళ్ళి, రెండడుగులు నీళ్లలోకిదిగి స్నానం చేస్తోంది. ధనంజయం మెల్లగా సాకుతూ అక్కడికెళ్ళి, ఒడ్డునకూర్చుని నీళ్ళమీదజల్లుకుంటున్నాడు. నాగభూషణం గారి 'రవి', 'రమ'లు గంతులేస్తూ, ఆ చోటుకే వెళ్లి నీళ్లల్లో దిగారు. లోతుకుదిగకండి, అని టీకొట్టువాడు కేకపెట్టాడు. అక్కడ సముద్రం రెండుమూడు గజాలు దాటగానే లోతుట. 'వెళ్ళకబ్బాయి' అని 'రవి'ని పట్టుకున్నాడు ధనంజయం. 'రమ' ఒకడుగువేసి కెరటంపోటుకి ముందుకు పడిపోయింది. కేకలు వేసింది.

ధనంజయం లోపల కాలుపెట్టి ఆమె జడపట్టుకుని వెనక్కి పడిపొయ్యాడు. కనకం వాళ్ళిద్దరినీ రెండు చేతులతో రొమ్ముకి నొక్కుకుని, ముందుకిగెంతి ఇసుకమీద పడింది. జనం నలుగురూ పోగయ్యారు. ఎవ్వరికీ ఏమీజరగలేదు. ధనం జయంగారు మాత్రం కాసినినీళ్ళుమింగారు— దగ్గులు, డోకులు అయినాక కాస్త తేరుకున్నాడు.

"అంతకీ కారణం ఆ కనకం" అన్నాడు చౌదరి.

"పాపం, ఆవిడేం చేసింది—ఆవిడ లేకుంటే రమ ఏమవును" అంది హేమలత. కనకంపట్ల మా ఆవిడ ఆమాత్రం సానుభూతి చూపడం నాకెంతో సంతోషాన్నిచ్చింది.

కొందరం టీ త్రాగడంతో, టీ కాస్తా అయిపోయింది. సూర్యుడు నీళ్లల్లో దిగిపోతున్నాడు—కెరటాల కొట్లాట చూసి రాజీ కుదర్చలేక విఫలు డైనట్లు. ఎరుపు కెరటాల శిఖరాన నురుగుని నీలంగా మారుస్తోంది. అది రంగుల కయ్యం— 'నీలం' అనే కన్యకి విడాకులిచ్చి, పారిపోతున్న రంగుల ప్రియులు.

రైలు ఏడున్నరకి బైలుదేరుతుంది. అది తప్పితే, మళ్ళా తెల్లారితే కాని రైలు లేదు. జనం స్టేషన్‌కి బైలు దేరారు. మరో ప్రయాణీకుల బృందం ఉన్న రెండు ఎడ్ల బళ్లనీ కట్టించుగుని వెళ్లిపోయారు. తిరిగి వొచ్చి, ధనం జయాన్ని తీసికెడతా నన్నాడుట. మేం అందరం నడుచుగుంటూ స్టేషన్‌కి చేరేటప్పటికి ఏడుంపావైంది. అక్కడ టీ త్రాగాం. అందరూ పెట్టెలలోకి ఎక్కారు. ఏడున్నరైంది. తిరిగి వెళ్లిన బండి రాలేదు. ధనంజయం, కనకం దిగడిపొయ్యారు. గార్డుని బ్రతిమలాడితే మరో పది నిముషాలు రైలు ఆపాడు. వాళ్ల బండి ఎంతదూరంలో ఉందో చీకట్లో కనబడటంలేదు. పాపం, ఆ ముసిలాయన, కనకం ఏమవస్థ పడుతున్నారో, ఏంచెయ్యాలి ? రైలు కదులుతోంది.

"ప్రొద్దుట బండిలో వొస్తారులెండి, మీ రెక్కండి" అన్నాడు విశ్వపతి.

"నేను దిగపడిపోతా, పోనీ," అన్నాడు కృష్ణమూర్తి.

"పట్టెడు రొంప జలుబుతో మీరేం చేస్తారు," అంది ఆయన భార్య ఇందిర.

"పోనీ, మీరుండిపోతారా ?" అంది హేమలత. రైలు కదిలింది. హేమలత ఫ్లాస్కు, బ్రెడ్ బాక్సు అందిచ్చింది. రైలు వెళ్లింది. దిగులుగా ఉంది స్టేషన్. కెరటాలు ఒడ్డున పడి, విరహంతో రోదిస్తున్నాయి. మానవుడు, సమాజము అక్కడి ప్రకృతికి ప్రధానంగా తోచలేదు. నేను యదార్థమో, సముద్రం యదార్థమో—ఎవరు నిర్ణయించగలరు ?

అట్లా అనుకుంటూ రెండు ఫర్లాంగులు వొచ్చేక ఎద్దుబండి ఎదురైంది. బండి నిలిచింది. కనకం దిగింది.

"ఇదేమిటి ఇల్లా వొచ్చారు ? మావయ్య ఆయాసం ఎక్కువైంది. వెంటనే బండిలోకి ఎక్కలేకపొయ్యాడు. నేను బండివాడూ, లోపలికి ఎక్కించాం కష్టంమీద," అంది.

"రైలు వెళ్లిపోయింది," అన్నాను.

"ఆ—మరెల్లా గిప్పుడు ?"

"ఉదయాన ఆరున్నరకి బండిలో వెళ్లోచ్చు. రాత్రి ఇక్కడే గడపాలి," అన్నాను.

బండి వెడుతోంది. ఆమె, నేనూ నడుస్తున్నాం. చుట్టూ చీకటి. చీకటికి భయపడని కారుమేఘాలు, కెరటాలతో కయ్యాని కన్నట్లు సముద్రపుటంచున మూగి సవాలు చేస్తున్నాయి. పైన నక్షత్రాలు, సాక్షులు మాదిరి నిశ్చలంగా మెరుస్తున్నాయి. సముద్రగర్భం ఒక మృత్యువులా నల్లగా ఉంది. దాన్నుండి కెరటాలు పారిపోయి మా పాదాల మీద పడి 'రక్షించండి' అన్నట్లు మొరెట్టుగుంటున్నాయి. కానుకలుగా పీతలు—పెద్ద బండలంత,—కాళ్లమధ్య పరుగులెత్తి కెరటంలో కలిసిపోతున్నాయి.

కనకంజుట్టు విడిపోయింది—ఆరబెట్టుకుంటోంది. జాకెట్టు భుజాన వేసుకుని, చీరకొంగు ఒంటిమీద కప్పుకుంది. మాటల్లేవు. మనిషి అనిశ్చలమై, మసగలాగై, కెరటాలమధ్య కరిగిపొయ్యే, ఒక భ్రాంతిగా సాగుతోంది. ఆమె—నేను, ఎవ్వరం? ఎక్కడికి పోతున్నాం? భాషలేదు, భావాలులేవు—కాలికింద ఇసుక రేణువులమాదిరి ఒడ్డున కదిలిపోతున్నాం. స్టేషన్ కొచ్చేశాం. ఫర్లాంగుదూరంలో గదుంది. మధ్యలో కర్రతో గోడ. దానిమీద మంచం. ధనంజయంగార్ని దానిమీద పడుకోబెట్టాం. తడిబట్టలు తీసేసి, సంచి తలకింద దిండులా పెట్టాం. చలిగాలి మొదలెట్టింది. తలుపులు మూసేశాం. స్టేషన్‌మాస్టర్ గ్యాస్ దీపం ఇచ్చాడు. నేను డాక్టర్‌కోసం బయలుదేరాను. ఊళ్లో ఐదారుఇళ్లు కనిపించాయి. టీ కొట్టుదగ్గర, పూరీలు దొరికాయి. డాక్టర్‌తో వచ్చేటప్పటికి పదైంది. ఆయన పరీక్షించాడు. లాభం లేదన్నట్లు పెదవి చప్పరించాడు. హెమరేజ్. రక్తస్రావంట. చెప్పలేం అన్నాడు. రక్తం ఎక్కించాలిట. చేసేది ఏమీ లేదన్నాడు. ఏవో బిళ్లలిచ్చాడు. బలవంతాన నోట్లోవేసి, మంచినీళ్లిచ్చాం. ఒకటి మింగాడు ధనంజయం. కళ్లువిప్పి మాకేసి చూశాడు. దీపం వెలుగులో కళ్లు పెద్దవిగా, ఒకళ్లై చూసినట్లు భయంకరంగా ఉన్నాయి.

"ఎట్లా ఉంది?"

పెదవులు వికృతంగా కదులుతున్నాయి. అది నవ్వే యత్నం. డాక్టర్ వెళ్లాడు. తెచ్చినవి తినమన్నాను కనకాన్ని. ఇద్దరం తిన్నాం. ఫ్లాస్కులో టీ తాగాం. ఆరిన జాకెట్టు జుట్టు ముడి తలకింద పెట్టుకుని, గుమ్మంముందు పరుంది. కొంచెం దూరంగా బెంచిమీద నడుంవాల్చాను. అంతటా నిశ్శబ్దం. ధనంజయం మూలుగు, గురక వినబడుతోంది. ఏదో కల. సముద్రం మధ్యలో పడవ, తెరచాప చిరుగుతుంది. మేఘాలు, ఉరుములు, మెరుపులు; సముద్రం అడుగునుండి, అగ్నిపర్వతం ప్రేలినట్లు చప్పుడు; పడవ ముక్కలవుతుంది. ఒక్క ముక్కని పట్టుకుని ఆకాశంలోకి వెళ్లిపోతాను. కొన్ని లక్షలమైళ్లు వెడతాను. చంద్రమండలాన్ని దాటిపోతాను. రెండు మిలియన్లమైళ్లు దాటి వెడతాను. సూర్యకిరణం కర్రను, నన్నూ కాల్చేస్తుంది.

"అమ్మో!" అని కేక వినబడింది. త్రుళ్లి బెంచిమీద నుండి పడ్డాను. కనకం పరున్న గుమ్మందగ్గర ఒక తలుపూడి పడింది. లోపలికి వర్షం సూదులకిమల్లె పడి పొడుస్తోంది. ఉరుములు, మెరుపులు, సముద్రం హోరుని ముంచివేసి, విజయం సాధించాయి. కనకం బ్యాటరీలైటు వేసింది. అది క్షణం వెలిగి నిలిచిపోయింది. లేచి ఊడిన తలుపుని నిలబెట్టి, ఇద్దరం అదిమి పట్టాము. పది నిముషాల్లో వర్షం నిలిచింది. గోడ అవతలకి వెళ్లిచూశాను. అక్కడ లైటు ఆరిపోయింది. ధనంజయంగార్ని కదిపి వూపి పలకరించాను. ఏదో రోదన చేస్తున్నాడు. గుండెలు కొట్టుకుంటున్నాయి. మూలుగు వినబడుతోంది. ఒంటిగంటైంది. క్రింద నీళ్లు, బెంచిమీద చేరాను. తల మోకాళ్లమధ్య దాచుకుని కూర్చుంది కనకం. మళ్లా నిశ్శబ్దం, భయం, చలి, మనస్సులో పెద్ద ఖాళీ—భారం. మరో మనిషి కావల్సి వచ్చింది. మనిషి ఒంటిగా పుడతాడు, ఒంటిగా పోతాడు. కాని, ఈమధ్యలో మరోప్రాణి లేకపోతే ఉండలేడు. ఒంటి ప్రాణి అసంపూర్ణం. కనకం ఒడిలోకి వాలిపొయ్యాను. ఆమె స్తనాలమధ్య చెంప వాల్చాను. చేతులు నడుంచుట్టూవేసి, వేడిని నాలోకి లాక్కుంటున్నాను. మెడ నోటికి తగుల్తుంది. రక్తం, మాంసం, వేడి, మెత్తదనం—జీవుడు కొట్టుకోడం—గుండెలో కదిలే ప్రాణం. వీటిని గట్టిగా కౌగలించుకుని, నా బ్రదుకుని యదార్థం చేసుకోడంకోసం: అదొక పెనుగులాట, అదొక జ్వాల; దహించి బ్రతికిస్తుంది. ఆమెతోసేస్తోంది. తప్పించుకుంటోంది. ఇండియా రబ్బర్‌లా జారిపోతోంది.

"అమ్మో—విడిచెయ్యండి" అంది రహస్యంగా. కంఠంలో అస్పష్టమైన నాదం—మాటలులేవు. ఇంకా ఇంకా జరుగుతున్నాను ఆమెని పెనవేసుకుని, కరిగి విరిగి ఐక్యం అయిపోతున్నాం, తోసేస్తోంది. బెంచిమీదనుండి కింద నీళ్లల్లో పడ్డాను. నన్ను లేవదీసింది.

"మీరిల్లా పడుకోండి. వానకి బట్ట తడిసినట్లుంది. పిండేదా?" పిండుతోంది.

"ఒళ్లు పట్టేదా? తలనొప్పా? జోకొట్టేదా? కాళ్లు పట్టేదా?" ఆమెను దగ్గరగా తీసుకుని, అధరాలను తాకాను.

"నమస్కారం పెడతానూ, పడుకోండి."

"ఏం?"

"ఆ ముసిలాయన అట్లా చావు బ్రదుకులమీద ఉండగా, మీ రిట్లాగవచ్చా?"

"దానికీ, దీనికీ ఏం సంబంధం?"

"చదువుకున్నవారు. పెద్ద కుటుంబంలో మర్యాదగా పెరిగినవారు—ఇట్లాంటప్పుడు, ఆ ఆలోచన ఎట్లాగొచ్చిందండీ మీకు? హేమలత దగ్గర లేబట్టేనా? ఆమె దగ్గరవున్నా, ఆమెతో మీ రిట్లా గడపగలరా—ఎంత రాతి గుండెమీది!"

"నేనంటే ఇష్టంలేదా"?

"ఇష్టంఉంటే పెండ్లి చేసుకుంటారా?"

"నీ కిప్పుడు పెండ్లేమిటి?"

"మీకంటె రెండు మూడేళ్లు పెద్దదాన్ని. నామీద మీ కెట్లా ఇష్టం ఏర్పడిందో—ఈ ఒక్క గంటా ఇష్టం—మళ్లా ప్రొద్దున్నకి మామూలే. హేమలత భర్తగారు. ఆమెతో చెప్పేదా?"

"ఎవరి వృత్తి వారిది."

"ప్రేమించడం, ఇష్టపడటం నా వృత్తికాదు. మీ ఆవిడగారి వృత్తి అది."

"మరి నీదేమిటి?"

"డబ్బుకి శరీరాన్నివ్వడం."

"డబ్బు కావాలా?"

"అంత ఇష్టంగాఉంటే, శరీరం అడక్కుండా డబ్బివ్వండి."

ఆమె గదిలోంచి వెళ్లిపోయింది. బైట తిరుగుతోంది. బెంచిమీద పడుకున్నాను. నీరసంగావుంది. కడుపులో ఖాళీ ఏర్పడింది. అస్తిపంజరం ఏడుస్తోంది. మెదడులో ఆలోచన లేదు. కళ్లు మూతలు పడ్డాయి. ఎవరో నుదిటిమీద చెయ్యివేసి లేపారు. భయం వేసింది. కనకం.

"కోపం వచ్చిందా?"

నేనేమీ మాట్లాడలేదు.

"హేమలతకి మీరంటే ఎంతో ప్రాణం. తెలిస్తే ఆమె కెట్లా ఉంటుంది?"

"అవును, పాపం, పతివ్రతవు."

"కాను, నిజమే. మనస్సులో ఉండొచ్చుగా."

"ఎప్పడినుంచో."

"మీబోటివారి సావాసమైంతర్వాత," అని నవ్వుతూ పక్కకివెళ్లి ధనంజయాన్ని చూసివచ్చింది.

"ఇటురండి. కళ్లుమూసినట్లున్నాడు," అంది. ఇద్దరం వెళ్లి చూశాం. కళ్లు మూశాడు. కాళ్లు, చేతులు చల్లగా ఉన్నాయి. గుండె నిలిచిపోయింది. ముసిలాయిన అస్తమించాడు. ఇంక జీవితంలో పెనుగులాటలేదు. బైటకివెళ్లాం. చీకటి విడిపోతూంది. కెరటాలు ప్రభాతగీతం ఆలాపిస్తున్నాయి. బద్ధకంతో పక్షుల కలకలం వినబడుతోంది. స్టేషన్‌లో జనం అలజడి ప్రారంభమైంది. మంత్రాలకి ఒకాయన్ని తీసుకొచ్చాను. డాక్టర్ దగ్గర సర్టిఫికెట్ తీసుకున్నాం. నలుగుర్ని డబ్బిచ్చి రప్పించాను. ఏడింటికి తీసుకెళ్లాం. నాలుగు ఫర్లాంగులు నడిచాం. మంత్రాలు చదివారు. చితిపేర్చారు. నిప్పంటించింది కనకం. మంటలో పొగ, కెరటంలో నురుగు ఆవిరై, రెండూ ఏకమై శూన్యంలో కలిసిపోయినాయి. తొమ్మిది గంటల బండిలో వెనక్కివెళ్లి, మధురలో బస్సెక్కి, కన్యాకుమారి చేరుకున్నాం, ఆ రాత్రి తొమ్మిదింటికి.

* * * *

'కన్యాకుమారి ఆలయం దర్శించి, సముద్రస్నానంచేసే మా గదికి చేరుకునేటప్పటికి ఒంటిగంటైంది. మా బస చిన్న హొటల్లో ఒక గది. నా గదిలో నేనూ, రక్షితలాల్, వారి సతీమణి రాజీబాయీ ఉన్నాము. భోజనం చేసి పడుకుని, మూడింటికి లేచాను. విశ్వపతి సుచీంద్రం ఆలయానికి బస్సు ఏర్పాటు చేశాడు. పదకొండుమైళ్లు. అద్భుతమైన శిల్పాలు. ఇటీవల త్రవ్వి, పైకితీయబడిన పెద్ద ఆంజనేయస్వామి రాతి ప్రతిమ. తోకలోంచి తీర్థంపడే ఏర్పాటు చేశారు.

ఆలయంలో వెనక నర్తనశాలగాఉండే మందిరం చూశాం. అక్కడ స్తంభాలు మోగిస్తే వివిధ వాద్యాల నాదం వినబడుతుంది. ఆమధ్య తిరుచ్చి రేడియో నిలయంవారు, ఆ వాద్యాలు రికార్డు చేసుకుని వెళ్లారుట. నా కన్నింటిలోకీ ఆ ఆలయంలో శిల్పాలు నచ్చాయి. వాటిలో ఒళ్లు పులకరింపజేసే, సూక్ష్మమైన సౌందర్యంఉంది. ప్రేమంటే తెలియనివారు ఆ శిల్పాలనిచూస్తే ప్రేమించటం మొదలెడతారు. అది వాంఛతో, కామంతో, ఇంద్రియాలనుకదిపే ప్రేమ కావచ్చు. వాంఛనుండి విడగొట్టిన ప్రేమను నే నెరగను. అది ప్రాప్తిస్తే ధన్యుణ్ణే. అంతవరకూ, కళాసౌందర్యంలో తృప్తిపడితే తప్పులేదనుకుంటాను. తిరిగి గది కొచ్చేటప్పటికి ఎనిమిదైంది. హొటల్లో నాలుగు మెదుకులు తిని, గది కొచ్చేటప్పటికి తొమ్మిది దాటింది. గుమ్మంలో విశ్వపతి నిలబడి మందహాసం చేశాడు.

"క్షమించాలి, లక్ష్మణమూర్తిగారూ. ఈ పూటకి కనకం, మీ గదిలో ఉంటుంది. ఇప్పుడే వచ్చారువాళ్లు. ధనంజయం చనిపోయాడుట. అంత్యక్రియలుచేసి ఇప్పుడే వచ్చారు. మధుసూధనంగారు ఫస్ట్‌క్లాస్ ప్యాసెంజర్‌గా—వారికి పెద్ద హొటలు గదిలో చోటుంది. మీరు కవులు......"

ఇంకా వాక్యం పూర్తవకుండానే, కనకం గదిలో కొచ్చేసింది.

"మన లక్ష్మణమూర్తిగారేగా—ఆయనకి ఏ అభ్యంతరం ఉండదు—వారి మొహాన చిరునవ్వు తాండవిస్తూఉంటుంది. ఏం! లక్ష్మణమూర్తిగారు......" లోపలికొచ్చి, సంచీలో దుస్తులు తీసుకుని ధరించి, జడ అల్లుకుని, "తినేటందుకు ఏమన్నా ఉందాండి. మంచి ఆకలిగాఉంది," అన్నది. ఏం చెయ్యాలో తోచక అటూ, ఇటూ చూస్తున్నాను. రక్షితలాల్‌గారు పొట్లం విప్పి, నాలుగు పూరీలు పెట్టాడు. రెండు నారింజ పండ్లిచ్చాడు. అవి తిని, మంచినీళ్లు తాగి, ధనంజయంగారి చివరి ఘడియలు వర్ణించింది. ఆమె కబుర్లు—కళ్లు కదలికా, చేతులు తిప్పడం, మెడవంచి వూగిసలాడుతూ మాట్లాడుతూంటే సుచీంద్రం ఆలయంలో ఒక బొమ్మ ప్రాణం పోసుకుని మాట్లాడుతున్నట్లనిపించింది. నా మంచంమీది రగ్గులాగి, కింద పరుచుకుంది. మా పెట్టెలో రోజా చూస్తూనేఉన్నా. కాని, ఆ సమయంలో కొత్తగా కనపడింది. ధనుష్కోడిలోపొందిన విషాదకరమైన అనుభవంవల్ల, పెరిగి, నిజాయితీ, నిబ్బరం సూచించేమొహం వింతగా కనబడింది. ఆమె కళ్లు మూసుగుంది. శ్వాస వినబడుతూంది—వక్షం కెరటంలా లేచి పడుతోంది. ఆమెని గురించి ఎన్నో విన్నా—బొత్తిగా గిట్టని శ్యామలరావు చెప్పినవి. అతన్ని ద్వేషించడం కూడా ఒక కారణమే, ఆమెపట్ల కుతూహలం ఏర్పడడానికి, పతితులపట్ల ఉన్నంత కుతూహలం శీలులపట్ల ఉండదేమో. ఈ భావాలన్నీ వూహలో తిప్పుతూ, ఒక ఖండ కావ్యం వ్రాయమొదలెట్టాను. పది నిముషాలవగానే లేచి కూర్చుంది కనకం. అటూ ఇటూ చూసింది.

"ఏమండీ—అవతల కెళ్లాలి. కాస్త సాయంగావచ్చి ఎటో చూపిస్తారా?" అంది.

ఏం చెయ్యను. వెళ్లాను. చూపించి, బైట నిలబడ్డాను. మళ్లావచ్చి పడుకుంది. "మీరెంత మంచివారండి," అని దుప్పటి కప్పుకుంది. నే మొదలెట్టిన గేయం పూర్తి కాలేదు. స్విచ్ నొక్కి పడుకున్నాను.

ఐదు కాకుండానే లేపింది. సూర్యోదయం చూద్దాం రమ్మంది. రాజీబాయి 'నేను రాలేను—మేం చూశాం, మీరెళ్లండి,' అంది. మొహం కడుక్కుని బైలుదేరాం. చాలా చలిగాఉంది. మాటలు రావడంలేదు. నాలుగు ఫర్లాంగులు నడిచి సముద్రం ఒడ్డుకి చేరుకున్నాం. చీకటి పట్టు వీడుతోంది. అలలమధ్య పెద్ద పెద్ద రాతిబండలు పారా వేస్తున్నాయి. నీళ్లల్లోకి నడిచి వెళ్లి 'రండి ఇక్కడ కూర్చుందాం,' అని తను ఒక రాయిమీద కూర్చుంది. నేను కాస్త దూరంగా నిలబడ్డాను. 'రాండి' అని, చెయ్యి పట్టుకులాగి కూలేసింది.

"నేనేమన్నా చేస్తానని భయమా?" అంది కొంటెగా చూస్తూ. వెలుగు రావడంతో నా సిగ్గు తొలిగినట్లైంది.

"నువ్వుకాదు, నేనేమన్నా చేస్తానేమోనని భయం," అన్నాను. నవ్వేసింది.

"మీరు కవులటగా. కవులకి ఆ ధైర్యం లేదులెండి. నే నెరుగుదును."

"ఎట్లా ఎరుగుదువు?"

"ప్రక్కన పడుచుపిల్లుంటె పద్యాలు చెప్పరట. పద్యాలు చెప్పేవారు పడుచుపిల్లకేసి చూడరుట. అవునా?"

"చాలా అనుభవంఉందే."

"నా మొహం. వారు వీరూ చెప్పుకుంటుంటె విన్నవి· సర్దాగావుందా ?"

ఏం చెప్పను? నా కెందుకో భయంవేసింది. ఆమె చెప్పినట్లు నాకు ధైర్యం లేదనిపించింది.

"రాత్రి నిన్ను గురించి ఒక గేయం మొదలెట్టాను, తెలుసా?" అన్నాను.

"గేయమేనా—చెప్పండి, విని సంతోషిస్తాను."

గొంతు సవరించుకుంటున్నాను. ఆమెకి అర్థమవదు. అర్థంకూడా విడమరిచి చెప్పాలి. అల్లా చెప్పగానే దాని అందం చెడుతుంది. ఆ సంగతి కూడా ఆమెకి తెలీకపోవడం అదృష్టం అనుకున్నాను.

"ఆహా—అటుచూడండి — సూర్యభగవానుడు," అని చేతులు జోడించి నమస్కరించింది. ఎర్రగా బింబం అంచుపైకొచ్చింది. పైన చోద్యం చూడ్డానికి వస్తున్న మేఘాలని తన సౌందర్యం చూసి సిగ్గుపడేటట్లు చేసింది. మేఘాల మొహాలు, సిగ్గుతో ఎర్రబడ్డాయి. జోహారులిస్తూ, కెరటాలు ఎగిరి పడుతున్నాయి. మూడు సముద్రాల అలలు, దూరంగా జరుపుతున్న సమరం కాసేపు నిలిపి, దూరంగా ఎరుపుతో ఏకంచేసి సంధి కుదిర్చింది సూర్యబింబం. ఎరుపుతో రాతి బండలు విర్రవీగి, కెరటాలని క్రూరంగా గెంటివేస్తున్నాయి.

ఎరుపుతో కనకం మొహం పుష్పంలా విప్పుకుంది. కళ్లు వెలుగుతో చెలిస్తున్నాయి. వక్షం వూగిపోతోంది. వాటి మధ్యకిరణం కత్తిలా దూసుకుంది—మరెక్కడా చోటులేక.

"ఏదీ, దానందం వర్ణిస్తూ పద్యం చెప్పండి"

నే మళ్లా గొంతు సవరించుగుంటున్నా. ప్రబంధ కవుల వర్ణనలు జ్ఞప్తికి తెచ్చుగుంటున్నా. అవి పఠించే భాగ్యంలేదు. మేఘాలు అత్యతంగా బింబాన్ని కమ్మేశాయి. ఎరుపు పోయింది. ఎరుపు బూడిదైంది. శ్మశానంలో గోరీలల్లె రాతి బండలు మిగిలాయి.

"పూర్తిగా చూళ్లేదు. అదృష్టంలేదు," అనివేచింది కనకం. అల్లా నడుచుకుంటూ మధ్యలో హోటల్లో టిఫిన్ తిని, కన్యాకుమారి ఆలయం దర్శించాం. లోపలన్నీ దీపాలు—

వెయ్యో, లక్షో లెక్కించలేను. ఆమె మూర్తి విడతెగని యువ్వనానికి సాంకేతికం. కనకం సాష్టాంగ ప్రణామం సల్పింది. తర్వాత గాంధి స్మారక మందిరం చూశాం. అదొక అందమైన భవనం. మధ్య చదరపు ఆకృతిగల రాతి ఫలకం ఉంది. మహాత్ముడు పుట్టిన రోజున—అక్టోబర్ రెండవ తేదీన, పైన కంతలోంచి సూర్య బింబం, గుండ్రంగా బంతిలా, ఆ రాతి ఫలకం మధ్యలో పడే టట్లు నిర్మాణం చేశారు ! కనకం ఆ ఫలకంమీద పడుకుంది. లేచింది. నమస్కరించింది. స్నానాలుచేసేచోటుకి చేరుకున్నాం. అక్కడ జనం ఎవ్వరూలేరు. ఒక పెద్దరాతి గుట్ట నీళ్లల్లోకి పాకింది. అవతలవైపు కూడా ఎవ్వరూ జనం లేరు. కనకం నీళ్లలోకి దిగింది.

"హాయిగాఉంది రండి," అంది. నాకు చలేస్తోంది. వెళ్ల లేను.

"మీరు స్నానంచేసిరండి," అని అరిచాను.

"నన్ను మీరు అంటున్నారే—ఎంతమంచివారండీ. మీకు రోజూ ఇంత మంచి చలి దొరకదు. సిగ్గుపడుతున్నారే, ఆడదానికిమల్లే," అంటూ కెరటంమీది తుంపరని నామీద పడేటట్లు చేత్తో కొట్టింది.

"తుడుచుకునేందుకులేదు. మీరు కానివ్వండి." అన్నాను.

"నా చీరుందిగా సంచీలో" అని పరుగెత్తుకుంటూ వచ్చి చెయ్యి పట్టుకుని నీళ్లల్లోకి లాగింది. విదిలించుగుని, దూరంగా జరిగి కెరటాలమధ్య కదుల్తున్నాను. ఆమె లోతుకి వెడుతోంది. "వెళ్లద్దు," అని కేక వేశాను. రాయి తగిలి వెల్లికిల పడింది. అటువెళ్లి చెయ్యి పుచ్చుగుని లేవనెత్తాను.

"మీరు లేకపోతే చద్దును," అని రాతిబండమీద కూర్చుంది' కెరటాలమీదపడ్డ కాంతి ఆమె వక్షంపైన పడుతోంది. వెండి తీగలమాదిరి, రంగు తీగెలు వంకరలుతిరిగే, బంగారపు పంజరంలో పక్షివలె కిలకిల నవ్వుతోంది.

"ఇల్లా హాయిగా ఇక్కడే ఉండిపోవాలనుంది," అంది. మళ్లా నీళ్లల్లోకి దిగి నా వైపు నడిచి వస్తోంది. నా రెండు చేతులమధ్య ఇమిడింది. అప్రయత్నంగా నా చేతులు ఆమె నడుం చుట్టూ బిగియడం పూర్తవకుండానే తొలిగించి దూరంగా వెళ్లింది.

"మీరు మంచివారు. మీ జోలికిరాను. ఆడది నిజంగా ఏమనుకుంటోందో తెలిస్తే, మొగాళ్లు మరింత తెగింపు చేసే వారు. అవునా లక్ష్మణమూర్తిగారూ?"

ఒడ్డుకివెళ్లి సంచిలో బట్టలుతీసి, చీర మార్చుకుం టోంది. తడి చీరలోంచి ఒంటెలో ఒంపులు స్ఫుటంగా కన బడుతున్నాయి.

"ఇటు చూడకండి. పదేళ్లక్రితం అయిఉంటే, మీరల్లా దూరంగా కూర్చుని ఉందురా. ఇంద, చీర—తుడుచుకోండి," అని మరో చీరమీద పడేసింది. బట్టలు ఆరుతున్నాయి. జడ విప్పి, పిండి మడికింద కట్టింది. రెవిక నెత్తిన వేసుకుని ఎండ పెడుతోంది.

నేను గట్టుమీదికి వెళ్లాను. విశ్వపతి ఒక్కడూ నడుచు కుంటూవచ్చి నా ముందు నిలబడ్డాడు.

"కనకం లాక్కెళ్లిందంటగా!" అన్నాడు.

"చూపిద్దామని."

"మీరు చూపేదేమిటి—డబ్బిస్తే అదే చూపెడు తుంది."

"ఏమిటా మాటలు. కనకం ఎవరనుకున్నావు?"

"లేచొచ్చింది—లేవదీసుకెడుతుంది—నీకు దాంతో ఏమి టయ్యా."

నేను మీదికెళ్లాను. వెర్రికోపం వచ్చేసింది. విశ్వ పతిని తన్నాలనిపించింది. ఈలోగా కనకం వచ్చింది.

"వింటున్నావే విశ్వపతిగారు—టిక్కట్టు కొనుక్కునే వస్తినిగా రైల్లో. మీరేం వూరికే తీసుకు రాలేదు."

"తీసుకొచ్చాను. అనుభవిస్తున్నాను. నలుగురూ తిట్టి పోస్తున్నారు. ఈయన్నేనా—" ఒళ్లు మండింది. చెయ్యి చాచి సాగదీసికొట్టాను. మధ్య అడ్డు తగిలిన కనకం చెంపకి తగిలి, బాధ సూచిస్తూ కేకపెట్టింది.

విశ్వపతి ఇంకెప్పుడూ అనను, చెంపలేసుకుంటూ అని వెళ్ళిపొయ్యాడు.

"తగిలిందా పాపం. మీరెందు కడ్డుపడ్డారు. వాడికి కావాల్సిందే."

"పాపం, అతని తప్పుమాత్రం ఏముందిలెండి. అందరి లాగా వాడూ మనిషే," అంది.

"మరేం పెద్దగా తగల్లేదుకద— చూడనీ" అని ఆమె బుగ్గ నిమిరాను. ఆమెకళ్లంట నీళ్లు తిరుగుతున్నాయి. తుడి చేసుకుంది.

"నే నెందుకు ఏడవటం ? వెర్రిపిల్లని," అని నవ్వు తోంది. రాళ్లమీద పేర్లుచెక్కుతున్న కుర్రాడిని కేకేసి, మా ఇద్దరిపేర్లూ ఆ బండమీద చెక్కమంది. వాడుచెక్కాడు.

"అల్లా పైనాకిందా కాదు పేర్లుచెక్కడం. పక్కపక్కనే." నాగభూషణంగారి కుటుంబం, మరికొందరు రైలుమిత్రులు ఒస్తున్నారు. వాళ్లలోకలిసిపొయ్యాము. ఆ సాయంత్రం అంద రం, బస్సులో, తిరువనంతపురం ప్రయాణమయ్యాము.

'మా పెట్టెలు తిరువనంతపురం చేరడానికి ఒకరోజు ఆలస్యమైనందున మేం మరోరోజు అక్కడ గడపాల్సివచ్చింది. అక్కడ పద్మనాభస్వామి ఆలయం, ఆర్టుగ్యాలరీ, బీచి, తోటలు చూశాక, ఇంక చూడవల్సినవేవీ కనబడలేదు. ఇందిర ఇంక

తిరగలేనంది. ఒంట్లో బాగాలేదు. నాగభూషణం పరీక్షచేసి మందిచ్చాడు. హాట్‌కాఫీతాగి రెస్టుతీసుకోమన్నాడు. ఒక చుక్క బ్రాండీ ఇప్పిస్తే మంచిదన్నాడు. ఊళ్లోతిరిగి, అది దొరికే వయనం తెలుసుకుని బ్రాండీబుడ్డి సంపాదించాను.

“నన్నడగలేకపొయ్యావా కృష్ణమూర్తీ. అంతశ్రమ దేనికి ?” అని రాఘవయ్య సూట్‌కేస్‌లోంచి రెండుబుడ్లు— ఒకటి విస్కీ— బైటికితీసి, కాస్తపుచ్చుగుని, లోపలపెట్టేశాడు. మందుప్రాయంగా నన్నూకాస్త పుచ్చుగోమని సంజ్ఞ చేశాడు. నిద్రపోతున్న ఇందిరనిచూపి వద్దన్నట్లు తలపంకించాను. భార్యతో యాత్రకి బైలుదేరితే కొన్నిసరదాలు ఒదిలేసుకోవాలి. భక్తిమార్గంలో కుంటుకుంటూనైనా నడుస్తున్నట్లు నటించాలి. ఇందిర ప్రోత్సాహంమీదనే ఈ యాత్రకి బైలుదేరాను. కాని మేం ఏమిచూడదల్చామో మాకేతెలీదు. ఒక చోటుకి బైలుదేరేవరకూ ఒకటే హడావుడి. తీరావెళ్లాక, వెనక్కివెళ్లే హడావుడి— పదిలంగా, చూసి ఆనందించిన స్థలం నాకుగుర్తులేదు. రైల్లో వెడుతూ, కిటికీ అవతల జారిపోతున్న ప్రకృతిదృశ్యాన్నిచూస్తూ, సమయానికి మంచికాఫీ, మంచి భోజనం, బద్ధకంగా పత్రికచదవడం. మధ్యమధ్య తోటి ప్రయాణీకుల అలవాట్లు, అవస్థలు గమనించడం, వారు మనకేసి చూస్తున్నది మనం గమనించనట్లు మొహం తిప్పి వెయ్యడం, వారుచూడకుండా వారికేసిచూస్తూ, మళ్లా చూస్తున్నామని వారికితెలిసేటట్లు సూచించడం, రైలునిలిచి నప్పుడు, ప్లాట్‌ఫారమ్‌మీదదిగి ఏదో కొనడం, తినడం— థర్డ్‌క్లాస్ పెట్టెలో వారితమాషాలుచూసి వినోదించడం— నాకు బాగున్నవి ఇవి— చాలారోజుల్నుంచి చూస్తూ అలవాటైన మధుసూధనం, హేమలత, ‘డెవిల్ బేబీ’— రామనాథం పూర్తి చెయ్యని పెన్సిల్‌చిత్రాలు— నువ్వూ ఇవన్నీచూస్తూ వినోదిసున్నావుగా— అని ధ్వనించేటట్లు, ఇందిరకేసి చూడడం, ఆమె కొత్తచోటు చూసినప్పుడు తన ఆహ్లాదాన్ని మొహంలో ఎల్లా ప్రకటిస్తుందో గమనించడం— ఇవికూడా విసుగ్గా తోస్తున్నాయి. మొదట్లో చాలారోజులు మా పెట్టెలో కనకం వుండేది. ఇప్పుడు రావడం మానేసింది. ఆవిడుంటే కాస్త కాలక్షేపం అయ్యేది. ఏదో వాగుతూవుంటుంది. అతిశయోక్తిగా ఆశ్చర్యాన్ని ప్రకటిస్తుంది ఏదన్నా చూసినప్పుడు. ప్రతీదీ అద్భుతంగా గొప్పగా, ‘మజాగా’ వుంటుందనేది. విలువల వ్యత్యాసాలు, సూక్ష్మమైన తేడాలు ఆమెకి తెలియవు. మనిషిని రెండెట్టి గుణించినట్లు— ఆమెకంతా వింత, విడ్డూరమూనూ, ఇప్పుడు ఆ కాలక్షేపంకూడాలేదు. మధ్యాహ్నం రెండింటికి మారైలు బైలుదేరుతుంది. ఓపిక, డబ్బు, ఉత్సాహం వున్నవాళ్లం కొందరం, మరొక్కసారి వూరుచూద్దామని బైలుదేరాము. అక్కడ చేతిపనుల ప్రదర్శనశాల చూద్దామన్నాడు నాగభూషణం. రక్షితలాల్, జోగారావుకూడా బైలుదేరారు. మాకంటె ముందే అక్కడ చేరారు చెట్టిదంపతులు, రామనాథం, కనకం. వాళ్లు కర్రపీనుగులు, చోళీలు కొన్నారు. నేను మంచి గంధపుసామాన్లు బేరంఆడుతున్నాను. రక్షితలాల్ ఒకటోపీ, చేతికర్ర తీసుకున్నాడు. కర్రతో చెక్కిన మళయాళంస్త్రీ బొమ్మఒకటుంది. నాగభూషణానికి అదికొనాలనుంది. దానివెల నలభై.

“డబ్బు మిగలదేమో,” అన్నాడు. చెట్టిగారు అప్పుగా కావాలంటే ఇస్తానన్నాడు.

“ప్రస్తుతం ఫరవాలేదనుకోండి. అవసరంఒస్తేమాట. ఆధీమా చూసుగుని ఆ బొమ్మకొన్నాడు నాగభూషణం. కనకం చెవికి కేరళస్త్రీలు తగిలించుగునే బరువైన కమ్మలు బేరమాడుతోంది. అవి చదరంగావుండే నాలుగు గుండ్లతో ఇమిడ్చి రెండంగుళాలు కిందికి వ్రేల్లాడే కమ్మలు. బంగారంవికావు. ఇరవై చెప్పాడు. చెవులకిపెట్టుగుని చూసుకుంటోంది.

“బరువుకి మీచెవిజారి, తెగిపోతుంది” అన్నాను.

“ఎప్పుడూ పెట్టుగోను. తలంటు పోసుగున్నాక అద్దంలో చూసుగుని మళ్లా దాచేస్తాను. బాగున్నాయా ?” అని అడిగింది.

కొట్టాయన, మేమూ అద్భుతంగా ‘మజాగా’ ఉన్నాయన్నాము.

“అచ్చంగా కేరళ స్త్రీ లాగున్నావు,” అన్నాను.

“చెవికి పెద్ద కంత మినహా,” అన్నాడు చెట్టిగారు.

చిట్టమ్మ ‘వూరుకోండి,’ అన్నట్లు ఆయన చొక్కా వెనక్కి లాగింది.

“అబ్బో, ఇరవై రూపాయలే” అంది కనకం.

“మీకు చాలా బాగుంది, సంకోచించకండి.

డబ్బా ? ఉండనివ్వండి,” అని ఒక పాతిక చేతులోపెట్టాను. మందహాసంతో తీసుగుని కమ్మలు కొనుక్కుంది.

“ఇవాళ ఉషార్‌లో ఉన్నారు కృష్ణమూర్తిగారు !” అన్నాడు చెట్టి.

“ఖర్చులకే కదండీ ప్రయాణాలు,” అన్నాను.

కుంకుమభరిణ కూడా కొంది కనకం. పచ్చ కుంకుమ. పాపిట మధ్యలో పెట్టుకుంది.

“ఇప్పుడు అచ్చంగా కేరళ మనిషే,” అన్నాడు జోగారావు. అందరం టాక్సీలు చేసుగుని స్టేషన్‌కి చేరుకున్నాం.

ఇందిర మందు పుచ్చుగుంది. బ్రాండీ ముట్టనంది. ఆ వాసన డోకుట. సీసా గిరవాటెడతానంది. రాఘవయ్య దగ్గర తీసుకున్న రెండు బుడ్లూ మధుసూధనంగారి పెట్టెలో దాచాను. పడుకుని నిద్రపోతానంది. రైలు కదిలింది. పక్క స్టేషన్ చేరేటప్పటికి నిద్రపోయింది. ఏమీ తోచక థర్డ్ క్లాస్ పెట్టెలోకి చేరాను. అక్కడ గంద్రగోళంగా ఉంది. యాత్ర కార్యక్రమం అధిపతి విశ్వపతి, క్రితం రాత్రే తొందరపనుందని వెళ్లిపొయ్యాడుట.

"మమ్మల్ని నట్టేట్లోదించి వెళ్లాడు. ఏమనుకున్నాడు. ఈ ఏర్పాట్లన్నీ ఎవరు చేస్తారు ? సంజాయిషీ ఎవరు చెప్పాలి ? ఉదయం టిఫిన్‌లో ఉప్పు తగలెయ్యలేదు. ఈ సీటు చీటలు తీసింది. ఈ ఫాన్ తిరగడం మానేసింది. ముందు డబ్బు చేతిలో పెడితే ఇంతేననుకోండి," అని విశ్వాన్ని ఉద్దేశించి వాపోతున్నాడు పద్మనాభం.

"నేను ఉన్నాను కదటండీ—అంతా నన్నే చూసుకో మన్నాడు. ఇప్పుడు మీకేం లోటొచ్చిందీ—ఉప్పంటారా—పై స్టేషన్‌లో బస్తాడు తెప్పించనూ—ఈలోగా కృష్ణమూర్తి పంతులుగారి టేబిల్ సాల్ట్ ఉండనే ఉంది," అని వంటాయన విఠలయ్య నచ్చజెపుతున్నాడు.

'ఎవరికి వారే యమునా తీరే, అన్నాడు లక్ష్మణమూర్తి. కోయంబత్తూరు, అక్కడనుండి ఊటీ ప్రయాణం ఉందిట. ఇంకెక్కడికీ వొద్దు, తిన్నగా కొంపకి చేరుకుందాం—అని అధిక సంఖ్యాకులు తీర్పు చేశారు.

"దీని కంతకీ కారణం, కనకం" అన్నాడు పద్మనాభం.

"మధ్య నేనేం చేశానండోయ్ ?" అంది కనకం.

"నువ్వు ఆ ఫస్ట్‌క్లాస్ పెట్టె వారితో సావాసం చేశావు. ఆ అలవాట్లన్నీ మా కయ్యాయి. వాటిని సమకూర్చలేక, మన పోరు పడలేక ఉడాయించాడు విశ్వపతి" అన్నాడు.

"మర్యాదగా మాట్లాడండి. అరుగో చెట్టంత మనిషి కృష్ణమూర్తిగారు ఇక్కడే ఉన్నారు. మన అలవాట్లు వారికి మాత్రం అబ్బలేదనా. ఎన్నిసార్లు ఆదుకున్నారు ? రేడియో యిచ్చారు. బ్యాటరీలైటిచ్చారు. ఎన్నోసార్లు పాలు సర్దుబాటు చేశారు. కప్పుకునేందుకు లేకపోతే రగ్గు ఇచ్చారు. ఇదా మీ కృతజ్ఞత ?" అంది.

"అవన్నీ ఎవరికోసం ఇచ్చారు ?' ఎందు కిచ్చారు ?" అన్న ప్రశ్నతో వాదం రేగింది. అందరూ మాట్లాడ్డం సాగించారు. నేను పత్రిక అడ్డం పెట్టుగుని బైట దృశ్యం చూస్తున్నాను. అందమైన ప్రకృతి. దూరంగా అప్పుడప్పుడు సముద్రం కనబడుతుంది. కొబ్బరితోటలు, భారీ చెట్లు, చుట్టూ మట్టిగోడ—మధ్య విశాలమైన తోట, దాని మధ్యపూరిగడ్డి ఇల్లు.

స్త్రీలు కష్టించి పనులు చేస్తున్నారు. వారికి రవికెలు లేవు. లుంగీలా నడుంకి కాస్త బట్ట వ్రేలాడుతుంది. ఆకర్షణీయమైన శరీరాలు—నల్లగా, ఎర్రగా, చామనఛాయ శరీరాలు. నాగభూషణం కొన్న కర్రబొమ్మ నకలు. ఆ చెట్ల మధ్య నీడలలో, సూర్యరశ్మి సోకినచోట వెలుగుతూ ఒంటిమీద ఒంపులమధ్య నీడలు పడుతూ. ధాన్యం దంచేవారు, కొబ్బరి చెట్లెక్కేవారు, విత్తనాలు వేసేవారు, పూడ్చేవారు, పశువులని మేపేవారు, ఆట్లాడేవారు, పదాలు పాడేవారు— ఏదో పెళ్లి, పెద్ద గుంపు—అక్కడ చెట్లమధ్య ఉయ్యాలపై ఊగుతున్న కన్యలు, పరుగులెత్తే పిల్లలు, కొబ్బరిపీచులాగి ఎండబెట్టే వృద్ధులు— మధ్య సముద్రం నీరు సరస్సులా ప్రత్యక్షం—వాటిలోంచి కాలువలు—పడవలమీద బెస్తవాళ్లు—ఇక్కడ చేపలు పడుతున్నారు. కాలవలో, చల్లటి నీళ్లలో స్నానాలు, ఈతలు—కండలు తిరిగి, గుండ్రనై, నిండైన స్త్రీల సౌందర్యం—ఎందరెందరు స్త్రీలో—మొగాళ్లు ఎక్కువగా కనబడలేదు—అందరు స్త్రీలూ. ఒక్క స్త్రీ స్వరూపంలా, ఒక స్త్రీ శక్తిలా ప్రకృతినంతా అలుముకుని, లొంగదీసుకుని, రాణులై, సజీవులై, ప్రాణులై, సౌందర్యాన్ని పది నెలలు మోసి కనే స్త్రీలు, వారున్న స్థలాలు, తెరమీద సినిమాస్కోప్ ప్రకృతిదృశ్యంలా జారిపోతూ, నా మనస్సుకి గాలంవేసి లాక్కుపోతుంటే పోనివ్వక క్షుద్రజగత్తులోకి మాటలతో, తిట్లతో, అసూయలతో, పగలతో లాక్కుపోయి, బంధించి పడేస్తున్నారు తోటి ప్రయాణికులు. నా కిక్కడ ప్రశాంతత లేదు. ఉండడం క్షేమంకాదు. పక్క పెట్టెలోకి వెళ్లబోతుండగా ట్రాన్సిస్టర్, బ్యాటరీలైటు, రగ్గు ఇచ్చివేసి శెలవు తీసుకుంటానంది, కనకం.

"ఏం తొందర. చివరలో ఇవ్వొచ్చు," అన్నాను.

"ఇవి నా దగ్గరుంటే నన్ను బ్రతకనియ్యరు."

"నిన్నెవరన్నారమ్మాయ్. పల్లెత్తుమాట అనలేదు. లోకంతీరు, ఫలానా అని చెప్పాను. అంతే. అవన్నీ ఉంచుగో—వూరేగు, మధ్య మాకేం ......"

నే నింక వినలేదు. అవి తీసుగుని నా పెట్టెలోకి వెళ్లాను. ఇందిర నిద్రపోతోంది. లేపి, కాఫీ ఇచ్చాను. కొల్లాన్ ఇవతల స్టేషన్ మయ్యనాడు విడిచింది రైలు. ఎత్తున, కొండలమీది నుంచి వెడుతోంది. పెద్ద పెద్ద కొండలు. కింద ఎంతో లోతుగా లోయలు, మధ్య కాలువలూ, కొండలమీద పచ్చటి చెట్లూ, మేఘాలు, తుంపర మంచుపొరలా శిఖరాలని కప్పుతున్నాయి. కొండ దిగువున చిన్న గుడిసెలు. తొంగిచూస్తే, కాలువ ఒడ్డున, పడవలో ఇద్దరు పిల్లలు ఆడుకొంటున్నారు—చల్లటి, పచ్చటినీడలు. సూర్యరశ్మి తడితడిగా పడుతోంది.

మయ్యనాడ్‌లో కాఫీ ఫలహారా లయ్యాయి. ఇరావిపురం అన్న చిన్న స్టేషన్ దగ్గర రైలు నిలిచిపోయింది. అక్కడ నుండి కొల్లాన్ వెళ్లే రైలుమార్గం, కొంతభాగం వర్షాలకి చెడిందిట. రిపేర్లు పూర్తవడానికి, రెండు మూడు గంటలు పట్టొచ్చుట. అందుచేత, మా టూరిస్టు పెట్టెల్ని, సైడింగులో మూడు ఫర్లాంగుల దిగువలో విడిచేసింది ఇంజిన్. అందరం బైటకొచ్చాం. గుంపులు గుంపులుగా చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు టిఫిన్ తింటున్నారు. జాలయ్య, శంకరం చదరంగం మొదలెట్టారు. చెట్టుకింద చల్లటి రాళ్లమీద కండువా పరచి, ఒక బృందం పేకాట మొదలెట్టింది. 'రవి' ఫస్ట్‌క్లాస్ పెట్టెలో చేరి రేడియో పెటుగున్నాడు. విఠలయ్య టీ పెడుతున్నాడు. ఇందిర కాసేపు పచార్లుచేసి. బండిలోకెళ్లి పడుకుంది. హేమలత వీణని ఆడిస్తోంది. దూరంగా సైడింగు దిగువలో ఒక ట్రాలీ ఉంది. అక్కడి

కెళ్లి కూర్చుంది కనకం. నేను, నాగభూషణం, జోగారావు బుడ్లున్న బాగ్ తీసుకుని దూరంగా నడిచి వెళ్లాం. ఐదు దాటింది. సూర్యుడు కొండ వెనక ఆకులమధ్య కన్ను గీటుతున్నాడు. బుడ్డి పైకి తీశాం. అక్కడ కనకం, ట్రాలీ కుర్రాడితో ఘర్షణ పడుతోంది. ఆమె చెప్పేది వాడికి తెలియదు. వాడనేది ఆమెకి అర్థం కావడంలా.

వాడేదో మేకుతో కదిల్చాడు. ట్రాలీ కదిలింది. వెడుతోంది పల్లంలోకి. ట్రాలీ కుర్రాడు నవ్వుతున్నాడు. పరుగెత్తి ఆపుచేసి, దిగమని సంజ్ఞ చేశాడు. ఆమె దిగి ట్రాలీ పైకి తోస్తోంది. 'రమ్మని' కేక పెట్టింది. బుడ్డి మూసేసి, బాగ్‌లో పెట్టి ముగ్గురం అక్కడికి వెళ్లాము. ట్రాలీ దిగమన్నాడు కుర్రాడు. కాసేపు అల్లా అందులో షికారు తిరుగుదాం అంటుంది కనకం. కుర్రాడిచేతిలో డబ్బుపెట్టాం. నవ్వుతూ ఎక్కమన్నాడు. మేం ముగ్గురం ఎక్కాం. కనకం ముందుగా కూర్చుంది. కుర్రాడు ట్రాలీని ఒక్కగెంటుగెంటి, వెనకాల ఎక్కి, పదం పాడుతున్నాడు. పట్టాలు కొండదిగువకేసివున్నాయి. దూరంగా ఒంకరలుతిరిగి, మధ్యలో మాయమైనాయి. అక్కడ నుండి, ఇసుక, రాళ్లు తెచ్చేటందుకు ఆ చిన్నట్రాలీలైన్ వేశారట. జోరుగా నాలుగుఫర్లాంగులు దిగింది. అక్కడ చదునైన నేలమీద నిలిపాడు కుర్రాడు. బుడ్లుతీశాం. అందరం తలోకాస్త పుచ్చుగున్నాం.

"కాస్తపుచ్చుగో," అన్నాడు జోగారావు కనకంతో.

"ఇంకానయం. అంత చెడిపోలేదులెండి," అంది కోపంగా.

"మేమంతా చెడిపోయినట్లా ! ఏదో సర్దాకి—" అన్నాడు జోగారావు.

"డాక్టరుగారుండే ఒప్పుగున్నారా ?"

"ఇదొక మందులాంటిది. అప్పుడప్పుడు, నలుగురూ చేరినప్పుడు, కులాసాగా వుండాలిమరి."

"పండగపూట పాతపెళ్లామేనా అంటారు," అని నవ్వింది.

"పాత మొగుడేనా అనిసామెత." అన్నాను.

"అదితప్పు. కొత్తదనం కావల్సిన వాళ్లుమొగాళ్లు."

"ఆడదిలేందే మొగాడూలేడు గనక, ఇద్దరికీ సరిపోతుందిలే," అన్నాడు జోగారావు.

"కాస్త.... ఏది ?"

"ఛ, ఛ నాకొద్దుబాబు. మళ్ళా వెనక్కి వెళ్ళాలంటారా. రండి పొద్దుపోతోంది," అంది. ట్రాలీలోకెక్కాం. కుర్రాడు తోస్తున్నాడు. రెండు ఫర్లాంగులొచ్చాం. చీకటి పడుతోంది. పక్షులు గూళ్లల్లోచేరి కొటాడుకుంటున్నాయి. ఏవేవో జంతువుల వింత అరుపులు—కీచురాళ్లశ్రుతి. కుర్రాడు ఫర్లాంగుతోసి నిలిచిపొయ్యాడు. వాడికాయాసంగావుంది. తోసే వాళ్లని తీసుకొస్తానని వెళ్లాడు.

"నడిచిపోదాం" అన్నాడు నాగభూషణం.

"పోనీ మనమే తోద్దాం పట్టండి" అన్నాను.

జోగారావు దిగాడు. ఏంజరిగిందో తెలియదు. చక్రం వెనకపెట్టినరాయి కదిలిందో, మరేం జరిగిందో, ట్రాలీ క్రిందికి నడవడం మొదలెట్టి, క్షణంలో వేగంగా కదిలిపోతూంది. దాన్ని నిలపలేము. ఇంకా, ఇంకాకిందికి జోరుగా వెళ్లిపోతూంది. ఇందాక ఆగిన చదును నేలదాటింది. మరో మళుపుతిరిగి, మరీ దిగువున, అతివేగంగా వెడుతూంది. నాకు చాలా థ్రిల్లింగ్‌గా కనబడ్డా, లోపల ఏదోభయం. గట్టిగా ట్రాలీపట్టీలు పట్టుగున్నాం. మళుపులో చదునునేల కనబడుతోంది. ఎట్లా ఆపడం? దూకి ముందుకెళ్లి నిలపాలి, వేగంతగ్గాక. దానికి సిద్ధమవుతుండగా, ట్రాలీ ఒక చక్రంవూడి ముందికిపడి దభాలున నిల్చిపోయింది. తుళ్లిపడి, కిందికిదిగి ఒళ్లు దులుపుకున్నాం. ఏమీ ప్రమాదం జరగలేదు. ఎవ్వరికీ గాయం తగల్లేదు. బాగా చీకటిగావుంది. నట్టడివి. పట్టాలమ్మటే నడిచివెళ్లాలి.

"ఆయాసంగావుంది. కాసేపు కూర్చుందాం," అంది కనకం. సరేనన్నాను. నాగభూషణం బుడ్డీతీసి కాస్త పుచ్చుగుని, నాకుకాస్త ఇచ్చాడు. ఆ బుడ్డీ ఖాళీఅయింది. ఖాళీబుడ్డీ వాసనచూసి దూరంగా గిరవాటెట్టింది కనకం. అదిపగిలినచప్పుడు, కీటకాల చప్పుడులో కలిసిపోయింది. అరగంటైంది. ఇంకా నడుద్దాం అన్నాను. పట్టాలమ్మటే నడుచుకుంటూ వెళ్లాం. మెరక. ఆయాసంగావుంది. అటూ ఇటూ రాళ్లు, పొదలు. పట్టాలుమధ్యనే అడుగుతీసి అడుగేస్తున్నాం. మరోఫర్లాంగు వెళ్లాం. కనకం చతికిలపడింది. "ఇంక నేరాలేను."

"రాత్రంతా ఈ అడవిలో గడుపుతావా ?" అన్నాను.

మళ్లాలేచింది. మరో అరఫర్లాంగు వెళ్లాక కూర్చున్నాము. ఏడుదాటింది. దాహంగావుంది. ఎక్కడో ఇందాక కాలవచూశాము. ఎక్కడ ? జ్ఞప్తికిరావడంలేదు. ఏమీ కనబడడం లేదు. చదును ప్రాంతం చేరుకున్నాము. అక్కడ దూరదూరంగా వున్నాయి, చెట్లు, రాళ్లు, పొదలు. అక్కడకూర్చున్నాము. ఎనిమిదైంది. జోగారావు కలిసాడు. జరిగిందంతా అతనికి చెప్పాము.

"మనం వెళ్లకపోతే, రైలు వెళ్లిపోతుందేమో"అన్నాడు.

"ఇంతవరకూ వుంటుందీ ? ఈ పాటికి వెళ్లేవుంటుంది" అంది కనకం, ఒగర్పు ఆపుగుని. పట్టామీద కొప్పు ఆనింది. నేలమీద కాళ్లుచాచి పడుకుంది.

"నేనింక నడవలేను. చస్తే ఇక్కడే చస్తాను. మావుయ్యాకి మళ్లే స్వర్గానికెడతాను."

"స్వర్గాని కెడతానన్న ధీమా నీకెందుకుండాలి. ధనం జయం అంటె పుణ్యాత్ముడు." అన్నాడు నాగభూషణం.

"నేను పాపాత్మురాలినేలెండి. అందుకే స్వర్గానికెళ్లే చాన్సుంది. దేవుడికి పాపులంటెనే ఇష్టంటగా !"

ఏదో వోపిగలేని నవ్వు,

"ఎక్కడేనా నీళ్లు దొరుకుతాయేమో చూద్దాం పదండి," అన్నాడు నాగభూషణం.

"ఈ ప్రాంతంలో ఏదోఒక పాకచూసినట్లు గుర్తు. చూద్దాం పదండి," అని జోగారావు, నాగభూషణం బైలుదేరారు. చెయ్యి పుచ్చుకుని కనకాన్ని లేవదీశాను. మెల్లిగా నడవడం ప్రారంభించింది. వాళ్లు ముందు, మేం వెనకాల. అర ఫర్లాంగు నడిచాం. నాకాళ్లు తడబడుతున్నాయి. వస్తువులు సరిగ్గా కనబడ్డంలేదు. తల తిరుగుతోంది. ఆమె భుజంమీద చెయ్యివేసి అడుగులు వేస్తున్నాను. చతికిల పడిపొయ్యాను. జోగారావుని కేకేసాను. వాళ్లు ఎటు పొయ్యారో కనబడ్డంలేదు. పక్కన రాయిమీద తలెట్టుగుని పరుంది కనకం. ఎంతసేపైందో తెలీదు. నే కళ్లు తెరిచేటప్పటికి నా తల కనకం తొడపై ఉంది.

"ఆయాసం తీరిందా. లేవండి. ఆ మైకం తాగడం బట్టి" "నేనేం చేస్తున్నానో నాకు తెలియడంలేదు. ఆమె నడుం గట్టిగా పట్టుగుని వక్షంపైకి ఎగబాకుతున్నాను. ఆమె లేచి చెయ్యి తీసుకుని లేవదీసింది. లేవతియ్యలేక రొప్పుతోంది. వెడుతోంది. 'ఉండు.' నిలబడు అని కేకలేస్తూ నడుస్తున్నాను. చాలా దూరం నడిచాము. జోగారావు, నాగభూషణం పిచ్చారు కేకలేస్తూ. అక్కడ ఒక గుడిసె ఉందిట. అక్కడ నీళ్లున్నాయిట. వెడదాం రండి అన్నారు.

"ఎంత దూరం ?"

"రెండు మూడు ఫర్లాంగులు."

నడుస్తున్నాం. కాస్సేపు జోగారావు, కాస్సేపు నాగభూషణం నన్ను పట్టుగుంటూ గుడిసె దగ్గరకి చేరుకున్నాం. అక్కడ ఎవరో ముసిలాడున్నాడు. చీకటి. ఇలాయిబుడ్డి వెలుగు. నీళ్లు త్రాగారు కనకం, జోగారావు. మిగిలిన కాసినీ నేను త్రాగాను. గుడిసె ముందు పాక. దానిలో గడ్డి గుట్టలు. బ్యాగ్‌లో సీసా తీసి, గబగబ త్రాగేశాను. గడ్డిలో పడిపొయ్యాను. మిగిలింది నాగభూషణం త్రాగేశాడు. సీసా అవతల పారేసింది. కనకం.

"ఏమిటి ఇల్లా పడుకుంటే ఎట్లా ?" అన్నాడు జోగారావు. ఎవ్వరూ సమాధానం చెప్పరు. పది దాటింది. కళ్లు మూశాను. ఇంకేమీ గుర్తులేదు. కదిలి కళ్లు తెరిచాను.

"ఎంతైంది ?"

సమాధానం లేదు. వాచ్ చూస్తే కనబడ్డంలేదు. కనకం లేచొచ్చి వాచ్ చూసి, 'పన్నెండు' అని, వెళ్లి పడుకుంది నాగభూషణం పక్కన గడ్డిలో.

ఇక్కడికి రాదేం ? నాగభూషణం చెయ్యి ఆమెమీద పడుతోంది. కళ్లు పెద్దవిచేసి చూశాను. ఆమెను గట్టిగా పట్టుగున్నాడు.

"తాగుమోతు సరసాలు," అని విదిలించుగుని పాకవతల గడ్డి లొక్కుని పడుకుంది. వెళ్లి ఆమె ప్రక్కనే పడుకున్నాను.

"తలపడతావా ?"

నుదురు నొక్కుతూంది. హాయిగా ఉంది. అరచెయ్యి మొహం అంతటా రాసుకున్నాను. జడలో చెయ్యి పెట్టాను. వూడి నా మొహాన పడింది. అందులోంచి ఆకాశం కనబడుతోంది. నక్షత్రాలు మెరుస్తున్నాయి. వక్షంమీద తల ఆనించాను. తొలిగింది.

"నువ్వంటే ఇష్టం" అన్నాను.

"తాగున్నారు. నేనంటే కాదు. ఆడది కావాలి. ఎవరో ఒకరు. ఇందిరగారితో చెప్పేదా !" తర్వాత ఏమందో, ఏం జరిగిందో జ్ఞప్తిలేదు. ఎవరో తట్టి లేపుతున్నారు. కనకం అనుకున్నాను. కాదు. ట్రాలీ కుర్రాడు. పక్కన మరో ఇద్దరు మనుషులు. ట్రాలీవాళ్లు. జోగారావు లేచాడు. నాగభూషణం లేచాడు. కనకం పాకలో లేదు. గుడిసెలో మూలగా ముసిలాడి పక్కన చాపమీద పడుకునుంది. లేపాం. నడిచి ట్రాలీ దగ్గరికి చేరుకున్నాం. ట్రాలీ చక్రం బిగించి తెచ్చారు. అందులో ఎక్కాం. స్టేషన్‌కి చేరేటప్పటికి ఆరైంది. ఏడింటికి రైలుట. స్టేషన్‌లో కాఫీ త్రాగాం. కొల్లాన్ చేరేటప్పటికి ఏడున్నరైంది. మా పెట్టెలు సైడింగులో సిద్ధంగా ఉన్నాయి.

* * * *

తిరుగు ప్రయాణంలో కనకం మా పెట్టెలో ఉండక తప్పింది కాదు. ఆ పెట్టెలో వారు మధ్య మధ్య ఇందులోకొచ్చి దర్శనమిచ్చే అవకాశమూ లేదు. వారంతా ఊటీ, బెంగుళూరు, నాసిక్ వరకూ ప్రయాణం పెట్టుగున్నారుట. అందుచేత వాళ్ల క్యారేజి విడిపోయింది. మేం మదరాసులో ఒకరోజు ఆగాల్సి వచ్చింది. కాని ఎవ్వరికీ వూళ్లు తిరిగి వినోదించే వోపిక లేదు.

"ఏం శ్యామలరావు, అల్లా సినిమాకి వెళ్లొద్దామా ?" అన్నాడు రాఘవయ్య. శ్యామల తనూ వొస్తాననంది. సుందరం ఎక్కడికీ వెళ్లొద్దు, ఐన ఖర్చులు చాలు అని కసిరింది. రక్షిత లాల్ వొంట్లో బాగాలేదు. రాజీబాయి సపర్యలు చేస్తోంది. లక్ష్మణమూర్తి తను కొత్తగా కూర్చిన గేయాలు పత్రికల వాళ్లకి ఇచ్చి వస్తానని వెళ్లాడు. చౌదరి, రిటైరైన వాళ్లని మళ్లా పనిలోకి తీసుగునే కొత్త రూల్సు ఏమన్నా ఉన్నాయేమో తెలుసుగుని వొస్తానని వెళ్లాడు.

చెట్టిగారు, భార్య చిట్టెమ్మ, చెల్లాయి పెండ్లిసంబంధం చూసొస్తామని వెళ్లారు. నాగభూషణం, భార్య హాయిగా

రెన్నా తీసుకుంటామన్నారు. జాలయ్య మార్కెట్టుకి వెళ్ళి, పర్సు పోగొట్టుకుని, తిరిగొచ్చి దిగులుగా కూర్చున్నాడు. జోగారావు, పద్మనాభం, శంకరం పేక ముందేసుగుని, నాలుగో చెయ్యిగా విఠలయ్యని రమ్మని అడుగుతున్నారు. కనకం నిద్ర పోయింది—చెవులకి పెద్దగా వ్రేలాడే కమ్మలు తగిలించుకుని. మర్నాడు రైలు బైలుదేరింది. ఇంక మరో గంటలో బైలు దేరిన చోటుకి చేరుతుంది. మా యాత్ర అంతటితో ముగిం పవుతుంది. ఐదైంది. ఆ స్టేషన్‌లో టిఫిన్ తిని, కాఫీ త్రాగాను. ప్రయాణం ఖర్చు వ్రాసుకుంటున్నాను. రైలు కదిలింది. కునుకొచ్చి, కళ్ళు మూశాను. ఎవరో బుజంతట్టి లేపారు. చూస్తినికదా కనకం. వెనక్కి జరిగి, కూర్చో మన్నాను.

"ఏం— విశేషం ?"

"కృష్ణమూర్తిగారు అడ్రెస్ ఇచ్చారు. ఈ పాతిక మని యార్డర్ వ్రాసిపెడతారా ?" అంది.

"అప్పుగా తీసుకున్నావా ?"

"ఏదైతే ఏం లెండి."

"నువ్వు తిరిగి రొక్కంగా ఇవ్వడం విశేషమే."

"ఇంకెల్లాగిస్తారు ?"

"ఇచ్చినవారు డబ్బు రూపేణ ప్రతిఫలం కోరరుగా" అన్నాను.

"మీ తికమకలు నా కర్థంకావులెండి. నూటిగా అడగ రాదు. నా సావాసంవల్ల మీ రందరూ పాడయ్యారు. నేన దివ్వ డానికి సిద్ధంగా ఉన్నానని తెలిసి అది అడగడం బాగుండదని మానేసిన మర్యాదస్తులు. డబ్బు తీసుగుంటే అదివ్వాలని తీసుకోడం మానేసి, నేనూ మీవల్ల పాడయ్యాను."

ఇదంతా నాకు తికమకగానే తోచింది. ఆమె కళ్లల్లో ఒక వెలుగు, దైన్యం రేఖ మెరుస్తోంది. ఉప్పునీటి స్నానాలకి మొహం బాగా కడగబడి, పవిత్రమైనట్లుంది చర్మం.

"నాకో సందేహం—చాలారోజుల్నుంచి. అడిగెయ్యనా ?" అన్నాను.

"దాచకండి. అనుమానం ప్రాణసంకటం, అన్నారు."

"నువ్వింతమందిని చూశావుకదా—"

"అంటె."

"ఇప్పుడు కాదులే—వెనక. అన్ని రకాలవారిని చూశావు కదా—పోనీ, ఇప్పు డనుకో—నీ వూహలో నిజంగా, నీకు నచ్చి, మన్ను మసపారా ప్రేమించి, వాంఛించి, ఎప్పుడూ వారితోనే ఉండిపోవాలి — మరొకరి సంపర్కం లేకుండా — వాళ్ల ఒక్కళ్లతోటే, ఎల్లప్పుడూ బంధం ఏర్పరచుకుని గడపాలి— అనే వ్యక్తిని ఎరుగుదువా ?" అన్నాను.

"నూటిగా అడగలేరూ ? పెళ్లి చేసుకునేందుకు తగిన మొగాడు దొరికాడా అనా ?" అంది.

"అంతేకాదు. పెండ్లయినా, కాకపోయినా, నే నితన్ని ప్రేమించాను, ఇతనే ఆదర్శపురుషుడు. ఇతనిలో ఐక్యమై పోతాను—అంత గాఢంగా వాంఛించిన వ్యక్తిని ఎరుగుదువా అని ప్రశ్న" అన్నాను.

"ఓ, ఎరుగుదును."

"ఎవరు ?"

"భగవంతుడు" అంది క్రమమైన పళ్లవరస కన పరుస్తూ. ఆ క్షణంలో నే నామెని ద్వేషించలేదు. ప్రేమించా నేమో కూడా !

*　　*　　*　　*

యాత్రకి వెడుతున్న కొందరి మిత్రులను, ప్రయాణం విశేషాలు, వారివారి అనుభవాలు, వింతలు, ఆయా ప్రాంతాల నుండి వ్రాయమని కోరాను. కొందరు వ్రాశారు. మరి కొందరు యాత్ర నుండి తిరిగొచ్చాక స్వయంగా చెప్పారు. ఇవన్నీ గుచ్చెత్తి, వారి భాషలో బూతునీ, పచ్చిగా చెప్పిన వాటినీ, అతిశయోక్తితో ప్రకటించిన మానసిక స్థితినీ విడి చేసి, శైలిని మార్చి చిత్రిక పట్టగా ఏర్పడిన రచన ఇది. కథకి ముగింపు ముఖ్యమంటారు. దీనికి మనస్సులో నిల్చిపోయే ముగింపు లేదు. ధనంజయంగారి ఆస్తిలో కొంతభాగం వారి కొడుకులు కనకానికి వ్రాసి ఇచ్చిన ఉదంతం జరిగిఉంటే కథకి మంచి ముగింపు సమకూరేది. వారి కొడుకులు అల్లా చేసినట్లు వినలేదు. చిత్రకారుడు రామనాథం శ్యామలని వివాహమాడినట్లూ వినలేదు. కాని, పెళ్లిమాటలు సాగుతున్నా యట. కొంత మెరుగు. కథంతా చదువుకుని, దీనిలో నిగూఢ మైన వ్యాఖ్యానం, ప్రయోజనం ఏమన్నా ఉన్నాయా అను కుంటే, శ్యామలరావు చివర చెప్పినదాంట్లో, చివరి వాక్యాల్లో ఇమిడిఉన్నది మినహాయిస్తే, నా కింకేమీ కనబడలేదు. ఇంత కథా చదివి, ఆ కాస్త వ్యాఖ్యానంతో పాఠకుడు తృప్తిపడితే ఈ రచన వృథా అనుకోను.

సంగీతకళ: నేటి స్థితి

శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావు

రేడియో, గ్రామఫోను, సంగీతాన్ని మారుమూలలకు వ్యాపింపజేసినవి. మూడు నిముసములలో మహావిద్వాంసుల గానం వినడం సాధ్యమా ? అని గ్రామఫోను రికార్డులను త్రోసిపుచ్చ నవసరములేదు. అరగంటసేపు పాటను వినిపించే (Long Playing) రికార్డులు, గంటన్నరదాకా వినిపించే (Tape recorders) వచ్చాయి. నాలుగు గంటల కచ్చేరీని నాలుగు టేపులలో రికార్డు చేయవచ్చును. ఇవి కేవలము ఆలిండియా రేడియో లాంటి సంస్థలలో మాత్రమే కాక, ప్రతివారి ఇంటనూ చూడవచ్చును. సంగీతమును ఇంతసేపు వినిపింపచేయు సాధనలు మును లేవు. అందుకని వీటి మూలాన వెనుక మహారాజు లనుభవించిన సంగీత కచ్చేరీలు నేడు మారుమూలలందున్న సామాన్య ప్రజలు సులభముగా వినగలుగుచున్నారు. ఇన్ని సౌకర్యములున్నా ప్రయోజనము ఏమి ? మహాగాయకులు అరుదయి పోవుచున్నారు. మునుపటి ఘనత, గాంభీర్యము, ఉదాత్తత, సంప్రదాయము, గొప్ప మనోభావము నేటి గానములో చాల అరుదయిపోవుచున్నవి. రానురాను శాస్త్రీయ సంగీతమునకు తిరని క్షామ మేర్పడు నన్న శంక, రుజువగుచున్నది. శాస్త్రీయ సంగీతమునకు మంచి రోజులు రాగలవా అన్న ప్రశ్నను హితైషులు విచార భావముతో అడుగు దురవస్థ వచ్చినది. "రానురాను మహా గాయకుణ్ణి చరిత్రలోనే తప్ప మన తోటి గాయకులలో చూడగలమా"—అని కొందరు రసికులు మదరాసులోనూ, ఢిల్లీలోనూ అనుకొనుట నేను, చెవులార విన్నాను.

"It Cannot be denied that, inspite of all that modern exponents of music might claim, the age of giants is over. We have no more of the old giants and ustads."

అని సంగీత ప్రపంచముతో సాన్నిహిత్యమున్న ఒక రసికుడు వాపోయాడు. హిందుస్థానీ, దాక్షిణాత్య సంగీతములు వ్యాప్తిలోనున్న రెండు ప్రాంతాలవారూ ఇలా సామాన్యంగా అనుకుంటూ ఉండడం సహజమయినది. ఇది నిజమా? అట్టి దుస్థితిని తొలగించుటకు మార్గము లున్నవా ? పాశ్చాత్య దేశమందు కూడ సంగీత రచనా నిర్మాతలను గురించి ఇంచుమించు ఇట్టి అభిప్రాయము ప్రబలియుండుట గమనించ తగినది. ఆ దేశముల గాయకులను గురించి అట్టి అభిప్రాయము రాలేదు.

"ఇదొక పూర్వపక్ష మీమాంస ! ఇది ప్రతివారు తమ మునుపటివారినే పొగడి ఇప్పటివారు పనికిమాలిన వారనుకోవడం, నైజంలోని ఒక దుర్లక్షణం. కాళిదాసు కాలంనుండి ఇట్టివా రుండనే ఉన్నారు. నా చిన్న వయస్సులో సంగీతమును విన్నది జ్ఞాపకం చేసుకుంటే—ఆనాటి సంగీతము బహు సామాన్యంగా ఉండినదనే చెప్పగలను. ఆకాలపు విద్వాంసులంతా నలుగు రయిదుగురే. ఎక్కువ గమకము లుండేవికావు. మొత్తం నాలుగయిదు కీర్తనలు బాగా పాడేవారు. ప్రసిద్ధ రాగములే తప్ప అల్పమయిన, అపురూపములయిన రాగాలను అసలు పాడుటే అరుదు. అందచందములమాట కొస్తే ఆనాటి సంగీతము మోటా అనే చెప్పవచ్చును. సంవత్సరానికి ఏ రెండు మూడు పర్యాయములో సంగీతకచ్చేరి వినగలిగే వారము కాబట్టి ఏది పాడినా అతిశయముగా వినపడేది. నేటి తాళపు గడబిడలు, కర్త్రాగముల విస్తరణ, కొత్త కీర్తనల ప్రచారము, నాడు చాల అరుదు. సంగీత కచ్చేరికి వందలు వేలుగా జనము రావడ మెక్కడిది ? రాగాలాపనలు హార్మోనియంమీద వాయించినట్లుండేవి. ఇక జావళీలు, పదాలు నాట్య ప్రదర్శనలందే కాని విద్వాంసులు పాడేవారు కారు. వాద్యము లందు కూడ నేటి నిపుణత అరుదు. వాద్యములను వాయించే వారి సంఖ్య కూడ చాల తక్కువ." అని మరికొందరు అభిప్రాయపడుతూండటం కూడ వినియుండవచ్చును. ఈ రెండు భిన్నాభిప్రాయములందునూ కొంత సత్యమున్నదని పరిశీలించినవారికి కనుపడవచ్చును. విఖ్యాతి గాంచిన గాయకులు, ఉస్తాద్ ఫైయాజ్ ఖాన్, టైగర్ వరదాచార్యులు, ఫిడేల్ గోవిందస్వామిపిళ్లె, మృదంగం దక్షిణామూర్తి పిళ్లె, వీణ సంగమేశ్వరశాస్త్రి, శేషణ్ణ, వెంకటరమణదాసు మొదలగువారి శ్రేణికి చెందునట్టి విద్వాంసులు అరుదన్నమాట వాస్తవము. వీణ ధనమ్మపదములు ఇంక వినే అవకాశములేదు అన్నమాట వాస్తవమే. కాని వారి తరువాతకూడ ప్రథమశ్రేణికి చెందిన గాయకోత్తములు సంగీతమును తమ కౌశల్య ప్రదర్శనకే గాక, ఒక ఉపాసనావిద్యగ చేకొని సంప్రదాయమును ఎదుట నిలబెట్టిన ధీరులు ఎందరయిన కలరు. అట్టివారిలో కొందరు అరియకుడి రామానుజ అయ్యంగార్లు, మహారాజపురం విశ్వనాథయ్యరు, ఇటీవల గతించిన పల్లడం సంజీవరావు, వాద్య విద్వాంసులలో ద్వారం వెంకటస్వామినాయుడుగారు, పాలఘాటు మణి అయ్యరు, ఫ్లూట్ మహాలింగం, సెమ్మంగుడి శ్రీనివాసయ్యరు, జి. ఎన్. బాలసుబ్రహ్మణ్యయ్యరు, మధురమణి అయ్యరు—తదితరులు. కాని, రెండవశ్రేణి గాయకులు, వాద్యములను వాయించు విద్వాంసులు అట్టి అధిక్యార్హతలను పొందకల్గియున్నారా ? వీరిలో మునుపటి గాయకుల శక్తి సామర్థ్యములు అసలు లేవా ? ఈ గాయకులకు తమ యోగ్య

తను పెంపుచేసికొను ఆసక్తి లేదా ? వీరి సంగీత విద్యార్జనలో లోపాలున్నవా ? వీరికి కచ్చేరిలు చేయు అవకాశాలున్నవా ? ప్రజా హృదయాన్ని ఆకర్షించు మోహనకరమయిన నాద సంపద స్వాధీనము చేసుకోగల్గినారా ? వీరిమూలాన వేలకొలది సంవత్సరాలుగా కాపాడబడుచూ వచ్చిన సంప్రదాయము కృశించక, నశించక తమ తరువాతి తరమువారికి అందజేయబడుచున్నదా ? వీరు సరియయిన గాన ప్రదర్శనలు చేసి గౌరవముగా జీవించగల్గుచున్నారా ? వీరి కొరత లేవి? ఇట్టి జిజ్ఞాస అవసరము.

ఇట్టి జిజ్ఞాసను సక్రమంగా కొనసాగించుటకు మునుపటి సంగీతము ఉత్కృష్టముగా నుండుటకు కారణములేమిటి అన్న సంగతులు ప్రజ లందరికీ బాగా తెలియవలయును. పదేపదే ఆదర్శనీయములగు కచ్చేరీలను విని గానరసమును స్వయంగా ఆస్వాదించి తన్మయత్వమును పొందగల అనుభవము గడించుకోవలయును. అట్టి ఆసక్తి గలవారు కీ. శే. టి. వి. సుబ్బారావుగారు రచించిన "Studies in Music" అను గ్రంథాన్ని, ముఖ్యంగా "The seven lamps of Sangita" అను వ్యాసాన్ని శ్రద్ధగా చదువవలయునని నా మనవి.

సంగీతమునకు ఏడు అంశములు చాల ముఖ్యమయినవి— శృతి శుద్ధత, రసప్రధానము, లయ శుద్ధము, సాహిత్య శుద్ధము, గమకాలంకార శోభితము, ఆనందమయత్వము. అన్నిటికంటె ముఖ్యమయినది శృతిశుద్ధత. 'శృతిలేని పాట, స్మృతిలేని మాట' అన్నారు. శారీర సాధనను ఎంత దీక్షతో కొనసాగించిన అంతకంతకు శృతి శుద్ధము చేకూరును. త్రిస్థాయిలందు 'అ' కార శుద్ధముగా, నాభినుండి నిండుగా పండుగా నిలకడగా స్వరములను తంబూరతోటి లయింపచేయునది శ్రేష్ఠమయిన గానము. ఇది మన సీమను వదలిపోయినదేమో ! హిందుస్థానీ గాయకులం దీ పరిపక్వమయిన నాదము తరచుగా ఎక్కువగా వినగల్గుచున్నాము. కమాను వేయగానే ఒక హాయినిచ్చు నాదమును నాయుడుగారు రోజూ గంటలతరబడి సాధనచేసి, స్వరస్థానములను ధ్యానించి—కైవశము చేసుకున్నారు. మణి అయ్యరు మృదంగపు నాదము, మహాలింగము వేణునాదము అట్టి పక్వమును చెవికి తేగలవు. పాశ్చాత్య సంగీత విద్వాంసులలో ఈ పరిపక్వమయిన నాదమును తప్పనిసరిగా వినవచ్చును. 'ధ్యానము' అన్నది తంబూర వేసుకొని గంటలతరబడి షడ్జ, పంచమ, మధ్యమ స్వరాలను పాడుకొనుటయే. స్వరావళులను శుద్ధముగా మూడు స్థాయిలందు శృతి విడువక జారుతో గమకముతో పాడి సంగతులను శృతిలో అమరి ఇమిడిపోవునట్లు పాడగల్గిన శారీర సాధన, వాద్యములపై స్వాధీనత తప్పనిసరి యన్న అంశమును హిందుస్థానీ సంగీత విద్వాంసులలో బాగా చూడవచ్చును. నోటి పాటకు అనువుగా ప్రక్కన వాయించిన చాలునని వయొలిన్ ద్వాంసులు తృప్తిపడరాదు. ఆ వాద్యమునకు సహజమయిన వినాదము ఎట్టిది? ఎన్నివిధములయిన కమాను లున్నవి? మూడు నాల్గు స్థాయిలలో వివిధ మాధుర్యముల నిచ్చునట్లు ప్రేళ్లాడునా ? వీణకు ఎన్నిరకములయిన 'మీటు' లున్నవి? వేలకొలది సంవత్సరాలలో మన పూర్వులు ఏర్పరచిన వాద్యవిధాన సూత్రము లేవి ? అట్లే మృదంగము అనుసరికి రానురాను లెక్కలను పెంచి, కర కర ఢమఢమ ధ్వనులతో నాద కోలాహలంలో వినువారికి గారడీ మజా నిచ్చినన్నిరోజులు, ఆ వాద్యమునుండి వెడలు ప్రణవనాదము, ఆబాలగోపాలం విన్నంతనే ఆనందముగా చిందులు త్రొక్కు వరుసలు వీనులలకు అందవు. Tonal— Purity of quality) నాద పారిశుద్ధతను విశేషముగా అలవర్చుకొనుటకు రోజూ గంటలతరబడి సాధన తప్పనిసరిగా చేయవలసి యున్నది. కాని రసాస్వాదనపరులగు కొందరే ఇట్టి శాంతిరసమునకు వేచియుందురు. సామాన్యప్రజల కింతటి ఓపికలు లేవు. రివ్వుమని ఫిరుకాలు పాడుట, స్వర విస్తారంతో మృదంగపు జతుల నాధరముగా నడుపించుట, 'హాత్ హాత్త' ని నానాధ్వనులతో రెచ్చగొట్టినప్పుడు ప్రజలు నేడు తబ్బిబ్బులు పడి ఆనందపరవశులయిపోయి కరతాళధ్వనులు చేయుచున్నారు. కనుక కలకాలము నిలచు ఆత్మానందాన్ని చేకూర్చు నాదానికని పరిశ్రమ ఎందుకు ? అట్టి గానమును వినువారే లేరే ! విన్ననూ సరిగా ఆదరించరు కదా ? గంటల తరబడి సాధన చేసినగాని వీలుకాని సంగీతమును పాడుటకు గాయకులకు ఎట్టి ప్రోత్సాహము, తీరిక అవసరము ? ఈ విషయమువట్ల దక్షిణదేశ ప్రజలు గాయకులకు చేయవలసిన సహాయము ఇంకా ఎంతయిన కలదు. భూస్వాములు, వర్తకులు, ఇతర జనానీకము శాస్త్రీయ సంగీతాన్ని ఉచ్ఛ్రీతులలో పాడనిచ్చి, విని మనఃపూర్వకముగా ఆదరించు మంచి రోజులు వచ్చువరకు సంగీత గారడీ లెక్కువయి రానురాను అప్పటమయిన రాగసంపద సమసిపోవును. అప్పుడు చౌకబారు సినీమా సంగీతములోని లబ్బులన్నీ ఈ మేడలందే వినవలెనన్న అపోహ ప్రబలుతుంది. అది వినేవారు నేడు ఆలోచించవలసిన సమస్య. ఇట్టి' పరిస్థితి హిందుస్థానీ ప్రాంతములకు రాలేదు. అచ్చటి రసికులకు శాస్త్రోక్తమయిన రాగాలాపనయే వచ్చును. ఎంత విలంబమయినా సరే, ఎంత నిదానంగా పాడినా సరే రాగ విస్తారమును అనుక్షణము సంగతి సంగతిగా ఆస్వాదించి వింటారు. ఆ శ్రోతలకు ధృపద్, ఖ్యాల్, టుమ్రీ టప్పా మొదలగునవి ఏఏరీతులలో పాడవలయునో ఆ రీతులలో పాడించుకొని విను ఓపిక, రసజ్ఞత గలదు. మన దేశమునందు, రాగభావము, రాగ ఆలాపననుండి క్రమంగా తొలగిపోవుటకు మన శ్రోతల అభిరుచి కొంత కారణము. విలంబముగా మంద్ర మధ్యస్థాయిలలో సంప్రదాయముగా లభించిన స్వరూప వైశిష్ట్యత గల రాగాలను ఆలాపించిననే నిజమయిన సంగీతానుభవం, రసానుభవము కలుగును. ఇట్లు పాడువారే అరుదు. అంతకన్న వినువారు అరుదు. నేటి అలవాట్లు తొలగించి, హిందుస్థానీ గానములోవలె మన సంగీతమునందునూ విలంబకాలము, మంద్రస్థాయి సంచారము, శృతిశుద్ధత, రాగ స్వరూపములను స్ఫుటీకరించు గమకశుద్ధమయిన గానమును విని

సంగీతకళ : నేటి స్థితి

ఆనందించి ఆదరించు అలవాటు మన ప్రజలకు కలుగకున్న మేలిమియయిన అంశములు మన సంగీతమునుండి తొలగి పోవుట తథ్యము. అది మనకంటెదుట జరుగుచున్న తిరోగమనము. ఈ సమస్యను గురించి సుమారు నలభయి సంవత్సరములకు మునుపే కీ. శే. టైగర్ వరదాచార్యుల సోదరులు శ్రీ కె. వి. శ్రీనివాసయ్యగార్లు వారు గానభాస్కరములో ఇట్లు వ్రాసియున్నారు. "దాక్షిణాత్య రాగాలాపనము హిందుస్థానీ రాగాలాపనమునకు వ్యత్యాసమై యున్నది.

మరియును హిందుస్థానీ రాగాలాపనము పూర్వశాస్త్రోక్త రాగాలాపన పద్ధతి యనియును, అదియే మంచి త్రోవ యనియును తెలియుచున్నది. ఎట్లనిన పూర్వగ్రంథగత పద్ధతిలో రాగములలో ఆలప్తిగాని, ఆలాపనముగాని మంద్ర స్థాయి నుండియే ప్రారంభించి చేయదగినదని స్పష్టముగ తెలియుచున్నది.

హిందుస్థాని గవాయిలు రాగములను పాడునపుడు మధ్య షడ్జములో ప్రారంభించి మంద్రస్థాయి ప్రస్తారమును చేసుకొని వెనుక మధ్య స్థాయిలోను, అటువెనుక తారస్థాయిలోను క్రమముగ రాగ విస్తారము జేసి తరువాత మూర్ఛనా ప్రస్తారములచే (ఫిరుకాలచే) రాగమును మధ్యకాల త్రికాలముగ జేసి దిగి మధ్య షడ్జములో ముగించుచున్నారు. అందుచేత రాగములోని రక్తి చెడకుండ యున్నది. రాగములను పాడునప్పుడు సుమారు మధ్యస్థాయి పంచమములోనుండి తారస్థాయి పంచమమువరకు గలుగు రక్తి విశేషము మంద్రస్థాయిలోను మధ్యస్థాయి పూర్వ భాగములోను గలుగుటలేదు. (ఇది సహజమే). రాగవిస్తారమును చేయునపుడు మంద్రస్థాయి షడ్జములో నుండి అపన్యాస క్రమముగా ఆరోహించునప్పుడు (ఒక్కొక్క స్వరమునందు నిలకడ ప్రసరించుట) క్రమముగ రాగములోని రక్తి యధికమగు చున్నదను విషయము సర్వ జనానుభవ సమ్మతము. అట్లుండియు మన దక్షిణదేశములో గాయకులు రాగములను పాడునప్పుడు వానిని తారస్థాయి షడ్జములోనుండి ప్రారంభించి తారస్థాయి పంచమము వరకును విస్తరించి రాగమును ముగించునప్పుడు పాడదగినదియై యుండు మూర్ఛనా ప్రస్తారములను (ఫిరుకాలను) రాగ ప్రారంభములోనే పాడి రాగములో విరక్తిని ఒక నిముషము లోపల వ్యయముచేసి తదనంతరము కొండమీద నుండు బండ దొర్లిన చందంబున తటాలని మంద్రస్థాయికి దిగి అచట రక్తిరహితమైన సంచారములను చేయుచున్నారు. ఈ రాగ ప్రస్తార పద్ధతి అనుభవమునకును శాస్త్రమునకును విరోధమైనదియే యగును." అని.

రాగప్రధాన సంగీతమున్న సూక్తిని సరిగా పాటించుట లేదు. రాగానికి అందులోని స్వరాలను అతిక్రమించిన ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కలదు. ఆ స్వరూపాన్ని అందుకోగల ధీశాలురే రాగరసాన్ని సృష్టించగలరు. రసప్రధానముగా నుండుటకు స్వరూపజ్ఞానము గల రాగాలాపన తప్పనిసరి. అట్టి భావనాశక్తి లేని వారి ఆలాపన స్వరముల కూర్పుతో రసరహితమగును. రాగభావమును స్ఫుటీకరించి సర్వ లఘుపోషణను చేకూర్చు పంచరత్న స్వరాలు, వర్ణములందలి స్వరాలు సుబ్బరాయశాస్త్రి కీర్తనలబట్టి స్వరాలు ఆదర్శనీయములు.

ఈ సందర్భమునందు హిందుస్థానీ గానములోని నాద పుష్టి, రాగపోషణలతోబాటు వారి 'బోల్ తాన్' అను సంగతుల రీతులను మనం నెరవలు చేయునపుడు గమనించవలయును. కేవలము లయ విన్యాసాలను రాగమును పెంపొందించు తానాలను పల్లవిలో ఖ్యాల్‌లో వలె పాడిననూ—సాహిత్యార్థమును విశదీకరించి పెంపొందించి హృదయములను ఆకర్షింపచేయుచు భావయుక్తమయి, సులలితమయి, అందచందములను విరజిమ్ము—బోల్‌తాన్ టుమ్రీలలో వినవచ్చును. ఖ్యాల్, టుమ్రీలో తానములున్నా ఆ రెంటినీ భిన్నమార్గము లందు నడుపుదురు. అట్టిది మన ప్రాంతమునందు కీర్తనల నెరవలునందు గమనించవలసి యున్నది. పూర్వులు ఇట్లు గమనించినందున మంచి భక్తి, శృంగార రసములు, సంగీతముతో పెంపొందించబడిన సాహిత్యరస భావములను శ్రోతల కందజేసిరి. కేవలము తాత్కాలికముగా వింటున్నంతసేపు మాత్రము హాయి అనిపించు చిలిపిచేష్టలను మీరిన ఆత్మానందమును కలుగజేసిరి. ఇట్టి ఉత్కృష్టమయిన సంగీతమునకు— "శాంతములేక సౌఖ్యములేదు." అనుట తప్పదు.

ప్రసిద్ధ రాగములను బాగుగా పాడించుకొని వినగల్గు రసికత ప్రజలలో తగ్గినందువల్లనే రూపనామములు లేని Scales ప్రబలి అసలు రాగములను పారద్రోలుచున్నవి. గాన భాస్కరములోని మరికొన్ని సూక్తులు—"పల్లవి పాడవలసిన క్రమ మేదియని విచారింతము. భగవన్నామ ప్రబంధమయిన ఏొక పల్లవిని విరసములేని దిట్టమయిన విళంబ కాలమున నుంచుకొని రాగభావము చెడకుండను పదార్థభావము తొలగకుండను గానము చేయవలయును. సంగీతశాస్త్రములో దిట్టమయిన పరిచయము లేనివారికి పల్లవి పాడుట యసాధ్యమే యగును. సంగతులు కీర్తనపదములలోని సంగతుల ననుసరించినవియై యుండుటయే శాస్త్ర సమ్మతము. స్వరములను పాడునప్పుడు వర్ణాలంకారముల ననుసరించియే పాడవలయును. స్వరములలో రాగ కళలు నిబిడమై యుండవలయును. సంపూర్ణ రాగములలోను, వక్ర రాగములలోను, దేశ్య రాగములలోను, దాటుస్వర ప్రయోగములు విశేషముగ జేయగూడదు. ప్రయోగాంతరముల ననుసరించియే దాటు స్వరప్రయోగములను చేయవలయును. ఉదాహరణముగ : తోడి రాగములో గధమ—మనిద—దరినిద—దగరిని— అను దాటు ప్రయోగములచే రాగకళలు చెడవు. పసస—పగగ—రిదద—రినిమ—గరిద— మొదలగు ప్రయోగములలో రాగకళ లెంత మాత్రము గనుబడవు. ఇటులనే జాతి భేదములును, జంటలును వర్జింపదగినయవి. ఉ : సరిగ—రిగమ—గమప—గరిసనిద—రిసనిదప—సనిదపమ— మొదలగునవి. తద్ధిత్తకిట, ధిత్తకిట—తద్దిత్తకిట తదింగిణతోం— మొదలగు కొన్ని పింపుజాతుల ననుసరించిన "పరిస్సనిద—రిసనిధ—ధరి

స్వనిద—రిసనిదస"— మొదలగు స్వరములు సమూలముగ వర్జింపదగినవి. మురజాతి ననుసరించిన కళాహీనమైన స్వర సంపకములు గానయోగ్యంబులు కానేరవు. ప్రకృతము మన దేశములో దర్బారు, నాయకి, హుస్సేని, ఆహిరి, సైంధవి, కురంజి, నవరోజు, పంతువరాళి, వరాళి మొదలగు పూర్వ ప్రసిద్ధమైనవియును, జ్ఞానబలముచే మాత్రము పాడదగిన వియు నైన యనేక రాగము లెట్లు నశించినవో అట్లే పల్లవి పాడు పద్ధతియును నశించెను." అని.

రాగమును అనుస్వరములతో గమకాలంకార శోభితముగ పాడుటకు గురుముఖమునుండి అధ్యయనరీతిగా కొన్ని వందల కీర్తనలు పాఠంచేయడం తప్పదు. వర్ణములను, కీర్తనలను వాటి కర్తలు అందజేసిన రీతిగా ప్రౌఢముగా పాడవలయును. త్యాగయ్యగారి పెద్ద కీర్తనలు, దీక్షితులు, శ్యామశాస్త్రి కీర్తనలు దీక్షతో రూఢిచేసి వాటిని పాడు అధికారమును గడించి ప్రజలకు ఆకర్షణీయముగా అందజేయవలయును. పాశ్చాత్యులు కచ్చేరీలకు వెళ్లుటకు మునుపు Beethoven Moyart మొదలగు మహాపురుషుల సంగీత రచన లెట్టివి, వాటి సహజ గాంభీర్య స్వరూపము లేవి యని పరీక్షించి అవగాహనం చేసుకొని వెళ్లుతారు. కాబట్టి వాగ్గేయకారుల సంగీత రచనలను చెక్కుచెదరక సమర్పించు భారము తప్పనిసరి యగును.

మన ప్రాంతమునం దిట్టి విచక్షణవాలదు. హిందూస్థానీ రసికులలో ఇట్టి విభాగముకద్దు. ధృపద్ పాడేవారివద్ద ధృపద్‌లు, ఖ్యాల్ విద్వాంసులవద్ద ఖ్యాల్, టుమ్రీటప్పాలు పాడేవారివద్ద వాటినిమాత్ర మేవిని ఆనందిస్తారు. వాద్యములను వినేసందర్భములలో ఆ వాద్యములో ఏవి బాగుండునో వాటినే వాయించడం వినడం జరుగుతుంది. ఇక్కడ అట్టిది అరుదు. గాత్రము పాడేవారు ఏవైతే పాడతారో వర్ణం, కీర్తన, పల్లవి, తిల్లాన, పదం, జావళీలు అన్నిటినీ వాద్యములందు వాయిస్తారు. కొందరు శ్లోకాలనూ వాయిస్తామంటారు ! ఇదొక ప్రత్యేకత. కాని వాద్యములకయి ప్రత్యేకించిన సంగీతరచనలు ఇదివరకూ ఏర్పడలేదు. ఇట్టి నూతనమార్గములలో క్రొత్త రచనలకు అంతులేని అవకాశమున్నది. మన సంగీత కచ్చేరీలందు పదాలను పెద్దకీర్తనలను వారివారి శారీరమునకు తగినట్లు మార్చి చేర్చిపాడుటవలన సంగీతసంపదకు దాని భవిష్యత్తుకు, తీరని నష్టము చేకూరుచున్నది.

కర్నాటక సంగీతములోని మేల్మియయిన అంశములు ప్రజాదరణ లోపంవల్లను పాడువారి దీక్షాపటిమ సడలినందువల్లను అదృశ్యము లగుచున్నవి. రెండుమూడు సభలు వేరుగా ఏర్పడి తీరవలయును— London నగరంలోవలె. ప్రత్యేకించి నట్లు శాస్త్రీయ సంగీత కచ్చేరీలు మాత్రమే కొన్నింట; మరికొన్నిట లలిత సంగీత కచేరీలు జరుగవలయును. అట్లు జరుగక ఆ సభాసదులు ఈ సభాసదులు కలిసి ఒకేచోట రెండు సంగీతాలను వింటున్నందువల్ల ఉభయులకూ సరియయిన సంగీత విందులు లభించటంలేదు. పెద్ద యోగ్యతలుగల విద్వాంసులు చౌకబారుగా పాడజాలకున్న ఇప్పటి పరిస్థితిలో వారికి జీవనోపాధికూడ దుర్లభమగును. శ్రీ టైగర్ వరదాచార్యులు, వీణ సాంబశివయ్యరు, వీణ ధనమ్మ, మన హరి నాగభూషణం గారు— అందరూ ఇట్టి ప్రజానిరాదరణకు గురియయినవారే. ఇట్టిదుస్థితిని, నివారించుటకు మనశ్రోతలుకూడ హిందూస్థానీ సంగీతశ్రోతల అడుగుజాడలను అవలంబించుట మంచిది. ఉత్తరదేశములో సంగీత గోష్ఠులున్నవి. సుమారు మున్నూయి నలభయి ఆరితేరిన రసికులు గుమిగూడి వింటారు. పాడువారు తమశక్తిని పరిపూర్ణముగా చూపెట్టవచ్చును. అక్కడ రక్తి కని చిలిపిచేష్టలు చేయుట అనవసరము, వ్యర్థము. కచ్చేరి అంతములో అట్టి గాయకులకు వేయిరూపాయలు, లేక ఐదువందలు ఇవ్వడము జరుగుతుంది. ఆంధ్రదేశములో అట్టి Music Circles సంస్కారసంపన్నులు ఏర్పరచినగాని సంగీత విద్యకు గత్యంతరములేదు. సంగీత నాటక్ అకాడమీ వారు అక్కడక్కడ గానకచ్చేరీలు ఏర్పాట్లు చేయించి ప్రజలలో సంగీతమువినే అలవాటు అభివృద్ధి చేయవలయును. గాయకులకు సరియయిన ప్రోత్సాహము లభించుటకు ఇంకను రెండు తరాలు కావలయునేమో ! అట్టి సుసమయం ఏర్పడు లోపల మంచివన్నీ నశించి వట్టి గ్యాలరీ గడబిడలే దక్కకుండ పెద్ద పెద్ద దేవాలయములలో ఆలయాని కొక్క విద్వాంసుని ఆస్థాన విద్వాంసునిగా నియమించి, నెలకు మూడువందలో నాలుగువందలో ఇచ్చి అతని కొరతను తీర్చవలయును. అచ్చట గురుకుల వాసమేర్పరచి సంగీత విద్యాదానమునకు ఏర్పాట్లు చేయవలయును. అప్పుడు గాయకులకు సరియయిన వాతావరణం ఏర్పడుతుంది. మంచి సంగీతము విద్యార్థులకు నేర్పుటకు అవకాశముంటుంది. అది తప్పక చేయవలసిన ముఖ్యమయిన ఏర్పాటని నా విశ్వాసము. లేకున్న ఊరూరూ తిరిగి కచ్చేరీలుచేయు విద్వాంసులు, ఇంటింటికెళ్లి తమ ఊపిరినంతా వచ్చి రానివాళ్లకుచెప్పి తమకున్న విద్యను గోల్పోవడం జరుగుతూనే వుండును. రానురాను సంస్కారమున్నవారికి శాస్త్రీయ సంగీతమునకు తమ జీవనము ధారపోయుట సాహసమేమో ననిపించుటవల్ల పురుషులు బొత్తిగా సంగీతమువంక పోవడం మానివేయుటం నే నెరుగుదును.

సంగీతవిద్య బాగా అభివృద్ధికి రావలయునన్న అప్పటమయిన సంగీతమునకు ప్రోత్సాహము దొరకవలయును. శాస్త్రీయ సంగీతమును పెద్దపెద్ద నగరములందు నేర్పరులద్వారా వ్యాప్తి చేయించవలయును. రేడియోలోకంలోను ప్రజలు గాయకుల నెక్కువగా ఆదరించవలయును. అట్టి ప్రజాదరణ కలిసి వచ్చినప్పుడు మంచి సంగీతము దేశములో ప్రబలి ప్రజలకు మనశ్శాంతిని చేకూర్చును. అట్టి బ్రహ్మానందమును ప్రజలు నిరంతరముపొందు సదవకాశములను దేవాలయ నిర్వాహకులు, సంగీతనాటక అకాడమీవారు కలుగజేయగల మంచిసదుపాయములు వేరులేవు.

‘శరణార్థిచేయు’ శబ్దపల్లవమే

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

1

తత్త్వ నిర్ణయ తాత్పర్యముతో, శాస్త్రానుకూలమార్గమున చర్చలు సాగించువారితో — ఎంతైనను వాదింపవచ్చును; వారిని ఒప్పించను వచ్చును. కాని, విషయపరిజ్ఞానము లేక వితండావాదములకు సిద్ధపడువారితో వేగుట మహాకష్టము. వారిని ఒప్పించుట బ్రహ్మదేవునికిని వశముకాదు.

1962 ఆగస్టు భారతిలో, శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులుగారు, కాళహస్తి మాహాత్మ్యము— అచ్చుప్రతిలో నున్న ‘శరణార్థిఁజేసి’ అను పాఠమే సరియైన దన్నారు.

నేను— అక్టోబరు భారతిలో— “కాదు స్వామీ ! (శరణార్థి + చేయు) ‘శరణార్థిచేయు’ అని శబ్దపల్లవ క్రియ. ఈజాతి క్రియలలో— అరసున్నలు, ద్రుతకార్యములు ఉండవు” అని లక్షణము చెప్పి, ‘శరణార్థియొనర్చి’ (1—34) అను మరియొక ప్రయోగమునుగూడా చూపించి, ‘శరణార్థిచేసి’ అనుటయే సరి. ‘శరణార్థిఁజేసి’ అనుట సరికాదని వివరముగా తెలిపినాను.

కాని, వారి వాదశోరణిని బట్టి—వారికి శ. ప. క్రియల తత్త్వము బొత్తిగా తెలియదనీ, చెప్పినను బోధపడదనీ నా కప్పుడే తోచినది. నా వ్యాసములో వ్రాసియు నున్నాను— మరియు వారు తమ వాదమును ఒకమాత్రాన వదలుకొను వారుకారనియు తోచినది. అదే నిజమైనది.

శబ్దపల్లవ లక్షణమును నే నంత వివరముగా చెప్పినను మనసున కెక్కించుకొనక— “శరణార్థిచేయు — శబ్దపల్లవమా?” అంటూ— డిశంబరు భారతిలో మళ్లీ ప్రత్యక్షమైనారు. ఈమాటు వారి ప్రసంగముకూడా కొంచెము మతిమించినది. అందువల్ల, నాకు శ్రమ యైనను, లేఖ ఒక్కింత విస్తరిల్లినను, వారి యాక్షేపములకు సమాధానములు సమగ్రముగా వ్రాయవలసినదే యనీ, లేకున్నచో వారివలని బాధ తొలగదనీ తోచినది. అందువల్ల వీలయినంతలో— విపులముగానే వ్రాయుచున్నాను.

(1) “శాస్త్రిగా రీసారి క్రొత్తయెత్తు నెత్తినారు. తాము తొలుత వ్రాసిన వ్రాతను సమర్థించుకొనుటకు, వారు త్రొక్కిన క్రొత్తపుంత ఇది. ‘శరణార్థిచేయు’ శబ్దపల్లవ మనియు, నందు ‘శరణార్థి’యను విశేష్యమునకు ‘చేయు’ అను క్రియ యనుప్రయుక్తమైనదనియు, వట్లగుట శబ్దపల్లవలక్షణమనియు సిద్ధాంతీకరించుట శ్రీ శాస్త్రిగారి సాహసమో ! నా యజ్ఞతయో ! పాఠకులే యూహించుకొందురుగాక” అని వారి వ్రాత.

నే నీనాడు క్రొత్తగా ఎత్తిన యెత్తుగాని, క్రొత్తగా త్రొక్కిన పుంతగాని, చేసిన సాహసముగాని యేమీ లేదు. ఆచార్యులుగారు తమ స్వభావముకొలదిని అట్లు భావించియుందురుగాని, వాదముకొరకు వక్రమార్గము త్రొక్కుట నా పద్ధతి కాదు. ఇది యంతయు నన్ను సరిగా నెరుగక వ్రాసిన వ్రాత. నిన్న కుప్పలు— నేడాళ్లు’ అన్నట్లు వా రిప్పుడిప్పుడు విమర్శరంగములో అడుగుపెట్టుచున్నవారు. కావున శబ్దపల్లవవ్యవహారము వారికి క్రొత్త గాని, నాకు క్రొత్త కాదు. చిరకాలము క్రిందటనే నే నీ క్రియయొక్క లక్షణమును, బహుప్రయోగ ప్రమాణములతో— నా ‘సాహిత్యసమీక్ష’లో— నిరూపించి యున్నాను. ఆ గ్రంథము 1955లో ముద్రితమైనది. ఈనాడు వారు శబ్దపల్లవమును గూర్చినాకు బోధింపవచ్చుట, తాతకు దగ్గులునేర్పఁ బూనుట వంటి పని.

(2) “శాస్త్రిగారు నుడివినట్లు— ‘శరణ + అర్థి + చేయు’ అందలి ‘శరణ + అర్థి’ అను రెండుపదములు కలిసిన విశేష్యముఁ బూర్వపదముగా గలిగినట్టి దానినిగూడ శబ్దపల్లవ మనవచ్చునని యింతదనుక నెవ్వరికిని దెలియని రహస్యము గాబోలు !” అని వారి ఆక్షేపము.

ఆక్షేపించుటే కాక అవహేళనముకూడా చేసినారు. చేయనిండు; దానికేమిగాని, రెండుపదములేకాదు; మూడు, నాలుగు, అయిదు పదములు కలిసిన విశేష్యము పూర్వపదముగా నున్నను— శబ్దపల్లవమే యగును. అదే అందున్న రహస్యము. ఈ రహస్య మెవరికిని తెలియనిదికాదు. వ్యాకరణము చదువుకొన్న వారికీ, ప్రాచీన కావ్యప్రయోగపరిచయ మున్నవారికీ తెలిసినదే. నా ‘సాహిత్యసమీక్ష’లో పెక్కుప్రయోగము లిచ్చియున్నాను. లేఖ విస్తరభీతిచేత, వాటిలో కొన్ని మాత్రమే ఇక్కడ చూపుచున్నాను.

1. ‘ఐదు పదిసేయు = అంజలించు’.

ఇది రెండుపదములు గలిసిన శ. ప. క్రియ (ఐదు + పది + చేయు).

“ఐదు పదిసేయురు దత్తిన తక్క” (ఆము. 2—34).

2. ‘చీఁకటి తప్పుసేయు = వ్యభిచరించు’.

ఇందును రెండుపదము లున్నవి. (చీఁకటి + తప్పు + చేయు).

“అమరవల్లభుఁడు గౌతము కూర్మి యిల్లాలిఁ
జీఁకటి తప్పుసేసిన విధంబు” (శృం. నై.7—151).

(ఇల్లాలిర్ = ఇల్లాలితో— అని యర్థము).

3. 'నల్లమేక తప్పుసేయు=రమించు'.

ఇది మూడు పదములు కలిసిన క్రియ (నల్ల + మేక + తప్పు + చేయు).

"బలభేది గౌతముభార్య నహల్యఁ గా
మించి చేయఁడె నల్లమేకతప్పు" (ప్రబోధ. 1—50).

(నల్లమేక తప్పుచేయఁడె— అని నమన్వయము).

4. 'తునిమితూఁటాడు = త్రుంచి ముక్కలుచేయు'.

తునిమి + తూఁటాడు. ఇది అసమాపకక్రియ ముందుగా గలిగిన శబ్దపల్లవము. ఇందును రెండుపదము లున్నవి. (తునిమి + తూఁట + అడు).

ఈ శబ్దపల్లవముల ప్రయోగవిధానమును వ్యాకరణములు చెప్పలేదు. నిఘంటువులును ఈక్రియలను సరిగా గుర్తింపలేదు. 'బుద్ధిసేయు' అను శ. ప. క్రియ, బహుచిత్రముగా ప్రయుక్తమై యున్నది. ఆచార్యులుగారి కొరకు గాకున్నను, జిజ్ఞాసువుల కొరకైనను ఉదాహరించుట అవసరమని తోఁచి, ఉదాహరించుచున్నాను.

(i) "మాత్స్యపురమున దైన్యపడుట బుద్ధిసేయకు" (అశ్వ. 1—116).

బుద్ధిసేయకు=తలఁపవలదు— అని యర్థము.

(ii) "ఏటికి నొండొక బుద్ధిసేసెదు" (ద్రోణ. 1—391).

ఎందుకు అన్యథా భావించెదవు— అని యర్థము.

ఇక్కడ, 'ఒండొకబుద్ధి' యను నమస్తపదమునకు 'చేయు' అనుప్రయుక్తమై, శ. ప. క్రియ యైనది. ఇందులో మూడు పదము లున్నవి. (ఒండు + ఒక + బుద్ధి + చేయు).

(iii) "సౌ, వీరకుల ప్రసూతులము వీరులమే మితరక్షితీశసాధారణబుద్ధిసేయకు ముదాత్తచరిత్రులమైన మా యెడన్". (అర. 6—182).

ఇక్కడ— 'ఇతరక్షితీశ సాధారణబుద్ధి' యను సిద్ధ నమాసమునకు 'చేయు' అనుప్రయుక్తమై, శ. ప. క్రియ యైనది. ఇది అయిదు పదములు కలిగినది. (ఇతర + క్షితి + ఈశ + సాధారణ + బుద్ధి + చేయు).

మేము మహావీరులము. మమ్ము ఇతరాజులను భావించినట్లు— అల్పముగా భావింపవలదు— అని భావము. శబ్దపల్లవ క్రియాయోగముగల ప్రయోగములకు భావప్రధానముగా అర్థముచెప్పికొనవలె గాని, ప్రతిపదార్థము చెప్పరాదు. అది కుదురదు.

శ్రీ ఎస్. టి. పి. వి. ఆచార్యులుగారు ఏమంటారో! వారు 'శరణార్థిచేసి'— 'శరణార్థి యొనర్చి' అను ప్రయోగము లను— 'శరణార్థిఁజేసి'— 'శరణార్థినొనర్చి' అని మార్చవలె నమచున్నవారుగదా! భారతప్రయోగముమగూడా, 'ఇతర క్షితీశ సాధారణబుద్ధిఁ జేయకుము' అని మార్చవలసినదే నంటారేమో! అట్లు మార్చినచో, 'బుద్ధిఁజేయకుము = బుద్ధిని చేయవలదు'— అని యర్థ మగునేగాని, 'భావింపవలదు' అన్న అర్థమురాదు. ఆయర్థము రానిచో పద్యమే వ్యర్థమగును. 'బుద్ధి సేయు' అను క్రియతో అన్వయించిననేగాని కవ్యుద్దిష్టార్థము సిద్ధింపదు.

అయిదు పదములు కలిసిన విశేష్యముతో నేర్పడ్డ శ. ప. క్రియయును ఉన్నది గనుక, రెండు పదములు కలిసిన విశేష్యముతో— శ. ప. క్రియ యేర్పడినదని నేను చెప్పుటలో పొరపాటు లేదనియు, అట్లుచెప్పుట సాహసమని శ్రీ ఆచార్యులుగారు ఆక్షేపించుటయు, అవహేళనము చేయుటయు ప్రాజ్ఞత యనిపించుకొన దనియు ఇక్కడ సారాంశము.

(3) "శరణార్థిచేసి— యనునది శబ్దపల్లవము కాదు. కనుకనే— శరణార్థిఁజేసి=శరణమును గోరి (శరణముయొక్క అర్థిని జేసి) అను నర్థము పొసగును" అన్నారు వారు.

ఇది యొక వక్రవ్యాఖ్యానము. వాదముకొరకు పట్టిన తప్పుదారి. 'క్రొత్తపుంత త్రొక్కుట' యనగా ఇట్టిది— 'శరణార్థిఁజేసి' అంటే, 'శరణమును గోరి (శరణముయొక్క అర్థిని జేసి)' అని యర్థమట! ఇది (వారన్నట్లు), ఇంతదనుక పండితుల కెవ్వరికిని దెలియని పరమరహస్యము గాబోలు!

ఆ యర్థము పొసగు నన్నారు. అది యెట్లు పొసగును? 'శరణముయొక్క అర్థిని జేసి' అన్నప్పుడు 'అర్థి' పదమునకర్థ మేమి? 'కోరిక' అనియా? ఈ యర్థము సంస్కృతమున నున్నదా? లేదు. తెనుగున నున్నది. అదియు వ్యస్తముగా నున్నప్పుడే. కనుక శరణ శబ్దముతో నమసింపదు— ఎట్లో నమసించు గాక; 'శరణార్థిన్— శరణముయొక్క కోరికను' అని యర్థమును అగుగాక; మరి 'చేసి' యను క్రియ కేమర్థము? 'కోరికను—చేసి' అంటే 'కోరి' అని అర్థ మెట్లగును?

శరణముయొక్క కోరికను— 'చేసి = ఒనరించి' అని యగును. లేదా, శరణముయొక్క— 'కోరికనుజేసి = కోరికచేత' అని యగును. అంతేగాని 'శరణమును గోరి' అని కాదు. ఆయర్థము కావలె నంటే, 'శరణ మర్థిచేసి' అనవలె. అప్పుడు— శరణము= శరణమును, అర్థిచేసి = కోరి— అని యర్థ మగును. 'శరణార్థిని జేసి' అనుటలో అర్థమే లేదు.

'విద్యనుకోరి వచ్చినా'వనుటకు, 'విద్యార్థిని జేసివచ్చినా' వనుట ఆచార్యులుగారి సాహిత్యమున చెల్లునేమో గాని, ప్రాచీన సాహిత్యరీత్యా చెల్లదు— కనుక వారిపాఠమూ, అర్థమూ రెండును తప్పే.

(4) "శరణార్థిచేసి— శబ్దపల్లవముకా" దన్నారు.

అగునో, కాదో; వారికే మెరుక? ఎరుకగలవారు శబ్దపల్లవముగానే గ్రహించినారు. అందు క్రింది యుదాహరణలు ప్రమాణము.

'శరణార్థిచేయు' శబ్దపల్లవమే

(1) **"అడకి యమ్మకు శరణార్థి సేయుచును".**
వేటూరివారి ప్రతి. (బసవ. పుట. ౧౫౨).

(2) "అడచి (?) యమ్మకు శరణార్తి యాచరించి".
పిడుపర్తి. (బసవ. ౫—౧౧౪).

(శరణార్తి = శరణార్థి).

(3) "శరణార్థిసేసి తజ్జంగమంబునకు".
చిలుకూరి వారి ప్రతి. (పండితా.సం.౧-పుట.౨౧౫).

(4) "సద్భక్తిఁ దపసికి శరణార్థిసేసి"
(పండితా. సం. ౨-పు. ౪౬౧).

(5) "అరఁగుదేరుగ శరణార్థి సేయుచును"
(పండితా. సం. ౨—పు. ౪౯౬).

ఇంకను ఉదాహరణబాహుళ్య మెందుకు ? ఆచార్యులుగారి వాదము తప్పు.

(5) "అర్థినిజేసి— యనునప్పు డర్ధానుస్వార ముండుట యుచితమేగదా ! 'శరణార్థి యొనర్చి' యనుచోటను 'శరణార్థి నొనర్చి' యనుకొనవచ్చును" అన్నారు.

అర్థజ్ఞానము లేనప్పుడు అట్లనుకొనవచ్చునుగాని, అర్థము తెలిసిన తరువాత అ ట్లెవరును అనుకొనరు. 'అర్థిచేసి' అను శ. ప. క్రియలో అరసున్న పెట్టుటచేతనే ఇంత యనర్థ మేర్పడినది. కాబట్టి ఆయరసున్న యుండుట యుచితము కాదు. కేవల మనుచితము.

అరసున్నల వలన శ. ప. క్రియలఅర్థము లెట్లు మారుచుండునో తెలియుటకు కొన్ని యుదాహరణ లిచ్చుచున్నాను.

i. ఆలిసేసి=వెలిచి.
ఆలిఁజేసి = భార్యను (గా) చేసి.

ii. తప్పుసేసి = తప్పుగానెంచి.
తప్పుఁజేసి = తప్పుచేత. ,

iii. మాయచేసి = మోసముచేసి.
మాయఁజేసి = నశింపఁజేసి.

iv. కొండసేసి = గొప్పచేసి.
కొండఁజేసి = కొండనుచేసి— మొదలగువవి.

ఈక్రియల కన్నిటికిని—నా 'సాహిత్యసమీక్ష'లో ప్రయోగము లియ్యబడియున్నవి. శ్రీవారు చిత్తగించి, శ. ప. క్రియలలో అరసున్నలుండుట ఉచిత మగునేమో తెలిసికొందురుగాక.

శ్రీమా నాచార్యులవారి ఆక్షేపముల కన్నిటికిని సమాధానములు వచ్చినట్లే నేను భావించుచున్నాను. ఏవయినను కొరవ సరవ లున్న మన్నింపవలసినదని వారికి నా మనవి.

వారి యాక్షేపములు, వారుచేసిన సవరణ, దానికి వారు చెప్పిన అర్థము, వారి సిద్ధాంతము అన్నీ తప్పులే ననియు, 'శరణార్థిచేసి' అనునదే సాధుపాఠ మనియు, అది శబ్దపల్లవమే— అందుకు సందేహములే దనియు ఈ విచారణలో తేలిన ఫలితాంశము.

నా పొరబాటు

ఇంతవరకును శ్రీ ఆచార్యులుగారి తప్పులు చెప్పినాను. వాటితోపాటు చెప్పవలసినది— నా పొరపాటుకూడా ఒకటి యేర్పడ్డది. అది యేమనగా:—

నేను సవరించిన పాఠము సరియైనదే గాని, నేను ఆపాఠానికి చెప్పిన 'శరణుకోరి' అను అర్థము సరియైనది కాదు. సాహిత్యదృష్టితో— ఊహించి అట్లు చెప్పినాను గాని— 'శరణార్థిచేసి = నమస్కరించి' అని చెప్పుట సమంజసము. ఇది సంప్రదాయశుద్ధమైన అర్థము. నా కిటీవల తెలిసినది. ఎట్లు తెలిసిన దనగా :—

ఆచార్యులుగారి యాక్షేపమునకు సమాధానము వ్రాసి భారతికి పంపిన తరువాత, ఒకనాడు బసవపురాణమును చూచుచుండగా, ఈక్రింది పంక్తులు కనబడినవి.

"విడియలతో రెండువేల మాడలును
నడకి యమ్మకు శరణార్థిసేయుచును
.... చనియె నా బసవఁడు". (పు. ౧౫౨).

'అమ్మకు శరణార్థిసేయుచును'— అను మాటలో 'శరణుకోరు' అన్న యర్థము ఏవిధమునను పొందపడలేదు. 'కాళహస్తి' పద్యములో— "రండన భక్తిన్ శరణార్థిచేసి" అని యున్నందున, 'శరణుకోరి' అన్న యర్థ మక్కడ ఒకవిధముగా సరిపడినది గాని, ఇక్కడ 'అమ్మకు' అని షష్ఠ్యంతముగా నున్నందున— అమ్మకు శరణుకోరి— అనుట బొత్తిగా సరిపడలేదు. 'అమ్మకు నమస్కరించి' అని యర్థమని సందర్భమే చెప్పుచున్నది. అందువల్ల 'శరణార్థిచేయుట' యనగా— నమస్కరించుట యనియు, 'కాళ.' పద్యమునను 'శరణార్థిచేసి = నమస్కరించి' అనియే అర్థ మనియు అప్పు డూహించుకొన్నాను.

మరియొక విషయ మేమనగా :— శైవులు— పరస్పరము —'శరణార్థి' అంటూ నమస్కరించుకొనుట ఆచార మైనట్లు— ఈ క్రింది పంక్తులవలన తెలిసినది.

" 'శరణార్థి' యని చక్కఁ జాఁగి మ్రొక్కుడును
దరుణియు నటమున్న 'శరణార్థి' యనుచు
వడుగుల కర్ఘ్యపణ్యంబులు దేర". (పు. ౧౫౨).

పెద్దలను దర్శించినపుడు— వైష్ణవులు 'దాసోహ' మన్నట్లు— జంగములు 'శరణార్థి' యనుట సంప్రదాయ మని ఈక్రింది వాక్యములు తెలుపుచున్నవి.

"అరుదెంచి డగ్గఱి 'యయ్యగారలకు
శరణార్థి శరణార్థి శరణార్థి' యనుడు
'శివమస్తు శివమస్తు శివము' స్తుటంచుఁ
దవిలి తోడ్తోడన తపసి దీవింప". (పు. ౧౫౭).

నేను గుర్తించిన ఈ విషయములు సరియైనవే నని, మిత్రులు శ్రీ యస్. సదాశివ (ఎం. ఏ.) గారు వ్రాసిన జాబు వలన— తరువాత— ధ్రువపడినది.

శ్రీ సదాశివగారు బహుభాషా సంప్రదాయజ్ఞులు. మంచి విమర్శకులు. సహృదయులు. వారి శబ్దపల్లవచర్చను చదివి, తమ యభిప్రాయమును నా కిట్లు వ్రాసినారు:—

(ఆదిలాబాద్. 20—8—62). "గతమాసం భారతిలో కాళహస్తి మాహాత్మ్యంగూర్చి తాము వ్రాసిన విషయములు చదివి నాను. 'శరణార్థిఁజేసి' అను దానిని తాము 'శరణార్థిచేసి' అనియే ఉండవలె నన్నారు. ఈనెల భారతిలో ఎవరో శ్రీరామానుజా చార్యులవారు, నైఘంటికమైన పదార్థాన్నీ, వ్యాకరణాన్నీచూచి అది సరికాదనీ, శరణ మర్థించుట, శరణు నర్థించుట అని వుండ వలసి యుండుననీ, కనుక 'శరణార్థిఁజేసి' అనునదే సరియైనదనీ వ్రాసినారు. దాని ప్రయోగం తెలియని వ్రాతలవి. శరణార్థి చేయుట అనగా నమస్కారముచేయుట. అచల సంప్రదాయము లోనూ, జంగమభక్తి మార్గంలోను భక్తులు పరస్పరం కలుసు కొన్నప్పుడు— "అయ్యా ! శరణార్థి—శరణార్థిని" అంటారు. అంటే 'అయ్యా ! నమస్కారము' అనే అర్థము. మార్వాడీలు— జై రామజీకీ, జై గోపాల్ జీకీ అంటారు. సన్న్యాసులు నారాయణ స్మరణచేస్తారు. దేశభక్తులు జయహింద్ చేసుకొంటారు. ఇవన్నీ నమస్కారపరంగ వాడేవే. నైఘంటికార్థం అవసరంలేదు. కనుక తాము వ్రాసినట్లు శరణార్థిచేయుటే సమంజసము".

శబ్దార్థపాఠములకు సంబంధించిన ప్రకృతవివాద ములో, పండితులైన పాఠకుల అభిప్రాయమును తీసికొను టయు నవసరమే గనుక, శ్రీ సదాశివగారి— విలువగల— అభి ప్రాయమును నే నిందు పొందుపరిచినాను.

ఈ జాబులో, శ్రీ ఆచార్యులుగారి వాదము సరియైనది కాదన్న విషయముతోపాటు — 'శరణార్థిచేసి = నమస్కరించి' అని చెప్పుట సరిగాని, 'శరణుకోరి' అని చెప్పుట సరిగాదన్న విషయముగూడా వ్యంగ్యముగా తెలుపబడినది.

ఆ డిశంబరు భారతిలోనే, శ్రీ విర్జాల చంద్రశేఖరయ్య గారును— "కర్ణాటక దేశములో కొన్ని ప్రాంతములలో 'శర ణార్థి' అంటే 'నమస్కారము' అని వ్యావహారికముగా అర్థము కలదు" అని సహృదయతతో తెలిపియున్నారు.

ఇట్లు 'శరణార్థి' ప్రయోగ సంప్రదాయార్థమును దయతో తెలియజెప్పిన శ్రీ సదాశివగారికిని, శ్రీ చంద్రశేఖరయ్య గారికిని కృతజ్ఞతను తెప్పికొనుచు, వారి యుపదేశమును, బసవపురాణ ప్రయోగమును అనుసరించి, నేను నా పొరపాటును సవరించుకొనుచున్నాను.

శ్రీ యాచార్యులుగారు — "శరణార్థిచేయు— శబ్ద పల్లవ మని సిద్ధాంతీకరించుట, శాస్త్రిగారి సాహసమో ! నా యజ్ఞతయో ! పాఠకులే యూహించుకొందురుగాక" అని సెలవిచ్చియున్నారు.

పాఠకులైన శ్రీ సదాశివగారు అది శబ్దపల్లవమే నని విశ్వసించినారు. మరి ఆచార్యులుగా రేమందురో !

ఇటుపై నా రేమన్నను, నేను మాత్రము బదులువ్రాయను.

2

ఆ డిశంబరు భారతిలోనే, ఈ శబ్దపల్లవక్రియకు సంబంధించినదే— శ్రీ రావూరి మృత్యుంజయరావు అనువారి ఆక్షేపవ్రాత ఒకటి యున్నది.

నేను శ. ప. క్రియలలో— అరసున్నలు, ద్రుతకార్యములు ఉండవనుట 'ప్రమాద'మని వారి యాక్షేపము.

కమఁగొను, ఏఁగుదెంచు, అరుగుదెంచు, చనుదెంచు మొదలగు క్రియలలో— అరసున్నలు, ద్రుతకార్యములు— ఉన్న వనియు, అట్లే శ. ప. క్రియలలోను ఉండవచ్చు ననియు, 'శరణార్థిఁజేసి' అనునదే సరియైన పాఠమనియు వారి సిద్ధాం తము.

'కనుఁగొను' లోని 'కొను', 'గొను' అగుటయు, 'ఏఁగు దెంచు' మున్నగు క్రియలలోని 'తెంచు', 'దెంచు' అగుటయు ద్రుతకార్యమని వారి భావము.

వారు ప్రకటించిన భావమే, వారు బాలవ్యాకరణము నైనను చదువుకొన్నవారు కారని చెప్పక చెప్పుచుండగా— నేను వారి యాక్షేపమునకు సమాధానము వ్రాయుట యెందుకు ? వ్రాసి ప్రయోజనమేమి ? అదియొక ప్రొద్దుపోని పని. కనుక నే నేమీ వ్రాయుట లేదు. ఇక నెన్నడును— ఇట్టి నీరసాక్షేపము లతో నాకు అలజడి కలిగింపవలదని మాత్రము వారికి వినయ ముతో మనవిచేసికొనుచున్నాను.

నా మనవిని మన్నింపక, యేమేని వ్రాసినను, దానికి నా తూష్ణీంభావమే సమాధాన మగును.

స్వామి వివేకానంద

శ్రీ మన్నవ గిరిధరరావు

“ఆత్మవిశ్వాసముగల కొలదిమంది వ్యక్తుల చరిత్రయే ప్రపంచ చరిత్ర” అని అన్నాడు స్వామి వివేకానంద. అందుకు ఆయనయే చక్కని ఉదాహరణ. ఆత్మ విశ్వాసమే ఆయన సర్వస్వం. చేతిలో చిల్లిగవ్వ లేకుండా దేశ దేశాలను పర్యటించాడు. హిందూ సంస్కృతియొక్క విశిష్టతను తేటతెల్లం చేశాడు. నిద్రాణమైయున్న భారత జాతిలో జాగృతి కలిగించాడు. భారత జాతీయోద్యమానికి పునాది వేశాడు. ఒక్కమాటలో—వివేకానందుడు నవీన భారత భాగ్యోదయమునకు ప్రతీకము!

భగవంతు డనేవాడు ఏ కొండ శిఖరంమీదనో, ఏ చెట్టు తొర్రలోనో, ఏ సముద్రగర్భంలోనో మకాం పెట్టుకొని జీవిస్తూ ఉంటాడని, ఆయనను వెదకడంకోసం సంసారాన్ని త్యజించి ఆకు అలములు భుజిస్తూ, ఏకాంతంగా సాధన చెయ్యాలని చాలా మంది ఉద్దేశ్యం. వివేకానందుడు ప్రత్యేకమైన దృక్పథంతో ఆలోచించాడు. సమాజమే భగవంతుడనీ, తోటి మానవులకు సేవ చేయడమే ముక్తికి మార్గమనీ బోధించాడు. అందుకే ఇలా నెత్తిన నోరు పెట్టుకొని ఇలా చెప్పాడు: “దేవుణ్ణి వెదకడానికి ఎక్కడికి పోతున్నావు? ఈ కోటానుకోట్ల ప్రజలు దేవుళ్లు కారా? గంగానదీతీరంలో బావి త్రవ్వదలుస్తున్నావా? ఈ ప్రజలను ప్రేమించు, ఆరాధించు.......నిరుపేదల కష్టాలనుచూచి వలవల ఏడ్చేవాడే మహాత్ముడు; లేనిచో వాడు దురాత్ముడే...... జాతి గుడిసెలలో నివసిస్తుందని గుర్తుంచుకొనండి......భారత దేశంలో ఒక కుక్కయైన క్షుద్బాధతో బాధపడకుండునంత వరకు మరల మరల వేయిసార్లయిన ఈ గడ్డమీద జన్మించి సమాజోద్ధరణకై శ్రమిస్తానేగాని, స్వీయముక్తిని కోరను”.

అంతేగాక, తాను స్వీయముక్తిని ఏల కోరుటలేదో ఒక సందర్భంలో ఇలా వివరించాడు: “స్వీయ మోక్షప్రాప్తిచే నేమి ప్రయోజనము? మధురమైన ఆహారమును విశేషముగ అనుభవించువాడెవ్వడు? అంతయు తానే తినువాడా, అన్యులతోగూడి భుజించువాడా? సమస్త ప్రపంచమును మనతో గూడ మోక్ష సౌధమునకు గొనిపోవలయును”.

ఇందు కనుగుణ్యమైన ఒక సంఘటన జరిగినది. అనేక మంది శ్రుత బోధకులు చెప్పిన రీతిలో దేవుని ఆరాధించి, తుదకు స్వామి వివేకానందునియొద్దకు ఒక యువకుడు వచ్చాడు. “ఇప్పటికినీ గది తలుపులు బిగించి, కన్నులు మూసుకొని ప్రతి దినమును ధ్యానించుచునేయుందును. కాని, శాంతి దొరకలేదు. తాము మార్గము తెలుపగలరా?” అని యతడు ప్రశ్నించాడు.



స్వామీ వివేకానంద

అందుకు వివేకానందుడు ప్రేమపూరితుడై, “నాయనా మొదట నీవు నీ గది తలుపులను తెరచి, మూసుకొనిన నీ కనులను విప్పి చుట్టు ప్రక్కలనున్న పరిస్థితులను పరికింపుము. నీ ఇరుగు పొరుగున వందల కొలది దీనులు, నిస్సహాయులు పడియున్నారు. నీ శక్తికొలది వారిని సంరక్షింపుము. రోగులకు మందిచ్చి సేవ చేయుము. ఆకలిగొన వారికి భోజన మిడుము. విద్యావిహీనులకు విద్య గరపుము. మనశ్శాంతి కిదియే మార్గము”, అని బోధిం

చాడు. వివేకానందుడు సమాజమే భగవంతుడని పేర్కొనడం ద్వారా విశ్వాత్మకమైన దృక్పథాన్ని మనకందించాడు.

చేతిలో చిల్లిగవ్వ లేకుండా వివేకానందుడు విశ్వమత మహాసభకు ఎలా వెళ్లగలిగాడు? 'నా' అనేవారు లేకుండా దేశ దేశాలలో ఎలా విజయ దుందుభి మ్రోగించగలిగాడు? యావద్భారతాన్నీ పర్యటించి ప్రజలను ఎలా ఉత్తేజపరచ గలిగాడు? 30 ఏళ్ల యువకుడు ఇట్టి ఘనకార్యాలను సాధించ డంలో రహస్యమేదైన యున్నదా?

దీనికొక చిత్రమైన కారణమున్నది. వ్యక్తి స్వార్థాన్ని జయించిననాడు మహాశక్తివంతుడవుతాడు. స్వార్థమే ఒకడిని అల్పునిగా చేస్తుంది. దాని మరచినవాడు దైవ సమానుడు. వివేకానందుని మాటల్లో చెప్పాలంటే: "మీ హృదయాలను ప్రపంచమంత విస్తృతం చేసుకోండి. అప్పుడు మహాశక్తి మీ వెనుక ఉంటుంది. ఇతరులకోసంచేసే అతి స్వల్ప కార్యం గూడా మీలోని శక్తిని మేల్కొల్పుతుంది. ఇతరులకోసం ఏ కొద్ది పాటి మంచిపని చేసినా, మీలో సింహానికున్నంత శక్తి—మీరు భరింపలేనంత శక్తి—ఉద్భవిస్తుంది. మీరు ఆశ్చర్య చకితు లవుతారు."

ప్రతి భారతీయుడు ఈ వాక్యాలలోని సత్యాని గమనించి, స్వార్థ రాహిత్యంద్వారా, సమాజ సేవలో తనను తాను మరచిపోవడంద్వారా దైవత్వాని సాధించాలని వివేకానందుని ఉద్బోధ. ఇదియే ఆతని సందేశం.

వివేకానందుడు అమెరికాకు, పాశ్చాత్య దేశాలకు ఎందుకు వెళ్లాడు? పాశ్చాత్యులను ఆధ్యాత్మికతవైపు త్రిప్పడానికి, వారిలో ఆస్తికత్వం పెంపొందించడానికి వెళ్లాడని మనమనుకుంటాం. కాని, అది నిజమైన కారణంకాదు. భారతీయులలో జాగృతి కల్గించడానికే ఆయన విదేశాలను పర్యటించవలసి వచ్చింది. మద్రాసులో ఉపన్యసిస్తూ, వివేకానందుడు ఈ విషయాన్ని పేర్కొన్నాడు కూడాను.

1857 స్వాతంత్ర్య సమరంలో ఓడిపోయిన పిదప భారతీయులలో ఆత్మ విశ్వాసం నశించింది. ప్రపంచంలో మనం ఎందుకూ కొరగాని వాళ్లమనేభావం ఏర్పడింది. మనలను జయించిన ఆంగ్లేయులు మానవోత్తములనే నమ్మకం కలిగింది. హిందూ ధర్మంమీద అసహ్యం, ఆంగ్లేయుల మత విశ్వాసాలమీద ఆసక్తి ఏర్పడింది. మనం అల్పులమనీ పరాయివాళ్లు అధికులనీ భావించడం జరిగింది. ఈ దేశంలోని గొప్ప కుటుంబాలవారు తమ కుమారులను మూడవయేటనే ఇంగ్లండు దేశానికి పంపించి, అచటనే విద్యాభ్యాసం చేయించారు. తమ బాలురకు భారతదేశపు గాలి సోకడం సహితం వారి కిష్టం లేదు!

ఇలా ఆత్మవిస్మృతి అనెడి అంధకారంలో ప్రజలు మునిగియున్నప్పుడు తరుణోపాయం ఏమిటి? వివేకానందుడు సింహాన్ని దాని గుహలోనే జయించదలచాడు. అందుకై అమెరికా వెళ్లాడు. విశ్వమత మహాసభలో పాల్గొన్నాడు. అచటి ఆలోచనా పరుల హృదయములను చూరగొన్నాడు. సర్వమతము లకు తల్లి అయిన సనాతన ధర్మమును అద్దములో చూపినట్లు వర్ణించి, పాశ్చాత్య దేశాలలో విజయయాత్ర చేశాడు.

ఒక మంచి విషయాన్ని సహితం ఆంగ్లేయులు ధ్రువ పరుస్తేతప్ప గుర్తించని భారతీయులు, వివేకానందుని విజయ యాత్రను పత్రికలలో చదివి ఉప్పొంగిపోయారు. హిందూ సంస్కృతి సజీవమైనదేనని గ్రహించి ఆత్మ విశ్వాసాన్ని పొంద సాగారు. ఆ తరువాత వివేకానందుడు భారతదేశానికి మరలి వచ్చినప్పుడు జాతి యావత్తూ అతనికి నివాళు లెత్తింది. అదియే భారత జాతీయ ఉద్యమానికి నాంది అయినది.

దేశంలో జనసంఖ్యకు తరుగులేదు. కాని, సరియైన కర్తవ్య భావనగల కార్యకర్తలు లేని కారణాన అనేక పనులు విఫల మవుతున్నాయి. అనేక సంస్థలు మూతపడుతున్నాయి. అందు చేత అన్నిటికి మూలమైన కార్యకర్తల తయారీ అనునది దేశంలో విస్తృతంగా జరుగవలసిన అవసరం ఎంతైనా ఉన్న దని వివేకానందుడు అనేక సందర్భాలలో హెచ్చరించారు. ఆయన ఇలా అన్నారు.

"ఏ జాతిఅయినా ఉచ్చదశకు రాగలిగిందంటే దానికి ఆ దేశపు పార్లమెంటువారు చేసే శాసనాలు కారణాలుకావు. ఆ దేశపు ప్రజల శీల సంపదయే కారణం. దేశంలోవున యావత్తు సంపదకంటె గూడ మనుష్యులయొక్క విలువ అధికం. ఒక వేళ మనకు కావలసిన భౌతికావసరాల నన్నిటిని ప్రభుత్వం సమకూర్చిందనుకోండి. వాటిని సద్వినియోగపరచుకోగల శీల వంతులైన వ్యక్తులేరీ? కనుక మనుష్యులను ముందు తయారు చేయండి".

కార్యకర్తలు క్రమశిక్షణ, విధేయత, పట్టుదల, త్యాగ భావము అలవరచుకోవలసిన ఆవశ్యకతను అనేక సందర్భాలలో ఇలా వివరించారు.

"మనం విదేశములమీద ఆధారపడరాదు. వ్యక్తులవలెనే జాతులు కూడ తమ కాళ్లపై తాము నిలబడవలెను. అదియే నిజమైన దేశభక్తి".

స్వామి వివేకానంద

"అనంతమైన ఓపిక, అనంతమైన పవిత్రత, అనంతమైన పట్టుదల, ఈ మూడూ ఒక మంచి పనిలో విజయం సాధించడానికి అవసరము.....".

"అనుకరణ నాగరికత కాదు. మానవుని యొక్క పతనానికి అది చిహ్నము. ఎపుడైతే వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటాడో అదే అతని చరమదశ. ఎపుడైతే వ్యక్తి తన పూర్వులను గూర్చి సిగ్గుపడతాడో, అదే అతని వినాశకాలం. ఈ భారతీయ జీవన స్రవంతినుండి దూరము కాకండి. భారతీయులందరూ విదేశీయుల మాదిరిగా జీవిస్తే బాగుండునని కలలోనైన భావించకండి".

వివేకానందుడు ఒకనాడు బృందావన క్షేత్రానికి వెళుతూ ఉన్నాడు. త్రోవలో హుక్కా త్రాగుచున్న ఒకనియొద్దకేగి, ఆ గొట్టమును ఒకమారు తనికివ్వమని అడిగాడు. ఆ వ్యక్తి తాను కడజాతి వాడనని సందేహిస్తూ చెప్పాడు. వివేకానందుడు ఆక్షణంలో హుక్కా గొట్టమును తీసుకొనక వదలివేశాడు. కాని, వెంటనే తన తప్పును గ్రహించి, ఎల్లరు మానవులను ప్రేమించవలసిన అవసరాన్ని గుర్తు చేసుకొని, ఆ కడజాతివాని యొద్ద హుక్కా గొట్టమును స్వీకరించినాడు.

అస్పృశ్యతను ఖండిస్తూ, ఆయన ఇలా అన్నాడు: "నన్ను తాకకు" అనేది ఒక మానసికమైన జబ్బు. జ్ఞాపకముంచుకొనండి. వ్యాప్తియే జీవనము; సంకుచితమంతా మరణము. ప్రేమ ద్వారా అందరిని నీలో ఇముడ్చుకో. 'ఆత్మ వత్సర్వ భూతాని' అనే ఋషి వాక్యం పుస్తకాలకు మాత్రమే పరిమితమా? ఆచరణకోసంకాదా?" అని ప్రశ్నించాడు.

70 ఏళ్ళక్రిందట వివేకానందుడు దేశంలో ఎలాంటి పరిస్థితులను చూచాడో నేడు కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. ప్రజలలో ఆత్మ విశ్వాసములేదు. విదేశాలమీద ప్రతి చిన్న విషయానికీ, ఆధారపడుతున్నారు. విద్యావిధానం సౌశీల్య నిర్మాణానికి ఉపయోగించడంలేదు. భౌతిక ప్రధానమయిన పాశ్చాత్య పద్ధతులను స్వీకరించి, ప్రజలు మానసిక అశాంతితో అలమటిస్తున్నారు. ఈ స్థితిలో వివేకానందుని ప్రవచనములను ప్రతిఒక్కరూ మననం చేయడం అవసరము.

కాటూరి వెంకటేశ్వరరావు

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

సామాన్యంగా కడచిన 5, 6 ఏండ్లలో అతన్ని చూస్తున్న వారిలో మీ రందరూ ఉన్నారుగదా. ఒక తెల్లటి శాలువ వేసుకుని, కఱ్ఱ ఒకటి పుచ్చుకుని తిరుగుతూండేవాడు. చాలా మందికి గుర్తుండేవా డనుకుంటాను.

నా కెవరో పెట్టిన శాలువ అతని కిస్తే, ఆ శాలువ అది. ఆ కఱ్ఱకూడా నేనే ఇచ్చాను. ఆ శాలువ వేసుకుని ఆ కఱ్ఱ పుచ్చుకుని తిరుగుతూ ఉండేవాడు.

ఎందుకు చెపుతున్నానంటే, నేనంటే అతని అంతరాంతరాలలో ఎంత ఆర్ద్రత, మార్దవం ఉన్నవో దీన్నిబట్టి తెలుస్తుంది.

మొన్న వెళ్లినప్పుడు అతను పోతాడని నేను అనుకోలేదు. ఏదో జాతకం—అదీ చెప్పాడు. జాతకం అంటే నా కంతగా తెలియదు కాని ఏదో శని చాలా ఉచ్ఛలో ఉన్నాడని మాధవ పెద్ది బుచ్చి సుందరరామయ్య అయితే ఆయనతో అన్నాట్ట—బాబుగారూ—అనేవా డాయన వేంకటేశ్వరరావు గారిని. బాబుగారూ మీకు చాలా మంచిరోజులున్నాయి. శని మహర్దశ వస్తున్నది. ఏదో పెద్ద సంస్థకు అధిపతిగా ఉండాలి—అని.... ఇట్లా అన్నాడోయ్ అన్నాడు నాతో. నాకు కూడా అలాగే ఉందోయ్, నీవు ఏదో పైకి రావాలి. నీకున్న కవితాశక్తికి తగిన ఆధిక్యం నీకు రాలేదు — అన్నాను. వస్తుందనే అనుకున్నాను. తప్పకుండా నిమ్మళిస్తుం దనుకున్నాను. ఇవాళ ప్రొద్దున్న యీ వార్త పెద్ద పిడుగులా వచ్చింది.

చెపితిని కదా—ఇద్దరం ఒకటే వయస్సు వాళ్లం. బాపిరాజు కూడా మా ఈడువాడే. అతను మాకన్న ముందర పోయాడు.

ఇది ఏమిటో—ఈ అష్టగ్రహ కూటం ఫలితమేమో—రెండు నెలలుకాలేదు గోపీచంద్ పోయి. ఇవాళ మళ్లీ ఈయన పోయాడు.

స్నేహితుడు పోతే పడే కష్టం ఎవడికి వాడు గ్రహించాల్సిందే తప్ప, చెపితే తెలిసేది కాదు. ఒక్కసారిగా యీ పిడుగు వార్త వస్తే మరి — ఎప్పటి కప్పుడు బ్రతుకుతాడు బ్రతుకుతాడు—అనే నా తాత్పర్యం తప్ప ఇట్లా అవుతుందని అనుకోలేదు పైగా. నేనూ నా తమ్ముడూ ఇద్దరం కలిసి వెళ్లాం. మా వేంకటేశ్వర్లు కూడా చెప్పాడు—ఫర్వాలేదు వేంకటేశ్వరరావు — ఏదో — అని.

ఎంత ఏడ్చినా దీని తల్లి కడుపు కాల ఎవరైనా ఆప్తులు పోతే ఇంతకన్నా చేసేదేమీ కనపడలేదు. అసలు ఇవాళ నేను మాట్లాడడం రేడియో వాళ్ళు మాట్లాడమంటూంటే మాట్లాడకపోతే అతనికేదో ద్రోహం చేసినవాడ నవుతానేమోనని తప్ప, అతన్ని గురించి మాట్లాడదలుచుకుంటే ఇవా మాట్లాడవలసింది ? ఇవి కాదే మరి. అతను ఎంత కవో చెప్పాలి. ఒక మహా వైశిష్ట్యం కల కవి అతను. అంతటి మహావైశిష్ట్యం కల కవి అని — ఇవాళ అతను పోయాడు గదా అని నేను అనడంలేదు. అతను బ్రతికుండగానే చాలాసార్లు అన్నాను. ఒక విధమైన రచనా వైశిష్ట్యం ఉండేది అతనికి. అలా ఒక ప్రబంధం వ్రాయమని అనేకసార్లు చెప్పాను.....ఏమిటోయ్, నాకు సమాధి కుదరదు.... అంటూ ఉండేవాడు. అతని శైలి అట్లాంటిది. దాన్ని గురించి ఇప్పుడు కవిత్వాన్ని గురించి మాట్లాడడానికి లేదు. ఎప్పుడైనా పరమేశ్వరుడు అనుగ్రహిస్తే ఎప్పుడన్నా ఇతరత్రా మాట్లాడవలసిన సమయ మది—అటువంటి చమత్కారమైన కూర్పు, అదొక పరమ రమణీయత—ఇప్పుడు కాదు.

ఎప్పుడో 40 ఏండ్ల క్రిందట ఒకప్పుడు ఏదో మయూర కోకిలం అనో ఏవో వ్రాశాడు. ' కొన్ని పద్యాలు. ప్రకటించలేదు. ఆ పద్యాలు వ్రాసినప్పుడే ఓరిబాబో ఇదేమి శైలి ఎట్లా కుదిరింది ?—ఆశ్చర్యం వేసింది నాకు.

తరవాత మా గురువుగారు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు బందరు నుంచి ఉపాధ్యాయత్వం విరమించి కడియం వెడుతూ ఉంటే అప్పుడు వ్రాశాడు పద్యాలు — ఆ రోజున సభ సభంతా దద్దరిల్లి పోయింది అవి చదివితే, నమ్మండి మీరు. '.... యీ ముదిపాయు పొంగు ముద్దుతే కడియంబుకు దక్కనిమ్ము ....' —అ దేమి టో ఆ పద్ధతి—'ఆంధ్ర దేశస్థ సర్వాంగ్లభాషా కళాశాలలకున్ కనులు చల్లబడెనె ?'—అని వ్రాశాడు.

అంతటి మహాకవి బందరు పట్టణంలో హైస్కూలులో ఉండి అంతవాడు మనకు లేడని తక్కిన కళాశాలలన్నీ చుప్పనాతితనం పడుతున్నాయట, చుప్పనాతితనం. ఆ చుప్పనాతితనం పడడాన్ని గురించి వ్రాశాడు—'ఆంధ్రదేశస్థ సర్వాంగ్లభాషా కళాశాలలకున్ కనులు చల్లబడెనె ?'

ఎందుకు చెపుతున్నానంటే అంత చిన్నప్పుడు 40 ఏళ్ల క్రితం వ్రాసిన తెలుగు కవి, ఆ కవి—ఇంత కవి అని చెప్పడానికి వీలు కాదు. ఆంధ్రభాషకు ఆయన ఒక మహాప్రబంధం వ్రాసిపెట్టక పోవడం ఆంధ్రభాష దుర్దశ అని నా తాత్పర్యం. ఆయన ప్రత్యేకంగా వ్రాసిన గుడిగంటలు గాని, రావణాసురుణ్ణి గురించి వ్రాసిన పద్యాలు గాని, మా వూరు అని వ్రాసిన పద్యాలు గాని శైలిలో వాటి కవే సాటి. అంత రమణీయమైన శైలి పరమేశ్వరుని యొక్క అనుగ్రహం లేకుండా రాదు. ఆంధ్రభాషలో ఉన్నటువంటి ఒక విధమైన సౌకుమార్యం ఒకానొక మెత్తదనం—ఇదంతా వడపోసి అతని కవిత్వంలో ఉన్నదా అనిపిస్తుంది—అతని కవిత్వం. **—విజయవాడ ఆకాశవాణి సౌజన్యంతో.**

కాటయవేముని అన్నవరదానశాసనము - కొన్ని చరిత్రాంశములు

శ్రీ తురగా కృష్ణమూర్తి

పరిశోధకులు దుర్గమమగు కీకారణ్యసీమల నల్లిబిల్లిగాఁ బెరిగిన ముండ్లపొదల, అక్కసరుస్సుల, మేటిమ్రానుల భేదించి, యొకమార్గము నేర్పరచు పథనిర్మాతలవంటివారు. దుర్గమారణ్యసీమలఁ దొలుదొల్త భేదించుపని బహుళ కష్టసాధ్యము. ఆవెనుక వచ్చువారికా పని కొంతలో కొంత సుకరమై, అభివృద్ధిపరచుటకుఁ గొంత వెసులుబాటు నొసంగును. ఆపిమ్మట వచ్చు తరమువారికా యగమ్య మార్గము సుగమమై, రాచబాటలఁ దీర్చిదిద్దుటకుఁ గడుంగడు సులభసాధ్యమై యుండును. అటులనే చారిత్రక పరిశోధకుల విషయమునఁగూడను. శాసనాద్యాధారములు పుష్కలముగా లభించని పూర్వపు రోజులలో నున్న కొద్దిపాటి యాధారములఁ బట్టి నిర్మించిన చరిత్ర, చేసిన నిర్ణయములు, యూహించిన యూహలు క్రమశః క్రొత్త విషయములు—అవిశాసన రూపమున నైన నేమి, గ్రంథరూపమున నైననేమి, తదితర రూపమున నైననేమి— బయల్పడినపుడు పూర్వ చరిత్రగతి మారిపోయి, నూత్నాంశములు వెలుగు చూచి, తదనుగుణముగ పూర్వ సిద్ధాంతములను మార్చివేసి, యదార్థ చరిత్రను నిర్మించుటకుఁ గొంత నూత్న సామగ్రి నందిచ్చి, క్రొత్త రూపమును చరిత్రకు సంతరింపఁజేయు నవసరమును, అవకాశమునుఁ గల్పించును. అట్టి చారిత్రక ప్రాధాన్యత గల్గి రెడ్డిరాజుల చరిత్రములో నింతవరకు వివాదగ్రస్తములుగా నుండిపోయి, కొమ్ములు తిరిగిన గొప్ప చారిత్రక పరిశోధకులకే తలనొప్పి ఘటిల్లఁ జేసి, అపరిష్కృతములుగా నిల్చిపోయిన రెండు, మూడు ముఖ్య వివాదాంశముల పరిష్కరించి, నిర్ణయింపగల సాధన సామగ్రి నొసంగిన కాటయవేముని అన్నవరదాన శాసనమీ దృష్టితో ముఖ్యాతి ముఖ్యముగా నెన్నఁదగినదై యున్నది.

ఈశాసనమును సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు శ్రీ కొల్లూరు హర్షవర్ధన శర్మగారు "భారతి" (సంపుటము 37—సంచిక 10) లో ప్రచురించి యున్నారు. శ్రీ శర్మగారీ శాసనమును ప్రకటించుచు "రెడ్డిరాజుల చరిత్రమునకీ శాసన మత్యన్తోపయోగకరమైనది. ఇంతవఱకుఁ దెలియని అపూర్వమైన చరిత్రాంశముల నిది మొట్టమొదటిసారిగ దెల్పుచున్నది", అని ప్రశంసించి యున్నారు. నూతన చారిత్రక పరిశోధనలో యుత్సాహమునుఁ జూపుచు, క్రొత్త క్రొత్త చారిత్రక విషయములను సోపపత్తికముగా నిరూపించుచు, పరిశోధనా రంగమున కృషిసల్పుచున్న శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రిగారు కూడ దీని ప్రాశస్త్యము నన్నివిధముల గుర్తించుచు "ఇది రెడ్డి ప్రభువుల చరిత్రమునుఁ దెలుపుటలో నమూల్యమయిన స్థానము గలది. ఆ రాజుల పాలన విషయమున నీ వఱకు వెలుఁగులోనికి రాని అమూల్యమైన విషయము లెన్నియో బయటకు వచ్చినవి. రెడ్డిరాజుల చరిత్రమును రచించువారి కెన్నియో చిక్కుల నిది విడదీసి పెట్టినది", యని ప్రశంసించి యున్నారు. ఇంతగా వీరి ప్రశంసల నందుకొన్న యీ శాసనములోని విషయ ప్రాధాన్యత లెట్టివి ? ఆ విషయము లింతవఱకు చారిత్రక పరిశోధకులను కలవరపఱచు సమస్యలను యిదమిత్థముగా పరిష్కరించుట కెట్లువకరించినవి ? అట్లు సహాయపడుచునే నిది యేమేని క్రొత్త సమస్యల లేవఁదీసినదా ? యను విషయ విమర్శ చేయుట కుద్దేశింపబడినదీ వ్యాసము.

శ్రీ శర్మగారీ శాసన పూర్వ పరిశోధకులకు విడివడని చిక్కులుగా నుండిపోయిన మూడు సమస్యలను పరిష్కరించి పెట్టినదని వ్రాయుచు, వాని నీ క్రింది విధముగా సూత్రీకరించి యున్నారు.

(1) ఇదివరకు చరిత్రకారు లందఱు నంగీకరించినట్లు అనవోత, అనవేమారెడ్డులు ప్రోలయవేముని ఔరసపుత్రులు కారనియు, ఆతని తమ్ముడు అన్నయరెడ్డికి అన్నమాంబయందు జనించినవా రనియు, ప్రోలయవేమునిచే దత్తపుత్రులుగా స్వీకరింపబడినవా రనియు నది మొదట విషయమనియు;

(2) ఇంతవరకు పరిశోధకులకు వివాదాస్పదమై, పలువురిచే పలు తెఱంగుల నిర్ణయములుగావింపబడిన కుమార గి

రెడ్డి సోదరి, కాటయవేముని భార్యపేరిందులో సుస్పష్టముగా నుండుట రెండవదనియు;

(3) కుమారగిరిరెడ్డి మరణమును గూర్చి దెల్పుట మూడవ దనియుఁ దెలియపరచి యున్నారు. శ్రీ శర్మగారు నుడివినట్లు ఈ శాసనమా మూడు విషయముల నింతవరకు చారిత్రక పరిశోధకులకుఁ గొరకరాని కొయ్యలుగా నుండిపోయిన సమస్యల పరిష్కరించిన దనుట నిజమై యున్నను పరోక్షముగా నంతకంటె క్లిష్టతరమైన సమస్యల సృష్టించి పరిశోధకుల వ్యాసంగమునకు మరల గొంత పని కల్పించి, "ఔను" "కాద"ను వివాదల రేపి, యూరకున్నది.

అనపోతారెడ్డికి భార్యలిద్దరా?

అన్నవరదాన శాసనము పరిష్కరించినదన్న మూడు విషయములలో నాద్యంత విషయములను వదలివైచి, మధ్య విషయముఁ దీసికొని చర్చింతము. ఏమన—శ్రీ శర్మగారు నుడివినట్లు యింతవరకును కుమారగిరి సోదరి, కాటయ వేముని భార్య, అనపోతుని కుమార్తెయైన ఆమె పేరు మనకెంత మాత్రము లభింపకుండ నుండ నేటి అన్నవర శాసనము వలన నా కొరత తీర్చబడినదని ఘంటాపథముగా వక్కాణింపబడుటలో నుత్పన్నమైన క్లిష్ట సమస్యలు కారణముగా నద్దానిని చర్చించవలసిన యగత్య మేర్పడినది.

మొదటలోనే అన్నవర శాసనము ఇంతవరకుపలబ్ధములైన శాసనాదికములలోని విషయములను, గ్రంథస్థములైన విషయములను అన్యథాకరించుచున్నది. అన్నవర శాసనములోని 33 వ శ్లోకములో:—

కన్యోదభూన్నారప భూపతేర్యా।
లక్ష్మీర్యథాశుద్ధా దివదుగ్ధ సింధోః।
తా మన్య మాఖ్యా ముదవోఢ విష్ణు।
ర్లక్ష్మీ మివాఖ్యా మనవోత భూపః॥

అని అనవోతారెడ్డి నారభూపతి కుమార్తె అన్యమాంబను పెండ్లాడినట్లుగా చెప్పబడినది. తరువాతి శ్లోకమున:—

కుమారగిరి సంజ్ఞకం తనయ మన్య మాఖ్యాంసుతా
మసూత కులపాలికా తదను సాన్యమాంబా యమా 1॥

అని అన్యమాంబ యం దనవోత భూపాలుడుకుమారగిరి యను కొమరుని, అన్యమాంబ యను కుమార్తెను కవలలుగాఁ బడసెనని వక్కాణింపబడినది.

నిజముగా శ్రీ శర్మగారు చెప్పినట్లే అన్నవరదాన శాసనమిదివరలో లభ్యములైన తామ్ర శిలాశాసనములకు విభిన్నమైన విషయ ప్రసక్తులతో కూడినదే యగును! కాని—శ్రీ శర్మగారనినట్లు యింతవరకు చారిత్రక పరిశోధకులకు విడివిడని సమస్యలుగా నిలిచియున్న విషయములను ఈ శాసనము సంశయ విచ్ఛేద మగునట్లు తెలివిడిచేయ సమర్థమై యున్నదన్న మాట యెంతవరకు నిజమో తెలియరాదు! ఇప్పటివరకు అనవోత భూపాలుని భార్య "మనుమాంబిక" యని యీ క్రింద నుదహరించిన గ్రంథ, శాసన సామగ్రి వలన స్పష్టమై యున్నది.

(ఎ) ద్రాక్షారామ భీమేశ్వరుని ఆలయములో పశ్చిమ ప్రాకారం దగ్గర పడియున్న పగిలిపోయిన రాతిమీది శాసనంలోని "అనవోత ప్రభోః పత్నీ సపత్నీ ధరణీశ్రియోః। అనేక సుగుణైః శ్లాఘ్యాంబికా మనుమాంబికా", యను శ్లోకము 2.

(బి) రెడ్డి సంచిక (పే. 71)—"అనవేమారెడ్డి అనంతరము అనపోతారెడ్డి కుమారుడు కొమరగిరి రెడ్డి క్రీ. శ. 1385 వ సం. సింహాసన మెక్కెను. ఈతని తల్లిపేరు 'మనుమాంబిక'. కుమార గిరీశ్వరుని ప్రసాదము వలన జన్మించినవా డగుటచే కుమారగిరి యని యీతనికి నామకరణము చేయబడెను 3.'

(సి) రెడ్డిరాజులు (పే. 52)—"అనవేమారెడ్డి పిమ్మట ననపోతారెడ్డికి 'మనుమాంబ' యనెడు భార్యయం దుద్భవించిన కొమరగిరి రెడ్డి సింహాసనము నధిష్ఠించెను." 3 (ఎ)

---

1 ఈ శ్లోకమునకు వేరొక యర్థమును శ్రీహర్షవర్ధన శర్మగారు సూచించుచున్నారు. ఇది వారు మొదట "భారతి" లో ప్రచురించిన దానికి భిన్నమైనను సమర్థనీయముగా కనుపించుచున్నది. అదే మన: "అన్యమాంబకుమారగిరి యను పుత్రుని 'అన్యమాంబ' యను పుత్రికను అనంతరము యిరువురు కవలలను కనెను", అని.

2 ఈ ద్రాక్షారామ శాసనమునకై శ్రీ హర్షవర్ధన శర్మగారు భీమేశ్వరాలయ మంతయు గాలించి వెదకినను కనుబడలేదని తెలియుచేయుచున్నారు! శ్రీ రమణయ్యగారు "రెడ్డి సంచిక" లోను, శ్రీ ప్రభాకరశాస్త్రిగారు "శృంగార నైషధము" లోను యెత్తి వ్రాసిన యీ శాసన పంక్తులు మెకంజీ దొరవారి వ్రాత ప్రతి నుండియే యై యుండవలెనని వారు అభిప్రాయపడుచున్నారు.

3-3 (ఎ) ఈ వ్రాతలు గూడ శ్రీ మెకంజీ దొరవారి వ్రాతల నాధారముగా నుట్టంకించబడినవే గాని యితర ఆధారములఁ బురస్కరించుకొని వ్రాసినవి కావని శ్రీ హర్షవర్ధన శర్మగారి భావన.

కాటయవేముని అన్నవరదానశాసనము - కొన్ని చరిత్రాంశములు

అన్నవరదాన శాసనము బయల్పడక పూర్వము నుండియు ననవోత భూపాలుని పత్ని "మనుమాంబిక" యనియు నామెకు "కుమారగిరి రెడ్డి" జన్మించి పైతృక సింహాసనమును తన బావమఱది కాటయవేముని సహాయ సంపత్తుల వలన నధిష్టించి, రాజ్యపాలన మొనరించెననియు నిశ్చయింపబడి యున్నవి. కుమారగిరి కొక సోదరి యుండెననియు నామెను కాటయవేముడు ద్వాహ మాడెననియు మాత్రము తెల్పబడినది. ఆమె పేరు మాత్ర మెచ్చటను స్పష్టీకరింపబడక వివిధ చరిత్రకారుల దృష్టికి వివిధ తెరంగులఁ దోపఁజేసి, జటిల సమస్య నుత్పాదింపఁ జేసినది. ఈ విషయమై ముందు ముందు ప్రస్తావింపనై యున్నాను. గాన యిట ననవోతారెడ్డి భార్యలుగా వివరింపబడిన "మనుమాంబిక" "అన్యమాంబ"ల విషయమై కొంత చర్చింతము.

అన్నవర శాసనము బయల్పడు వరకు అనవోతు రాణి "మనుమాంబిక" గా నిర్ధరింపబడి వ్యవహరింపబడుచున్నది. ఈమె జననీ, జనకుల ప్రశంస యెందును గానరాకుండ పోయినది. కాని—అన్నవరదాన శాసనము బయల్పడి, అనవోతునకు నార భూపతి తనయ "అన్యమాంబిక" యను నామెయే భార్యయై యుండెనని తెలుపుచున్నది. అందుచే నిప్పుడు అనవోతారెడ్డి కిర్వురు భార్య లున్నట్లు స్పష్టపడు చున్నది! ఇది యొక క్రొత్త విశేషము!

ఇది నిజముగా నొక క్రొత్త విశేషమే! ఇందుమూలమున అనవోతారెడ్డికి "మనుమాంబిక" వలన నొక "కుమార గిరిరెడ్డి" జన్మించగా "అన్యమాంబిక" వలన వేరొక "కుమార గిరి" యను కొమరుడును "అన్యమ" యను కుమార్తెయుఁ గవలలుగా జన్మించినట్లు స్పష్టమగుచున్నది. అందుచే అనవోతునకు "కుమారగిరి" నామాంకితులగు ఇర్వురు కుమారులు కలరని తేలుచున్నది. ఇదియొక యసంభవమైన విషయము గాదు. ఒక వ్యక్తికి భిన్న వ్యక్తులగు భార్యల వలన ననేక నామధారులగు పుత్రు లుండుట అసహజము కాదు. ఏకనామధారులగు సోదరులు ఒకే మాతృ సంతానమై యుండుటగాని, వైమాత్రేయులై యుండుటగాని పొసగ వచ్చును. అందు విడ్డూర మేమియు లేదు. వారల నిర్ధరించి, వివక్షించి పిలుచుటకుగాను "పెద్ద" "పిన్న" తారతమ్య వాచ్యముల నుపయోగించియో, మరొక విధముననో వ్యవహరించుట లోక ప్రసిద్ధమే! కావున అనవోతారెడ్డి కిర్వురు భార్యలుండి, అందు నొక యామె "మనుమాంబిక" యై వేరొకతె "అన్యమాంబ" యై యుండుట గూడ పొసగవచ్చును. ఇట్లని సరిపెట్టుకొనుటకు ఇంతవరకు మనకు లభించిన చరిత్ర సామగ్రి గాని, సాహిత్య సంపద గాని అనవోతారెడ్డి కిర్వురు "కుమారగిరి" నామకపుత్రు లుండినట్లు తెలుపుటలేదు! అయిన నీ విరుద్ధ విషయముల సమన్వయపరచు టెట్లు?

తామ్రశిలా శాసనోత్కీర్ణ నిపుణుల ప్రమాదము వలన దొరలిన తప్పుల వలననో లేక చరిత్రకారులు శాసన పాఠములు జదివి గుర్తించుటలో పొరబడుట వలననో, అనపోతారెడ్డి భార్యపేరు "అనుమాంబ" కు బదులుగా "మనుమాంబ" అని యూహించుకొని, వ్రాసికొని, గతానుగతికముగా చరిత్రను చర్విత చర్వణముగా రచించుటలో తన్నామమును "మనుమాంబిక" గనే స్థిరపరచి యుండవచ్చును. కాని—అది వాస్తవమునకు "అనుమాంబ" యై యుండి క్రమశః "అనమాంబ" "అన్నమాంబ" లుగా మారి, తచ్ఛబ్దములు సంస్కృతీకరణము అగుటలో "అన్యమాంబ" "అన్యమ" లుగా రూపొంది యుండవలెను. అందుచే అన్నవరప్పాడు తామ్రశాసనములో నుల్లేఖించబడినటుల అనపోతారెడ్డి దేవేరి "అన్యమాంబ" యై "కుమార గిరిరెడ్డి" "అన్యమ" లకు తల్లియై యుండనగుచున్నది. లేనిచో "కుమార గిరిరెడ్డి" కి "మనుమాంబిక" "అన్యమాంబ" లు తల్లులగుట పొసగదు. అనపోతారెడ్డి కిరువురు "కుమార గిరిరెడ్లు" పుత్రులై యుండి నటుల చరిత్రలో నెక్కడను గానరాదు. అందుచే "మనుమాంబిక" "అన్యమాంబ" లిరువురు నొకరై యుండవలెను గాని భిన్నలగుట పొసగదు. అట్లౌట అనపోతారెడ్డి "అన్యమ" వలన "కుమార గిరిరెడ్డి" "అన్యమ" లను పొందినటులఁ దెల్పు అన్నవర శాసనములోని విషయ మితర శాసనములందును, గ్రంథములందునుఁ జెప్పబడిన విషయములతో సమన్వయమగుచున్నది. కావున అనపోతారెడ్డి "కన్యమ"యను యొక భార్య గలదనియు, నామెయం దాతడు "కుమార గిరిరెడ్డి" "అన్యమ" లను ఇరువురు కవలల గాంచెననియు నిర్ధరింపనగుచున్నది.

కు మా ర గి రి సో ద రి
"అన్యమ"యా? "దొడ్డాంబిక"యా?

అన్నవరదాన శాసనము లభించ నంతవరకు చరిత్రకారులు, కుమారగిరి సోదరి కాటయవేముని భార్య విషయమైన పరిశోధనలో నెవరి చిత్తము వచ్చినట్లు వారు నిర్ణయించి, వారి నిర్ణయములే నిజమైనవని చాటుచు, విషయమును క్లిష్టతరముచేసి విడిచివైచిరి. కుమారగిరి సోదరిలుగా చరిత్ర కెక్కినవారు "దొడ్డాంబిక" "మల్లాంబిక" లు. పైన యుదహరించిన ద్రాక్షారామ శాసనములో "కుమార గిరిరెడ్డి" ప్రసక్తియేగాని, ఆతని భగినీనామ ప్రశంస లేకుండ పోయినది. "రెడ్డి సంచిక"లో శ్రీ వడ్డాది అప్పారావుగారు "కుమారగిరి రాజ్యమునకు రాగానే తన ప్రియ కుమారుని వీరాన్నపోతను యౌవరాజ్యాభిషిక్తునిగా చేసి, ఆతనికి కౌమార భుక్తికై సింహాద్రి పర్యంత దేశమును జయించి యివ్వ గోరెను. అందు నిమిత్తమై తనయప్ప 'దొడ్డాంబిక' భర్తయును, సామ్రాజ్య నిర్వాహకుడును, చతుర్విధోపాయ నీతి ప్రవీణుడును, మహా ప్రభావుడును అగు కాటయవేముని పిలచి, దిగ్విజయ ప్రస్థానమునకు ఆజ్ఞ యిచ్చెను", అని కుమారగిరి సోదరి "దొడ్డాంబిక" యని యుల్లేఖించినారు. అదే సంచికలో శ్రీ అంబటి సూర్యనారాయణ శాస్త్రిగారు "కుమార గిరిరెడ్డి తన చెల్లెలగు "మల్లాంబ"ను కాటయవేమున కిచ్చి

యామె కరణముగా నామె భర్తకు రాజ మహేంద్రవర రాజ్యము నిచ్చెను", యని వాక్రుచ్చి యున్నారు. అదే సంచికలో శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు "కాటయవేముని వైదుష్యము" నుగూర్చి వ్రాయుచు "కుమారగిరి తోబుట్టువ యగు 'మల్లాంబిక' యాతని అర్ధాంగి", యని స్పష్టీకరించి యున్నారు. కీ. శే. చరిత్ర చతురాననులు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులు గారు తమ ఆంధ్రుల చరిత్ర (మూడవ భాగము)లో "ఇతనికి (అనవోతారెడ్డికి) కుమారగిరి రెడ్డి యను కుమారుడును 'మల్లాంబ' యను కుమార్తెయునుఁ గలరు. 'మల్లాంబ'ను తన మేనల్లుఁడగు కాటయవేమున కిచ్చి వివాహము గావించెను", అని వ్రాసియున్నారు. శ్రీ బుర్రా వేంకట నాంచారయ్యగారు "మన వీరుఁడగు కాటయవేముడు తన మేనమామ యనవోతారెడ్డి తనయయగు 'మల్లాంబిక' నుద్వాహమయ్యెను. ఇదే కుమారగిరి రెడ్డికిని, కాటయవేమునకు గల బాధ్యత", యని తమ "రెడ్డిరాజులు" యను గ్రంథములో వాక్రుచ్చి యున్నారు.

ఈపై యుదాహరణములబట్టి కుమారగిరిరెడ్డి సోదరి' అనవోత భూపాలుని పుత్రి, కాటయవేముని పత్ని "దొడ్డాంబిక" యని కొందఱు "మల్లాంబిక" యని కొందఱు తమ తమ నిశ్చయములుగా ప్రకటించినట్లు తెల్లమగుచున్నది. అట్లు ప్రకటించుటకు వారి కెట్టి యాధారములు నుండి యుండవనుట మన మూహింపరాదు. కావున వారు వారికి లభ్యములైన సాధన సామగ్రి ననుసరించియే యిట్టి నిర్ణయమునకు వచ్చి యుందురని మనము విశ్వసింపవలసి యున్నది. అట్టియెడ అన్నవరదాన శాసనములో ప్రసక్తమైన "కుమారగిరి సోదరి అన్యమ" గూడ నీ కోవలోనికే చేరి, కాటయవేముని భార్యలలో నొక్కతె గావలయును గదా ! అందుచే కాటయవేముడు వరుసగా కుమారగిరి సోదరీలగు "దొడ్డాంబిక", "మల్లాంబిక", "అన్యమాంబిక" లనుద్వాహమాడెనని నిశ్చయింప నగుచున్నది ! ఇది అత్యంత లోక విరుద్ధము. వైమాత్రేయులగు అప్పచెల్లెండ్ర నొకే వ్యక్తి యుద్వాహ మాడుట ధర్మసమ్మతముగాని, తదన్యమైన వైవాహిక బంధనము ధర్మ విరుద్ధ మనిపించుకొనుముగదా ! ఈ వ్యాసములోనే ముందు సందర్భమున అనవోతారెడ్డి కిరువురు భార్యలు లేనట్లు రుజువయినది. అట్టిచో "దొడ్డాంబిక", "మల్లాంబిక", "అన్యమాంబిక" ల వైమాత్రేయ సిద్ధాంతమున కాస్కారమెక్కడను లేకుండఁ బోయినది ! అగుచో వీని సమన్వయ మెట్లు ?

అన్నవరదాన శాసనము బయల్పడని కాలములో సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులగు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారీ పరస్పర విరుద్ధ విషయముల పరామర్శించి యొక సమన్వయ మార్గమును సూచింప ప్రయతించుచూ తమ " History of the Reddi Kiugdoms" లో నీ క్రింది విధముగా వ్రాసియువ్నారు:—

'The name of the sister of King Kumaragiri is not definitely known either from inscriptions or literature. According to the late Sri K. V. Lakshmana Rao she was "Mallambika" (A. V. S. Vol: II. P.25). His authority is Katayavema's Daksharama inscription (Ep. Ind. Vol IV. P. 328). This record however does not explicitly state that she was the daughter of Anavota I. While editing the Kaluvacheru grant (A. S. P. P. Vol: III. PP. 103 ff) the late Sri J. Ramayya Pantulu also writes that of "Doddambika" and "Mallambika", the two wives of Katayavema, the latter was the sister of Kumaragiri. Even the Tottaramudi plates of Katayavema do not make the relationship between Mallamba or Kumaragiri or Anavota I clear (Ep. Ind. Vol. IV. PP. 318 ff). Hence there is no definite proof to say that Mallasani or Mallamba was the daughter of king Anavota I and the sister of Kumaragiri.

Following Lakshmana Rao and Ramayya Pantulu the late Sri C. Veerabhadra Rao also wrote that Mallamba was the sister of Kumaragiri (An. Cr. III, P. 171 and P. 256). Mallasanamma was the daughter of a certain Kanniboraya (?) [S. I. I. Vol: V. No. 102] and the sister of Mukkanti Raya. We do not know who this Kanniboraya was. There seems to be some mistake in the reading of the name as such a name is unusual and strange. However it is certain that Mallasani was not the daughter of Anavota and sister of Kumaragiri.'

ఈ వ్రాతలవలన "మల్లాంబిక" అనవోతుని కూతురుఁగాని, కుమారగిరి సోదరిగాని కాదని స్పష్టపడుచున్నది. ఇంక మిగిలినది "దొడ్డాంబిక". "దొడ్డాంబిక" కుమారగిరి సోదరి యని నిర్ణయింపగల శాసనా ద్యాధారములుగాని, గ్రంథసామగ్రి గాని యింతవరకు లభింపలేదు. "దొడ్డాంబిక" ప్రసక్తిగల శాసనము "అనితల్లి", "కలువచేరు శాసనము" దక్క వేరొండేమియు లేదు. ఆ శాసనములో 38 వ శ్లోకమున:—

శ్రీమత్కాటయ భూపతే రుభ్జభృతో నప్త్రప్రతాపోన్నతేః
పౌత్రో మార మహేశ్వరస్య తనయశ్శ్రీ కాటయోర్వీవిభోః

కాటయవేముని అన్నవరదానశాసనము - కొన్ని చరిత్రాంశములు

జావాతా ప్రభు రన్నపోత నృపతే ర్వే మక్షమాధీశ్వరో
యస్యాసీత్స కుమార గిర్యధిపతిస్స్యాలః పతిర్దైవతం॥

అని కాటయవేముడు, అనపోతారెడ్డి కల్లుడనియు, కుమారగిరికి స్యాలకుడనియుఁ జెప్పబడినది. అదే శాసనములో 42 వ శ్లోకమున:—

యస్యా వేమ నృపాలో జనకో దొడ్డాంబికాతు జనయిత్రీ
సాదీవ్యత్యని తల్లీ సమూర్తి రివదేవ భూమి దేవశ్రీ॥

అని "అనితల్లి" తల్లి "దొడ్డాంబిక" యనియు, తండ్రి కాటయవేము డనియు నుగ్గడింపబడెను. ఈ రెండు శ్లోకములను దృష్టిలో నుంచుకొని, కాటయవేముని భార్య "అనితల్లి" తల్లి "దొడ్డాంబిక" కుమారగిరి సోదరి యని చెప్ప సాహసించినారేమో! కాని ఆ సంబంధ మిందు ధ్రువము కాలేదు. కావున కుమారగిరి సోదరి "దొడ్డాంబిక" యని చెప్పగల సాహస మింకను మన కలవడలేదు. అన్నవరదాన శాసన మాధారముగా కుమారగిరి సోదరి, కాటయవేముని భార్య "అన్యమ" యని నిర్ధారింపబడినదిగదా! అందుచేతనే కాబోలు శ్రీ హర్ష వర్ధన శర్మగారు "బహుశః కుమారగిరి సోదరియగు అన్నమాంబనే దొడ్డాంబిక యని వ్యవహరించెడివారేమో తెలియదు", అని తమ అనుమానమును వెలిబుచ్చి యున్నారు. ఈ అభిప్రాయ మెంతవట్టు సమంజసమో విమర్శింతము.

"అన్యమ" "దొడ్డాంబిక" లేకవ్యక్తులా?

"అనితల్లి" కలువచేరు శాసనమునుబట్టి "దొడ్డాంబిక" కాటయవేముని భార్యయు, అనితల్లి జననియునై యుండెనని స్పష్టమైనది. అందు నిర్ద్వంద్వముగా "దొడ్డాంబిక" కుమారగిరి సోదరి యని యుట్టంకింపబడలేదు; గాని—అనవోతు, కుమారగిరి, కాటయవేముల సంబంధ బాంధవ్యములఁ దెలుపు శ్లోకార్థములఁ బట్టి "దొడ్డాంబిక" కుమారగిరి సోదరియై యుండియుండవలెనను యూహచేతకు తావొసంగి, సుప్రసిద్ధ చరిత్రకారులనే కొంత చిక్కులు పెట్టినది! అన్నవరదాన శాసనము బయల్పడి "అన్యమ" యే "దొడ్డాంబిక" యా యన్న యనుమానమును రేకెత్తించినది! ఒక చిక్కును విడదీసి, మరొక చిక్కును కల్పించినది. శ్రీ హర్షవర్ధన శర్మ గారికిఁ గూడ "అస్తి" "నాస్తి"వి చికిత్సాభావ సంఘర్షణ మనుభవింపఁ జేసినది!

కుమారగిరి సోదరీలుగాఁ జెప్పుకొనఁదగు "అన్యమ" "దొడ్డాంబిక" ల ప్రసక్తి ప్రస్తుత అన్నవరదాన శాసనము లోను, అనితల్లి కలువచేరు శాసనములోను తప్ప యితర యే విధములగు శాసనములందు గాని, గ్రంథములందుగానిఁ గానబడుటలేదు. అన్నవరదాన శాసన కాలము శా. శ. 1307 నకు సరియైన క్రీ. శ. 1385 వ సంవత్సరము. అనితల్లి కలువచేరు శాసన కాలము శా. శ. 1345 నకు సరియైన క్రీ. శ. 1423 వ సంవత్సరము. అన్నవరశాసనమున కనుబంధముగా నీయబడిన శాసనకాలము శా. శ. 1324 నకు సరియైన క్రీ. శ. 1402 వ సంవత్సరము. కుమారగిరి కొండవీడు రాజ్యాధిపత్యమును క్రీ. శ. 1382 వ సంవత్సరమున స్వీకరించి క్రీ. శ. 1403 వరకు పాలించినట్లు మన కందరకునుఁ దెలిసిన విషయమే! కుమారగిరి కాటయవేముని రాజమహేంద్రవర రాజ్యమునకు బంపినది క్రీ. శ. 1385 వ సంవత్సరముననే! కావున— కుమారగిరి పనుపున కాటయవేముడు రాజమహేంద్రవర మరుగుచు మధ్యే మార్గమున "అన్యమాంబ" చే నీ దానము చేయించి, తాను పాలకొలను క్షీరా రామేశ్వరునికి భూదాన మొసంగి యొక శాసనము వ్రాయించి యున్నాడు. (S. I. I. Vol V No: 155). అందువలన "అన్యమ" తొలుదొల్తగాఁ దన సోదరుం డిచ్చిన గ్రామమునుఁ దనపేర నగ్రహారముచేసి ధారవోసిన వెనుక, రాజమహేంద్రవరమున నివాస మేర్పరచుకొన్నట్లు నిర్ణయింపవచ్చును. ఆ తరువాత కాటయవేముడు రాజమహేంద్రవర రాజ్య విస్తరణకుఁ బూనుకొని, దిగ్విజయముల సాధించి, రాజ్య విస్తీర్ణ మొనరించి పేరుగాంచెను. కుమారగిరి తనయుఁ డనపోతారెడ్డి పోయిన వెనుక, తాను స్వతంత్రముగ రాజమహేంద్రవర రాజ్యపాలనను స్వీకరించి, కష్టదశలో నున్న కుమారగిరి నాదరించి, తుదకు క్రీ. శ. 1415 వ సం. ప్రాంతమున దివంగతు డయ్యెను. కాటయవేముడు దివంగతుడైన 8 లేక 10 సంవత్సరముల తర్వాత "అనితల్లి" కలువచేరు శాసన మీయబడినది. ఈ శాసనములోనే "అనితల్లి" జనని, కాటయవేముని భార్య "దొడ్డాంబిక" ప్రసక్తి తొలిసారిగా కానవచ్చుచున్నది. ఇంతవర కట్టి సమాచార మే శాసనమునందునుఁ గూడ మన కందఁజేయఁ బడలేదు. అందుచే కాటయవేముడు రాజమహేంద్రవర రాజ్యమునకు కుమారగిరి తనయుడు అనవోతారెడ్డికి రక్షకుడుగా, మంత్రిగా, సేనాధిపతిగా వెడలునాటికి కుమారగిరి సోదరి "అన్యమ" నుద్వాహమై యుండి, యామెతో గూడ రాజమహేంద్రవర రాజ్యమున కేగి, యట దాంపత్య జీవనము నెరపుచు నుండి యుండవచ్చును. ఆ తరువాతఁ గొంతకాలమునకు "అన్యమ" గతించుటచే (పాపము శమించుగాక!) కాటయవేముడు కుమారగిరి మరొక సోదరియగు "దొడ్డాంబిక" ను పరిణయమాడి యుండవచ్చును! ఈ యూహలు నాకుఁ గల్గుటకు కారణము "అన్యమ పులుపర్తి గ్రామమునుఁ దనపేర 'అన్నవరము' గా మార్చి దానమిచ్చిన శా. శ. 1307 చైత్ర బహుళ తదియ జీవదినమునాఁడీ శాసనము లిఖింపఁబడక, తరువాత పదునేడు సంవత్సరములకు అన్యమ భర్త కాటయవేముడు చేసిన దాన సందర్భమును పురస్కరించుకొని శా. శ. 1324 చిత్రభాను సంవత్సర మాఘ శు. 30 పూర్ణిమ బుధవారమునాడు లిఖింపబడుటయే! కాటయవేముడు తన భార్య అన్యమ మరణానంతరము తనయొక్కయు, తన భార్య యొక్కయు పేర్లచే గల వేమావ్యమా వరములను గ్రామముల యౌన్నత్యమునకుగాను సమగ్ర సస్య ఫలాభిరామమై వెనుక యిచ్చిన గ్రామములో మిగిలినదానిని అన్నవర, వేమవర బ్రాహ్మణులకు అభ్యాగతార్చన విధ్యర్థము వేమ భూపతి దానము చేయుటయే! పదిహేడేండ్ల క్రిందట నిచ్చిన గ్రామమునకు దానశాసనము లేకపోగా నిపుడు

ఆ గ్రామములో యిచ్చిన మిగిలిన భాగమును దాన మొసంగు చుండుటచే నెప్పు డెవ్వరిచే నా గ్రామ మెళ్ళు తొలుదొల్త దాన మొసంగఁబడినదో వివరింపవలసిన యవసర మేర్పడి వందున మొదటి శాసన భాగము లిఖింప నవసరము కల్గి, తరువాత యే తత్కాలమున నొసంగబడుచున్న దాన ప్రశంస మొదటి శాసనమున కనుబంధముగా లిఖించుట జరిగియుండ వలెనని తోఁపించుచున్నది.[4]

ఈ అభిప్రాయమునే మొట్టమొదట 1946 వ సంవత్సరమున నీ శాసనమును పరిశీలించిన కధావశేషులు శ్రీ భావరాజు వేంకటకృష్ణారావు పంతులుగారు యథాలాపముగా వెలువరించి యున్నారు. ఈ శాసన ప్రచురణ విషయమై మా యిర్వురి నడుమ నడచిన యుత్తర ప్రత్యుత్తరములలో శ్రీ పంతులుగారు తమ 17—2—50 వ తేదీ గల జాబులో "కాటయవేముడు వరుసగా కుమారగిరి సోదరీలను ఇద్దరిని పెండ్లియాడి యుండు. అన్నమ చనిపోవుటచేత కావలయు కాటయవేముడు ఆమె చెల్లెలిని 'మల్లాంబిక' ను (ఇట పంతులుగారు పొరబడిరి: 'దొడ్డాంబిక' యని యుండ వలెను) యుద్వాహమయ్యెను. అన్నవరప్పాడు శాసనమువల్ల ఇవుడు కాటయవేమునకు ముగ్గురు భార్య లున్నట్లున్ను కుమారగిరిరెడ్డి చెల్లెండ్ర నిద్దరిని పెండ్లియాడినట్లు తెలియు చున్నది", అని వ్రాసియున్నారు.[5]

అనవోతారెడ్డి కిర్వురు భార్యలు లేనందున, యేకగర్భ జనితులైన యప్పసెల్లెండ్ర నొకరు జీవించి యుండగనే రెండవవారి నొకే వ్యక్తి వివాహమాడుట ధర్మసమ్మతము గాదను తలంపుననే "అన్యమ" గతించినవెనుక నామెసోదరి "దొడ్డాంబిక"ను కాటయవేము డుద్వాహమాడియుండవలె నను సిద్ధాంత మువపాదించితిని. శ్రీ పంతులుగారి వ్రాత నా యూహను బలపరచుచున్నది; కాని శ్రీ శర్మగారు నా వాదన లోని యేకమాత్రేయ సిద్ధాంతముపై "నన్యమ" బ్రతికి యుండగనే కాటయవేముడు ఆయనసోదరి "దొడ్డాంబిక"ను ద్వాహ మాడుటలో ధర్మ ప్రయత్నమున్నదను హంశమును హర్షింపలేమనియు, నిజముగ "దొడ్డాంబిక"యేగాక "అన్యమాంబ"యేగాక భిన్నవ్యక్తియు, నామెసోదరియు యైన నామెనుగూడ "అన్యమాంబ" జీవించియుండగనే కాటయవేముడు పరిణయ మాడెననుట యుక్తమని వారినమ్మకమనియు, ఇరువురు యేకమాత్రేయులో లేక వైమాత్రేయులో మనకు స్పష్టమగు ఆధారము లేదనియు, మరియువారు రెడ్లను విషయము మనము మరువరాదనియు, నక్కసెల్లెండ్రు సజీవముగా నుండ నొకేవ్యక్తిని పెండ్లాడుట ధర్మశాస్త్ర నిషిద్ధముగాదనియు, అంబ, అంబిక, అంబాలికలను సకలధర్మ శాస్త్రములను యెఱింగిన భీష్ముడు తన తమ్ముడు విచిత్రవీర్యునకు పెండ్లిచేయఁ దోడ్కొనిరాలేదా ? అని దృష్టాంతపూర్వకముగా ప్రశ్నించుచున్నారు. ఈ మావాదనలలోని బలాబలములను నిర్ణయించు భారము విజ్ఞులకే వదలి వేయుచున్నాను.

ఈ పై కారణమువలన "అనితల్లి" జనని "దొడ్డాంబిక" కుమారగిరి సోదరీలలో నొకతెయనుటకు తగుసావకాశము లభించుచున్నది. అందుచే రాజమహేంద్రవరము కాటయవేముని వెనుక "ననితల్లి"కి సంక్రమించుట సమంజసమైనదిగా సమర్థింప వీలగుచున్నది. "కలువచేరు శాసనము"లో గూఢముగా స్ఫురింపఁ జేయబడిన కాటయవేమనవోత కుమారగిరుల సంబంధ భాంధవ్య విషయక ప్రస్తావన సార్థకత నందుచున్నది ! అందుచే నింతకు తేలిన సారాంశమేమన "అన్యమ" "దొడ్డమ" లేక వ్యక్తులుగారనియు, వారు కుమారగిరి సోదరీలనియు ననునదియే !

"అన్యమ" "దొడ్డమ" లక్కసెల్లెండ్రని నిరూపింప గల సాధన సామగ్రి మనకింతవరకు లభ్యముగానిమాట వాస్తవము; కాని— అనితల్లి కలువచేరు శాసనమునుండియు, అన్నవర శాసన రచనా పద్ధతినిబట్టియు నీ నిర్ణయమునకు వచ్చుట యైనది. ఇందలి నిజానిజములు భావిపరిశోధనచే నిరూపింపబడునంతవరకు యీ నిర్ణయము నిర్బాధకముగా మన మంగీకరింపవచ్చు ననుకొందును !

---

4. ఈ నా యూహతో శ్రీ హర్షవర్ధన శర్మగారు ఏకీభవించుటలేదు. రెండవ అనుబంధ శాసన కాలము నాటికి అన్యమాంబ జీవించియున్నదనియే వారి విశ్వాసము. "'స్వస్వ కళత్రయోః గ్రామౌ సమున్నతిం నేతుం' ఇత్యాదిగా అన్యమాంబికను పేర్కొనడు. మరియు నాటికి కుమారగిరి చనిపోయినట్లు చెప్పినవాడు, అన్యమాంబ చనిపోయినచో తెల్పియుండడా ?" అని ప్రశ్నించుచున్నారు. అదియునుగాక మిగిలిన గ్రామ భాగము "కడిమి" ని యెందుల కిచ్చెనో "ఇష్టార్థసిద్ధి పరితుష్ట నిజాశయానాం", అని స్పష్టముగ నా బ్రాహ్మణులు కోరినందున యిచ్చినట్లు తెల్లమగుచున్నదని తెల్పుచున్నారు.

5. కీ. శే. భావరాజువారి అభిప్రాయముతో గూడ తా మేకీభవింపలేమనియు, కుమారగిరి మరొక సోదరి "దొడ్డాంబిక" యను నామె యుండిన యుండవచ్చుననియు, ఆమెనుగూడ కాటయవేముడు వివాహమాడి యుండవచ్చుననియు, అందుకొఱకై వాధనా సౌలభ్యమునకుగాను అన్యమాంబను చంపివేయ నక్కరలేదనియు, "కుమారగిరి సంజ్ఞకం తనయ మన్యమాఖ్యాంసుతా మసూతకుల పాలికా తదనుసాన్యమాంబాయమా" యను శ్లోకమునకు వారు సూచించిన యర్థములోనే "దొడ్డాంబిక" యునికి గూడ గర్భితమై యున్నదనియు తెల్పుచున్నారు. ఈవిధముగా నైనను శర్మగారు "అన్యమ" "దొడ్డమ" లేక వ్యక్తులుగారనిరి. (సశేషం)

గురజాడ: వర్డ్స్‌వర్తు

డా॥ సి. నారాయణరెడ్డి

గురజాడ వారిపై ఇరువురు మహాకవుల ప్రభావముంది. ఒకరు వర్డ్స్‌వర్తు, రెండోవారు రవీంద్రుడు. ఈ యిరువురిని గూర్చి గురజాడవారు ప్రశంసాపూర్వకంగా వ్యాసాలు వ్రాశారు. రవీంద్రునితో ఉత్తర ప్రత్యుత్తరాలుగూడా జరిపారు. అయితే వీరిపై వర్డ్స్‌వర్తు కవిత్వ ప్రభావమున్నట్లు రవీంద్రుని రచనల ప్రభావంలేదు. రవీంద్రుని వ్యక్తిత్వ విశిష్టత మాత్రం వీరిని ఆకర్షించింది.

Lyrical Ballads ద్వితీయ ముద్రణ పీఠికలో వర్డ్స్‌వర్తు ప్రవచించిన కవితా సిద్ధాంతాలకూ, గురజాడవారి ముత్యాలసరాల్లో ప్రతిబింబించిన కవిత్వ తత్వానికీ ఎంతో సాదృశ్యముంది. కృత్రిమతకు దూరంగా నిసర్గసుందరంగా ఉండే ప్రకృతిఒడిలో పుట్టిపెరిగే పల్లీయుల బ్రతుకును కవితా వస్తువుగా చేసుకోవలెనని వర్డ్స్‌వర్తు అభిప్రాయపడినాడు. అతని 'మైకేలు', గురజాడ 'లవణరాజుకల'లోని మాలెత ఈ దృష్టితో నిర్మింపబడిన పాత్రలే.

కవితారంగంలో నే పథ్యంలో పడిపోయిన ప్రకృతికి గజ్జె కట్టించిన మహాకవి వర్డ్స్‌వర్తు. అతనికిముందున్న ఆంగ్ల కవులు అడపాదడపా ప్రకృతిని చిత్రించలేకపోలేదు. అయినా ఆ ప్రకృతి చాలావరకు ప్రాచీన ప్రబంధాల్లోనుంచి ఎరువు తెచ్చుకున్నదే. ప్రత్యక్ష దర్శనంవల్ల అనుభవంలోకి వచ్చింది కాదు. వర్డ్స్‌వర్తు అలాకాక తాను తనివితీర దర్శించిన ఋతుపరివర్తనాన్ని, కొండలను, నదీనదాలను, పూలను, గాలిని, నింగిని, నేలను స్వభావరమ్యంగా వర్ణించాడు. మానవుని వయోదశల్లో అన్నిటికంటె నిష్కల్మషమూ, ప్రప్రథమమూ అయిన బాల్యాన్ని మిన్నులకెత్తడం ఈ కవి ప్రత్యేకత. పసివానిని పరమర్షిగా, శిశువును భవిష్యత్పితగా భావించడం ఈతని విశిష్టత. గురజాడవారుగూడా వర్డ్స్‌వర్తులాగే కవిసమయ పంజరంలో చిక్కిపోయిన ప్రకృతికి విముక్తి కలిగించారు. తెలుగునాట తాము కళ్లారచూచిన ప్రకృతిదృశ్యాలనే మనసార వర్ణించారు. 'లవణరాజుకల'లో వారు చేసిన ప్రకృతి వర్ణనయిది.

"తాడివనములు తూర్పుకొండను
గొడుగు లెత్తెను; చామరంబులు
నిడిపె జీలుగు, లుడుగణంబులు
దవ్వులను నిలిచెన్.
చల్లగాలులు సాగి యలలుగ
జల్లు జల్లున రాల్చె పూవుల...."

'డామను పితియను'లో కొండకోన ప్రక్కనున్న భవనరాజం, దానిలోని నారింజచెట్లు, అలివిచెట్లు, ద్రాక్ష పందిరులు ప్రకృతి వర్ణనల్లో చేరిన రమ్య విషయాలు.

'కొండల నడుమను కొనొకటున్నది
కోనకి నడుమా కొలనొకటుంది
కొలని గట్టునా కోవెల లోపల
వెలసెను బంగరు దుర్గమ్మ'.

అనే 'పూర్ణమ్మ'లోని వర్ణన ఈ కోవకు చెందిందే. ఇక పూజారింట బుట్టిన పూర్ణమ్మ 'ఏ యే వేళల పూచే పువ్వుల ఆ యా వేళల' దుర్గ కందించేదట. 'ఏ యే ఋతువులపండే పళ్లను ఆ యా ఋతువుల్లో' అందించి, బంగరు దుర్గను భక్తితో కొలిచేదట. ఈ గేయంలోనే వసంతాగమనంతో ప్రకృతిలో కల్గిన పరిణామాన్ని గురజాడవారు ఎంతో రస విస్ఫురంగా వర్ణించారు.

'ఆమనిరాగా దుర్గ కొలనులో
కలకల నవ్వెను తామరలు
ఆమనిరాగా దుర్గవనములో
కిలకిల పలికెను కీరములు'.

ఈ రకంగా గురజాడవారు వర్డ్స్‌వర్తులాగే ప్రకృతిని ఊహాల ఇంద్రజాలంలేని స్వభావ రమ్యదృష్టితో చిత్రించారు. ఇదే వారి ప్రత్యేకత. గురజాడవారి కవితా సంపుటిలోలేని ప్రకృతి వర్ణనలు కొన్ని వారి 'మాటా మంతీ'లో దొరికినవి. 'ప్రకృతి అనే పుస్తకం' అనే శీర్షికతో వారు చేసిన ప్రకృతి వర్ణనలు వర్డ్స్‌వర్తు మున్నగు కాల్పనిక కవుల రచనలకు ఏమాత్రం తీసిపోవు. ప్రకృతిని పుస్తకంగా భావించడంలో వర్డ్స్‌వర్తు ప్రభావం తొంగి చూస్తున్నది. ప్రకృతిని ఒజ్జగా భావించిన ప్రథముడు వర్డ్స్‌వర్తే. గురజాడవారు పై శీర్షికక్రింద ప్రకృతి దర్శనంవల్ల తమలో కలిగిన భావ వీచికలను చిత్రించారు. అయితే ఇవి వచనంలో ఉండడంవల్ల కవిత్వం క్రిందికి రాకపోవచ్చు. కొంత వర కివి వచన గీతాల వాసనల్ని గుబాళిస్తున్నాయి. మచ్చున కొకటి రెండు పొందుపరుస్తాను.[1]

1 ఈ వర్ణనల్లో 'లయ' లేదు. అదొక్కటేవుంటే ఇవి వచన గీతాలే అయిపోయేవి.

"వాన వెలిసెను. నీటి బిందువులు ఆకుల నంటి, చెట్లను ముత్యములతో గప్పి యున్నటుల చేసెను. వెలగాడ కొండపై నొక నల్లని మేఘ శకలము చందురునిపై నన్నని బట్టవలె కమ్మి మళ్లీ అంతలోనే పక్కకు వొత్తిగిలినది. పొన్నాకులపై చంద్ర కాంతి ప్రతిఫలించి ఆకులకు తళతళ మెరుగులు వెట్టినది".2

"గాలి యీాలలువేస్తూ, తలుపు సందుల దారి చేసుకొని ధ్వని చేస్తున్నది......గుంపులు గుంపులుగా, సైనికులవలె నిల్చున్న తాటిచెట్లు........చిన్న చిన్న మేఘములు అభ్రకమువలె తెల్లగా వున్నవి. గాలికి దూది పింజలవలె మబ్బులు తేలిపో తున్నవి".3

"కొండ చిలువవలె భయంకరమైన కళ్లు పెట్టుకొని కోటవద్దనుంచి రైలు వస్తోంది".4

ప్రకృతిని ఈరకంగా వర్ణించడం ఆ రోజుల్లో గొప్ప నవ్యతే అనాలి. ఈ వర్ణనల్లో కనిపించే తాటిచెట్లు వారి కవిత్వంలో రెండు మూడు సందర్భాల్లో చోటు చేసుకున్నవి.

వర్డ్సువర్తు కవిత్వానికి నిర్దిష్ట ప్రయోజన ముండవలెనని భావించాడు. Ly.ical Ballads పీఠికలో ఆత డిలా వ్రాశాడు.

"......The Poems in these volumes will be found distinguished at least by one mark of difference, that each of them has a worthy purpose"

తాను ప్రయోజన గర్భితమైన రచనలు చేశానని చెబుతూ వర్డ్సువర్తు, ఉదాహరణకు Idiot Boy, Mad Mother, We are seven అనే రచనల్ని పేర్కొన్నాడు. ఇవి సందేశాత్మకమైన రచనలే. గురజాడవారు గూడా కవిత్వానికి గొప్ప సాంఘిక ప్రయోజనముందని భావించారు. వారి కన్యాశుల్క నాటకం సమాజంలోని కుళ్లను వెలికి జిమ్మిన బలవత్తరమైన రచన. వారి 'ముత్యాలసరము'లనే గేయం సంఘంలో పాతుకుపోయిన మూఢ విశ్వాసాల కెదురు దిరిగిన రచన. అలాగే వారి దేశభక్తి, పూర్ణమ్మ, కన్యక లాంటివి సాంఘిక, నైతిక ప్రయోజనాన్ని ప్రతిపాదించిన కావ్య ఖండాలు. కావ్య ప్రయోజనాన్ని గూర్చి గురజాడవారే స్వయంగా ఇలా అన్నారు.

'Literature Cannot have a higher function than to show up such (bad) practices and give currency to a high standard of moral ideas'.5 కావ్యం 'ఉపదేశయుజే' అన్న ప్రాచీన సూక్తికి సరిపోతుందిది.

కవిత్వానికి అలంకారప్రాయమని పలువురు భావించే శైలీ ప్రాబల్యాన్ని (Diction) వర్డ్సువర్తు నిరసించాడు. Lyrical Ballads ద్వితీయ ముద్రణ పీఠికలో ఆయన వ్రాసిన మాట లీ సందర్భాన గమనించదగినవి.

'There will also be found in these volumes little of what is usually called poetic diction; I have taken as much pain to avoid it as others ordinarily take to produce it'.

గురజాడవారు కృత్రిమ పదబంధాలను అసహజమైన శైలిని నిరసించిన విషయం సుప్రసిద్ధమేకదా.

వర్డ్సువర్తు పద్యానికీ, గద్యానికీ అంతగా భేదం లేదని సిద్ధాంతం లేవదీశాడు. వచనంలాగాఉండే కవిత్వాన్ని 'prosiasm' పేరుతో ఈసడించే విమర్శకుల నీతడు విమర్శించాడు. ఛందస్సు (Metre) ను వదిలివేస్తే ఉత్తమ కావ్యాలనబడేవాటిల్లో చాలా భాగం వచనం లాంటిదే అని అభిప్రాయపడినాడు. మిల్టన్ మహాకవి వ్రాసిన 'Paradise Lost' కావ్యంలో రసవత్తర ఘట్టాల్లో చాలావరకు వచన సమ్మితమే అని అన్నాడు. పైగా పట్టి ఛందస్సువల్ల కలిగే ఆనందం స్వల్పమని అన్నాడు. వస్తు చిత్రణంలో కౌశలం చూపవలెగానీ, ఛందస్సులో ఏముందని ప్రశ్నించాడు. గురజాడవారు ఇలాంటి సిద్ధాంతాలు చేయనప్పటికిన్నీ లక్ష్యరూపంలో ఈ బాటనే అనుసరించారు. పద్య కవిత్వానికి పరంపరగా ప్రాప్తించిన కృత్రిమతాగంధాన్ని తొలగించి, దేశిచ్ఛందస్సులను స్వీకరించి, వాటిని వచనానికి దగ్గరగా నడిపారు. పద్యానికున్న నిర్బంధాలను (యతిప్రాసాదులను) తృణీకరించడంవల్ల సరళమైన గేయచ్ఛందస్సుల్లో కవిత్వం వ్రాయడంవల్ల వీరు వర్డ్సువర్తు సిద్ధాంతానికి సన్నిహితులయ్యారు.

వర్డ్సువర్తు వ్రాసిన చిన్న చిన్న కథా కావ్యాలవల్ల గురజాడవారు ప్రభావితులైవుంటారు. వీరి లవణరాజుకల, డామను పిథియసు మున్నగునవి వర్డ్సువర్తు వ్రాసిన Native Poems వంటివే. ముఖ్యంగా గురజాడవారి 'పూర్ణమ్మ' వర్డ్సువర్తు వ్రాసిన 'Lucy Gray' అనే గేయాన్ని తలపింపజేస్తుంది. రెంటి అవసానం విషాదాంతమే. 'Lucey Gray లోని—

'And many a hill did Lucy climb;
But never reached the town'.

2, 3, 4 'మాటామంతీ: అవీ ఇవీ'—పుటలు 33, 35, 36.

5. కన్యాశుల్కం: మొదటి కూర్పు పీఠికలో.

న్న వగాలు చదువుతుంటే 'పూర్ణమ్మ ఇంటికి రాదాయె' అన్నమాటలు తళుక్కున స్ఫురిస్తాయి. అలాగే

'Yet some maintain that to this day
She is a living child;
That you may see sweet Lucy Gray
Upon the lonesome wild'.

అన్న చరణాలు రేఖామాత్రంగా—

'కన్నుల కాంతులు కలవల చేరెను
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ'.

అనే పంక్తుల్ని స్మరింపజేస్తాయి. ఈ చరణాల్లోవున్న భావ రేఖలతో సాదృశ్యమున్న పంక్తులు షేక్స్పియరూ, కాళిదాసూ ముందే వెల్లడించారు. షేక్స్పియరు 'Tempest' లోని క్రింది పంక్తుల్ని చూడండి.

'Full fathom five thy father lies
of his bones are coral made
Those are pearls that were his eyes
Nothing him that doth fade
But doth suffer a sea-change
Into something rich and strange'.

ఇది టెంపెస్టు నాటకంలో Ariel పాడిన పాట. Ferdinand (నాయకుడు) తో అతని తండ్రి చని పోయాడని కల్పించి పైవిధంగా అంటుంది. దీని అర్థమిది. 'అతని ఎముకలు, పగడపు దీవుల్లో కలిసి పోయినవి. కళ్లు నక్షత్రాలుగా మారినవి. శరీరంలో ఏ భాగమూ నశింప లేదు. అందంగా రూపాంతరం పొందింది'. పూర్ణమ్మ శరీరం గూడా నశించినట్లుగాక రూపాంతరం పొందినట్లే వర్ణింప బడింది. కాళిదాసు రఘువంశంలో అజవిలాప ఘట్టంలో ఈ పంక్తుల్ని స్ఫురింపజేసే శ్లోకముంది. ఇందుమతి మరణా నంతరం అజు ఈవిధంగా విలపిస్తాడు:

'కలమన్య భృతాసు భాషితం
కలహంసీషు మదాలసం గతం
పృషతీషు విలోల మీక్షితం
పవనా ధూతలతాసు విభ్రమః'.

ఈ శ్లోకంలోని 'నడకలను కలహంసలయందు చేర్చుట' అనేది గురజాడవారి 'హంసల జేరెను నడకల బెడగులు' అన్నదానికి మాతృకో అన్నట్లుంది.

ఇంగ్లీషు కాల్పనిక కవుల్లో వర్డ్స్వర్తు ధోరణి విల క్షణమైంది. ఈతని కావ్య వస్తువునూ, రచనారీతినీ, భావ వ్యక్తీకరణ పద్ధతినీ షెల్లీ, కీట్సు, బైరన్ మొదలైన కాల్పనిక కవులంతగా ఆదరించలేదు. అయినా అందరూ కాల్పనికోద్యమ ప్రవక్తల్లో ప్రథముడుగా వర్డ్స్వర్తునే పరిగణిస్తారు. అలాగే గురజాడవారి రచనా రీతులను తరువాతి భావ కవుల్లో ప్రముఖులైన కృష్ణశాస్త్రి, వేదుల, నాయని మున్నగువారు అనుసరించలేదు. అయినా వర్డ్స్వర్తులాగే విలక్షణ కవితా ముద్ర, విశిష్ట వ్యక్తిత్వంఉన్న కాల్పనిక కవీంద్రుడు గురజాడ.

శుభాకాంక్షలు

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

ఎప్పటికప్పు డభ్యుదయము లిద్దము లైన వికాసరేఖలన్
ముప్పదితొమ్మి దేండ్లు బుధమోహన సంస్కృతి సాహితీరుచుల్
చిప్పిల నాంధ్రికిన్ గొలువుచేసి రసజ్ఞులమెప్పు గన్న నీ
గొప్పతనంబు తెన్గుప్రజకున్ గరువమ్ము ఘటించు భారతీ!

నలువదవపుట్టుపండు వీనాఁడు నీకు;
సంతసము సందడించు సంక్రాంతి మాకు;
విశ్వకల్యాణమునకు నువ్విళ్లుగొనెడి
మనుగడలు చూచి లోక మిమ్మాడ్కి సాగయు.

అపుడు శ్రీకాశికానాథుని యాదరంబు
నిపుడు శంభుప్రసాదంబు నీవు గంటి
వదిర! శివములు నీకు నిత్యమ్ము లగుట
నుద్ధరింపుము సాహితిన్ యుగయుగాలు.

వర్గము లెచ్చి భావముల వైఖరి మాఱి సహస్రసాహితీ
మార్గములన్ వరించెడిసమాజము పుట్టిన నేమి నేఁ డహో!
స్వర్గవిరీతి నా మెత లొసంగద వాశ్రితకోటికెల్ల నీ
సర్గము సామ్యయోగ మది శాంతినికేతన మమ్మ! భారతీ!

ఔచితి లేని వ్రాఁతదెస శాదృతి చూపవు నీవు; నీమదిన్
దోఁచినపల్కు గూర్చిన బుధుల్ కవులున్ బులకించి పుణ్యముల్
పూఁచినయట్లు పొంగెద; రపూర్వము నీ గరిమమ్ము; చంద్రికా
రోచికి గాంగవీచి కనురూపము నీదుయశమ్ము భారతీ!

స్ఫోటవాదము

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తము

1

ఆంధ్ర వ్యాకరణ వాఙ్మయము నందెచ్చటను, సంస్కృత వ్యాకరణ వాఙ్మయమున నొక ప్రత్యేకశాఖగా విలసిల్లిన 'ఆర్థిక విచారము'ను వివరించుటకుఁ బ్రయత్నము కానరాదు. ప్రాచీనార్వాచీ నాంధ్ర వ్యాకరణములందీ విషయమునకుఁ దగునవకాశము లభింపకున్నను, ఆధునిక వ్యాకరణ విమర్శ గ్రంథములందిట్టి విచారమునకు అవకాశము లేకపోలేదు.

పాణినీయము శబ్ద విభాగమునుగూర్చి నిర్దుష్ట మార్గములను జూపును. వాని ననుసరించియే 18 వ శతాబ్దియందు ఇండో — యూరోపియన్ భాషల తులనాత్మక వ్యాకరణము వికసించినట్లు తజ్ఞుల యభిప్రాయము. పాశ్చాత్య భాషావేత్త లీ కృషి సందర్భమున పాణిని మహర్షికి తామెంతో ఋణపడినట్లు పేర్కొనిరి. కాని భాషాశాస్త్రమున నతి ప్రముఖమగు ఆర్థిక తత్త్వమునుగూర్చి ప్రాచీన భారతీయ విద్వాంసులు గావించిన విశేష పరిశోధనముపట్ల వారును దగుశ్రద్ధ వహింపలేదు. ఇట్లీవిషయము విస్మృతి పథమునఁ బడినది.

లభ్యమానమగు ఆర్థిక తత్త్వగ్రంథములలోఁ బ్రాచీనమయినది భర్తృహరి విరచితమగు 'వాక్య పదీయము'. ఆర్థిక తత్త్వసంబంధమగు ప్రస్తావనలు యాస్కుఁడేకాక పాణిని, సంగ్రహకర్తయగు వ్యాడి మున్నగు ప్రాచీనులును గావించినట్లు పతంజలి తన మహాభాష్యమున సందర్భానుసారముగాఁ గావించిన చర్చల ననుసరించి గ్రహింపఁ బడుచున్నను, ఏతద్విషయమును సమగ్రముగాఁ జర్చించు ప్రథమ గ్రంథము వాక్యపదీయమే యనుట నిర్వివాదము. తరువాత నాగేశభట్టు, కొండుభట్టు మున్నగువారు భర్తృహరి వివరణములను బ్రపంచించిరి. ఈ రచనలన్నియును మొత్తముమీద నైయాయికాది యితర మతములను ఖండించుచు, వైయాకరణ సంప్రదాయమును బ్రతిష్ఠించినవి.

వైయా కరణాంగీ కృతమగు మగువాదమునకే "స్ఫోట వాదము"ని పేరు. ఈ స్ఫోటవాదము పాణినికిఁ బూర్వమున్నదో లేదో నిర్ణయించుట కష్టము. 'స్ఫోటాయనుఁడ'ను పేరు పాణినీయమునఁ గలదు. ఈతఁడే స్ఫోట వాదమునకుఁ గర్త యని కొందరు భావించిరి. ప్రాతిశాఖ్యలలో నెచ్చటను స్ఫోట శబ్దము కానరాదు. అయినను తద్వ్యాఖ్యాతలీ పదమును వర్ణోత్పత్తి సందర్భమున నుపయోగించిరి.[1]

"స్ఫుటత్యర్థోఽస్మాదితి స్ఫోటః"—దీనివలన నర్థము స్ఫుటమగును గావున స్ఫోటమనియు, "స్ఫోటయత్యర్థమ్" అర్థమును వ్యక్తపరచునది యని యువ్యుత్పత్త్యర్థములు. "వర్ణాతిరిక్తోవర్ణాభి వ్యంగ్యోర్థ ప్రత్యాయకో నిత్య శబ్దః స్ఫోటః"—వర్ణములకన్న భిన్నమై వర్ణములవలన వ్యక్తము సేయబడి యర్థమును బోధించు శబ్దము స్ఫోటమనియు, "పూర్వపూర్వ వర్ణానుభవాహిత సంస్కార సచివేన అంత్యవర్ణానుభవేన అభివ్యజ్యతేస్ఫోటః"—రెండవ వర్ణము నుచ్చరించునపుడ మొదటి వర్ణము నశించును. కాని, దాని సంస్కారము చిత్తమున నిలుచును. ఆ యనుభవముచే నభివ్యక్తమగునదియే స్ఫోటయను రీతిని నిర్వచనములును గలవు.

2

పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి యని వాక్కును బ్రాచీనులు చతుర్విధములుగా విభజించిరి. పరావాక్కు మూల చక్రస్థము, పశ్యంతి నాభి సంస్థితము. ఈ రెండును యోగులకే యనుభవనీయము. హృదయదేశమందలి వాక్కు మధ్యమ నాఁబడు. కంఠదేశమందలిది వైఖరీవాక్కు. ఈ మధ్యమా వాక్కునకే స్ఫోట శబ్దమని వ్యవహారము. ఇది నిత్యము, అఖండము, అవికారము, అచలము, అనశ్వరమునైనది. ఇదే బ్రహ్మరూపము. ఈ సిద్ధాంతులకే "స్ఫోట బ్రహ్మవాదుల"ని, "శబ్దబ్రహ్మ

---

1 "Haradatta says that స్ఫోటాయన was the originator of the స్ఫోటవాద. The word స్ఫోట is not actually found in the Prati Sakhya works. However Commen-tators on the Pratisakhya works have introduced it in their explanations of the texts which discribe వర్ణోత్పత్తి". A Dictio-nory of Sanskrit Grammar—P 405—by Prof. K U. Abhayankar—Oriental Insti-tute, Baroda.

వాదులని" యు పేళ్లు. మనము శ్రవణేంద్రియముచే గ్రహించు శబ్దముకాక, దానిచే నభివ్యక్తమై బుద్ధినిష్ఠమగు శబ్దమే స్ఫోటము. (శబ్దోబుద్ధి నిష్ఠః వాక్యపదీయము I—46) అదియే యర్థమును ప్రకాశింపజేయును. అది నిత్యము. అది పద రూపమునగాని, వాక్యరూపమునగాని యుండును. వాక్యస్ఫోటమే ముఖ్య సిద్ధాంతము.

వైయాకరణు లభివ్యక్తవాదులు. అనగా మనకు విని పించు వర్ణ, పద, వాక్యములు శబ్దముకాదని, బుద్ధిలో నభి వ్యక్తమగు వర్ణ పద వాక్యములు మూడును నిత్య శబ్దములని, వర్ణ స్ఫోట, పదస్ఫోటలు నిత్యములేయని యంగీకరించినను, వాక్యమే ముఖ్యశబ్దమని, అదియే నిత్యమని వీరి సిద్ధాంతము. నైయాయికులు జన్మవాదులు. వీరు శబ్దములు జనించునందురు. మీమాంసకులు ఒకానొక ధ్వనిచే వ్యక్తము చేయబడు వర్ణరూప మగు శబ్దము నిత్యమనియందురు. వీరిమతమున వర్ణము శబ్దము. అది నిత్యము. పదము వాక్యము కూడ వర్ణ సమూహ రూప ములే. వైశేషికులు ధ్వనియే శబ్దమందురు. ఆధ్వని ద్వివిధ ములు: (1) వర్ణరూపము, (2) అవర్ణరూపము. ఈ రెండు విధములగు ధ్వనియే కార్యమే (క్రియాజన్యము—అనిత్యము). కాని నిత్యము కాదందురు. ఈ మతములను ఖండించు జల వైయాకరణ మత మిట్లున్నద్వాటితము. "పదములందు వర్ణ ములులేవు, అట్లే వాక్యమునందును బదములులేవు. ఇవి కల్పి తములు. వాక్యమే సత్యము, అఖండము, ఏకము, అభేద్యము. ఇదియే వాక్యస్ఫోట".

"పదేనవర్ణా విద్యన్తే వర్ణేష్వవయవానచ
వాక్యాత్పదానామ్ అత్యంతం, ప్రవివేకోన కశ్చన"
(వాక్య—I—73).

"పదే భేదేఽపి, వర్ణానామ్ ఏకత్వం ననివర్తతే
వాక్యేషు పదమేకంచ, భిన్నేష్వప్యుప లభ్యతే"
(వాక్య—I—71).

ధ్వనులు ద్వివిధములు:—1. ప్రాకృత ధ్వని (Primary sound). 2. వైకృతధ్వని (Secondary sound). ప్రాకృతధ్వని స్వభావ జనితము. ఇది స్ఫోటవ్యంజకము. ఇది యవిభక్తము. ప్రాకృత ధ్వనిజన్యము, వైకృతధ్వని. 1 ఇది గ్రహణోపాధి భేదములనుబట్టి ద్రుతవృత్తి, మధ్యమవృత్తి, విలం బిత వృత్తియని త్రివిధములు. అభ్యాసకాలమున ద్రుతవృత్తి, మననచింతనాదులందు మధ్యమవృత్తి, శిష్యోపదేశమునందు విలంబితవృత్తియును సరళీయములు. 2 హ్రస్వదీర్ఘ ప్లుతాది భేదములు కూడ వైకృత ధ్వనికి జెందినవియే. కాని, స్ఫోట శబ్దము కాల విభాగ రహితమైనది. పైకి కాల విభాగాదులున్నట్లు గోచరించును. జపా కుసుమ రూపానుసక్తమై స్ఫటిక గ్రహింప బడుచున్నట్లు ధ్వనితో నభిన్నముగా స్ఫోట గ్రహింపబడుచున్న ట్లు కొందరందురు. 3 ఇంద్రియ ధర్మములు తెలియబడ కయే, విషయము తెలియబడునట్లు, ధ్వని గ్రహింపబడక పోయినను స్ఫోట గ్రహింపవగును. ధ్వనిస్ఫుటము కావంత మాత్ర మున స్ఫోట లేదనుటకు వీలులేదు. సూర్య నక్షత్రాదులు చిన్న విగా కనుపించినంత మాత్రమునగాని, పగటివేళ నక్షత్రములు కానరావంతః మాత్రమునగాని యవి యట్టివే యని భ్రాంతి పడరాదుకదా! యత్న విశేషముచేత వర్ణపద వాక్యముల ధ్వనులు ఆ యా స్ఫోటలను మరల మరల ఆవిర్భవింపజేయుచు, శ్రోతల బుద్ధులలో నా యా స్ఫోటల నావిర్భవింపజేయును. అంత మాత్రమున స్ఫోటక నంతత్వము కలుగదు. ఒక శ్లోకము ననేక పర్యాయము లా వృత్తి చేసినంతమాత్ర నయ్యది యనేక శ్లోక ములు కానేరదు. అభివ్యంజకములగు ప్రదీపాదులకు వృద్ధి హ్రాస్వములున్నను, ప్రకాశ్యములగు ఘటాదుల కట్టివుండవు. జలతరంగములయందొకే ముఖమనేకముగా గోచరింపవచ్చును. కాచ శస్త్రాదులయందీ ముఖమే రక రకములుగా నగపడును. 5 ఇట్లే వ్యంజక ధ్వను లనేకములైనను, వానిచే వ్యంజనమగు స్ఫోటయేకమే. 6 ఇది భాగ రహితమైనను వర్ణ పద వాక్యము లచే వ్యక్తమగునపుడు ఈ వర్ణాది రూప విభాగ మున్నట్లు భాసిం చును. ఈ భానము సత్యముకాదు. స్ఫోటగ్రహణమున కదియే యుపాయ మగుటచే ఆ భానమనివార్యము—ప్రతిపత్తు స్ఫోటన ఖండముగానే గ్రహింపవలయును. అటం డందు భేదమును గ్రహించెనేని యది వాని యశక్తియే యగును. ఉపాయము నందు భేదములున్నవికాని, యుపేయమునందు భేదములేదు అది యఖండము. 7 జ్ఞానమేకము నఖండమునైనను, జ్ఞేయ

1 ధ్వనిస్తు ద్వివిధః। ప్రాకృతో వైకృతశ్చ। ప్రకృత్యార్థ బో ధనేచ్ఛయా స్వభావేనజాతః స్ఫోటవ్యంజకః ప్రథమః ప్రాకృతః। తస్మాత్ప్రాకృతాకృతాజ్జాతో వికృతి విశిష్ట శ్చిరస్థాయీ నివర్తకో వైకృతికః। హరిస్యాహ—
"స్ఫోటస్య గ్రహణ హేతుః ప్రాకృతోధ్వనిరిష్యతే
శబ స్ఫోర్థ్వ ప్యమభి వ్యక్తేర్వృత్తి భేదేతు వైకృతః"
(వాక్య.) పరమ లఘుమంజ షయామ్ స్ఫోట
వాదః—పుట 231.

2 అభ్యాసార్థే ద్రుతా వృత్తిః ప్రయోగార్థేతు మధ్యమా।
శిష్యాణా ముపదేశార్థం వృత్తిరిష్టా విలంబితా।
(వాక్య. I—75).

3 స్ఫోటరూపా విభాగేన ధ్వనేర్గ్రహణ మిష్యతే కైశ్చిత్
ధ్వని రసం వేద్యః స్వతంత్రోఽన్యైః ప్రకాశకః
(వాక్య I—82).

4 వాక్య. I—83—పుణ్యరాజ వ్యాఖ్యానము.

5 వాక్య. I—97; 100 శ్లోకములు—వానికి పుణ్య రాజ వ్యాఖ్యానము.

6 వాక్య. I—83.

7 అనతశ్చాంతరాలే యాఞ్ఛబ్దాన్ అస్తీతి మన్యతే
ప్రతిపత్తు రశక్తి స్సాగ్రహణోపాయ ఏవసః"
(వాక్య. I—86).

సంబంధము కలిగియే వ్యవహార గోచరమగును. ఘటపటాది రూపములచే జ్ఞానము భిన్న భిన్నములుగా భాసించును. 8 అట్లే ఆంతరమైన శబ్దాత్మ కూడ వ్యంజకమగు ధ్వనుల భేదములనుబట్టి భిన్నమైనదిగాను, క్రమము కలదానివలెను భాసించుచుండును.9 కాని యది యభిన్నము; క్రమ రహితము.

అనేకములగు శబ్ద వ్యక్తులచేత వ్యంజింపబడిన శబ్ద జాతియే స్ఫోట. ఈ వ్యంజకములగు శబ్ద వ్యక్తులు ధ్వనులన బడును. స్ఫోట యనబడు శబ్దజాతి వాక్యాంతిమ వర్ణముయొక్క ప్రత్యక్ష కాలమునందు వెనుకటి వర్ణముల యనుభవమువలన గలిగిన సంస్కార సహాయముతో నభివ్యక్తమగును. 10

వర్ణ, పద వాక్యములు నిరవయవములైనవని, అందలి మాత్రా విభాగము, వర్ణ విభాగము, పదవి భాగము కేవలము కాల్పనికములని, సత్యముకాదని భర్తృహరి యుద్ఘాటించెను. (10—ఎ) వ్యాకరణ శాస్త్ర మిట్టి విభాగ విధానమునే బోధించును. దీనినిబట్టి ఏతచ్ఛాస్త్రాధ్యయన మనవసరమని భావించ రాదు. ఇట్టి భావము కలుగవచ్చునని శంకించియే కానోపు! వ్యాకరణ శాస్త్ర ప్రాముఖ్యము నాతడు తన కృత్యాదిలో నీ రీతిగా నుద్ఘాటించెను. "అర్థజాతులన్నియు శబ్దజాతులచే నిబంధనమైనవి. ఇట్టిశబ్దమునకు తత్ప్రకృష్ట రసస్థానీయమైనది వ్యాకరణము. ఇది సకల విద్యలకు మూలము. మోక్ష సిద్ధి కేర్పరుపబడిన సోపానములలోనిది ప్రప్రథమము. అట్టి ఈ శబ్దస్మృతి ముముక్షువుల కవక్రమగు రాచబాట. 11 అగ్నిజీవుడు, శబ్దమునను మూఁడు ప్రకాశములలో పుణ్యతమమగు జ్యోతిస్సు శబ్దము. స్థావర జంగమాత్మకమగు సృష్టి ఈ శబ్దమునందు నిబద్ధము. వ్యాకరణ మీ శబ్ద జ్ఞానమునకు ఋజువైన మార్గము. 12 అర్థ ప్రవృత్తి తత్త్వము శబ్ద నిబంధనము. 13 శబ్ద తత్వావబోధమును వ్యాకరణముతప్ప నన్యము చేయజాలదు.

భర్తృహరి వాక్యము నిరంశము, అఖండమునగు నేకోచ్చారణమని; అది యవిభక్తమగు నేకార్థ ప్రతిపాదకమనియు నుద్ఘాటించెను. వాచక మెట్లు నిరంశమో, వాచ్యము కూడ నట్లేయని యాతని మతము. ఇందుల కాతడ డనేకోప పత్తులను ప్రదర్శించెను. ఒక చిత్రమునుగాని, ఒక శిల్పమునుగాని మన మఖండ దృష్టితో సందర్శించి యానందించుమని, తరువాత నా వయవికముగా బరిశీలించి కళాశక్తి కాశ్చర్యపడుదుమని భర్తృహరి భాషాగ్రహణము నన్య కళావగాహనముతో బోల్చుట పరిశీలనార్హము. (వాక్య. II—8).

సంసర్గము, సంసృష్టి, నిరాకాంక్ష పదార్థము, ప్రయోజనము, ప్రతిభ, క్రియ యనునవి వాక్యార్థములుగా తన కాలమునందు ప్రసిద్ధి వహించిన షడ్విధములగు మతభేదములను భర్తృహరి క్రోడీకరించి (వాక్య. II—117), ఇందు ప్రతిభయే వాక్యార్థమని, అది శబ్దము వలనను, అభ్యాసమువలనను గల్గునని స్వకీయమతముగా నుద్ఘాటించెను.(వాక్య. II—119). "ఈ ప్రతిభ సర్వప్రాణి సంవేద్యము. పశు పక్ష్యాదులకును నిది కలదు. దాని స్వరూప మిదమిత్థమని నిర్ణయింపజాలము. ఇతరులకనాఖ్యేయము. ఇది ఆత్మ సంవేద్యము మాత్రమే. దాని కిట్టి దనదగు రూపములేదు. వక్తకు కూడ నది యవ్యక్తము. ఇది జన్మాంతర భావనావశమువలన గజవాజులకు కూడ నుండును. అంకుశము ననుసరించి గజము, చుబుకపు శబ్దము ననుసరించి గుర్రము సంచరించుటకీ ప్రతిభయే హేతువు. శబ్ద ప్రయోగముచేత గూడ నిది కలుగును. ప్రతి వ్యక్తికి వాని ప్రతిభయే ప్రమాణము. దీనికి యత్న విశేష మవసరములేదు. ఇట్టి ప్రతిభచేతనే వసంతకాలమున పుంస్కోకిల కుహూ కుహూ రావములను గావించుచున్నది. పక్షులు కులాయములను నిర్మించుకొనుచున్నవి. లూతలు గూడ్లు కట్టుకొనుచున్నవి. సకల ప్రాణులు నాహారాది క్రియలయందు ప్రవృత్తమగుట ప్రతిభావశమునసే. (II—145 నుండి 152 శ్లోకములు). ప్రతిభకు శబ్దమే

---

8 జ్ఞేయేన నవినా జ్ఞానమ్ వ్యవహారోఽవ తిష్ఠతే
నాలబ్ధ క్రమయా వాచా కశ్చిదర్థోఽభిధీయతే॥
(వాక్య. I—87).

9 భేదాను కారో జ్ఞానస్య వాచశ్చోపప్లవో ధ్రువః
క్రమోపసృష్ట రూపాయా జ్ఞానంజ్ఞేయ వ్యపాశ్రయమ్॥ (వాక్య. I—88).

10 అనేక వ్యక్త్యభి వ్యంగ్యా జాతిః స్ఫోట ఇతిస్మృతా
కైశ్చిత్ వ్యక్తయ ఏవాస్యాధ్వనిత్వేన ప్రకల్పితాః
(వాక్య. I—94).
పూర్వ పూర్వ వర్ణానుభవజ సంస్కార సహకారేణాభి వ్యజ్యత ఇతి తాత్పర్యమ్। (పుణ్యరాజు).

10—ఎ ప్రత్యేకం వ్యంజకాభిన్నా వర్ణా వాక్యపదేషుయే
తే షామత్యంత భేదేఽపి, సంకీర్ణా ఇవశక్తయః।
(వాక్య. I—89—వ్యాఖ్య).

11 యదార్థ జాతయః సర్వాః శబ్దాకృతి నిబన్ధనాః
త ధైవలోకే విద్యానామ్ ఏషా విద్యా పరాయణమ్॥
(వాక్య I—15).
ఇదమాద్యం పదస్థానం సిద్ధి సోపాన పర్వణామ్
ఇయం సామోక్షమాణానామ్ అజిహ్మారాజ పద్ధతిః॥
(వాక్య. I—16).

12 ప్రాప్త రూప విభాగాయాయో వాచః పరమోరసః
యత్తత్పుణ్య తమంజ్యోతిః తస్యమార్గోఽయమాంజసః॥
(వాక్య. I—12).

13 అర్థ ప్రవృత్తి తత్వానామ్ శబ్దాఏవ నిబంధనమ్
తత్వావబోధః శబ్దానామ్ నాస్తి వ్యాకరణాదృతే
(వాక్య. I—13).

హేతువు. శిశ్వాదుల కిది తెలియకున్నను, ఆసత్తి విప్రకర్ష లుండునని 14 భర్తృహరి వివరించెను.

స్వభావము, చరణము, అభ్యాసము, యోగము, అదృష్టము, విశిష్టోపహితమను రీతిగా నీ ప్రతిభ షడ్విధములని వాక్యపదీయము వింగడించినదేకాని, వాని నన్నింటిని వివరింపలేదు. తద్వ్యాఖ్యాత పుణ్యరాజును నందుకు పూనుకొనలేదు. 15

ఈ 'ప్రతిభ' యను పదమును ఆలంకారికులు విశేషముగా నుపయోగించిరి. "నవనవోన్మేషశాలినియగు ప్రజ్ఞ ప్రతిభ యనబడును. దాని కాశ్రితుడైన వర్ణనము సేయువాడు కవి" 16 యని ఇది దైవదత్తమగు శక్తియని, వ్యుత్పత్తి వలనను సంపాదింపవచ్చునని, ప్రతిభా వ్యుత్పత్తులలో ప్రతి భగరీయమని వివిధాలంకారికులు పేర్కొనిరి. 17 ప్రతిభకు లోబడి ఏ సకల ప్రాణులు వర్తించునను భర్తృహరి యభిప్రాయము అంతేకాక, ప్రతిభాషా వ్యవహర్తను కొలదిగనో, గొప్పగనో కవిగా బరిగణింపవచ్చునని యాతని యాశయముగా భావింపనగును! క్రీ. శ. 7 వ శతాబ్దికి జెందిన భర్తృహరికి పూర్వాలంకారికులు 'ప్రతిభ'ను నిర్వచింపకున్నచో, ఏ తత్ప్రయోగ విషయముననను భర్తృహరియే ఆలంకారికులకు మార్గదర్శకుడన నగును.18

వాక్యార్థము కేవలము నిఘంటు సాహాయ్యమున లభించునదికాదనుట విదితము. వాచ్యార్థమున కతీతమగు లక్ష్యార్థము లనేక సందర్భములలో గ్రహించుచున్నాము. ప్రవీణుడు, కుశలుడు, లావణ్యము మున్నగు పదములు తమ వాక్యార్థమునే కోలుపోయినవి. "ఏడ్చేపిల్లల్ని పెద్దపులి ఎత్తుకుపోతుంది" అని తల్లి హెచ్చరించును. అంతమాత్రాన నట్టి సంఘటన జరుగదు. పిల్లల నేడ్వకుండ జేయుటే యీ హెచ్చరిక కర్థము. (వాక్య II—232). "దదనికాకములనుండి రక్షింపు మ"న్నంత మాత్రమున దధ్యుపఘాతకములగు శునకాదులను, తోలరాదని భావించు బాలుడుండడు కదా!! (వాక్య II—314) ఇట్టి వాక్యములును సామాన్య భాషా పరిధిలోనివేకాని, కావ్య భాషకుమాత్రము చెందినవి కావు.

ఇట్లు వాచ్యలక్ష్యార్థములేకాక క్రీ. శ. 9 వ శతాబ్దికి వ్యంగ్యార్థమును ప్రసిద్ధి వహించినది. దీని నానందవర్ధనుడు తన ధ్వన్యాలోకమున బ్రతిపాదించి, ప్రపంచించి సమర్థించెను. ఇతనికి బూర్వము వైయాకరణులు, తార్కికులు, మీమాంసకులు శబ్దముయొక్క అర్థ బోధక శక్తినిగూర్చి లెస్సగా పరామర్శించి, శబ్దమున కభిదా, లక్షణా శక్తులు మాత్రమే కలవని నిర్ణయించిరి. వ్యంజనావృత్తి నెవ్వరును దెలుపరైరి. శబ్దముననున్న యర్థాంతరమును బోధించు శక్తి వ్యంజనమనియు—ఆ యర్థాంతరము వ్యంగ్యమనియు శబ్దము వ్యంజకమనియు విదితము. వ్యంజనమే ధ్వని. 19 ఇది యొకచో వస్తు రూపముగను, ఒకచో అలంకార రూపముగను, ఒకచో రసభావాది రూపముగను సహృదయ హృదయ సంవేద్యమగును. ఇది శబ్దమును, శబ్దైక దేశమును, అర్థమును, వర్ణములను, రీతిని గూడ నాశ్రయించియున్నట్లు నిరూపితము.20

ఇతర సిద్ధాంతులు ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతము ప్రామాణిక సమ్మతముకాదని యాక్షేపింపగా, తన సిద్ధాంతము క్రొత్తది కాదని, వైయాకరణు లంగీకరించినదేయనియు ప్రమాణము చూపెను. ఆతఁ డీ సిద్ధాంతము నిట్లు గ్రహించెను. "పూర్వ పూర్వ వర్ణముల సంస్కారముతో గూడిన యంత్యవర్ణ ధ్వనిస్ఫోటను వ్యక్తపరచు విధముగా ప్రకరణాదుల సాహాయ్యమున శబ్ద మర్థాంతరమును వ్యక్తపరచును. అట వర్ణ ధ్వని స్ఫోట వ్యంజకము. ఇట శబ్దమరా ంతర వ్యంజకము. అచట వ్యంగ్యము స్ఫోట. ఇచట వస్త్వలంకార రసాదులు. ఆ ధ్వని పదమునే వ్యంజసాదృశ్యమునుబట్టి ఈతఁడు గ్రహించెను. వైయా

---

14 ప్రతిభా యామ్చ శబ్ద ఏవమూల మిత్యాహ-
భావ నానుగతాదేత దాగమాదేవ జాయతే
ఆసత్తి విప్రకర్షాభ్యామ్ ఆగమస్తు విశిష్యతే॥
(వాక్య. I—153).
సచాగమః కదా చిదా సన్మోస్మిన్నేవ జన్మన్యవగతః కదాచి జ్జన్మాంతర ఇత్యాసత్తి విప్రకర్షాభ్యాం శబ్ద ఏవ ప్రతిభా హేతుః॥ (పుణ్య రాజ వ్యాఖ్య).

15 స్వభావ చరణాభ్యాసయోగా దృష్టోప పాదితామ్
విశిష్టోప హితాచేతి ప్రతిభాం షడ్విధాలిదుః॥
(వాక్య. II—154).
స్వభావేవ యధాకపిః। చరణాదిషు ఉదాహరణాన్యూహ్యాని। (పుణ్యరాజా).

16 ప్రజ్ఞానవనవోన్మేషశాలినీ ప్రతిభామతా
తదను ప్రాణనా జీవద్వర్ణనా నిపుణః కవిః। తస్య కర్మ స్మృతా కావ్యమ్॥

17 'ప్రతిభా వ్యుత్పత్త్యోః ప్రతిభా శ్రేయసీ'—ఆనందవర్ధనుడు. కావ్యాలంకార సంగ్రహము. స. సూ. శాస్త్రి వ్యాఖ్య. 121—123 పుటలు.
"ప్రజ్ఞా అపూర్వ వస్తు నిర్మాణక్షమా"—అభినవగుప్తుడు.

18 శ్రీ స. సూ. శాస్త్రిగారు 'ప్రజ్ఞానవ నవోన్మేష శాలినీ' అను నిర్వచనమును భామహుడు గావించినట్లు (పుట 120) వచించిరి. కాని, 'సంస్కృత వాఙ్మ చరిత్ర'లో మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు ఈ శ్లోకము భట్టతౌత కృతమగు కావ్య కౌతుకము నందున్నట్లు పేర్కొనిరి. "ఇతడు క్రీ. శ. 960 ప్రాంతము వాడనుట విదితము"—రెండవ భాగము—పుట 244.

19 యత్రార్థ శబ్దోవా తమర్థముప సర్జనీ కృతస్వార్థౌ
వ్యక్తః కావ్య విశేషః సధ్వనిరితి సూరిభిః కదిధితః॥


20 కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్య. శ్రీ స. సూ. శాస్త్రి. పుటలు 149—164.

కరణాంగీకార వ్యంగ్యము స్ఫోటము, ఆనంద వర్ధనుని వ్యంగ్య మర్థాంతరము.21

ఇట్లలంకార శాస్త్రమునం దత్యంత ప్రాధాన్యము వహించిన ఈ ధ్వని సిద్ధాంతమునకు స్ఫోటవాదము మార్గ దర్శకమగుటచేతనే కావచ్చును, "ప్రథమేహి విద్వాంసో వైయా కరణాః" అని యానంద వర్ధను డభినందించియుండును. భారతదేశమున పూర్వకాలమందు వైయాకరణాన కగ్రతాంబూలముకాని, ఆధునిక కాలమున వైయాకరణుండు "మానవత్వము నుండి దిగి జారిన పండితమన్యుఁడు"గా 22 నిరసింపబడుటకు కారణము, భాషా వ్యవస్థను బరిశీలించుటలో నీత డవలంబించుచున్న పద్ధతులు అభిరుచులు కావచ్చును. ఇది యట్లుంతము. కేవలమువాఙ్మయమునందేకాక, దైనందిన వ్యవహారమునందును నత్యంత ప్రాముఖ్యము వహించిన ఈ యర్థత్రయమును (వాచ్య, లక్ష్య, వ్యంగ్యార్థములు) గూర్చి యాధునిక భాషా పరిశోధకులు పరిగణింపవలసి యున్నది. 23 నాడుగాని, 'ఆర్థిక శాస్త్రము' (Semantics) పుష్టిమంతము కానేరదు.

5

భర్తృహరి ముఖ్యముగా బ్రతిపాదించినది వాక్యజాతి స్ఫోట. అయినను తరువాతి వైయాకరణులు అష్ట విధములగు స్ఫోటల నీ రీతిగా నిరూపించిరి.



వర్ణములను మాత్రలుగను, పదములను ప్రకృతి ప్రత్యయములుగాను, వాక్యమును పదములుగాను విభాగించి యర్థము తేర్పరుచుట వ్యాకరణ శాస్త్రమునకు సంబంధించిన విషయము. 24 వ్యవహారము నుపయుక్తములగు పదములకు సఖండ పదస్ఫోటను కొందరు పేర్కొనిరి. ఏమైనను నవ్యులు అఖండ వాక్య స్ఫోటమే ముఖ్యమందురు. ప్రాచీనులు వాక్యజాతి స్ఫోట ముఖ్యమని భావింతురు. 25

వ్యక్తిస్ఫోట, జాతిస్ఫోటయను విభేదమునుగూర్చి చాల వివాదము కలదు. ప్రాచీన వైయాకరణులు జాతి స్ఫోట వాదులని, నవీన వైయాకరణులు వ్యక్తిస్ఫోటవాదులని ప్రసిద్ధి.26 అయిన నిం దుభయులు జాతి స్ఫోట నంగీకరింతురు. వ్యక్తి స్ఫోటను ప్రాచీను లంగీకరింపరు. భర్తృహరి జాతి స్ఫోటనే ప్రతిపాదించి బలపరచినట్లు భట్టోజీ దీక్షితుడు తన 'శబ్ద

---

21 కావ్యాలంకార సంగ్రహము—శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారి వ్యాఖ్యానము—పుట 164.

22 "The man who is incharge of Grammar and is called grammarian is regarded by all plain men as frigid and dehumanized pedant". "The Grammarian and his Language" by Edward Sapin P. 151. University of California.

23 "The linguist however must include within his survey all types of language behaviour from logic to literature"—Prof. Jhon Brough - "Some Indian Theories of meaning". T. P. S. 1953.

24 "తత్ర దర్థవి భాగస్తు శాస్త్రమాత్ర విషయస్" (లఘు మంజూషా—పుట 5).

25 Dictionary of Sanskrit Grammar పుట 405.

26 V. Krishnamacharya states that the ancients held the jati-Spota view; the moderns, i. e. Nagesa and his contem poraries, the vyakti-spota (vide intro. duction to Nagasas Spota-Vada; p. 24

కౌస్తుభమునందు వాక్యపదీయ శ్లోకముల తోడనే సమర్థించెను (పుట 9). కాని నాగేశు డాతని యన్వయము సరికాదని, వ్యక్తిస్ఫోట భర్తృహరికిని సమ్మతమేయని యుద్ఘాటించెను (స్ఫోటవాద—పుట 99). జాతి స్ఫోట తాత్త్వికముగాను నాచరణ యోగ్యముకాదని ఆధునిక విమర్శకుల యభిప్రాయము. 27 వ్యక్తి మూలముననే జాతి గ్రహింపబడును. వ్యక్తులన్నింటి యందుండు సమాన ధర్మమే జాతి. వ్యక్తి జాతి ధర్మ విరహితముగా నుండజాలదు. ఇట్లు జాతి—వ్యక్తులకు గల యవినాభావ సంబంధమునుబట్టి ఈ రెండును విరుద్ధ మతములు మాత్రముకావు. శుద్ధమగు దాత్వాదులకు లోకమునం దర్థము లేనట్లే కేవలము పదములకును నర్థములేదు. అఖండమగు వాక్యమే యర్థవంతము (వాక్య II—212). ఇది భాషా విషయిక నగ్న సత్యము. ఈ సత్యము నాధునిక భాషా శాస్త్రజ్ఞులను గుర్తించినదియేయైనను, ఆర్థిక విచారము (Semantics) నందీ విషయము విస్మృత మగుచుండుట విచారణీయము. ఇందులకు భర్తృహరి మున్నగు వారి సిద్ధాంతము లాధునికులు పాసింపవలసియున్నది. 28 "అనుపాసింత వృద్ధానాం విద్యానాతి ప్రసీదతి".

---

27 "It would seem, in fact that the jati–spota view is philosophically unworkable."

28 This is a plain linguistic fact, which has none the less been clear to very few philosophers, either in India or elsewhere; and though familiar enough in modern linguistics, is still constantly overlooked in many discussions on meaning. Until it is thoroughly understood no real progrrss can be made in the central linguistic problem of semantics. Theories of General Linguistics in the Sanskrit Grammarians by John Brough- Transactions of the Philological Society, 1951–PP. 27 to 46.

వీరేశలింగ చరిత్రము

శ్రీ నిడుదవోలు వేంకటరావు

అద్యతన కాలమున నాంధ్రజాతీయ, సాంఘిక, సారస్వత, వైజ్ఞానికాభ్యుదయ వికాసము సర్వతోముఖముగా వెలయింప జేసిన మహాపురుషులు మువ్వురు. కందుకూరి వీరేశలింగము, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, కాశీనాధుని నాగేశ్వరరావు. ఈ త్రిమూర్తు లాంధ్రులకు నిత్య సంస్మరణీయులు. వారిలో ప్రథములగు వీరేశలింగముగారి జీవితవృత్తాంతమును—

"వీరేశలింగ చరిత్రము"

అను పేర పద్య కృతిగా, విఖ్యాత కవయిత్రి శ్రీమతి కొటికెల పూడి సీతమ్మగారు రచించిరి. ఈ గ్రంథ మప్పటికి నలువది రెండేండ్ల క్రింద ముద్రితమైనను,[1] దీని యునికి గాని, విశిష్టతగాని ఈవఱకు వెలుగులోనికి రాలేదు. సీతమ్మగారీ గ్రంథము రచించునాటికే శ్రీ తోలేటి వెంకటసుబ్బారావుగారి వీరేశలింగ చరిత్రము వచనకావ్య మున్నది. శ్రీ పంతులుగారే తమ స్వీయ చరిత్రమును నానాటికి ప్రకటితమై ప్రచారమున నున్నది. ఇతరత్ర పత్రికల యందును వారి జీవిత సంగ్రహము ప్రచురమైనది. ఇట్లున్నను ప్రస్తుత పద్యకావ్యమునకు వాని యన్నింటికన్న యొక ప్రత్యేకత గలదు. దాని నీ క్రింద వివరింతును.

వీరేశలింగముగారి స్వీయచరిత్ర మున్నది. కాని యందు వారి గుణ విశేషములను, అనుభవములను, వెల్లడించి వారి ప్రతిభను వ్యక్తీకరించు రచనయందుండుట స్వాభావికము గాదు, స్వీయ చరిత్ర రచనా లక్ష్యమును గాదు. వారి కత్యంతము సన్నిహితులై వారితో ప్రత్యక్షముగా కాలము గడిపిన వారే వారి జీవిత చరిత్రను సహజముగ, చారిత్రకముగ, సప్రమాణముగ చిత్రించుట కర్హులు. అట్టి యర్హత సీతమ్మగారి యందు పూర్ణముగా గలదు. గ్రంథాంతమున నామె యిట్లు వినయసంపత్తితో విన్నవించినది.

క. "నా చిన్ననాటి నుండియుఁ
జూచినదై యుంట నీ విశుద్ధ చరిత్రమున్
తోచిన యటు వ్రాసితి నిట
యోచింపఁగ నలవ దతిశయోక్తు లటంచున్".

"కవితఁ జేయనేర్చి కన్న కూతురు బోలెఁ
జూచి నన్ను కష్టసుఖము లందు
నాదరించియున్న యట్టి మజ్జనక స
దృశుని దయ నుతింప వశమె నాకు".[2]

తాను కన్నులార జూచియున్నను జనకుని వలె భావించి గురువునొద్ద శిష్యురాలివలె శిక్షణ నందియున్నను, వర్ణించుటకు తగిన కవనశక్తి యున్నను, సీతమ్మగారిం దతిశయోక్తు లెక్కడను వ్రాసియుండలేదు. ఇది జీవిత చరిత్ర రచనకు ముఖ్యమైన మూదల.

ఇది నిర్వచన పద్యకావ్యము. ఇందేడువందల ముప్పది యేడు పద్యము లున్నవి. దీనికొక చిన్న పీఠిక యున్నది. అదియు నిర్వచనమే. అందు తొమ్మిది కందపద్యము లున్నవి.

ఈ కావ్యము ముగించునాటికి సీతమ్మగారు శ్రీ పీఠికాపుర సంస్థానాధీశ్వరుని యర్ధాంగలక్ష్మియగు శ్రీమతి చిన్నమాంబాదేవిగారి కాంధ్రోపాధ్యాయినియై, గురుపీఠము నలంకరించినది. పీఠికలో తానీ కావ్యము నంతకు మున్ను రచించియు దాని ప్రకటింపలేక పోవుటయు, నా వెనుక నిది సూర్యలోకము బడసిన విధమును నిట్లు స్పష్టపరచినది.

"కొన్ని వర్షంబుల క్రిందట
సన్నుతమగు సచ్చరిత్ర నదమల భక్తిన్
దిన్నఁగ వ్రాసి ముగించియు
గ్రన్ననఁ బ్రకటింపలేని కతమున దీనిన్".

---

1 ఇది క్రీ. శ. 1921 వ సంవత్సరమున కాకినాడలో శ్రీ సావిత్రీ ముద్రాక్షరశాలయందు ముద్రితమైనది. 172 పుటలు. ఆ ప్రాతప్రతియే యీ వ్యాసమున కాధారము—ఈనా డత్యంతావశ్యకముగా పునర్ముద్రింపదగిన ప్రశస్తకావ్యము. ఆంధ్రప్రదేశ ప్రభుత్వమువా రేర్పరచిన వీరేశలింగ శతవార్షిక జయంతి సంఘమువారికి నీ గ్రంథము గూర్చి తెలిపియు వారి వలన ప్రత్యుత్తరమును బడయజాలనైతిని.

1948 వ సంవత్సరమున జరిగిన వీరేశలింగ శతవార్షికోత్సవములలో పాల్గొని 'భారతి' (1948 మే నె.) లో నీ మహాపురుషుని గూర్చి వ్రాసితిని.

నేడు వారి జయంత్యుత్సవ సందర్భమున వారి చరిత్రను గూర్చి 'భారతి' యందే వ్రాయు భాగ్యము కలుగ జేసిన భారతి పత్రికా సంపాదకులకు కృతజ్ఞత.

2 శ్రీ వీరేశలింగముగారు, వారి సతీమణి శ్రీమతి రాజ్యలక్ష్మమ్మగారు, శ్రీమతి కొటికెలపూడి సీతమ్మగారును నున్న చిత్రపటము క్రీ. శ. 1909 లో వెలువడిన ప్రథమాంధ్ర పత్రిక సంవత్సరాదియం దున్నది.

"ఏ పత్రిక కైనను వే
నా పట్టున నీ చరిత్ర మంపం దలంచి యే
కోపములు గల్గునో యని
యాపని చేయంగలేక నాగిన పిదపన్".

"చరిత్రకు నాయకుం డగు స
త్పురుషుడు వీరేశలింగ బుధవర్యుండు
ధరణిం దొలంగి దివంబును
కరిగె సుహృజ్జనులు దుఃఖమందం గనకటా !"

"అంతట తక్కిన చరితము
నంతయు వ్రాసితిని మరణవార్తను నీవే
చింతిలక వ్రాయుమని భగ
వంతుండు నియమించె ననుచు భావించి మదిన్".

పై పద్యములను బట్టి క్రీ. శ. 1919 సంవత్సరమునకు నాల్గైదేండ్లు ముందుగానే యీ కావ్యము ప్రారంభమైనదని యూహింపనగును.

ఈ కృతి రచనా సంగతి తన సతి మూలమున నెరిగి శ్రీ సూర్యారాయ మహారాజేంద్రులు దీనిని ముద్రించు నేర్పాటు చేయించిరి.

"ఆ మహనీయుని కృపచే
నీ మహాత చరిత్ర మెట్టు లెంతయు దయతో
ధీమంతులు తోడ్పడగా
నీ మహిమ వెలయించి కంటి నీప్సిత సిద్ధిన్".

అని చెప్పి తన కృతిని సంస్కరించిన విద్వత్కవికి సప్రణామాంజలి సమర్పించినది.

"నీమము లెఱుంగక వ్రాసిన
భామిని కృతి యనుచుం జులక పఱుపక దీనిన్
ధీమతి దిద్దిన వేంకట
రామకవి శ్రేష్ఠునకు కరంబులు మోడ్తున్".

వీరు పీఠికాపుర సంస్థానాస్థాన విద్వత్కవివరేణ్యులు. పీఠికాపురాధీశ్వరులకు గురువులుగా పూజ లందినవారు. రాజుగారి గురువులు, రాణిగారికి గురువులుగా నున్నవారికి రచించిన కృతి పరిష్కరించుట సమంజసమే కదా.

ఇందు వీరేశలింగకవి జీవితమున ప్రధాన లక్ష్యముగా స్త్రీ పునర్వివాహము, స్త్రీ విద్యా వ్యాపన రూపమున నున్న సంఘ సంస్కరణ మహోద్యమము వివరణగా, విశదముగా వర్ణితమైనది. ప్రతి పద్యమున వీరేశలింగమూర్తియే ప్రతిఫలించుచుండును. సీతమ్మగారు గురువుల సులభశైలి, వచనా వైశద్యము పుణికి పుచ్చుకొన్నది. బాల్యమున వీరేశలింగము వసుచరిత్ర తల్లికి తెలియకుండ చదివిన ఘట్టము, వివాహము, పరిశుద్ధాస్తిక మతమున కానక్తి చవులు గొల్పెడు రచనతో నున్నవి. చూడుఁడు యౌవనమున నాదర్శప్రాయుండైన పండిత గృహస్థుడుగా నున్న వీరేశలింగ వర్ణన.

సీ. విద్యాగరిమతోడ విలసిల్లుచుండియు
గొప్ప యుద్యోగము లొల్లకుండం
గడు జవ్వనంబున గ్రాలుచు నుండి యు
పరసతీ కాల్యంబు బడయకుండ
సర్వ స్వతంత్రతాశక్తి యుక్తుండయ్యు
దల్లి మాటకు జవదాటకుండ
మిత్ర సంఘటనేచ్ఛ మెండుగా నుండియు
సజ్జనులకు గాని సఖ్య మిడక
ఆ. వె. పరమతుష్టి నేకపత్నీ వ్రతంబును
మాతృభక్తి, సుజనమైత్రి, నిష్ఠ
గలిగి కావ్యరచనం గావింపం దొడంగె నీ
బాల పండితుండు ప్రమద మొప్ప. (208 ప.)

కథాసందర్భము ననుసరించి యున్నను నిందలి పద్యములు ముక్తకములవలె, సరసార్థ సమన్వితములై, యీనాడును పఠనీయములై యున్నవి.

"తన మతమును భూషింపుచు
గనుగొను పర మతములెల్ల గర్హించెడు దు
ర్జను లెన్నఁడు గననేరరు
జన సమ్మతమైన సర్వ సమభావమ్మున్".
(200 ప.)

"క్రమకుం బుట్టిన యిల్లునై సుపథమై, సద్భావ యుక్తంబునై
విమలంబైన తలోదరీ మనమునన్ విద్యా మహాజ్యోతియే
క్రమ యుక్తిన్ గడు వెల్గెనేని తగలోక స్తుత్యమౌ కుందనం
బమరన్ రత్నము దాల్చిన ట్లగుఁ జా డీ యత్యంత శోభా కృతిన్". (242).

"మనవలె సుఖదుఃఖములకు
ఘనవాంఛా వికృతులెల్లం గాంతురుగద మా
విను లట్టులయినను వారికి
మనకును భేదంబు గలదె మహిధర్మమునన్". (308).

"సతుల యభివృద్ధి యేమన
కతులితమగు వృద్ధి యనుచు నారసి మదికు
చ్ఛిత మగు తలంపులు విడిచిన
మతిమంతుల మగుచు మనము మనఁగల మెపుడున్".

"జ్ఞానము గల్గి, భేదముల ఖండనచేసి, వివేకదృష్టితో
దీనుల నాదరించుచును, దేవుని సంస్మరణంబుసేయుచున్

మానక సత్యవర్తనము మంచితనంబు వహించియుండుటె
మానవధర్మ మంచు గుణమాన్యుడు బోధ యొనర్చె
నెల్లెడన్".

"గ్రంథస్థమైన నీతులు
నంథ పరంపరగ వచ్చు నాచారమునన్
బంధింపఁబడుటచేతను
దాంధులు చెలరేఁగి నీతిఁ దప్పుదు రెపుడున్".

వీరేశలింగముగారి యకుంఠిత కార్యదీక్ష, ధైర్య స్థైర్యములు యాచాంచల్య మానసిక ప్రవృత్తి, అంతశ్శుద్ధిని నీ కావ్యము విశదీకరించుటయే గాక, రచయిత్రి భక్తి విశ్వాసములను ప్రస్ఫుటీకరించుచున్నది. వీరేశలింగముగారి యర్ధాంగి రాజ్యలక్ష్మిగారు మరణించిన ఘట్ట మిందు కరుణరసము లొలికించుచున్నది. స్వీయ చరిత్రను నామెకు నంకితముచేయు సందర్భమున వ్రాసిన భావము సీతమ్మగారి దృష్టి స్త్రీజనోద్ధరణమునందే కేంద్రీకృతమైనదని చెప్పవచ్చును.

"పత్ని తనకు నొక్క బానిసగా నెంచు
స్వార్థపరుల కీ పరార్థపరుఁడు
దారిఁజూపె గాదె తరుణీమణుల నర్థ
గౌరవమునఁ జూచు కరణిఁ దెలిపి".

కవుల చరిత్రను, పీఠికాపురాధీశ్వరున కంకితము నిచ్చిన రీతిని నీ కవయిత్రి యెట్లు సమర్థించినదో చూడుఁడు.

చ. కవుల చరిత్ర యెంతయును కాలనిరూపణ చేసి చూపుచీ
కవి మరలన్ రచించి ఘనగౌరవ మొప్పఁగరావు సూర్య భూ
ధవునకు నంకితం బొసఁగి ధన్యత నొందెను స్వీయ పుత్రికన్
ప్రవిమల బుద్ధిశాలియగు వాని కొసంగిన తండ్రి కైవడిన్.

రాజ్యలక్ష్మీదేవిగారి నిర్యాణము వెనుక వీరేశలింగముగారు పలు కష్టములకు శారీరకముగ మానసికముగ లోనైరి. ఆకాలమున వారి స్థితి యిట్లుండెను—

వేళకు నన్నపానములఁ బ్రీతి నొసంగెడువారు లేక యే
వేళనొ యే పదార్థమునొ యెట్టులొ తాను భుజించి యోర్పుతో
దాళుచు కష్టజాలముల ధైర్యము బెంపొనరింపుచుండఁగా
గూళలు దోసకారియని కోవిదు నిందలఁబెట్టి రీసునన్.

ఆరు నెలలపాటు వా రన్నమే యెరుగరట !

"తగిన సంరక్షణములేక మిగుల నవసి
నాలు మాసంబు లన్నంబె యెఱుఁగ కునికి
ద్రవపదార్థంబులతో ప్రాణ ధారణంబు
చేయుచుండియె సత్క్రియల్ చేయుచుండె".

సర్వజన సులభగ్రాహ్యమైన యిందలి రచన సెలయేటి నీటివలె స్వచ్ఛమైనది. సంఘమున, సారస్వతమున నూతన చైతన్యము నుజ్జీవింపజేసిన వీరేశలింగ సందేశమును, పఠితల హృదయమున నాటుకొనునట్టుల చేసి, యుక్త కార్యాచరణమునకు గడగునట్లు ప్రబోధముచేయు నీ కృతినుండి మరి యొక్క ఘట్టము మాత్రమే నుదాహరింతును.

చరమదశ - కొమ్మరాజువారి భక్తి ప్రపత్తులు

వీరేశలింగము పంతులుగారు చరమదశలో ననగా పది యేండ్ల కాలము వారి కండగా నిల్చినవారు సుగృహీతనాములు శ్రీ కొమ్మరాజు వేంకటలక్ష్మణరావుగారు. వారే ప్రప్రథమముగా వీరేశలింగముగారిని స్వీయచరిత్ర వ్రాయుటకుఁ బ్రోత్సహించినవారు. వారే విజ్ఞానచంద్రికా గ్రంథమండలిలో దానిని వెలయింప జేసినవారు—వీరేశలింగముగారు, కవుల చరిత్ర ప్రథమ భాగమును సంస్కరించి ముద్రించునపుడు వారికి చేదోడు వాదోడుగా నున్నవారు. వారి అంత్యకాలమున గూడ పుత్రుడులేని లోపము లేకుండ నగ్నిసంస్కార కార్యము లాచరించినది శ్రీ లక్ష్మణరావుగారే.

ఈ విషయము లన్నియు నెంతయో విశదముగ శ్రీ సీతమ్మగారి కావ్యమున చిత్రించియున్నారు. ఆ ఘట్టమును యథామాతృకముగ నిం దుదాహరించుచున్నాను.

ఉ. అప్పుడు గ్రీష్మభాను కిరణావళి మేను దపింపఁజేయఁగా
నిప్పులఁ బోలు వేడిమికి నిల్వఁగఁ జాలక చల్లగాలికై
యప్పురుషుండు చెన్నపురికేగి వసించె సుహృజ్జనాళితో
నొప్పులకుప్పయై తనరుచుండెడు లక్ష్మణరావు చెంగటన్.

రాజమహేంద్రపురమున వేడిమి భరింపజాలక చెన్నపురి వచ్చిన తోడనే "తన మేను సుఖతర మగుట".

"గ్రక్కున కలముం గైకొని
చక్కన వ్రాయంగఁ దొడఁగె సత్కవుల కథల్"
"ఇది రెండవ భాగముగా
ముద మొనరింపంగఁ జేయు బుద్ధిఁ దలఁచి యీ
సదమలగుణుఁ డప్పుడు తా
పదిలంబుగ వ్రాయఁదొడఁగెఁ బై భాగంబున్".

వీరేశలింగముగా రెట్టి మహాపదలు వచ్చినను, వాని నెదుర్కొని మానసిక బలముచే గ్రంథరచనను గావించుచునే యుండిరి. ఇందే మరియొకచో నీ విషయ ముట్టంకింపఁబడినది.

ఆ. వె. వృద్ధ దశయు రుజయు, ప్రియ కళత్రంపు వి
యోగదుఃఖ మప్పు డొక్క పెట్ట
తన్ను నలమికొనిన ధైర్యంబు విడువక
గ్రంథరచనఁ జేయఁ గడఁగె నితఁడు. (710 ప.).

3 శ్రీ వీరేశలింగముగారు మరణించిన గృహము నేటికిని మదరాసు ఎగ్మూరునం దున్నది.

వీరేశలింగము తుదిరచన
బమ్మెర పోతన వ్యాసము

వీరేశలింగముగారు క్రీ. శ. 1917 లో కవుల చరిత్ర ప్రథమ భాగమును ప్రకటించిరి. నాఁటినుండి వారు మరణ మాసన్నమగు వరకు, కవుల చరిత్ర రెండవ భాగమును సంస్కరించుచుండిరని యీ గ్రంథము వలన దెలియుచున్నది. వారి తుది రచనను గూర్చి సీతమ్మగా రిట్లు దెలిపిరి.

"ఉ. అంతట నాంధ్రపత్రికకు నద్భుతశీలను పోతనార్యుఁడే
సంతతివాఁడొ? దెల్పుచును చక్కనివ్యాసము వ్రాసిపంపెఁ దా
వింతగఁజూచి యాంధ్రమున పేర్పడి గ్రంథ విలోకనంబు నం
దింతటివాఁడు లేఁడని కవీశ్వరు లెల్లను డిల్లపోవఁగన్".

ఈ వ్యాసము క్రీ. శ. 1919 సంవత్సరాది సంచిక యందు ప్రకటితమైనది. వీరేశలింగముగారి తుది రచన ప్రకటించు భాగ్యము "సంవత్సరాది సంచిక" కును, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి తుది రచన ప్రకటించు భాగ్యము "భారతి" కిని దక్కినది.

మరణదినము (27-5-1919)

"పందొమ్మిదివందల పై
పందొమ్మిదవదగు నేట ప్రజలకు బ్రహ్మ
నందమిడ నితఁడు బరునకు
సందేశము దెలుపఁబోవు సరణి గతించెన్.

"మే నెలను నిరువదేడవదైన తేది
నుదయమున నీ మహామహుఁ డోర్పు మిగుల
తాను రచియించుచున్న సత్కవుల కథను
సవరణ మొనర్చుచును బోయె స్వర్గమునకు".

అప్పుడు—

"సుతులులేని కొఱంత సుంతయు లేకుండ
నగ్ని సంస్కార కార్యంబు లెల్ల
సక్రమంబుగను లక్ష్మణరావు మొదలగు
నాప్తు లెల్లరు భక్తి నాచరించి
రీ కోవిదుని కోర్కె నెంతయుఁ దలఁదాల్చి
రాజమహేంద్రపురంబునందు
హర ప్రదంబైన నానంద నామ కా
శ్రమమున నొకచోట నతి సమాధి
సన్నిధిని తాను నియమించుకొన్న రీతి
నస్థికా ప్రతిష్ఠాపన మాచరించి
సఖుని యాత్మరక్షణకు నీశ్వరునిఁ గొల్చి
పురజనులు గని రీతని పూర్ణభక్తి".

ఆనందాశ్రమమున నస్థిపేటికను భద్రపరచిననాటి దివ మున జరిగిన సభావృత్తాంతమును నిందు గలదు.

"నాటి సభయందు సుకవి జనంబుఁ గూడి
మన కవి గ్రామణిని గూర్చి మనసు కరుఁగ
గద్య పద్యాత్మకంబుగా గణుతిఁజేసి
సానుభూతిని వెలిబుచ్చె సభ్యులకును".

"అపుడు మహాకవి యైనట్టి శ్రీ కాళ్ల
కూరి నారాయణ కోవిదుండు
నవరసయుక్తమై యువజనంబులకెల్ల
దారిఁజూపుచునుఁ బ్రోత్సాహ మొసఁగ

. . . .

పద్యముల్ వింశతి హృద్యముగా గూర్చి
వీరేశలింగాఖ్య పేర నొసఁగె".

ఈ పద్యములు "వీరేశలింగకవి వింశతి" అను పేర నా వెనుక గ్రంథరూపమున ప్రకటితములైనవి.

వీరేశలింగ సందేశమును, పురుషులకు స్త్రీలకు, సీతమ్మగారే రీతిగా నందించినదియుఁ దెలుపుచు నా పద్యములనే నీ వ్యాసమునకు భరతవాక్యముగాఁ బలుకుచున్నాను.

పురుషులు—

మ. కో. ఆశ నీ కథఁ జదువు పూరుషు లందఱుం దయతోడ నీ
దేశకాంతల దుర్వ్యశోలతఁ ద్రెంచి విద్య యొసంగ సం
దేశము న్గొనితెచ్చి యిచ్చిన ధీవరుం డగునట్టి వీ
రేశలింగ కవీంద్రుఁ బోలి చరించుచుందురు గావుతన్.

ఇది తెలుఁగు భాషకు సహజమైన కోకిల మధురస్వరముతో సందేశము నందించినట్లు భావస్ఫోరకముగ నున్నది.

స్త్రీలు—

ఉత్సాహ. దీనిఁ జదువు సతులు మన సుధీవరుండు చెప్పు సు
జ్ఞానమును గ్రహించి సతులు చదివి చెడుదు రంచున
జ్ఞానులాడు మాట కల్లగా నొనర్చి వేగమే
మానవతు లనంగఁ దగిక్షమన్ మహింత్రు గావుతన్.

ఇది స్త్రీజనముల కుత్సాహము గలిగించు రీతిని నుత్సాహ వృత్తముతో నున్నది.

నేడు మనము ప్రత్యక్షముగు జూచుచున్న స్త్రీ జనాభ్యున్నతి నీ విశ్వతోముఖముగ విలసిల్లుచున్నదన్నచో నది వీరేశలింగము దివ్య సందేశ ఫలితమే యని యాంధ్ర మహాజనులు గ్రహింతురుగాక.

శ్రీ సోమశేఖరశర్మ

శ్రీ కె. హెచ్. వి. శర్మ

1963 నూతన సంవత్సరము ఆరంభించిన వారము దినముల లోపుననే ఆంధ్రదేశమునకు తీరనిలోటు వాటిల్లినది. శాసన భానుఁడగు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు జనవరి 7 వ తేది ఉదయమున అస్తమించుటతోడనే ఆంధ్ర దేశ చారిత్రక పరిశోధనా రంగమున అంధకారము వ్యాపించి



మల్లంపల్లి సోమశేఖరశర్మ

నది. శ్రీ శర్మగారికిని, శాసనములకును అవినాభావ సంబంధము గలదు. వారి పేరు వినినంతనే ప్రతి యొక్కరికిని మొట్టమొదట స్ఫురణకు వచ్చునది శాసనములను గూర్చియే. ఆంధ్ర దేశమునకు సంబంధించిన అనేక విజ్ఞాన రంగములలో వారు అసాధారణ ప్రజ్ఞ జూపియుండినను కేవలము శాసన పరిశోధనకు మాత్రమే జీవితమును ధారవోసిన మహనీయులు వారు. శాసన పరిశోధకులుగ ఆంధ్రదేశమునకు వారుగావించిన సేవ నాకు దెలిసినంతవరకు దెల్పెదను.

ఆంధ్రదేశ సుప్రసిద్ధ పరిశోధకులలో నొక్కరగు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు వీరికి గురుతుల్యులు. వారి సాహచర్యముననే ప్రప్రథమమున శ్రీ శర్మగారు శాసన పరిశోధనయందు మిక్కిలి ఆసక్తి కలిగియుండిరి. వీరి శక్తి సామర్థ్యములను, అనుభవమును, ఆంధ్రాభిమానమును తోడనే గ్రహించిన దేశోద్ధారకులు, విశ్వదాతలగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వీరిని ఆదరించి తమచే నూతనముగ స్థాపించబడిన 'భారతి' మాసపత్రికకు పరిష్కర్తలుగ నియమించిరి. అర్జునునకు శ్రీకృష్ణ సహాయము వలె శ్రీ శర్మగారికి దేశోద్ధారకుల ప్రాపు లభించిన తోడనే ఆంధ్రదేశములోని అనేక శాసనములు సేకరించబడి అద్భుతమగు శాసన పాఠములు, వ్యాఖ్యలతో భారతి, ఆంధ్రపత్రికలయందు ప్రకటించబడి ఆంధ్ర దేశ చరిత్ర నిర్మాణమున కపూర్వ యవకాశము కలిగినది. విశ్వదాతలగు శ్రీ నాగేశ్వరరావు పంతులుగారి వితరణ, శ్రీ శర్మగారి కృషి ఫలితమున ఆనాడు ప్రకటించబడినన్ని అపూర్వ తెలుగు శాసనములు మరి ఏ కాలమున నెవ్వరిచేతను ప్రకటించబడి యుండలేదనుట కేవల మతిశయోక్తి కాదు. శ్రీ పంతులుగారి ఔదార్యమున శ్రీ శర్మగారు ఆంధ్రదేశములోని నలుమూలలు పర్యటించి యనేక కష్టనష్టముల కోర్చి అమూల్య శాసనములను సేకరించి ప్రకటించు చుండెడివారు. ఆయా సందర్భమున కొన్ని గ్రామముల వారుపర్యటించు తరి పడిన శ్రమను గూర్చి వా రిట్లు లిఖించిరి: "ఆలయాలకు చేరికగానే ఉన్న ఒక గుహను కూడా చూచి మళ్లీ మా దారి మే మందుకొన్నాము. నడచాము; నడచాము, చాలా దూరం నడచాము. మంచి వేసవి ఎండ; తీక్ష్ణమైన గాడుపు; ఉసూరుమనే ఘటాలు, కోనలో తాగిన నీళ్లే కాని ఎక్కడా మరి నీళ్ల చుక్క లేదు; వాగులూ, వంకలూ అన్నీ ఎండిపోయినవి. ఆ స్థితిలో ఎంత నడచినా తరగని దూరం. విపరీతమైన దాహం. కూర్చుంటూ, లేస్తూ మా మూట ముల్లెలతో ఉస్సురుస్సురంటూ ఒక్క అడుగు నెట్టినా నెట్టడమే అని నడిచాము. పోకలింగాయపల్లెకి పోతే కాని—నడుమ గ్రామ మేదీ లేదు—నీళ్ళు లేవు. ఆవురుమంటున్నవి ప్రాణాలు; తడి యార్చుకు పోతున్నది గొంతుక. ఏమిటి సాధనము ? ఏమిటి చేయడము ? పరుగుల లెక్క మా ప్రాణాలు తీసింది. మిత్రులైన ప్రసాదరావుగారు—కానైతే డాక్టరు గారే—చెట్టుక్రింద కూలబడ్డారు— నేనూ చతికిలబడ్డాను. ఆయన పరకాయించి చూశాడు; దాహానికి మంచి మందు కనిపెట్టినాడు; నాగజెముడు పళ్ళు మాకా సమయంలో అమృత ఘుటికలైనవి. అవే మమ్మల్ని పోకలింగాయపల్లెవరకూ నెట్టినవి. అక్కడ కడుపునిండా పట్టినన్ని మంచినీళ్ళు తాగినాము. ప్రయాణం మంచిపాఠం నేర్పిందనుకున్నాము — అంతేకదా; అనుభవంతో మనిషి బుద్ధిమంతుడూ అవుతాడు : ప్రాజ్ఞితా వస్తుందతనికి"— రహదారులు, ప్రయాణ సౌకర్యములులేని ఆ రోజులలో మనదేశమున మారుమూలలో పడియుండిన

ఈ శాసనములను సేకరించుటకు వారెంత కష్టపడిరో పై వాక్యములలో మనకు గోచరించును. కేవలము ధనసహాయము మాత్రము చాలదు; నిస్స్వార్థమైన త్యాగము, మాతృదేశమునం దభిమానము కావలెను. ఆ రెండును గల మహనీయులు శ్రీ శర్మగారు; కనుకనే శాసన పరిశోధనా రంగమున వారికి వారే సాటి. అట్టివ్యయ ప్రయాసలన్నింటికిని ఓర్చి యనేక శిలా శాసనములకు ప్రతిబింబములను తామే స్వయముగదీసి చక్కని మూలపాఠములు, వ్యాఖ్యలతోగూడ 'భారతి'ని అలంకరించిరి. తామ్రశాసన విషయమునను అనేక కష్ట నిష్ఠురములకు గురియై వాటిని మూర్ఖుల చేతిలోపడి కరగి పాత్రలగు ప్రమాదమునుండి కాపాడి భద్రపఱచిరి.

శాసనములను ప్రకటించుటయందు ముఖ్యముగ వారి నిదానము, పాఠనిర్ణయము, సంపూర్ణమైన చక్కని వ్యాఖ్య ప్రతి శాసన పరిశోధకుఁడును నేర్వవలసియున్నది. తొందర పాటు అనునదే వారెరుఁగరు. పాఠనిర్ణయమున తుదకొక్క అక్షర విషయమున చిన్నమార్పును సూచించినవారినైన పెద్దగ ప్రశంసించుట వారి అలవాటు. కేవలము 'భారతి'లో వారు ప్రకటించిన శాసనములు సుమారు ముప్పది; ఎపిగ్రాఫియా ఇండికాలోనివి నాలుగు—ఆంధ్రపత్రిక, రజతోత్సవ సంపుటములు, తెలంగాణా శాసనములు మున్నగువానిలో నింకను కొన్ని శాసనములు ప్రకటించియున్నారు. ఆంధ్ర దేశమునకు సంబంధించిన ముఖ్య శాసనములు కొన్ని ఆంగ్లములో నితరత్ర ప్రకటించబడినపుడు వాటిని ఆయా వ్యాసకర్తల పేరనే మరల భారతిలో చక్కగా సంస్కరించి ఆంధ్రావనికంద జేయు చుండెడివారు. శాసన పరిశోధనలో ప్రకటించిన శాసనముల సంఖ్య ప్రధానముకాదు; వానిపాఠనిర్ణయము, వ్యాఖ్య ముఖ్యముగ గమనించదగినవి. ఎవ్వరైనను వారికిదోచినరీతి పాఠము లను జదివి యేదియో ప్రకటించవచ్చును. కాని వారి, వారి పాఠనిర్ణయ మెంతవఱకు సమంజసముగ నున్నది వానినెంత వఱకు మన మాధారముగ గ్రహించి చరిత్రను నిర్మించవలె ననునదియే సమస్య. ఒక్కవిషయము చూడుడు. రైసుదొర ఎపిగ్రాఫియా కర్నాటికాపేర ప్రకటించినన్ని శాసనములు మొత్తము ప్రపంచములో నింతవరకెవ్వరును ప్రకటించి యుండలేదు. కాని శాసన పాఠకునిగ నాతనికిగల గౌరవము చాలాతక్కువ. నిజమునకు తదితర పాశ్చాత్య పండితులగు హుల్ష్, ఫ్లీట్, కీల్హార్న్ మున్నగువారలకు శాసన పరిశోధనా రంగమునగల విలువ ఆతనికి లేనేలేదు. దానికికారణము కేవలము శాసన పాఠనిర్ణయమే. అట్లే శ్రీ శర్మగారికి శాసన పాఠకులుగ నున్న గౌరవము, విలువకేవల మాంధ్రదేశ, దక్షిణ దేశములనే గాక యావద్భారతదేశమునను గలదు.

ఆంధ్ర దేశములోని మౌర్యఅశోకుని బ్రాహ్మీశిలా శాసనము మొదలుకొని ఇక్ష్వాక, శాలంకాయన, విష్ణుకుండిన, పల్లవ, తూర్పు చాళుక్య, గాంగవంశ, కాకతీయ, ముసునూరి, రెడ్డి, విజయనగరరాజుల శాసనలిపులన్నియు వారు చక్కగ చదివి పరిష్కరించిరి. భారతిలో ప్రకటించినవానిలో అశోకుని రాయలసీమ, శాలంకాయన నందివర్మ పెదవేగి, వినయాదిత్యుని కర్నూలు, అరికేసరి కొల్లిపఱ్ఱు, దేవేంద్రవర్మకంబికాయ, హస్తివర్మ నర్సింగపల్లి, ముసునూరి ప్రోలయనాయకుని విలస శాసనములు ఆయా రాజవంశజుల చరిత్రకు కడుముఖ్యమైనవి. ఈ శాసనముల నాధారముగ వారనేక చక్కని చారిత్రక వ్యాసములనుగూడ భారతిలో రచించిరి. అందుకడపటి పల్లవులకాల నిర్ణయము, వేంగి చాళుక్యులు, వాతాపిచాళుక్యులు, కళింగకదంబులు, త్రిలోచన పల్లవుడు, వడ్డవారము, బౌద్ధమత పరిణామము, పాల్కురికి సోమన, జక్కన కవుల కాలనిర్ణయము, కుల ములుకులసంఖ్య, చారిత్రక శతకములు, తంజావూరి మహారాష్ట్ర భూపతులు— ఆంధ్ర సాహిత్యము, యూరోపియనులు—ఆంధ్రాభాషా చరిత్రసేవ మున్నగువానిలో ఆంధ్రదేశ సంస్కృతికి సంబంధించిన వివిధరంగములలోని విజ్ఞానవిశేషములు కరతలామలకము గావించిరి. ముఖ్యముగ వారి 'విజయనగర సామ్రాజ్యము దాని యుదయ ప్రశస్తి'అనునది చక్కని రస వత్తరమైన చిన్న గద్యకావ్యమనియే చెప్పవలెను. ఇవిగాక ఆంధ్ర, ఆంగ్లములలో వారు ఆంధ్రదేశమునకు సంబంధించిన ననేక వ్యాసముల నితరత్రగూడ ప్రకటించిరి. ఆంధ్ర విశ్వవిద్యాలయాధ్వర్యమున ప్రకటించిన **Forgotten chapter of the Andhra History; History of the Reddi Kingdom** అను రెండును ఆంధ్రదేశ చరిత్రమున కమూల్య గ్రంథములు. ఇక ఆంధ్రవీరులు, అమరావతీ స్థూపము మున్నగున వెన్నియోగలవు. శ్రీ శర్మగారి మిగత రచనలన్నియు నొక యెత్తు, వారి సంపాదకీయమున నిటీవల వెలువడిన విజ్ఞాన సర్వస్వము-తెలుగు సంస్కృతి ఒక యెత్తు. ఆంధ్రదేశ చరిత్ర, సంస్కృతికి సంబంధించిన సకల విషయములందు పొందుపరచబడి యున్నవి. అందలి ప్రతి విషయమున, ప్రతి పుటను శ్రీ శర్మగారి నిదానము, విజ్ఞానము, విశేషానుభవము మనకు ప్రత్యక్ష గోచర మగుచుండును. ఆంధ్రదేశమున కిట్టి అమూల్య గ్రంథము నర్పించి గురుతుల్యులగు శ్రీయుతులు లక్ష్మణరావు, వాగీశ్వరరావు పంతులుగార్ల ఆశయము సంపూర్ణముగ నెరవేర్చిన ధన్యజీవులు. మరల ఆంధ్ర విశ్వవిద్యాలయాధ్వర్యమున రెండు గ్రంథములు 'భారతీయ లిపి శాస్త్రము', 'ఆంధ్రదేశమున మాండలికుల పరిపాలన' యనునవి రచించుటకు దలపెట్టిరి; కాని ఆ రెండును వారి చేతి మీదుగ మన ఆంధ్రులకు లభించు అదృష్టము పోయినది. శ్రద్ధ, సౌమ్యత, విజ్ఞాన, దేశాభిమానము లొక్కచో పుంజీభవించిన పుణ్యమూర్తి వారు. అట్టివారిని గోల్పోవుట నిజముగ మన ఆంధ్రదేశము దురదృష్టము. సర్వ శక్తియుతుఁడగు పరమేశ్వరుడు వారి యాత్మకు శాంతి నొసంగుగాక !

త్రిలింగాంధ్ర జన్మభూమి

శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి

ఇంతకుపూర్వము 'గోదావరి—శబరి— 'తేలవాహ' నదీ ప్రాంతమే 'తెలుంకు—అంధాపురము' సంబంధము తెల్పుచున్నది. దురదృష్టవశాత్తు 'తెలుంకు' జాతి నివాస స్థానమైన కోరాపుట్టి, గంజాము, బస్తర్ ప్రదేశములు 'తెల్‌వాహ' నదీ ప్రాంతము ఆంధ్రప్రదేశ్‌లో చేరక, ఒరిస్సాలో చేరుట శోచనీయము .... త్రినగ, త్రిలింగ, త్రికళింగ—శబ్దముల నుండి 'తెనుంగు, తెలుగు' భాషానామము లేర్పడలేదనియు, 'ఎత్' భాష నుండి కూడ కలుగలేదనియు, 'తెల్' నది 'ఉంకువ' నుండి పుట్టిన భాష 'తెలుఁగు' అయినదని తోచుచున్నది[1], అనుట తప్పుకాదు.

ఇట్లనుటలో కొంత చారిత్రక సత్యము లేకపోలేదు. ఇటీవల మరికొన్ని నిదర్శనములు కనబడినవి. అన్నిటిని కలిపి పరిశీలించిన త్రిలింగదేశ చిహ్నము లెట్టివో వూహించుట కవకాశ మున్నట్లున్నది. పరిశీలింపుడు.

ఒరిస్సాలోని తెల్ నది శబరి—గోదావరి నదులలో చేరుచున్న దనుట పొరపాటు; దృష్టిలోపము. కాగా, ఆ తెల్ నది పడమట పుట్టి తూర్పుగా ప్రవహించు మహానదితో కలియుచున్నది. బస్తర్‌లోని మద్రికి సమీపములో ఎదురుగా పుట్టి శోణపురి దగ్గర సుకెతెల్ నదిని తనలో కలుపుకొని ఒరిస్సాలో మహానదితో సంగమించుచున్నది. దీనికి మరి రెండు ఉపనదులు కూడ కలవు. కాబట్టి తెల్ నది గొప్ప యేరనుట తప్పుకాదు.

ఇదికాక, ఒరిస్సాలో 'ఢేన్ కనల్' సంస్థానమును, 'ఢేన్‌కడ (Denkada)' నదియు కలవు.

వాల్మీకి రామాయణములో 'టెంకణ' అను ప్రదేశము పేర్కొనబడినది. దీనికి తెంకణ—ఢేంకణ—టెంకణ—డెంకణ— అను రూపాంతరములు కూడ కలవు.

జాను తెనుగు ప్రబంధములో చోడ కవిరాజ శిఖామణి తన 'టెంకణాదిత్యుండన్'[2] అను బిరుద నామము పేర్కొనెను. ఇందలి తెంకణము అరవభాష యందలి దక్షిణదేశము కాదు. అది ఉత్కల దేశమందలి 'తెంకనల్' దేశము. అరవ దేశమునకు ఉత్తరదిక్కున ఉన్నది తెన్‌కనము. కాబట్టి తెంకణాదిత్యులనగా తెంకణ రాజ్య ప్రభువులు—సూర్యులు.

ఉత్కల తెంకణాదిత్యులు పిమ్మట తమిళనాటి ఒరయూరి పురవరాధీశ్వరులై మరల పాకనాటి పొత్తపి పురాధీశ్వరులైరి.

మధ్యప్రదేశ్‌లో 'తెండుల (Tendula, R)' అను నదియు, 'ఔంధి (o. Aundhi)' అను పురమును సమీప ప్రదేశములుగా కనబడుచున్నవి. ఇవి 'తెం (గు) ల్, (అ)ంధి' అను ప్రాచీన నామరూపాంతరములై యుండును.

బొంబాయి మహారాష్ట్ర మందలి 'ఔంధ్—(o. Aundh)' అను నామ సామ్యముతో 'అంధి — (o. Aundhi)' అను నామమూను 'ఔంధి—(o. Aundhi)' అను మూరు పేరుగా పలుకుట సహజము. ఇట్లు విభిన్న ప్రదేశము లగుచున్నవి.

మధ్యప్రదేశ్‌లో 'తెన్' నది కలదన్నట్లే, ఉత్కల ప్రదేశ్‌లో 'తేలవాహ' అను 'తెల్—(Tel. R.)' నది మరియొకటి కలదు. బుద్ధ జాతక కథలో వీటి పేర్లు కొన్నికలవు.

'శేరి' రాజ్యంలో బోధిసత్వుడు 'తేలవాహ' నదిని దాటుకొని 'అంధాపురం' ప్రవేశించడము జరిగింది.

ప్రాచీన కాలములో ఇప్పటి ఉత్కల ప్రదేశమునకు 'శేరి' ,రాజ్యమను నామాంతరమున్నదో లేదో తెలియదు; కాని, తమిళనాటిలో కొంత ప్రదేశమునకు, 'చేర' రాజ్యమను పేరున్నట్లు తెలియుచున్నది.

మార్గాంతరము లున్నను బోధిసత్వుడు దక్షిణ దిక్కునుండి ఉత్తర దిక్కునకు ప్రయాణము చేసెనను పక్షములో ఉత్కలరాష్ట్ర మందలి 'తెల్—(తేలవాహ)' నదిని దాటనిదే— మధ్య పరగణా యందలి 'అంధి—(అంధాపురి)' ప్రవేశించుటకు వీలులేదు. కాబట్టి, 'చేర' రాజ్యమునుండి 'చేది' రాజ్యమువైపు బోధిసత్వుని ప్రయాణము సాగినట్లు సమన్వయముచేయ వీలున్నది.

క్రీ. శ. 12 వ శతాబ్ది జాజల్లదేవుని రత్నపురి శిలాశాసనములలో 'అంధ్రకిమిడి—కోసలాంధ్రకిమిడి'[3] అను అంధ్రదేశ ప్రస్తావన కలదు. ఒరిస్సాలోని పర్లాకిమిడి పేరు వంటి పేర్లు ఆంధ్రదేశముతో సంబంధము కలిగియున్నవి. కోసలదేశ మిప్పటి మధ్య ప్రదేశములో చేరిపోయిన ట్లున్నది.

ఇట్లూహించుట తప్పుకాని పక్షములో ఒరిస్సా రాజ్యములో తేలవాహ—తెంకడ నదులు, మధ్యప్రదేశ కోసల రాజ్యంలో తెండుల—ఔంధి (అంధి) నదీ పట్టణములు కలవనుట దేశపట సమ్మతము. ఇవి త్రిలింగాంధ్ర జన్మభూమి చిహ్నము లనుటకు జాతి నామములు తోడ్పడుచున్నవి.

తెన్ + ఉంకు—తెనుంకు.

తెల్ + ఉంకు—తెలుంకు.

ఇది నదీతీర నివాసస్థల జాతినామ చిహ్నములు. వీటితో ఔంధి—అంధి జాతి కలసిన పక్షములో త్రిలింగజాతులు ఏర్పడును.

---

1. నా రచన-తెంకణాదిత్య కవి-(1960) పు. 9-10.
2. కుమా. సం. అ. 1—54.
3. అం. భా. చ. భా. 1. పు. 9.

త్రిలింగదేశ మత్యంత ప్రాచీనమైనదనుటకు గ్రీకు భూగోళశాస్త్రము తోడ్పడుచున్నది.

'ఉత్తర కళింగము ఉత్కళదేశ మనబరగు ఓఢ్రదేశము. మధ్య కళింగము, త్రికళింగము ఆంధ్రదేశమునకు చెందినవి. ఇవి గోదావరికి ఉత్తరముననున్న భాగములు. త్రికళింగములోని 'క'—కారము జనుల ఉచ్చారణ వేగముననో లేక విదేశీయుల పలుకుబడిలోనో జారిపోయి 'త్రిలింగ' పదముగా నిలిచినదనియు, ఇది యే కాలక్రమమున తెలుంగుగా మారినదనియు చేసిన యూహ యుక్తి యుక్తముగనే తోచును. దీనికి తార్కాణముగ టాలెమీ యను గ్రీకుదేశపు భూగోళ శాస్త్రజ్ఞుడు ఈ దేశమును వర్ణించుచు దీనిని 'ట్రిలింగాన్' అని పేర్కొని యుండుట గమనింపతగినది. టాలెమీ యను నాతడు క్రీ. శ. 150 వ సంవత్సర ప్రాంతమున నుండినవాడు. ఈతడు తన భూగోళ శాస్త్ర గ్రంథములో భారతదేశమును వర్ణించుచు త్రిలింగ దేశమును గూడ పేర్కొన్నవాడయ్యెను. ఇట్లు తెలుంగు శబ్దము కూడ మిక్కిలి ప్రాచీనమైన కథను (చరిత్రను) వహించియున్నది'4.

క్రీ. శ. 2 వ శతాబ్దమునాటిదగు ట్రిలింగము—త్రిలింగము 'తెన్—తెల్—అంధ్' జాతి చిహ్నములు గల త్రిలింగదేశ మనుట మధ్యప్రదేశ త్రికళింగ చరిత్ర సమ్మతము.

త్రిక—లింగ రూపాంతమే త్రి—కలింగ—త్రికలింగమైన దనుట త్రిలింగజాతి దేశభాషా చరిత్ర కాకపోదు. అనుచిత విభాగమే దేశ నామమైనది.

త్రిలింగాంధ్రభూమి జన్మస్థానము కోసలాంధ్ర మధ్య ప్రదేశ మనుట తెనుంగు—తెలుంగు—అంధ్రి—జాతి నదీ పట్టణ స్మృతిలింగము.

ఇప్పుడు వ్యవహారమందున్న కాళహస్తి—శ్రీశైల—దాక్షారామ—లింగములనుబట్టి కాని, కాళహస్తి, శ్రీశైల, మహేంద్ర నగరములనుబట్టి కాని, త్రిలింగాంధ్ర జన్మభూమి యేర్పడలేదనుట భూగోళ చరిత్ర ప్రసిద్ధమైనను వలసల విస్తరణ మూలమున తల్లింగాహ్వాయముగా అన్వయించుట దేశాభిమాన పూర్వ చరిత్రయే కాని, కేవల కల్పనా కృత్రిమ కథ కాదు.

ఇప్పటికిని మధ్యప్రదేశములో త్రిలింగజాతి భాషాసూచకములుగా వ్యవహరింపబడు భాషలు మూడున్నవి.

'మధ్యపరగణాలలోని చాందా జిల్లాలో నాంధ్రభాషకు—కొంటావు, సాలే 'వారి' గోలరి—అను పేళ్లున్నవి. ఈ మూడును వేర్వేరగు నుపభాషలుగా నెంచుటకు వీలున్నను వాని యుచ్ఛారణమును, సుప్తిఙంతముల విధానము నొక్క తీరుగనే యున్నవి'.5

తదుదాహరణము లన్నియు ఉల్లేఖించక పోయినను, కొంటావు భాషకే క్రింది ఉదాహరణ కథ వ్రాసెను.

'ఒక మనిషికి యిద్దరు పిల్లగాండ్లు వుండిరి. వాండ్లో చిన్న వాడు తండ్రితో అంటాడు, తండ్రి యేదో మాలమతది నాకు వచ్చవలది అది యివ్వు. వెనక వాడు పిల్లనికి ధనము పంచి ఇచ్చిండు. వెనక కొన్ని దేవపాలకు చిన్న పిల్లడు అంత సొమ్ము జమాజేషి దూరదేశానకు పోయిండు. యింక అక్కడా అవిచారముతో నడ్చి తన సంపత్తు పాడుగొట్టినాడు. తర్వాత వాడు అంతా పడ్చినంక ఆ దేశములో లావు కరువుబడది. అందుకు వానికి కఠినము బడది. అప్పుడు వాడు దేశములో ఒక్కమనిషి దగ్గరకు పోయిన్నాడు. వాడే తేను వాని పందులు కాశీ కొరకు తన చేండ్లోకి తొల్లాడు. పందులు తినేది పట్టుతో వాడు తన పొట్ట నింపుకోవలె అని వానికి అనిపించిది. యింకా ఎవ్వరు వానికి యివ్వలేదు. తర్వాత వాడు తెల్విపీదికి వచ్చి అన్నాడు. మా తండ్రి యింట్లో యెందరు నవుకరులకు పుష్కళంగా అన్నం వున్నది, యింకా నేను ఆకలితో చస్తా. నేను లేశి నా తండ్రి దగ్గరకు పొయ్యేను. వానితో అనేను. 'ఓ తండ్రి' నేను యీశ్వరునికి విరుద్ధం. నీ ముందర పాపం జేసినాను. ఇక్కడనుంచి నీ కొడుకును అనేటందుకు నేను యోగ్యని కాను. నీ ఒక్క నౌకరి వానివలె నన్ను వుంచు'.6

ఇది 'లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా 4—సంపుటము నుండి' ఎత్తి వ్రాయబడినట్లు సూచింపబడినది. తక్కిన వాటికి—సాలే వారి, గోలరి—తెనుగు భాషోదాహరణలు ఎత్తి వ్రాయువందువల్ల పోలికలు తెలియవు.

ఇప్పుడీ కొంటావుభాష వాగ్రూపములో ఉన్నదో, గ్రంథస్థమైనదో వివరములు తెలియవు. అరఖులోయ గిరి జనులలో 'కొంట్యా' జాతి కొండదొర లున్నట్లున్నది.

పై కొంటావు జాతి తెనుగు వ్యావహారిక భాషలో 'జమ—నౌకరి' మొదలగు అన్యదేశ్యములను వాడుచున్నప్పుడా ప్రాచీన లక్షణమును, అధర్వణకారికలు చెప్పుట కల్పిత మెట్లగునో తెలియదు!

'మధ్య పరగణాలలోని తేల్ నదీ ప్రాంతమునుండి వచ్చినవా రగుటచే తెలుంగులను నామము కలిగినదని కొందరు చెప్పుదురు. తైలిక శబ్దభవము తెలుంగని కొందరి యభిప్రాయము. తెలివిగలవారు కావున తెలుంగులను పేరుగలిగినదని కొంద రందురు. తెల్ అను పదము సంస్కృతములోని ధవల, తృప్త, దృప్త—మొదలగు శబ్దముల ప్రాకృత వికారము కావచ్చును. ఈ వ్యుత్పత్తు లన్నియు నూహామాత్రములు. తెలుంగు శబ్దము వ్యుత్పత్తిని గూర్చి ఇదమిద్ధమని చెప్పుటకు నేటికిని

4. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము (1949) పు. 5. ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

5. ఆంధ్రభాషా చరిత్రము, పు. 7 డాక్టరు శ్రీ చిలుకూరి నారాయణరావుగారు—కీర్తిశేషులు.

6. ఆంధ్రభాషా చరిత్రము, పు. 38—39.

దగిన యాధారములు లభింపలేదని మాత్రము చెప్పి యింతటితో విరమించవలసి యున్నది.'7

భాషా తత్త్వవేత్తల కిట్టి నైరాశ్యము కల్గినను, దేశపటములో త్రిలింగములుగా కనబడుచున్న 'తెన్—తెల్' నదీ నివాసస్థులను, 'అంధి' పురనివాసస్థులను త్రికలింగజాతులుగా గుర్తింపకపోవుట శోచనీయము.

తెన్ + ఉంకు—తెనుంకు; సరళము తెనుంగు; వైకల్పికము తెనుఁగు. తెండుల నదీతీరమందు ఉంకు (వ) కల జాతి తెనుఁగుజాతి. దీనికి దిగువ (ఔంధి) అంధి పట్టణము కలదు. ఇవి రెండు మధ్యప్రదేశములోని కోసలాంధ్ర ద్విలింగజాతి చిహ్నములు.

తెన్ వంటిదే యగు తెల్ + ఉంకు—తెలుంకు; సరళము తెలుంగు, వైకల్పికము తెలుఁగు. తేలవాహ నదీతీరమందు ఉంకు (వ) కల జాతి తెలుఁగుజాతి—ఇది ఓఢ్రదేశములోని మూడవదగు త్రికలింగ జాతి చిహ్నము.

పైని వివరించిన 'తెన్—తెల్—అంధి' అను త్రికలింగ దేశమే త్రిలింగదేశమని పూర్వ చరిత్రలో పేర్కొనబడినది. తెన్ నదికిని—తెల్ నదికిని—అంధిపురికిని—మధ్యనున్న దేశము క్రీ. శ. 2 వ శతాబ్దినాటి ట్రిలింగానము. పిమ్మట తెలంగాన దేశ విస్తరణనుబట్టి త్రిలింగదేశము హద్దుల మార్పు చేయబడినట్లు తోచుచున్నది.

'త్రికళింగ మనున దిప్పటి గంజాము, విశాఖపట్టణము జిల్లాలును, వానికి పడమర మధ్య పరగణాలలోని కొంత భాగమునై యుండెను.

'నేటి ముఖలింగమున్న ప్రదేశమునకు మోదోగలింగే యను పేరు గ్రీకు చరిత్రకారుల వ్రాతలయందుఁ గాన్పించుటచే మోదో అనగా మూఁడగు అని అర్థము చెప్పుకొని త్రికళింగమునకు మూఁడగు కళింగమని యర్థము చెప్పి యా త్రిలింగ శబ్దమునుండి తెలుఁగను పదము పుట్టినట్లు కెంబల్ మొదలగు పాశ్చాత్య పండితు లభిప్రాయపడిరి. మోదోలింగ మను పది మధూకశబ్ద భవముగాని మూఁడవ కళింగము అనుదాని మారు రూపము కాదు. మూఁడగు కళింగమని త్రిళింగ మెన్నడును వ్యవహారమున లేదు.'8

ఇప్పుడీ భాషా తత్త్వవేత్తల విమర్శలో కొంత సత్యము లేకపోలేదు. కాని, అంతా శూన్యమనుట సరికాదు.

త్రిలింగ—త్రికలింగ రూపాంతరములు సమానార్థకములు. త్రిక—లింగశబ్దమే త్రి—కలింగముగా వ్యవహారములో మారి, త్రికళింగ దేశవాచకమైన దనుట అనుచిత విభాగ చరిత్ర.

'తెన్—తెల్—అంధి' అను త్రిలింగములే పూర్వ చరిత్రలో త్రిలింగదేశము, లేక—త్రికళింగ దేశమనుట నేటికిని సమన్వయ మగుచున్నది.

తెనుఁగు—తెలుఁగు—అంధ్రి — జాతుల సమాహారమే ఆంధ్రజాతి—ఆంధ్రభాష, ఆంధ్రదేశము. అదే త్రిలింగాంధ్ర జన్మభూమి.

దక్షిణభారత్ (ఇండియా) దేశపటము 9 లో తిర్యగాంశ: 80—85 మీదను, ఊర్ధ్వాంశ: 15—20 మీదను త్రిలింగాంధ్ర జన్మభూమి కేంద్రీకృతమై యున్నది. తెనుగు పటములో నదీ చిహ్నము లున్నవి కాని, వాటి పేర్లు లేవు. ఇంగ్లీషు దేశపటము 10 లో ఆ నదీ నామములు, సంగమ స్థానములు గుర్తించ వీలున్నది.

మధ్యప్రదేశములో కాంకర్ పట్టణము దగ్గర పుట్టి రాజ్ నంద్‌గాన్ దగ్గర కాంకర్ నదితో చేరిన తెండుల నది ఉత్తరము—తూర్పుగా ప్రవహించి, శోణపురి దగ్గర సుక్తల్ నదితోను, తెల్ నదితోను మిళితమై మహానదితో సంగమించుచున్నది.

ఇట్లే తెనుగు కూర్పులో అంధిపురి పేరుకూడ లేదు. ఇంగ్లీషు కూర్పులో తెండుల (Tendula R) నదికి వాయువ్య దిశలోను, కాంకర్‌పురికి పడమటి దిశలోను, చాందపురికి ఆగ్నేయ దిశలోను అంధి (ఔంధి — Aundhi) పురమున్నట్లు చూపబడినది. మధ్యప్రదేశ్‌లో చాందా జిల్లాలో కొంటావు జాతి తెనుగుభాష కలదనుటయు, అచట కోసలాంధ్ర కిమిడి భాషయో, జాతియో కలదని క్రీ. శ. 1115—తేది రత్నపురి శాసనమువలన వ్యంజకమగు చున్నది.

ఆక్సుఫర్డు అట్లాసులలో స్పష్టముగా లేకపోయినను, మేక్‌మిలన్ తెనుగు 11 దేశపటములో కటకము దగ్గర ఢెంకనల్ పట్టణము, ఒక నదియు కలవని గుర్తింప వీలున్నది.

ఇందలి సాధక—బాధకములు విజ్ఞులు పరిశీలించి, ఏదో ఒక నిర్ణయము చేయుదురుఁగాక.

---

7. ఆంధ్రభాషా చరిత్రము, భా. 1—38; డాక్టరు శ్రీ చిలుకూరి నారాయణరావుగారు—కీర్తిశేషులు.

8. ఆంధ్ర. భా. చ. 1—32, 33.

9. ఆక్సుఫర్డు తెనుగు దేశపటముల పుస్తకము—1954; నాల్గవ కూర్పు—పుట 13.

10. The Oxford School Atlas. Southern Zone—Edi 1957—P. 20.

11. Macmillan & Co. Ltd. — Edi. 1953—తెనుగు భూపటముల పుస్తకము—పుట 24.

లేఖలు

అర్జునుడు నల్లనివాడు

"భారతి" సంపాదకులకు:

ఆర్యా,

అర్జునుడు నల్లనివాడని సోపపత్తికంగా నేను నిరూపించాను. (భారతి సెప్టెంబరు 1962 పేజి 86) కానీ, నా నిర్ణయాన్ని అంగీకరింపనొల్లక, తమ తప్పును ఒప్పుకొనడానికి ఇష్టపడక, ప్రతిష్ఠకోసం పెనగులాడుతూ శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు, అర్జునుడు తెల్లనివాడే అని నిర్ధారణ చేయడానికి వ్యర్థ ప్రయత్నం చేశారు. (చూ. భారతి 1962 డిసెంబరు, పేజి 81) వారి వాదంలో నున్న లోపాలను వరుసగా నిరూపిస్తున్నాను.

అర్జునుడు నల్లనివాడని సంస్కృత భారతంలో నున్న శ్లోకాలవల్లను (ఆది—135—89, విరా—44—23, ఆశ్రమ–25—7,) ఆంధ్ర భారతంలో నున్న పద్యాలవల్లను (ఆది—6—17, ఆది—7—124, ఆది—7—189, ఆది—8—128, ఆది—8—185, విరా—4—251, భీష్మ—1—108, ఆశ్రమ—2—40) మనకు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ ప్రబలతమ సాక్ష్యాలకు శ్రీ శాస్త్రిగారు సమాధానం ఇవ్వలేకపోయారు.

అర్జునుడు నల్లనివాడని వ్యాస భగవానుడు, నన్నయ భట్టు, తిక్కన సోమయాజి—వీళ్లంతా ఘంటాపథంగా చెబుతుంటే, శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు "అబ్బే, వాళ్లు చెప్పింది తప్పు, వాళ్లకేమీ తెలియదు" అనే ధోరణిలో మాట్లాడుతున్నారు.

'దేవుడు వరమిచ్చినా, పూజారి మాత్రం ఒప్పుకోలేదు'' అన్న సామెతని సార్థకం చేస్తున్నారు, శ్రీ శాస్త్రిగారు.

మూల భారత రచయితయైన వ్యాసమహర్షి "అర్జునుడు నల్లనివాడు" అని తన భారతంలో వ్రాయగా, "అది తప్పు. ఎందుచేతనంటే టీకాకారులు ఒక రిద్దరు, అర్జునుడు తెల్లనివాడన్నారు" అని ఎవరో టీకా కర్తలని శరణు జొచ్చారు శ్రీ శాస్త్రిగారు. "ఏనుగుమీద దండెత్తడానికి ఎలుక యొక్క సహాయం అర్థించినట్లు" కన్పిస్తున్నది శ్రీ శాస్త్రిగారి ధోరణి.

'అవదాత' శబ్దమునకు గల నానార్థములను వారు గమనించలేక పోయారు. అవదాత వర్ణమంటే ఒక్క తెలుపు రంగుకే కాకుండా పసుపుపచ్చ రంగుకీ, స్వచ్ఛమైన ఏ రంగుకైనా కూడా అర్థం చెల్లుతుంది అని చెప్పి నేను "అవదాత: సితే పీతే శుద్ధే" అను అమరకోశములోని శ్లోకాన్ని నా వ్యాసంలో ఉదహరించాను. అవదాత వర్ణమంటే కల్తిలేని స్వచ్ఛమైన వర్ణం (ఇది నలుపు కావచ్చును) అని అర్థం. అందుకే వ్యాస మహర్షి అర్జునుని శరీరవర్ణం "కృష్ణావదాత:" (విరా—44—23) అని సెలవిచ్చినాడు. అర్జునుడు తెల్లనివాడై యుంటే వ్యాసుడు "కృష్ణావదాత:" అనే పదాన్ని ప్రయోగించి ఉండేవాడు కాడు.

శ్రీ శాస్త్రిగారు ఉదాహరణగా చూపిన "కరోమికర్మ శుక్లంచ, తేన మామర్జునం విదు:" అను శ్లోకంలో నైనప్పటికీ, అర్జునుడు తెల్లనివాడని చెప్పబడలేదు. అతడు పవిత్రమైన కర్మను చేయువాడు కావున అతనికి అర్జునుడను పేరు వచ్చినదని ఆ శ్లోకం యొక్క తాత్పర్యం. అది శ్రీ శాస్త్రిగారికి అవగాహన కాలేదు.

అర్జునుడికి ఆ పేరు అతని శరీరవర్ణంబట్టి రాలేదు. కృతవీర్యుని కుమారుడైన కార్తవీర్యార్జునుని కంటె ఇతడెక్కువ పరాక్రమవంతుడు కాగలడు గనుక ఇతనికి అర్జునుడను పేరు చెల్లుతుందని ఆకాశవాణియే నిస్సందేహంగా చెప్పినది. (ఆది—5—124)

భగవద్గీతలో "అకీర్తికర మర్జున" (2–2) అనుచోట శంకరాచార్యులవారి వ్యాఖ్యానమున "అర్జున!—స్వచ్ఛ స్వభావ!" అని ఉన్నదని శ్రీ శాస్త్రిగారు సెలవిచ్చారు. ఉంటే మాత్రం ? అందులో "తెల్లనివాడు" అనే అర్థం ఎక్కడుంది ? స్వచ్ఛమైన స్వభావము కలవాడా! నిర్మలమైన శీలము కలవాడా! అనే కదా దాని అర్థం ? కనుక ఇది శాస్త్రిగారి వాదాన్ని బలపరచలేదు. ఆ శ్లోకాన్ని వారు ఉదహరించడం నిష్ప్రయోజనం. పైగా మిక్కిలి అది నా వాదాన్ని బలపరుస్తున్నది.

వ్యాస నన్నయ తిక్కనలే కాక, చేమకూర వేంకటకవి కూడ అర్జునుడు నల్లనివాడే అని చెప్పడానికి తన విజయ విలాసములో ఇలా వ్రాసియున్నాడు.

"మృగమదము చెంతఁ గుంకుమరేఖవోలె,
నీలమణి పొంత నుదిరి ప్రాలేకువోలె,
మేఘము కురంగటను దీగ మెరపువోలె,
అర్జునుని చెంగట సుభద్ర యలరె నపుడు."

భారతద్రష్టయైన వ్యాసమహర్షితో సహా ఇంతమంది మహాకవులు అర్జునుడు నల్లనివాడే అని నిస్సందేహంగా చెబుతూవుంటే శ్రీ శాస్త్రిగారు మాత్రం "కాదు, కాదు, అర్జునుడు తెల్లనివాడు" అని చెప్పడం చూస్తే "వూరంతా ఒకవైపూ, ఉండ్రుకుడి పోలయ్య ఒక్కడూ ఒకవైపూ" అన్న సామెత జ్ఞప్తికి వస్తున్నది.

అంతేకాదు. శ్రీ శాస్త్రిగారి మాటల్లో సందిగ్ధత, అస్థిరత గోచరిస్తున్నాయి. ఒకప్రక్క అర్జునుడు తెల్లని వాడని అంటూ, ఎందుకైనా మంచిదని, మళ్లీ "అర్జునుడు నల్లనివాడే యగుగాక" అని "గోడమీది పిల్లి వాటం" ప్రదర్శిస్తున్నారు శ్రీ శాస్త్రిగారు. అర్జునుడు, నలుపూ, తెలుపూ రెండు వర్ణాలూ ధరించడానికి అతడేమి వూసరవెల్లి అనుకుంటున్నారా శ్రీ శాస్త్రిగారు ? ఎంత అసందర్భమైనవాదం ! ఎంతటి అసమంజసమైన అభిప్రాయం !!

ఇప్పటికైనా శ్రీ శాస్త్రిగారు "తాఁ బట్టిన కుందేటికి మూడేకాళ్లు" అని వాదించే ధోరణిని విడిచిపెట్టి, ప్రతిష్ఠ కోసం పెనగులాడకుండా, తమ తప్పుని అంగీకరిస్తారని ఆశిస్తూ, ఈ చర్చకు ఇంతటితో స్వస్తి చెబుతున్నాను.

—నుంగిపూడి కృష్ణమూర్తి

ఈ చర్చను ఇంతటితో ఆపివేయడమైనది. భా. సం.

శబ్దపల్లవములు

"భారతి" సంపాదకులకు :

ఆర్యా,

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు 1962 అక్టోబరు భారతి సంచికలో ఆచార్యులుగారి కిచ్చిన సమాధానమున "శ. ప. క్రియలలో అరసున్నలు—ద్రుతకార్యములు ఉండవు" అని వ్రాసిరి. ఆ వాక్యము ప్రమాద పతితమని తెలుపుచు కొన్ని క్రియలును వానికి ప్రయోగములును '62 డిశంబరు సంచికలో "ప్రమాదో ధీమతామపి" అను వ్యాసమున నాచే జూపఁబడినవి.

దానిపై '63 జనవరి సంచికలో శ్రీ మా. శంకరరావు గారు తమ లేఖలో సూచించిన దానిని (బాల వ్యాకరణము—క్రియా పరిచ్ఛేదము—సూత్రము 110 చూడనగు) కృతజ్ఞతతో గ్రహించి యీ వ్యాసమున శబ్ద పల్లవ స్వరూపమున్న వివరింపఁ బూనితిని.

1 క్రియాః ప్రసిద్ధా బహువశ్శబ్దపల్లవ సంజ్ఞకాః।
2 ప్రథమాయా ద్వితీయాయా స్సంబంధ స్త్రతసమ్మతః
3 తయోర్విధి ర్యథాయోగం తత్సమాద్వై కృతాదపి।
4 క్రియాయా ఉపచారస్స్యాత్ ప్రథమా పద సంగతః।
అకర్మకత్వం ప్రాయస్స్య త్పరత్రో భయసమ్మతిః।

అని అథర్వణ వచనము. ఈ సందర్భమున నాగను శాసనమిచే నేమియు బ్రసంగింపఁ బడలేదు.

1. అనేకములగు క్రియలు శబ్ద పల్లవనామముచేఁ బ్రసిద్ధి నొందియున్నవి. 2. ఆ శబ్ద పల్లవ క్రియలలో ప్రథమా సంబంధమును, ద్వితీయా సంబంధమును, సమ్మతింపఁబడి యున్నది. 3. వాని విధి సంబంధానుసారముగ తత్సమ వైకృతములు రెంటిమీదను గలుగవచ్చును. 4. క్రియకు ప్రథమాపద సాంగత్యము గల్గినపుడు ఔపచారిక క్రియ యగును. అనగా పూర్వదళము ప్రథమాంత మైనపుడు ఉత్తర క్రియ యొక్క అర్థము ఆధారభూత కర్తయందు ఔపచారికముగ వర్తిల్లును (ఆరోపింపఁబడును). అట్లు ప్రథమాంతముతో యోగమున్నపుడా క్రియ ప్రాయికముగ అకర్మక మగుచుండును. ద్వితీయాంతముతో యోగ మున్నపుడా క్రియకు సకర్మకత్వమును సమ్మతింపబడినది.

ఈ సందర్భమున నహోబలపతి వాక్యముల నొకపరి పరిశీలింపవలసి యున్నది.

"అత్రాధేయ నిష్ఠ క్రియాయా అధార ఆరోప ఇత్యుచ్యతే". పెంపెక్కుచున్నాడు, పనిదేరి .... పెంపారి, తెగటారి ఇత్యాది రూపాణి ప్రథమా సంబంధ ఉదాహరణమ్ .... కదియంబడి, చదికిలంబడె నిత్యా దీనాం నాంతా నామపి ద్వితీయాంతత్వే నైవగ్రహణమ్. ఏతాదృశానిరూపాణి ద్వితీయా సంబంధే అకర్మకత్వ ఉదాహరణమ్ .... 'చేకొని' ఇత్యాదౌ న గకారాది వర్ణవికారః. "క్వచిన్నైవ వికారస్స్యా

ద్రూఘోత్వాచ్ఛబ్ద పల్లవః." ఇతి తస్యైవోక్తేః. "చెక్కనయ్యెన్, విన్ననయ్యెన్" ఇత్యాదికమ్, తెల్లంబడి, నల్లంబడి, డిల్లంబోయి, వెలవెలంబోయి, విన్నంబోయి, ఒడంబడి, తడంబడి ఇత్యాదికం చోభయత్రాపి గ్రాహ్యమ్".

పై యహోబలపతి వాక్యములు బరిశీలించినయెడల శబ్ద పల్లవ క్రియలలో నరసున్నలును ద్రుతకార్యములును నుండి తీరునను విషయము స్పష్టమగుచునే యున్నది.

శబ్ద పల్లవ విషయమున సూరి "ధాత్వాదులకు ధాతువులనుప్రయుక్తంబులయి విలక్షణార్థాభి ధాయకంబులగు నీయవి శబ్దపల్లవంబులు నాఁబడు" వని సూత్రించియున్నాడు. ఆ సూత్రమున సూరి కొన్ని యుదాహరణముల నొసఁగి "ఇత్యాదులు శబ్దపల్లవంబు" లని వ్రాసెను. ఆ యుదాహరణములలో ఖండబిందుకము, కృత ద్రుతకార్యమునగు రూప మొక్కటియును లేదు. దీనినిబట్టి శబ్దపల్లవ క్రియలలో నరసున్నలును, ద్రుతకార్యములు జరుగుటయు సూరికి రుచింపలేదని భావింపవలెనా ? లేక ఆది పదముచే నట్టివానిని గూడ నీ పట్టికలోఁ జేర్చుకొనవచ్చునా ? ఏమైనను సూరి యీ విషయమును కొంత సందిగ్ధముగానే నడిపియున్నాడు. మరియు "ఏఁగుదెంచు, అరుగుదెంచు" ఇత్యాది రూపసాధనమున సూరి "తెంచు ధాతువగ్వాదుల కనుప్రయుక్తంబగు నగుచో నుత్వంబు పయి దాని తకారంబు దకారంబగు" నని సూత్రించియున్నాడు. ఏఁగుదెంచు అనునది శబ్దపల్లవ మనుటలో ప్రాచీన లక్షణము ననుసరించిగాని, సూరి లక్షణము ననుసరించి కాని విప్రతిపత్తి యేమియు కానవగుటలేదు. కాని సూరి యిట్లు సరళాదేశము జరిగిన క్రియ నొకదాని నైనను శబ్ద పల్లవ పట్టికలో నీయలేదే ? ఖండబిందువుగాని, పూర్ణబిందువుగాని దీని యందు కానవచ్చుటలేదు. ఇట్టివానిలో మొదట బిందువుండియుండుననియును కాలక్రమమున నది నశించినదనియును నూహింపనగును. కావుననే (ఇందు బిందువు కాన్పింపకుండుట చేతనే) సూరి ప్రత్యేకముగ త కారమునకు ద కార మగునని చెప్పియున్నాడు. కాని గేలిగొను, గనువుగొట్టు, ఉదిరిగొను, అడ్డుగొను, ఎరగొను, కడగట్టు, ఒడగూర్చు, కావిగొను మున్నగు వానిలోని ఉత్తర దళాదయ క కారమున కాదేశముగ వచ్చిన గ కార మెట్లు వచ్చినది ? దీని విషయము చిన్నయసూరి చెప్పనే లేదు. మరియు ఉకారముకంటె పరమైన తెంచు ధత్వయవ త కారమునకు ద కారమును చెప్పెనే కాని కాలుఁ ద్రొక్కు మున్నగువానిలోని ద కార స్వరూప మెట్టిదో చెప్పలేదే.

పై క్రియ లన్నింటియందును, క,తల కాదేశముగ వచ్చిన గ కార, ద కారములు ప్రథమమున ద్రుతకార్యముల వలన వచ్చినవియే యని భావింపవలసి యున్నది. కాని కాలక్రమమున ద్రుతకార్య నిరూపకమగు బిందువు నశించి యుండుటచే దానిని వేరొకదారి ద్రొక్కింపవలసి వచ్చినది.

అట్టివానిని తీసివేసినను ద్రుతకార్య నిరూపకమగు బిందువుతోఁ గూడినవి యగు 1. 'కనుఁద్రొవు (వంచించు), 2. విన్నఁబడు (వివర్ణమగు), 3. విన్నఁబోవు (వివర్ణమగు) 4, ఒడఁగూడు (సిద్ధించు, చేరు), 5. ఒడఁబడు (సమ్మతించు, అనుకూలించు, సంతోషించు), 6. తొలఁగఁబడు (తొలఁగు), 7. దిగఁద్రావు, (దిగు). 8. వెలవెలఁబారు (వివర్ణమగు) 9. తడఁబడు (తొట్రు

---

1. "అనుజన్మ వధూగమనం, బొనరించిన ద్రోహి వగుట నోర్వకనిన్నున్
గనుఁద్రొవి సంహరించిన, ననుఁ జెందునె దుష్కృతంబు నగచర తిలకా!" రామా. 5 ఆ.

2. "వినుమో యబ్జాస్య నీ కింతమాత్రన విన్నం బడవేల" పారి. 4 ఆ.

3. "ఆ మంత్రినం, దనువాక్యంబులు నిక్కమయ్యెనని విన్నంబోయి". పా. 2 ఆ.

4. "అనువన గావున నేడ, క్కమలజుఁ గొలువంగ మహర్షి గణములు పితృ సం
ఘములును బోదురు బ్రహ్మం, డమునం గలవారలం దొడం గూడంగాన్". భార. ఆది. 5 ఆ.

5. సమున్నత పీఠమ్మున నుంచి యథావిధి పూజ లొడం బడ జేసి". ఆది. 5 ఆ.

6. "బలమతి ధ్రువుఁ డహితునిదో
ర్బల విభవము సైపలేక పరిభవ దైన్యా
కలనమున కోర్చి శత్రులు
చెలఁగఁ దొలఁగఁ బాఱె దేవ సేనలు గలగన్."
ఉ. హరి. 10 ఆ.

7. "కన్నంతన యేనిక
దున్న దిగంద్రావి రభస దోలాయితహో .... "
హరి. పూ. 7 ఆ.

8. "వెలవెలఁబాఱెఁ దమ్ముఖము వెల్వెలఁ బాఱె వితాన వాబ్జముల్". మను. 5 ఆ.

9. అళులుఁ గచంబులున్ లతలు నంగములున్ బువుగుత్తులుంగు చం
బులును జిగుళ్లుఁ బాణులును బుష్ప వికాసము మంద హాసమున్
గలసి తడంబడన్". కళా. 3 ఆ.

వడు, వ్యత్యాసవడు, చలించు) మున్నగు శబ్దములు మహాకవి ప్రయుక్తములై యున్నవి. దిఙ్మాత్రముగ నొక్కొక్క క్రియ కొక్కొక్క ప్రయోగము చూపుదును. (ఈ ప్రయోగములు శబ్దరత్నాకరమునుండి గైకొనబడినవి).

ఈ ప్రయోగములనుబట్టియు, నాథర్వణోక్తిం బట్టియు, కవి శిరోభూషణ కర్తయగు వహాబలపతి వ్యాఖ్యం బట్టియు శబ్ద పల్లవ క్రియలలో అరసున్నలును, ద్రుతకార్యములు నుండునని స్పష్టమగుచున్నది.

—రావూరి మృత్యుంజయరావు.

"శరణార్థి" పదచర్చ

భారతి" సంపాదకులకు:

ఆర్యా,

1963 జనవరి భారతిలో " 'శరణార్థిచేయు' అనునది శబ్దపల్లవమే" అగునని శ్రీ సదాశివగారు నా లేఖకు సమాధానము వ్రాసివారు. వారు శ్రీ దీపాలవారి వాదము నాదరించుచు, "శ్రీ శాస్త్రిగా రన్నట్లు 'శరణార్థి' అను విశేష్యమునకు 'చేయు' ధాతువను ప్రయుక్తము కాగా 'నమస్కరించు' అను విలక్షణార్థము సిద్ధించినందున అది శబ్ద పల్లవ క్రియయే అని నిర్ధారణ చేసినారు. అయితే "శరణార్థి" యను దానివి గూర్చి శ్రీ దీపాలవారు వ్రాసిన తీరును వీ రంగీకరింపలేదు. విర్జాల చంద్రశేఖరయ్యగారి సూచన నంగీకరించినారు. విర్జాలవారు ఈ పదము కన్నడపదము కానోపు నన్నారు. అట్టిచో శ్రీ సదాశివ గారు కన్నడ పదమును గూడ విశేష్యముగ గ్రహించి 'చేయు' అను ప్రయుక్తమైన దందురా ? అట్టి ప్రయోగ పద్ధతి యున్నదా ? ఆదటుండనిండు. సదాశివగారి వాద మంగీకరించి నను విలక్షణార్థము వచ్చుట లేదే ! శరణార్థి=నమస్కారము, చేసి=చేసి, అని శబ్ద పల్లవ క్రియ కాకున్నను, వారు చెప్పిన యర్థము వచ్చుచునే యుండెనే ! శ్రీ సదాశివగా రింకొక మాటన్నారు : "శబ్ద పల్లవముల లిస్టులో 'శరణార్థి' లేదు గాన ఆచార్యులుగా రనుమానించు చున్నారని". ఈపద ముండుట గాదు నేనన్నది. శరణ+అర్థి = 'శరణార్థి' అనునట్టి సమాస సిద్ధమగు పదమును గూడ గ్రహించి క్రియ నను ప్రయుక్తముచేసి ప్రయోగించు పద్ధతి యున్నదా ? అని నా ప్రశ్న. వ్యాకరణమును గూర్చి వారొక మాటనూ టన్నారు. "వ్యాకరణమే సమస్తము" కాదని. సమస్తమని యెవ రన్నారు? అనుమానాస్పద విషయము లెన్నియో వ్యాకరణరీత్యా నేటి విమర్శలో విమర్శింపబడుటలేదా ?

సమగ్రపరిశీలన లేక తొలుతనే వ్రాసిన యర్థము సరి పోని మాట వాస్తవమే. సందర్భమును దెలిపి, దీపాలవారు సూచించిన సూచన అర్థ విషయమున సరిపోవుటకు సమ్మ తించి, వారికి నా నమోవాకము. ఇంతకూ ఇక్కడ చర్చ "అర సున్న యుండుటా ? లేకుండుటా ? 'శరణార్థి' యను నది దీపాలవా రన్నట్లు సిద్ధ సమాసమా ? లేక కన్నడ పదమా? సిద్ధసమాస సిద్ధపదము గూడ ప్రయోగించు పద్ధతి యున్నదా ? అన్య దేశ్యములను గూడం శబ్దపల్లవములుగా వాడిన సందర్భము లున్నవా ?" ఈ విషయములను గూర్చి శ్రీ సదా శివగా రన్నట్లు పెద్దలు నిర్ధారణ చేయుటయే శ్రేష్ఠమనీ, చేయవలసినదనిన్నీ ప్రార్థన. ఇంతటితో ఈ చర్చకు స్వస్తి.

ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు.

ఈ చర్చను ఇంతటితో ఆపివేయడమైనది. భా. సం.

"కావ్యాలంకార చూడామణి"

సంపత్కుమార

'కావ్యాలంకార చూడామణి' అను శీర్షికతో భారతి (మే '62, కల.గం.)లో ప్రచురితమైన వ్యాసమును చూచిన తరువాత, అందలి విషయములను గూర్చి నాకుతోచిన అభిప్రాయము 'కావ్యాలంకార చూడామణి: కొన్ని అసమన్విత పద్యములు' అను శీర్షికతో నొకవ్యాసరూపమున భారతి (జూలై '62 కల.గం.)లో ప్రచురితమైనది. ఈ నా వ్యాసమును విమర్శించుచు 'కా. చూ.' వ్యాసకర్తవురల 'కావ్యాలంకార చూడామణి' అను శీర్షికతోడనే వ్రాసిన యొక 'లఘువ్యాసము' భారతి (నవం' 62. లేఖలు)లో ప్రచురితమైనది. ఈ లఘువ్యాసమునుచూచి ప్రస్తుతము కొంతవ్రాయవలసి వచ్చింది.

1. 'కా. చూ' వ్యాసకర్త ఆ వ్యాసమున (లఘువ్యాసమున కాదు) కా. చూ. లోని '.... వళు—లు పరస్పర వర్ణయుక్తి నుభయముఁ జెల్లున్ "7–47 అను పద్యములోని యతిభంగము నుద్దేశించి ".. దీనికి సవరణయేమిటి? పాఠాంతరమేమైన కద్దా?" అని ప్రశ్నించినారు. పాఠాంతరముకాదుకాని '..వళు–లు పరిస్వర వర్ణయుక్తి నుభయముఁ జెల్లున్' అను నాకుతోచిన సవరణను నా వ్యాసమున చూపినాను. ఈ సవరణనుగూర్చి 'కా. చూ.' వ్యాసకర్త తమ లఘువ్యాసమున— కా. చూ. లోని ఈ పద్యము ఒకటి రెండక్షరముల మార్పుతో కవిజనాశ్రయము లోనిదని కస్తూరి రంగయకవి తన గ్రంథమున ఉద్ధరించినాడని, కవిజనాశ్రయము (వావిళ్లవారిది 1960, పు. 72)లో '.. —వళ్ను పరిస్వర యుక్తమైన నుభయముఁజెల్లున్" అని యున్నదని, నా సవరణకన్న '**Economy of words**' దృష్ట్యా క. జ. పాఠమే బాగని తమ యభిప్రాయమని వ్రాసినారు. అయితే 'క. జ.' పాఠమును చూచియే కా. చూ. వ్యాసకర్త సవరణను కోరినారా? వావిళ్లవారి 1960 క. జ.నే చూడలేదు. గాని, వారిదే అగు 1950 క. జ.లో పు. 72లోనే ఈ పద్యము ప్రక్షిప్తముగా చూపబడినది. దీనిబట్టి క. జ.లోకాని లేకున్న కా. చూ.లోకాని ఇది ప్రక్షిప్తము కావలెను. క. రంగయ దీని నుద్ధరించుటచే నిది కా. చూ. లోనే ప్రక్షిప్తమనవలెనుగదా! కాని ఒకటి రెండక్షరముల మార్పుతో క. రంగయపాఠము కా. చూ. పాఠమువలెనే యున్నది. యతిభంగముతోసహా. కావున క. జ.లోకూడ నిట్లే యుండియుండవలెను. కాగా ప్రస్తుత క. జ.లో ప్రక్షిప్తమన్న పాఠము సవరింపబడినదే. కా. చూ. లోని పాఠమునకు, క. రంగయపాఠమునకు కొద్ది మార్పుతో సవరణ నేను చూపినాను. ఇంతకన్న అధికమైన మార్పుతో 'క. జ. లోని సవరణ పాఠమున్నది. లబ్ధమగు పాఠమునకు దగ్గరగానున్న సవరణయేదని చూడవలెనుగాని, '**Economy of words**' సూత్ర ప్రవృత్తియున్నదా యని కాదు. ఆ దృష్ట్యా చూచినచో గ్రంథములయందనేక పాఠములు సవరించవలసి యుండును. మరివాటిని సవరించుటయా? లబ్ధ పాఠమున కతిసన్నిహితమగు సవరణయే యుక్తమని నే ననుకొనినాను. ఈ విషయమునుగూర్చి విజ్ఞులాలోచించవలసియుండును.

2. మేలనగతిలోని మొదటి మూడు గణములను ఎత్తి విడిగా ప్రయోగించుటవలన 'ఎత్తుగీతి' యను పద్యమున కాపేరు వచ్చియుండునను ఊహను నా వ్యాసమున వ్యక్తీకరించినాను. దీని నుద్దేశించి కా. చూ. వ్యాసకర్త తమ లఘువ్యాసమున ".... ఈ ఊహ సరికాదు. ద్విపద— తరువోజల సంబంధమునుబట్టి ద్విపద పాదములు రెండు ఒక తరువోజపాదముగాఁ జెప్పుట సంప్రదాయమై యున్నది. కాని, తరువోజ పాదమును సగము చేసి ద్విపదపాదముగా జెప్పుటలేదు...." అని ఇట్లే మరికొన్ని ఉదహరించి నా ఊహ సరికాదనినారు. ఇట ఒక విషయమును గమనించవలెను. నేను మేలనగీతిని సగముచేసి ఎత్తు గీతి పాదముగా చెప్పలేదు. అసలు మేలనగీతి సగమునకు విరుగదు. దాని గణసంఖ్యచేసి ఒకవిధముగా నక్షరములను కూర్చి విరిచినను రెండు భాగములు సమ లక్షణముతో నుండవు. అందువలన కా. చూ. వ్యాసకర్త వ్రాసినవిషయ మప్రస్తుతము. నా యూహ సరికావచ్చును, కాకపోవచ్చును. కాని కాదనుటకు కా. చూ. వ్యాసకర్త చూపిన ఉపపత్తి కుదరదు. నా యూహయే పరమ ప్రమాణమను భావము కూడ నాకు లేదు. ఇంతకన్న మంచి యూహ మరెవరయిన వ్యక్తీకరించవచ్చును. అసలు పేర్లను గూర్చి యూహయేమి? అవి కూడ ఎవరయిన అనవచ్చును. అది సరి. 'జలదము, నర్కుటము మొదలైనవి ఉత్పల చంపక

మూలలమండి యెత్తబడినవా ?' అని లఘు వ్యాసమున ప్రశ్నించబడినది. అక్షరసంఖ్యా నియతిగల 'జలదాదుల' కును అట్టి నియతిలేని ద్విపదాదులకును సంబంధ మేమిటి ? రెండు ద్విపద పాదములు కలిసి ఒక తరువోజపాద మనుట సంప్రదాయముగదా ! మరి రెండు 'విచిత్ర' వృత్తపాదములు కలిసి ఒక 'భుజంగ ప్రయాత' వృత్తపాదమను సంప్రదాయమున్నదా ? ఇది లేదు, అది లేదు. అందువలన వాటికీ వీటికీ ఈ సంబంధ మిట్లు చెప్పుట కుదరదు.

3. నా వ్యాసములో నొకచోట 'మేలనగీతి ఉత్సాహము యొక్క చివరి గురువు తగ్గించుటచే ....' అను దానికి బదులు పొరబాటున '.... మాత్ర తగ్గించుటచే' పడినది. ఆ పొరపాటును—'అసంబద్ధము', 'మిక్కిలి శోచనీయము' అని ఎంత తీవ్రముగా నైతేనేమి ?—తెల్పినందుకు (లఘు వ్యాసమున) కా. చూ. వ్యాసకర్తకు కృతజ్ఞుడను. ఉత్సాహపు చివరి గురువు తగ్గుటచే మేలనగీతి ఏర్పడుచునే యున్నదనుట మాత్రము గమనించదగినది.

4. లఘువ్యాసమున నా 'పరిశీలనాశక్తి'కి మరియొక ప్రబల తార్కాణముగా మరొక పొరబాటు చూపబడినది. రేచన, విన్నకోట పెద్దన, అనంతుడు విషమ సీసోదాహరణములలో తేటగీతు లుపయోగించినారని నా వ్యాసమున వ్రాసినాను. వారు ఆటవెలదుల నుపయోగించినారు. ఇది గమనించకుండుట—కారణ మేదైన నేమి ? పొరపాటు. అయితే ఆ 'ఆటవెలదు' లు విచారణీయములుగా నాకు తోచినవి. విషమ సీసానుబంధిగా రేచన వ్రాసిన ఆటవెలది ఇట్లున్నది.

(i) 'ప్రాలువళ్ల లీల—నోలిన నిలిపి యా
గణమె కాని యొండు—గణము లిడక
యభిమతార్థరచన—నభిమతమ్మై యుండఁ
జెప్ప విషమసీస—మొప్పుఁ గృతుల.'

ఇందులో '.... ఆ గణమె .... లిడక' అనుటచే ఆటవెలదియే విషమసీసానుబంధిగా నుండవలయుననుట రేచన అభిప్రాయముగా లఘు వ్యాసమున ఉన్నది. కాని '.... ఆ గణమె' అనగా నేమి ? ఏ గణమును రేచన నిర్దేశించినాడు ? అట్టి దేదియు గోచరించదు. సూర్యేంద్ర గణములు ఆటవెలదియం దుండును గదా ! అగుచో 'గణమె' అనుట ఏమి ? ఈ యసమన్విత భాగము నుండి 'ఆటవెలదియే' ఉపయోగించవలెనను నభిప్రాయమెట్లు వచ్చును. ? మరొకటి. ఈ పద్యములో 'ప్రాలువళ్ల .... వోలిన నిలిపి ....' అని ఉన్నది. అనగానేమి ? ప్రాలు అనగా ప్రాసయతులని, వళ్ల అనగా కేవలయతులని భావించవలెనా ? వాటిని ఓలిని నిలుపుటయేమి ? ప్రాసయతి, కేవలయతి అను ఈ రెంటిని కలిపి ఏకత్ర ఉపయోగించవలెనా ? పద్యమున అట్లు లేదు. 1—4 పాదములలో ప్రాసయతియే యున్నది గాని దానితోబాటు 2—3 పాదములలోవలె కేవలయతి కూడ కలిసిలేదు. దీనిబట్టి సర్వత్ర ప్రాసయతియే ఉపయోగింపబడవలెననుట యుక్తము. అట్లగుచో 'ప్రాలువళ్ల' అని గాక 'ప్రాసవళ్ల' అని ఉండవలెను. అట్లున్న మొదటి పాదముననే ప్రాసయతి భంగమగును.

(ii) విషమ సీసానుబంధిగావి. పెద్దన వ్రాసిన ఆటవెలది ఇట్లున్నది.

వడిదనర్పఁ బ్రాస—వైభవం బలరార
నిట్లగణ నిరూఢి—నెసక మెసఁగఁ
గీర్తితాతి మధుర—గీతియుఁ బైఁ గల్గ
నదియ విషమసీస—మండ్రు గృతుల.'

ఇందులో ప్రథమపాద భావమేమి ? ఈ పద్యమున కేవలయతియే తప్ప ప్రాసయతి అసలే లేదు. కాన 'ప్రాస వైభవ' మనగా ప్రాసయతి వైభవ మనుటకు వీలులేదు. ఇక వృత్తమున వలె ప్రాస ఉండవలెనా ? లక్ష్యమున నట్లు లేదు. అది గాక ఆటవెలదియం దిట్టి ప్రాస నుపయోగించినచో నది రేచన ననుసరించి ప్రగీదియు (అనంతాదుల ననుసరించి ఏవడగీతి) యగును గాని ఆటవెలదిగా నుండదు. ఇక ప్రాస వైభవ మనగా ప్రాసయతియే యనుకొని, ఉన్నచో సర్వత్ర ప్రాసయతియే లేక కేవలయతియే యుండవలెనను కొనవలెనా ? కాని ఆ పాదమున నీ భావము రాదు. ఇదిట్లుండగా, ద్వితీయ పాదభావమేమి ? ఈ పాదమున విషమసీసానుబంధిగా ఆటవెలదియే ఉపయోగించవలెనను భావ మున్నట్లు లఘు వ్యాసమున వ్యక్తీకరింపబడినది. కాని ఆ భావ మిందు లేదు. 'ఇట్ల' అనగా ఈ పద్యమందున్నట్లే అని గదా ! లేక ఈ పాదమందున్నట్లే అనియా ? గల—న—గల—న—న అను గణములే ఆ క్రమముననే ఉపయోగించవలెనా ? ఇక 'గీతియుఁ బైఁ గల్గ' అనగా నేమి ? దేనికి 'పైఁ గల్గ' ? ఈ 'పైఁ గల్గ' అను దానిచే ఈ ఆటవెలది పూర్వార్థ విషయము ఆటవెలదికి సంబంధించినది గాక, తత్పూర్వమున నుండు ఉత్సాహమునకు సంబంధించినట్లు తోచును. అప్పుడీ విషయము సమన్వితమగును. ఉత్సాహమున వడి—ప్రాస రెండుండవలెను. వి. పెద్దన ఈ విషమసీస మందలి ఉత్సాహమున అన్నియు గలములే ఉపయోగించుటచే 'ఇట్ల గణ నిరూఢి' అని చెప్పబడి యుండవచ్చును. (అయితే గలములు మాత్రమే ఉత్సాహమున

ఉపయోగించవలెననుట పూర్వోత్తర లాక్షణిక విరుద్ధము). ఈవిధముగనే రేచన విషమసీసానుబంధిగా చెప్పిన ఆటవెలది యందలి విషయమునుగూడ చూడవలెను. 'ఆ గణమె కాని' అనగా సూర్యగణమెకాని అని భావించినచో సరిపోవును. కాని ఉత్సాహలక్షణము స్పష్టముగా' .... హగణ మొండెనగణమొండె 'దత్సాహచర్యమొండె .... ' అని చెప్పి మరల 'ఆ గణమె కాని' అనుట అనవసరము. వి. పెద్దన 'తత్సాహచర్య' విషయము స్పష్టముగా చెప్పలేదు. 'హగణ నగణంబు లేడు .... ' అనినాడు. హగణము లేదు కాని నగణము లేదు కాని యను భావము దీనివలన కలుగవచ్చును. ఈవిధముగా విచారించినచో నీ రెండింటి యందును 'ఆటవెలది' యే విషమసీసానుబంధిగా ఉపయోగింపబడవలెనన్న భావము లేదనవలసి వచ్చుచున్నది.

(iii) అనంతుని విషమ సీసానుబంధియగు ఆటవెలదిలె యందు ప్రాసయతి, యతి కలపి ఏకత్ర ఉపయోగించవలెను భావ మున్నది. లక్ష్యము గూడ తదనుగుణముగనే యున్నది. కాని ఈ పద్ధతి పూర్వోత్తర లాక్షణిక మత విరుద్ధము. చిత్రకవి పెద్దన, అప్పకవి కేవలయతినే ఉపయోగించినారు.

5. కా. చూ. లోని 'ఎత్తుగీతి' కి నేను సవరణ పాఠము నొకదానిని సూచించాను. అది 'అపూర్వమే' అనుకొందునుగాని, 'అసాధారణము' మాత్రము కాదు. నా సూచించిన పాఠమున 'చెలువు నెత్తుగీతి....' యని యున్నది. "చెలువు+ఎత్తు'ను 'చెలువునెత్తు'గా సంధింపఁ యెట్లు పొసఁగును ?" అని లఘు వ్యాసమున కా. చూ. వ్యాసకర్త వ్రాసినారు. సంధి విషయము నకేమి గాని, ఆ సవరణ పాఠము సరిగా ఉన్నట్లే కదా. సవరణ సరిగా నున్నచో సంధి నెట్లయిన పొసగింపవచ్చును. అసలు చెలువు+'ఎత్తు' అని కాక 'చెలువును+'ఎత్తు' అని విడదీయవలయును. మధ్య 'ను' పాదపూరణమునకైనది. (చూ. ప్రౌఢవ్యా. శబ్ద. 116 సూ.) అందువలన 'చెలువు నెత్తుగీతి' కుదురును. అసలీ సవరణ పాఠమున కాధారమైన పాఠము '—చెలువుదోపనెత్తుగతి—' యనియున్నది. దానినుండిదోప' తొలగించి పాఠము సవరింపబడినది. 'దోప' తొలగింపగా 'చెలువు నెత్తు' అని యేర్పడినది. పాదపూరణార్థము 'ను'చేరిన దన్నచో వది పొసగక యేమగును ? (కాదు కూడ దన్నచో సవరణ పాఠమే ఇది కాన '.... మెఱియఁ—జెలఁగి యెత్తుగీతి ...' యనుకొనవచ్చును.)

6. లక్షణమును చెప్పు పద్యమునే సామాన్యముగా లక్ష్యముగా కూడ నిరూపించుట లాక్షణిక పద్ధతి యని నా వ్యాసమున వ్రాసినాను. కా. చూ. లో గూడ అదే పద్ధతి అనుసరింపబడినదని వ్రాసినాను. ఈ అభిప్రాయమును ఒప్పుకొనుచునే కా. చూ. వ్యాసకర్త లఘువ్యాసమున '—అసామాన్యముగా విన్న కోటపెద్దన సీస, ఉత్సాహమంజరులకు వేరు పద్యములలో లక్షణము చెప్పియున్నాడు.... ఈవిధముగాఁ జూచినచోఁ బైనిఁ బేర్కొనిన వ్యాసమంతయు విమర్శనీయముగా నున్నది' అని వ్రాసినారు. నేను 'సామాన్యముగా' అనియే చెప్పినానుగదా. ఒకటి రెండు చోట్ల అపవాదము ఉన్నను సామాన్య పద్ధతికి నష్టము లేదుగదా ! మరి 'ఈవిధము' చే నా వ్యాసమంతయు ఎందుకు విమర్శనీయమో. 'ఈవిధముగాఁ జూచినచో' మాత్రమే నా వ్యాసము 'విమర్శనీయము' అయినచో నా కభ్యంతరములేదు. నా వ్యాసము 'అవిమర్శనీయ' మనియు నా యభిప్రాయము కాదు. విమర్శనీయ మనుటకు చూపిన ఉపపత్తి కుదురదు.

'అదనముగా వ్రాసికొనిపోవుట' నా యభిమతమును గాదు. అందువలన అసమన్విత పద్యములను గూర్చి విజ్ఞులాలోచించవలయునని కోరుచున్నాను.

శాలంకాయనులు ఎక్కడివారు ?

శ్రీ శిష్ట్లా కాళిదాసు

శాలంకాయన వంశానికి చెందిన రాజులు ఆంధ్రదేశంలో క్రీస్తుశకం 4, 5 శతాబ్దాలలో పరిపాలించారు. వీరి శాసనాలు కొన్ని బయట పడ్డప్పటికీ, ఎక్కువ వివరాలు తెలియవు. సుమారు క్రీస్తుశకం రెండవ శతాబ్దం మధ్య భాగంలో టాలెమీ వ్రాసిన 'జియోగ్రఫీ' లో సలకేనోయ్ (Salakenoi) అనే ప్రజలను గూర్చి వ్రాశాడు. వారు భారతదేశంలో మైసోలాయ్ (Maisoloi) అనే వారికి ఉత్తరంగా ఉన్నారనీ, వారి ముఖ్య నగరం బెనగౌరాన్ (Benagourn) అనీ వ్రాశాడు. మైసోలాయ్ అంటే మచిలీపట్నం ప్రాంత వాసులనీ, సలకేనోయ్ అంటే శాలంకాయను లనీ, బెనగౌరాన్ (ఇది బెన్‌గౌరాన్ అనే దానికి వ్రాయన కాని పొరపాటు అని పండితుల అభిప్రాయం) అంటే వేంగీపురమని పండితులు గుర్తించారు. శాలంకాయనుల శాసనాలు ఏలూరు, పెద్దవేగి, కంతేరు మొదలైనచోట్ల దొరకినాయి. సముద్రగుప్తుని అలహాబాదు శాసనంలో ఆ మహారాజు, వేంగీ పాలకుడైన హస్తివర్మను జయించి, విడిచివేసినట్లు చెప్పబడింది.

హస్తివర్మ శాలంకాయన వంశానికి చెందినవాడని చాలామంది చరిత్రకారుల అభిప్రాయం.

ఇప్పటివరకూ శాలంకాయనులు ఆంధ్రదేశీయులేనని (ఆంధ్రదేశీయులు కాదు అనటానికి ఆధారాలు లేవు కనుక) చరిత్రకారులు అనుకుంటున్నారు. వారు ఆంధ్రదేశంలో జన్మించలేదేమో ననటానికి కొన్ని ఆధారాలు కనుపించుతున్నాయి. నేను యీమధ్య డా. జయస్వాల్‌గారి 'హిందూ పాలిటీ' అనే గ్రంథం చదువుతున్నప్పుడు అందులో శాలంకాయనులమీద వ్రాసివున్న విషయం చాలా ఆసక్తిజనకంగా కనుపించింది. అందులో ఆయన యిలా వ్రాశారు: "Like the Arjunayanas some new republican states were founded in the closing and weak period of the Mouryas. To this class belong the Vamanathas of Katyayana and Patanjali, and the Salankayana of Patanjali." (P. 152. Third edtions 1955) (అర్జునాయనులవలెనే మౌర్య సామ్రాజ్యపు చివరి క్షీణదశలో మరికొన్ని 'సంఘ' (రిపబ్లిక్) రాజ్యాలు కూడా స్థాపించబడ్డాయి. ఆ తరగతికి చెందినవారే కాత్యాయన పతంజలుల వామరథులు, పతంజలి శాలంకాయనులూ). పతంజలి మహాభాష్యంలో యీవిధంగా ఉన్నది: "సంఖ్యాయాః సంజ్ఞాసంఘసూత్రాధ్యయనేషుః సంజ్ఞాయాం స్వార్థే! సంజ్ఞాయాం స్వార్థే ప్రత్యయ ఉత్పాద్యః॥ పంచైవ పంచకా శకునయః। త్రికాః శాలంకాయనాః। సప్తకాః బ్రాహ్మణ్యకాః॥.....". కాశికాలో శాలంకాయనులు వాహీక దేశీయులు అని ఉన్నది. గణపాఠము దీనిని బలపరుస్తూ శాలంకాయనులను ఔదంబరులతో పేర్కొన్నది (హిందూ పాలిటి పే 153). కనుక శాలంకాయనులు వాహీక దేశస్థులని రూఢి అవుతున్నది. మహాభారతంలో వాహికులు పంచనదులు, సింధూనదీప్రాంతాలలో వారు అని వున్నది. శాలంకాయనులు వాహికులే గనుక పంజాబులోనో, సింధునదీ ప్రాంతంలోనో నివసించేవా రన్నమాట. ఈవిధంగా పశ్చిమోత్తర భారతంలో ఉన్న శాలంకాయనులు మొదట సంఘ రాజ్యాంగాన్ని (Republican constitution) కలిగివుండేవారు. వారి సంఘం మూడు విభాగాలుగా ఉండేదని పైన పేర్కొన్న పతంజలి వాక్యం చెబుతున్నది. కాని యీ మూడు భాగాలు ఏమిటి అనేది మాత్రం మనకు తెలియదు. డా. జయస్వాల్, శాలంకాయన సంఘం, మూడు రాజ్యభాగాలు (State-units) కలిసి ఏర్పడి ఉండవచ్చునన్నారు. శలంకుడి సంతతివాడైన శాలంకాయనుడు యీ సంఘ రాజ్యాన్ని స్థాపించాడని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆంధ్రదేశంలోని శాలంకాయనులు తమ మూల పురుషుణ్ణి గూర్చి కాని, తమ గోత్రాన్ని గూర్చి కానీ చెప్పుకోలేదు. 'శాలంకాయన' అనేది వారి గోత్రనామమని చాలామంది అభిప్రాయం. దీనికంటె పైన పేర్కొన్న జయస్వాలుగారి అభిప్రాయమే సమంజసముగా కనపడుతున్నది. శాతవాహన, గుప్త మొదలైనవాటి లాగానే శాలంకాయన నామం కూడా ఆ పేరుగల వ్యక్తిని బట్టి వచ్చిఉంటుంది. పంజాబు ప్రాంతంలో నివసిస్తున్న శాలంకాయనులు దక్షిణానికి వలస వచ్చి ఆంధ్రదేశంలో స్థిరపడి ఉండవచ్చు. ఆ కాలపు భారతదేశపు పరిస్థితి అందుకు చాలా అనుగుణంగా ఉన్నది. పతంజలి కాలంలో అంటే క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దంలో శాలంకాయనులు పంజాబు ప్రాంతంలో ఉండేవారు. వారిది సంఘ రాజ్యం; అంటే ఒక విధమయిన ప్రజాస్వామ్యం. బహుశః కుషాణుల కాలంలో వారు రాజ్యాన్ని కోల్పోయి ఉంటారు. కుషాణులు నిరంకుశ ప్రభువులు. అందువల్ల శాలంకాయనుల స్వాతంత్ర్యాన్ని, ప్రజాతంత్ర విధానాన్ని అణచివేశారు. ఆ సమయంలో కానీ, ఆతర్వాత కొంతకాలానికి కానీ స్వాతంత్ర్యాభిలాషులైన కొందరు శాలంకాయనులు ఆంధ్రదేశానికి వచ్చి వేంగీ ప్రాంతంలో స్థిరపడినట్లు కనబడుతున్నది. ఇట్లా ఉంటూ మూడవ శతాబ్దపు చివరి భాగంలో కానీ, నాల్గవ శతాబ్దపు తొలి భాగంలో కానీ వారిలో బలవంతుడైనవాడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి వేంగీనగరం రాజధానిగా రాజ్యాన్ని స్థాపించి ఉంటాడు. ఇతడు శాలంకాయనుడి వంశస్థుడు కనుక ఇతడి వంశం శాలంకాయన వంశమైంది. వీరు దాదాపు నూరు, నూట యాభయి సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పాలించారు. శాలంకాయన మహారాజులలో శైవులు, వైష్ణవులూ కూడా ఉన్నారు. కాని వారి కులదైవం మాత్రం చిత్రరథస్వామి అనే సూర్యదేవుడు. కనుక వీరి పూర్వులు సూర్యభక్తులు అయివుంటారు. సూర్యారాధన భారతదేశంలో పశ్చిమోత్తరంలో ఎక్కువగా ఉండేది. ఈ విషయం కూడా శాలంకాయనులు పశ్చిమోత్తర భారతదేశంనుంచి వచ్చారు అనే విషయాన్ని బలపరుస్తున్నది.

జర్మన్ సారస్వత సర్వస్వము

"గ్లోబ్"

బవేరియా వైజ్ఞానిక పరిషత్తు చారిత్రక సంఘంవారు సమగ్రమైన జర్మన్ సారస్వత సర్వస్వం ఒకటి తయారు

చేయడంకోసం రెండువేల అయిదువందలమంది రచయితలను నియమించారు. వీరిలో జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్ మొదటి అధ్యక్షుడు ప్రొఫెసర్ థియోడర్ హెస్‌కూడా ఉన్నారు. ఈబృహత్ గ్రంథం పూర్తిఅవడానికి పదిహేను, ఇరవై సంవత్సరాలు పట్టవచ్చు. దీనిలో 30,000 మంది ప్రసిద్ధ జర్మన్ రచయితల జీవితచరిత్రలు, వారి రచనల వివరాలు ఉంటాయి.

అర్ధ శతాబ్దం క్రింద ఇలాంటి గ్రంథమొకటి తయారయింది. అది 56 సంపుటాలు. జర్మనీలోనూ, జర్మన్ భాషా ప్రాంతంలోనూ ఉన్న రాజులు, రారాజులు, కవులు, శాస్త్రజ్ఞులు, వైజ్ఞానికవేత్తలు, రాజకీయవేత్తలు, పండితులు మొదలయినవారివి మొత్తం 26,000 మందివి జీవిత చరిత్రలు దానిలో ప్రచురించారు.

నేటివరకూ యీ గ్రంథమే ఉపకరిస్తోంది. కానిదీనిని సమగ్రంగా తయారుచేయవల్సిన ఆవశ్యకతను గుర్తించి 1943లో అంటే ద్వితీయ ప్రపంచ సంగ్రామ సమయంలో యీ కొత్త సారస్వత సర్వస్వపు పని ప్రారంభించారు. కాని యుద్ధంమూలాన జర్మనీ పరిస్థితి తారుమారు అవడంవల్ల, దీని మొదటి సంపుటం 1953 వరకూ ప్రకటించలేకపోయారు. ఆ తర్వాత యింత వరకూ నాలుగు సంపుటాలు ప్రచురించారు. ఆరవసంపుటపు పని జరుగుతోంది.

జర్మన్ భాషాప్రాంతంలోనేకాక, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్‌లోని జర్మన్ ప్రజల జీవితాలు, నెదర్‌లాండ్స్, పోలండ్, గ్రీస్, రష్యా దేశాలలో చారిత్రక నిర్మాతలయిన జర్మన్‌రాజుల, ప్రముఖుల చరిత్రలు యీ గ్రంథంలో వివరించారు.

ఒక్కొక్క జీవితచరిత్ర ప్రాధాన్యత ననుసరించి 15 పంక్తులనుంచి పదిపుటలవరకూ కేటాయిస్తున్నారు. పాత గ్రంథంలో ఒక్కబిస్మార్క్ జీవితచరిత్రకే రెండువందల పుటలు కేటాయించారు. వ్యక్తిజీవిత చరిత్రతోపాటు వారివంశావళికూడా జతపరుస్తున్నారు. దీనివల్ల, సాంఘిక శాస్త్రజ్ఞుల పరిశోధనలకి కావల్సిన వివరాలు లభిస్తాయి.

గ్రంథ విమర్శనము

సాహిత్యోపన్యాసములు

"రావు"

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు తాము ప్రచురించిన నన్నయ పద ప్రయోగకోశము, పదబంధ పారిజాతము (ద్వితీయ సంపుటము)ను నావిష్కరించిన సమయమున, నా గ్రంథములనుగూర్చి ప్రత్యేకముగా పండితుల నాహ్వానించి యుపన్యాసముల నిప్పించిన గ్రంథ మిది. ఇందు నాలుగు ఉపన్యాసములున్నవి.

1. నన్నయ భాష—శ్రీ దువ్వూరి వేంకట రమణ శాస్త్రి.
2. నన్నయ కవిత్వము—శ్రీ భూపతి లక్ష్మీనారాయణరావు.
3. తెలుగు నుడికారము—డాక్టరు గిడుగు సీతాపతి.
4. తెలుగు పలుకుబడులు—శ్రీ తాపీ ధర్మారావు.

మొదటి రెండును నన్నయ పదకోశమునకు, తక్కినవి రెండును పదబంధ పారిజాతమునకు సంబంధించినవి.

సాహిత్య అకాడమీవారు తాము ప్రకటించిన గ్రంథముల లోని విశేషములను, లోకమున వ్యక్తపరచుటకు నిట్టి యుపన్యాసముల నేర్పాటు కావించిరనుట సత్యదూరముకాదు. మరియు నివి యా గ్రంథములకు 'ప్రకటన' లేక 'ఘోషణ' పత్రములవలె నుండవలెనని యూహించుటలో కూడ విప్రతిపత్తి లేదేమో! వస్తుతః వా రిట్టి ప్రత్యేకోపన్యాసము లేర్పాటుచేయు నావశ్యకత లేదు. ఆ యా గ్రంథముల విశిష్టతను, విద్వల్లోకమే విలువకట్ట గలదు.

ఇక విమర్శన—

1. నన్నయ భాష—

కేవలము తెలుగు భాషాతత్త్వమును గూర్చి విమర్శించుటకు నేడు రెండు దృక్పథము లున్నవి. 1. సంప్రదాయ దృష్టి. 2. చారిత్రక దృష్టి. మొదటిది పరంపరాయాతముగ పండితలోకమున వచ్చుచున్న వైయాకరణ పద్ధతి. రెండవది భాషా శాస్త్ర సంబంధమైన నవీన చారిత్రక పద్ధతి. వీనిలో వైయాకరణ సంప్రదాయ పద్ధతి ననుసరించి వేంకటరమణ శాస్త్రిగారు, నన్నయ భాషను గూర్చి సమంజసముగ సమీక్షించిరి. ప్రారంభముననే వారు నన్నయ ప్రధాన దృష్టి తత్సమ పద ప్రక్రియా నిర్వహణమేయని నిరూపించిరి. నన్నయ భాష యందు మూడు వంతులు తత్సమ పదములే యున్నవని తొమ్మిది వందల యేండ్లనుండి కవులంద రెరుంగుదురు. సాహితీ విమర్శకుల కది చర్విత చర్వణము. భాషావేత్తలకు సుపరిచితము. ఆంధ్ర ఛ్ఛందో వ్యాకరణ లక్షణ గ్రంథములన్నియు తెలుగున గల తత్సమపద బాహుళ్యమునుగూర్చి తెలుపుచునే యున్నవి. ఇంతయేల. నన్నయ భట్టారకుడే 'తెనుగు' అను పదమును తత్సమ, తద్భవదేశ్యయుక్తమైన భాష—అను నభిప్రాయము తోడనే వాడియున్నాడు. 'తెనుగు' అనగా ప్రాచీన కాలమున— అనగా అచ్చ తెనుగు కావ్యములు బయలు వెడలు వరకును, తత్సమ యుక్తమైన భాష అనియే యర్థము.

వాస్తవికస్థితి ఇట్లున్నను, 'నన్నయ పద ప్రయోగ కోశము'[1]న తత్సమ పదములన్నియు, పరిహరింపబడినవి. అట్లని యందచ్చటచ్చట తత్సమ పదములు కాననగుచున్నవి.(ఇవి క్రియారూపములు కావు) పుట 161. అసుర. ఇం దెనిమిది యారోపములు పంద్రెండుదాహరణము లున్నవి.

ఇది వైకృతమా?

682 భంగిన్.

795 హితవు. ఇది తత్సమమే. ఇట్టివి— అర్ఘ్యవు— ధర్మువు నన్నయ వాడియున్నాడు. వాని నీయలేదు—సరికదా 571 పుటలో 'ధ' అను నక్షరము 'ద' క్రింద చేర్పబడినది.

గమనిక:—'ధ' వేరుగా నీయలేదు. ఇక 'క' అను నక్షరమున తత్సమ పదము లేవైన గలవాయని చూచుటకు నిచ్చట నన్నయ పదకోశమున—384 నుండి 393 వరకును పెనిమిది పుట్ట (49 వ ఫారము) లోపించినది—అకాడమీవారు, తమ వద్దనున్న నన్నయ పదప్రయోగ కోశములను జాగరూకతతో పరిశీలింతురుగాత! ఆ గ్రంథము లందుకొన్నవారు గూడా మరి యొకమారు పరిశీలింతురు గాత!

సాహిత్యోపన్యాసములు—ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారి ప్రచురణ—తిలకరోడ్డు, హైదరాబాదు—పుటలు 93— వెల: 1—50.

1 ఈ గ్రంథము భారతి (ఏప్రియలు 1962) లో సమీక్షితమైనది. అయినను నన్నయ భాషనుగూర్చి వ్రాయు నపుడు పునఃకించిద్వివక్ష యనివార్యమైనది. పాఠకులు మన్నింతురు గాక.

నన్నయ భట్టారకుడే, సంస్కృత పదములకు తత్సమ రూపమున నచ్చ తెనుగున సమ్మేళనము చేసి, రెండింటికి నవినా భావ సంబంధము గల్పింపగా, నీ గ్రంథమున వానిని విస్మరించుట చేత నీ 'పద'కోశము వికసించుటకు గూడ శక్తి లేనిదై, నిర్జీవ ప్రతిమవలె నున్నది. వ్యాసకర్తలు విభక్తి, సమాసాన్వయాది వ్యాకరణ ప్రక్రియలన్నియు సోదాహరణముగ నన్నయ భాష నుండి నిరూపించుట యభినంద్యమై యున్నది. అట్లని 2తప్పులు పడుటను గూర్చి తడవక యుండలేదు. అర్థ పరిణామము బొందినవి కొన్ని చూపబడినవి. నన్నయ పదశక్తి పరస్పర సంయోజనము—అర్థవ్యాప్తి—చక్కగా విపులమైనవి. కాని యచ్చు టచ్చుట సందేహములకు తావులేక పోలేదు.

పుట 4. 'కర్ణాట వాఙ్మయమున మణి ప్రవాళముగ గూర్పబడిన పదజాలము'.

కర్ణాట వాఙ్మయమున—మణి ప్రవాళము—ప్రచారమునలేదు.

పుట 11. కన్నువొందె—నిద్రించె (పలుకుబడిలో వ్యత్యాసము)

ఈ పదము నీ యర్థముననే క్రీ. శ. 17 వ శతాబ్దిని ఈమురుపల్లి భవానీశ కవి ధర్మ ఖండమున—సౌఖ్యమొదవ నాకు కన్ను వొందకుండు (1—237) అని ప్రయోగించినాడు. (ఉ. వు) యతి ప్రాచీన సమ్మతము.

కన్నువొం దదొక్క గడియ యామె. అనిమించుపల్లె.

2. శాపదినంబులు పోవుదెంచె—అనగా గతించెను. ఇచట శాపదినంబులు పోవుదెంచె అనగా గతించెను అను వర్థము కాదు. శాపదినము లయిపోవచ్చినవి; ముగియు కాలము సమీపించినది యని యర్థము.

పుట 14. 'అమ్మ' అను శబ్దము—నన్నయ వ్యస్తముగా ప్రయోగింపలేదు. ప్రార్థనార్థకమున వాడియున్నాడు. నన్నయ 'అవ్వ' అనుమాట అమ్మకు బదులు వాడియున్నాడు. నన్నయ కవితలో 'ను' అను సముచ్చయమునందలి విశేషముల నెరుక పరచిన ఇంకను బాగుగా నుండెడిది.

నన్నయ పద ప్రయోగ కోశమునిను ప్రకటించుటకు పూర్వము సాహిత్య అకాడెమీవారొక్క ముఖ్య విషయమును గమనించలేదు. ఈ పదకోశముయొక్క విశిష్టత గ్రహింపవలెనన్న ముందుగా నన్నయ భారతభాగము మూలము చదువరుల కందుబాటులో నుండవలయును. ఈనాడు గ్రంథపఠనాసక్తి ప్రజాసామాన్యములో ప్రవర్ధమానమగుచున్నది. నన్నయ భారత భాగమును సరసమైన వెలకునందజేయుట యిట్టి సంస్థల ప్రధాన కర్తవ్యమై యున్నది.

ఆంధ్ర గ్రంథమాల - భారతము

ఇంతకుమున్ను కొన్ని యేండ్లకుముందటనే నాంధ్ర పత్రికాధ్యక్షులగు శ్రీ శంభుప్రసాదుగారు భారతమును స్వల్పమగు వెలతో నాంధ్రుల కందించుటకు తొలుత "ఉద్యోగ పర్వము"ను ప్రకటించియుండిరి. ఆ ముద్రణము సర్వవిధముల నమిచీనమై యున్నది. అనాడు వారైదువేల ప్రతులను ప్రతి యొక్క రూపాయి వెలపెట్టి ప్రచురించిరి. ఆ ధరను కూడ వారు నాల్గవవంతు తగ్గించి యిచ్చెదమని ప్రకటించిరి. కాని మనవారట్టి యవకాశమును పురస్కరించుకొని, యా యుద్యమమును ప్రోత్సహింపలేదు. వారట్లే యాంధ్ర మహాభారతమునంతటిని నందజేయుటకు సంకల్పించిరి. ఇవా ఉట్టి ప్రచురణలకు చెల్లుబడి యున్నచో, ఈనాటికి నన్నయ భారత భాగము నాలుగు రూపాయలకు మనకు లభించి యుండెడిది. కాని యట్టి భాగ్యమునకు మనము నోచుకొనలేదు—ఈనాటికి నాంధ్రభారతమునందు శ్రీ శంభుప్రసాదుగారి "యభిప్రాయంబు బెద్ద"4యై యున్నది. ఆ గ్రంథమాంధ్ర ప్రజా సామాన్యములో వ్యాప్తము గావలయునను మహోదారాశయము గలవారు—దానికి ప్రతియాది వారమున సారస్వతానుబంధమున ప్రకటితమగుచున్న వచన భారతమే సాక్షి. ఆంధ్ర మహాజనులట్టి భారత ప్రచురణోద్దేశము లను గ్రహింతురుగాత.

నన్నయ కవిత్వము.

నన్నయ భాష మన కెంత యపరిచితమో, నన్నయ కవిత అంత సుపరిచితము. కవితా విషయమున నన్నయను పేర్కొనని కవిలేడు. విమర్శకుడులేడు. వాఙ్మయ చరిత్రకారుడులేడు. ఆంధ్ర సాహితీప్రియు లా బాల గోపాల మెరిగిన నన్నయ కవితలోని లక్షణము లీ వ్యాసకర్తయగు లక్ష్మీనారాయణరావుగారికి మాత్రము గోచరింపలేదు. పందొమ్మిది పుటల వ్యాసమునకు ఒది పుటల యుపోద్ఘాతము. ఇందొకటి రెండు పుటలు మాత్రమే నన్నయ కవితా గుణములకు వినియోగపడినవి. దీనికి తోడుగా నిది వరకు నన్నయ విమర్శకు లెవ్వరికిని స్ఫురింపని యపూర్వ విషయ మిందుగలదు. అది వ్యాసకర్త దృష్టిలో యనౌచిత్యమున కాలంబనమైన సత్యవతీ పరాశర సమాగమము.

నన్నయ కవిత్వమునుగూర్చి ప్రత్యేక గ్రంథమో, లేక దీర్ఘ వ్యాసమో, లేక తత్త్వ ప్రతిపాదక గ్రంథమో వ్రాసినపుడు, కవిత్వము పుట్టు పూర్వోత్తరములు—ప్రాచీన భార

---

2 ఈ కోశమున తెలుగు పదముల విభజన—అర్ధానుస్వార, శకట రేఫములు నస్తవ్యస్తముగా నున్నవి. కొన్ని బహు ప్రమాద భూయిష్ఠములు.

పుట 394. కలారె కర్మ విపాకంబు గడవంగలాదె. 1—6—250. నన్నయలో 'కలారె' వంటి రూపము లుండవు.

ఈ యుదాహరణ భాగమే తిరిగి 718 పుటలో —లావె. కర్మ విపాకంబు గడవంగ లావె–1–6–250 లో నున్నది. ఇది సరియైనది.

పుట 728. లేకను. ప్రసిద్ధ వ్యాకరణమును చూపిన ఈ పదము (నుప్రాసలో నున్నది) ఈ కోశమున లేదు.

3 ఈ పదకోశములోని పదము లిదివరకే "ఆంధ్ర భాషా చరిత్రము"న వర్గీకరణము గావింపబడినవి.

4 ఇది నన్నయ వాక్యము.

తీయ సంప్రదాయము—తెనుగున కవితావరణ గాథ—మున్నగు వానిని చర్చించుట యావశ్యముగాని, కాలపరిమితి, గ్రంథ పరిమితిగల చిన్న యుపన్యాసమున కంత పెద్ద పీఠిక యేఁనో దురూహ్యము—ఈ పుటలలో ఆంధ్ర భాషా కవితా విషయము లెంతమాత్రమునులేవు—సరికదా — అర్థముకాని, అన్వయము చేసికొనలేని—సంస్కృతాలంకారికుల నిర్వచనములు—భావము తెలియని పాశ్చాత్యుల సాంకేతిక పదములు నిండుకొని యున్నవి.

వ్యాస ప్రారంభముననే యొక పుటలో—ఉదాత్తత—హృద్యము—హృద్యత—ఇవియే పిష్టపేషణముగా నారేడు మారులు ప్రయుక్తములైనవి. ఇక నాంగ్ల భాషా పదములును వాక్యములును చూడుడు.

పుట. 19 High Poetry, Lyrical Poetry, Sensuos poetry· Keats, Shelly, Iliad. Divine Comedy: Paradise Lost.

20 Epic poetry–రెండుసారులు.

34 'Unconscious Art'లో రామణీయకమెక్కువ

35 It is not what is said but how it is said that matters in Poetry.

36. 'రీతి' అనుభావమును Grace అను ఆంగ్ల పద భావముతో పోల్పవచ్చును. ఈ Graee లేక రీతి–అనునది.

వీనికిని నన్నయ కవితకు సంబంధమేమో?

ఇట్లు భాషా దారిద్ర్యమేకాక, భావదారిద్ర్యము గలదు.

పుట 32. సత్యవతీ పరాశర సమాగమము—అందీ క్రింది పద్యముద హరింపఁబడినది.

చపలాక్షి చూపుల చాడ్పున కెదమెచ్చుఁ
జిక్కని చనుగవఁ జిఱిగోరు
వన్నువకౌఁ దీగ యందంబు మదినిల్పు
జఘన చక్రంబుపైఁ జలుపు దృష్టి
యభిలాష మేర్పడు నట్లుండఁగాఁ బల్కు
వేడ్కతో మఱుమాట వినఁగఁ దివురు
వతి ఘనలజ్జావనతయగు నక్కన్య
పైఁబడి లజ్జయుఁ బాపఁగడఁగు
నెంత శాంతులయ్యు నెంత జితేంద్రియు
లయ్యు గడు వివిక్తమైనచోట
నతుల గోష్ఠిఁ జిత్త చలన మొందుదు రెందుఁ
గాము శక్తి నోర్వఁగలరె జనులు.

(ఆది. 3—38).

దీనిపై విమర్శ—

"ఈ వర్ణన మూలమునలేదు. నన్నయ వ్రాయలేదని నా దృఢ విశ్వాసము—ఈ సీస పద్యమున వర్ణితమైనది చిర కాలాభ్యస్తమైన కాముక చిత్తవృత్తి.........పరాశర మహర్షి యొక్క తాత్కాలిక చిత్తవికృతియొక్క వర్ణణ కాదిది........ తిక్కనయు నిట్టి జుగుప్సావహములగు వర్ణనలు గావింపలేదు".

ఈ వాక్యములవలన వ్యాసకర్తకునన్నయ పద్యము చదివి యర్థము గ్రహింపలేని యజ్ఞత యలముకొన్నది యని తలప వగును. పద్యమునకు చివరనున్న యాట వెలది పాదములలో నెంత గంభీరార్థమున్నదో యవగాహన చేసికొన లేదు—అంతకుమున్ను పరాశర మహర్షి తపః ప్రభావము—మహాత్మ్యమును జితేంద్రియత్వమును ముందు ప్రశంసించి, యా వెనుక నన్నయ రహస్య ప్రదేశమున నొంటరిగ యువ తులు సన్నిహితులైనపు డెంతటి మహర్షికైన చిత్త సంచ లనము కలుగుననియు, త్రిమూర్తులను లోగొన్న మన్మథుని బారి తప్పించుకొనుట కెవ్వరికిని సాధ్యము కాదనియు, అది యనివార్యమైన ప్రకృతి ధర్మమనియు దెలిపి—తుదకు "కాము శక్తి నోర్వఁగలరె జనులు" అను రుచిరార్థ సూక్తిని నిబంధించియున్నాడు.

మొదట పద్యమర్థము చేసికొనకపోవుటయేగాక, యాపై పద్యము "నన్నయ వ్రాయలే"దని (పుట 32) "తర్వాతి కాలమున మహామభావు లెవ్వరో చేర్చియుందు"రని (పుట 33) వ్యాసకర్త వ్రాసియున్నాడు. ఇది యా పాత రమణీయమగు వ్రాత—సంస్కృతాంధ్ర సాహితీ పరిజ్ఞాన మేమాత్రమున్న వారికైనను నిట్టి సన్నివేశ వర్ణనలు సుపరి చితమే. "హరస్తు కించిత్పరిలుప్త ధైర్యమే" అను కాళిదాసు వాక్యము మన మవగతము చేసికొనలేకున్న "ప్రకట జితేం ద్రియుల్ ధరపరాశర కౌశికులంతవారు వెలి బెట్టిరే బాడ బులు పరాశరు బట్టి దాశకన్యాకేళి తప్పుజేసి" అన్న యాంధ్ర కవి సూక్తులు మనకు కంఠస్థములేగదా. ఆంధ్ర భాషా సాహితీ బోద్ధయగు వ్యాసకర్తవంటివా రెరుగక పోవువచ్చును.

పరాశర మహర్షివంటివాడేమి, మహా మహిమగల మన్మ థునే దగ్ధము చేసిన మహాదేవుడే పార్వతీదేవి నొంటరిగాఁ జూచినపు డెట్టి చిత్త విభ్రాంతి నొందెనో నన్నెచోడ కవి రాజ శిఖామణి చిత్రించిన విధము చూడుడు.

సీ. పులకాంకురంబులు దలవెత్తి మేను గం
పింపఁ గోమలిఁ గౌఁగలింపఁదలఁచు
రాగోత్కటమున స్థైరణ లేక మానినిఁ
గాయ్యున పైఁబడి గవయఁ దలఁచు
లలితాంగి యువ యువములు మాచిమదిదని
వోవక చూడ్కులఁ ద్రావఁజూచు
నధరోష్ఠముదరంగ నంతస్మితాంశులు
దలు కొత్త నేమేనిఁ బలుకఁ దలఁచు

గీ. తన మహత్త్వంబు దలఁపకఁ దరుణిపొందు
వడయ గీడ్వడి తేకువ వాపఁదలచు
భావ జాస్త్రాభిహతి మహాదేవుఁ డొక్క
వ్రేలిమిడిఁ బెంపు సెడి కడువిరలిగొనియె. (5—45).

నన్నయ నన్నెచోడులలో కవితలలో, పదభావ సంవా దము లున్నవని నలువది యేండ్లక్రిందటనే విమర్శకుల్ సూచించియున్నారు. పైఁబడి—పలుకులు—తేకువ (లజ్జ) బ్వా

5. 'Un-conscions Art లో రామణీయక మెక్కువ' యో, తక్కువయో మనము గ్రహింపలేముగాని, వ్యాసకర్త దీనిని **'Conscious'** గా వ్రాసినాడాయని యనుమానము మాత్రము మనకు కలుగక తప్పదు.

గడగుట మున్నగు పదములు సమానము. భావములు సమాన ములే. నన్నయ పద్యము చివరగల......

"కాముశక్తి నోర్వగలరె జనులు"

అను యర్థాంత రన్యాసమును—నన్నిచోడకవి (1—104) లో

"కాము మాయల నెవ్వారు నేమిగారు" అను గీత పాదమున నిబంధించి యున్నాడు. ఇంతేకాదు. 'గత మద మత్సరుండు, (3—36) అన్న నన్నయ యెత్తు గడయు—నన్నెచోడని 'గత మదమత్సరేంద్రియ' (1—132) గతమద మత్సరుండు (6—170) అనునవియు సమానములు.

ఇట్టి యుపపత్తి యుండగా నిది నన్నయ కృతము కాదనుటకల్ల. వ్యాసకర్త కీ తెలివిడి యుల్ల.

భాషా విషయము పరిశీలించిన నిది నన్నయ కృతము కాదట. ఈ సీసపద్యము నన్నయదే యనుట కిందలి సర్వ యతి నియమమే సాక్ష్యము. ఈ పద్యము సర్వయతి సీసము (నాల్గు పాదములు—ఎత్తు గీతి యూట వెలది)గా నుండుట విశేషము. పరాశరుడు యతీశ్వరుడు—కావున నతని మనో భావములు వ్యక్తము చేయుటకు నన్నయ—సర్వయతి సీసము రచించినాడు. యతిస్థానము—విశ్రమ స్థలము. యతిచూపులు సత్యవతి యంగ సౌష్ఠవము నందాయా చోట్ల విశ్రమించు చున్నవని భావము.

ఈ పద్యము మొదలనుండి చదివినగాని, చివరనున్న పాదములో నిగూఢమై యున్న యర్థము మనకు స్ఫురింపదు. ఇట్టివానిని "గూఢ చతుర్థి" అందురు.

ఈ పద్య విమర్శ ఇంతటితో నాగలేదు. "మరియు దేశ మందున్న వ్రాతప్రతులలో కొన్నింట నీ పద్యము కానరాకుం టయు గమనింతురని నా కోరిక" అని మరియొకవాక్యము.

ఇది యజ్ఞతయో, సాహసమో యవగాహన మగుట లేదు. అచ్చులోనున్నవానిని సరిగా నర్థము చేసికొనలేనివారు నన్నయ పద్య లక్షణమునైన తిన్నగా నెరుగనివారు—వ్రాత ప్రతులు 'పరిశీలించి' (ఇది వ్యాసకర్తమాట) వారని భావింప గలమా? దీనినిబట్టి ముద్రిత గ్రంథములనైనవారు పరిశీలింప లేదనుట సత్యము. ప్రాచీనములైన భారతాది గ్రంథములు ముద్రితములైనప్పుడు—వ్రాత ప్రతులలోనుండి నిదివరకు ముద్రితములైన వానిలో లేనిచో వానిని చేర్చి—"కొన్ని వ్రాత ప్రతులలో నీ పద్యమున్నది" అని యుండును. ఒకప్పుడు పూర్వముద్రణములలోనుండి వ్రాత ప్రతులలో లేనప్పుడు—"ఇది ప్రక్షిప్తము" అని యుండును. ప్రస్తుతము ముద్రి తములైన నన్నయ భారత ప్రతులలోగాని, యంతకుముందు గలవానిలోగాని పై పద్యము ప్రక్షిప్తమని చూపగలరా? ఇంతకు వ్యాసకర్త యెన్ని ముద్రిత, తాళపత్ర ప్రతులు పరిశీలించినాడో మచ్చునకైన యొకదానినేని యుదాహరింప లేదే?—ఏమి ఈ సర్వజ్ఞత్వము?

ఇట్టివారిని గూర్చియే కాబోలు శ్రీనాథ మహాకవి ఇట్లు వ్రాసియున్నాడు.

"బోధ మల్పంబు గర్వ మభ్యున్నతంబు
శాంతి నిష్పచ్చరంబు మచ్చరము ఘనము
కూప మండూకములఁబోలె కొంచె మెఱుఁగు
పండితమ్మన్యులైన వైతండికులకు".

సాహిత్య అకాడమీవారు సమావేశపరచిన యొక గొప్ప విద్వత్సభయం దీ యుపన్యాసము చేయబడినట్లు గ్రంథ పీఠికవలనఁ దెలియుచున్నది. ఇంత యవక తవక వ్యాసము నచ్చుట నెవ్వరును విమర్శింపకపోయిన పోవుదురుగాక! అకా డమీవారైనను, నిది ముద్రించునపు డీ సంకలనమున నది చేరుట కర్హమైనదా లేదా అని విచక్షణ చేసినట్లు కానరాదు. ఈ యుపన్యాసములలో నిట్టిది చేరుట యనౌచిత్యము—కళంకము గ్రంథమున కాపాదించుచున్నది. నన్నయ కవితా లక్షణములు వీరికి "నారాయణ!రావు".

2. పదబంధ పారిజాతము—

ఇందు తెలుగు నుడికారము అను నుపన్యాసమున డాక్టరు సీతాపతిగారు తా మదివర కెన్నో పరియాయములు చెప్పినవే—తిరిగి చెప్పినారు. అయినను వారు ప్రవయస్కులు. తండ్రి చాటు బిడ్డలు. మొదటనే

"తెలుగ దేల యన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ—తెలుగొకండ—
ఎల్లనృపులు గొలువ నెఱుగవే బాసాడి
దేశ భాషలందు తెలుగులెస్స".

ఇక్కడ కండ అనగా పులకండ—పులకండ వలెనే తీయనిదని భావము అన్నారు. (41 పుట).

ఇది సరికాదు. ఆ పద్యము నిట్లు చదువవలెను.

తెలుఁగ దేల యన్న? దేశంబు తెలుఁగేను
తెలుఁగు వల్లభుండ, తెలుఁగొకండ
నెయెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి,
"దేశ భాషలందు దెలుగు లెస్స".

"తెలుఁగొకండ—తెలుఁగు భాష యొక్కటియే—యెల్ల నృపులు గొలువ—అనగా అందరు రాజులు గొలువ—(ద్రవిడ కర్ణాటాంధ్ర రాజులు) బాసాడి యెరుగవే—నీవు మాట్లా డుట నీకు తెలిసినదేగదా" అని యర్థము. కృష్ణదేవరాయలు ద్రవిడాంధ్ర కర్ణాటములఁ బాలించినను—తెలుగును రాష్ట్ర భాష (Court language) గా చేసినాడన్న చారిత్రక విషయ మిందున్నది. తక్కిన భాగములలోనే విశేషములు లేవు.

తెలుగు పలుకుబడి—శ్రీ తాపీ ధర్మారావుగారి రచన. నుడికారములో 'కారము' ఉన్నను, నది మధురముగ నుండు నను చమత్కారముతో పెక్కు నుడికారముల యర్థమును, చక్కగ వివరించునది. పెట్టనికోట—కంగుక దీర్చిన పైఠిణీ రవిక—వజ్రాంగి—ఇట్టి పలుకుబడుల లోతుల నరయుట కును 'హవ్యవ హుంజరణంబు ద్రొక్కెదో' అను నైషధ పాఠ మును సంస్కరించుటకు పండబారిన సాహిత్యానుభవము కావలెను. తాపీవారి ధర్మమా అని యట్టి యనుభవ మిందు ప్రస్ఫుటమై మన కందుబాటులోనికి వచ్చినది. ఈ యుప న్యాసములలో నాద్యంతములు మాత్రమే హృద్యములై నాకర్ష ణీయములై యుండుట యాశ్చర్యముగా నున్నది.

గ్రంథ విమర్శనము

రాగరేఖలు

[నవల; రచన : జి. వి. కృష్ణారావు; ప్రచురణ : ప్రజా ప్రచురణలు, ఏలూరు రోడ్, ఏలూరు; ⅛ (క్రౌను)సైజున 200 పుటలు— వెల మూడురూపాయలు].

శాంతాదేవి ఒక భద్రమహిళ; రైతుకుటుంబంలో పెత్తనము సాగించేఇల్లాలు. ఆమెకు ధర్మకీర్తి ఒకకుమారుడు; ఆతడు మంచంపట్టి, ప్రత్తిచేలు కోతకు వచ్చినసమయంలో పనులు చూచుకోలేని స్థితిలో ఉండగా కథ ప్రారంభమవుతుంది. ఆ కోత పనులు— గుణవర్ధనుడనే శకజాతి పురుషునికి అప్పగించి పని చేయించాలని ధర్మకీర్తి ఆలోచన. పెద్దపాలేరు, వేదగిరి వేరే చేయించాలని సూచిస్తాడు. రుద్రదాముడనే చిన్న పాలేరు మరొకడున్నాడు. శాంతమ్మ వీళ్లచేత పనులుచేయించాలని సంకల్పించినా అలాగచేయదు. కొడుకుచెప్పినట్లు గుణవర్ధనుని పిలిపిస్తుంది. ఆ శకపురుషుడు సంగీతంకూడ పాడ్తాడు. ఆతడు పాడితే అస్వస్థుడుగా ఉన్న ధర్మకార్తికి ఆరోగ్యనిద్ర కలుగుతుంది. ఈ కారణంచేతకూడ ధర్మకీర్తికి గుణవర్ధనుడంటే ఇష్టం. కాని శాంతాదేవికి ఆతడంటే కిట్టదు. ఆతడు శకజాతివాడు, బానిస, నికృష్టుడు; అటువంటివాడికి పంటపొలాలపైన పెత్తనం ఇవ్వడం ఆమెకు ఇష్టంలేదు. అంతేకాదు, వారియింటిలో పెరిగి పెద్దదయిన చిత్రఅనే బాలికఉన్నది. ఆమెనిజానికి శకజాతి పురుషుడు భానుదత్తునివల్ల జన్మించిన తర్వాత తల్లి— శాంతమ్మ అక్కగారికీయగా ఆ, యక్క యీామె కప్పగించినపిల్ల. ఆమె మొదటినుంచీ అయినింటిబాలికలాగే పెరుగుతుంది. జన్మ వృత్తాంతము ఆమెకుకూడ తెలియని రహస్యంగా దాచిపెట్టారు. అట్టిచిత్ర, గుణవర్ధనుని ప్రేమిస్తుంది; వివాహం చేసికోబోతుంది. అది శాంతమ్మ జరగనీయదు, గుణవర్ధనుని ఇల్లువెడలగొట్టారు. ఆతడు తిరిగివచ్చేవరకు చిత్ర వేచియుండి, ఆతనినే పెళ్ళిచేసుకోవాలనే నిశ్చయంతో ఉంటుంది. ఆతడెన్నటికీరాడు; చనిపోయాడనుకొంటారు. కాని చివరికివస్తాడు. ధర్మకీర్తి ఆశీర్వచనంతో వారి వివాహంజరిపిస్తాడు. ఇది నవల అనేకంటె, పెద్దకథ అనవచ్చు. బౌద్ధ యుగంలో శకులకు, ఆంధ్రులకు, యవనులకు పగలు, వైషమ్యాలూ ఉన్నరోజులలో జరిగినట్లు చెప్పినా, అప్పటి వాతావరణంకాని సమకాలీన సంప్రదాయాలుకాని హెచ్చుగా ఇందులో రాలేదు. బి. యస్. రెడ్డిగారు మొదట సినిమాకని సూచించిన యీ కథావస్తువు ఈరూపంలో జి. వి. కృష్ణారావుగారు రచించి— వారికే దీనిని అంకితమిచ్చారు. కాలక్షేపానికి చదువుకోవడానికి మంచి కథే !

విశ్వకవి

[రవీంద్రుని కథ పిల్లలకోసం రచించినది; రచయిత : శ్రీ డి. రామలింగం; ప్రచురణ : శ్రీ గోదా గ్రంథమాల, శ్రీమన్నారాయణపురం, ఉర్లిపాలెము పోస్టు, దివితాలూకా, కృష్ణాజిల్లా; ⅛ (క్రౌను)సైజున 51 పుటలు, వెల: ఒక రూపాయి.]

ఈ పుస్తకము రచించిన డి. రామలింగంగారు మొదట విశ్వకవి రవీంద్రుని జీవితచరిత్ర పెద్దపుస్తకముగా వ్రాసి, ఒక దినపత్రికలో ధారావాహికముగా ప్రకటించినారు. అది రవీంద్రుని జీవితములోని ముఖ్యఘట్టములను పొందుపఱచి రసవంతముగానే నడచినట్లు కొందరు పాఠకులు ప్రశంస చేసి యున్నారు. అది పురస్కరించుకొని దానినే సంగ్రహపఱచి పిల్లలకు తెలియునట్టి శైలిలో పెద్ద అక్షరాలలో 51 పుటలలో ఇముడించి యీ పుస్తకరూపములో రామలింగంగారు తిరిగి వ్రాసినారు. కథచెప్పినట్లు కవిజీవితమును కమ్మగా చెప్పుకొని పోయినారు. మధ్యమధ్య రవీంద్రుని పాటలు చెప్పవలసివచ్చినప్పుడు వట్టి వచనముగా వ్రాసినారు. ఉదాహరణకు ఒకగీతంలో తల్లి బిడ్డల సంభాషణ.

"అమ్మా ! నేను ఎచ్చటనుండి వచ్చితిని ?
నీవు నన్నెచ్చట బడసితివి ?"
అని పసిపాప అడిగింది.

తల్లి ఆనంద భాష్పములతో
పాపను హృదయానికి హత్తుకొని
ఇట్లా సమాధానం చెప్పింది.

"ముద్దుల పాపా,
నీవునా చిరకాల వాంఛగా
నా హృదయంలోనే దాగివున్నావు ?
నేను నా చిన్నతనంలో ఆడుకున్న
బొమ్మలలో నీవే వున్నావు ?"

ఈ పద్యానువాదం చేసినతీరు శ్రుతిలేని పాటలాగున్నది. ఈ పుస్తకం అంతకీ రవీంద్రుని గీతాలకుచేసిన అనువాదాలే ఎగుడుదిగుడు శైలిలో నడచినవి. అయినప్పటికి, ఈ చిన్న జీవిత పరిచయము పిల్లలకు తెలియచెప్పు తేటతెల్లమైన, రీతిలోనే నడచినది. ఈ పాటలకు 'శ్రుతి'లేని కారణముచేతనేమో— సంజీవదేవ్‌గారి 'శృతి'వేసి పరిచయము వ్రాసినారు. పిల్లలకొఱకు ప్రకటించునట్టి ఇట్టి పుస్తకములలో 'శృతి' వంటి వర్ణక్రమ దోషములు లేకుండ నిర్దుష్టముగా వేయుట ముఖ్యము.

చిట్టికి చిరుగంట

[పిల్లలకు పిల్ల నవల. తమిళమూలం: అ. వళ్లియప్ప; తెలుగు: చల్లా రాధాకృష్ణశర్మ. ప్రచురణ: యమ్. శేషాచలం అండ్ కంపెనీ, బందరు. $\frac{1}{8}$ (క్రౌను) సైజున 88 పుటలు; రంగు రంగుల బొమ్మలతో సహా, అట్టపైన త్రివర్ణ ముఖ చిత్రం; వెల: రూపాయి ముప్పావలా].

కందన్ ఒక పేద పిల్లవాడు; ఆ పిల్లవాడికి ఒక మేకపిల్ల ఉన్నది. మే కపిల్ల మేకపిల్ల అందమైన మేకపిల్ల అని దానితో ఆడుకునేవాడు; పాడుకునేవాడు; మాటలాడుకొనేవాడు. ఆ మేక పిల్లకి ఒక చిన్న గంటకొని మెడలో వెయ్యాలనే కోరిక పుట్టింది. తండ్రితో చెప్తాడు. వాళ్లకి తిండికి గడవడానికే కష్టమైతే చిరుగంట ఎక్కడ కొనగలడు? వీలులేదు అంటాడు. కందన్—మేకపిల్లను తీసికొనివస్తూవుంటే రాజభటు డీ మేక నిమ్మంటాడు. కందన్ ఇవ్వడు; భటుడు బలవంతంగా తీసికొనిపోతాడు; రాజుగారు యజ్ఞంచేస్తూ ఉంటారు. ఆ యజ్ఞానికి నూట ఒక్క మేకలు కావాలి. కందన్ మేకపిల్ల 'చిట్టి' చిట్ట చివరిది. కందన్ తన మేకపిల్లకోసం వెదకుకొంటూ వెళ్ళి, చిట్టిని కని పెట్టి వెంటపెట్టుకొని వస్తాడు. తిరిగి భటుడు వెంటాడించి—ఆ మేకపిల్లను యజ్ఞ ముహూర్తానికిముందు రాహుకాలం రాకుండా తీసికొనిపోతాడు. కందన్—తిరిగి వెళ్తాడు. మేకపిల్లను ఆ పిల్లవాడు అపహరిరిచాడని నేరం; శిక్ష. ఈ సమయంలో రాజగురువు ప్రేమానందస్వామి ఆ తీర్పు సమయంలోవచ్చి, అంతా మార్చివేస్తాడు. కందన్‌కి మేకపిల్ల దొరుకుతుంది; 'చిట్టి'కి చిరుగంట వస్తుంది. కథ కంచికి మన మింటికి. ఈ కథ చాల రసవంతంగా వళ్లియప్ప తమిళంలో రచించారు. తెనుగు చేయడంలో కూడ రాధాకృష్ణశర్మ చక్కగానే రచించారు. కాని, భాష ఒకచోట సరళంగాను, ఒకచోట విరళంగాను నడిచింది. తమిళంలో కందన్, మురుగన్, కుప్పన్ వంటి పేరులు కందడు, మురుగడు, కుప్పడు అని తెనిగించడం బాగాలేదు. మొత్తం మీద ఈ చిన్న నవల చిన్నపిల్లలకు మంచి నవల. బాపు, ఉమాపతి వేసిన బొమ్మలు ప్రత్యేకాకర్షణ.

షేక్స్పియర్ హామ్లెట్

[తెనుగు అనువాదము: దుర్భా రామమూర్తి. ప్రకాశకులు: సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ. $\frac{1}{8}$ (డెమ్మీ)సైజున 155 పుటలు. వెల మూడు రూపాయలు. సోల్ డిస్ట్రిబ్యూటర్స్: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు].

ప్రపంచ భాషలలో ప్రఖ్యాత నాటకకర్తలు, కవులు, సాహిత్య వేత్తలు చేసిన రచనలు, దేశ భాషలలోనికి అనువాదంచేసి, ఆ మహనీయుల ప్రతిభా విశేషాలు లీలామాత్రముగానయినా మన దేశీయులకు తెలియజేయడం మంచిపని. ఆ పనికి, మన కేంద్ర సాహిత్య అకాడెమీ పూనుకొన్నది. ఈ కార్యక్రమంలో కొన్ని గొప్ప గ్రంథములను ప్రసిద్ధ మహా కావ్యములను (క్లాసిక్స్) అనువాదం చేయించి ప్రచురణ చేయుటలో 'యునెస్కో' సాహాయ్యం కూడ లభించింది. ఇట్టి సాహాయ్య సంపత్తితో షేక్స్పియరు మహాకవి నాటకములు తెలుగులోనికి అనువాదం చేసి, ప్రకటించే కార్యభారం ఈ సాహిత్య అకాడెమీవారు తమ పైన పెట్టుకొని—అతడు రచించిన ప్రసిద్ధ విషాదాంత నాటకములు నాలుగు మొదట ప్రకటించాలని సంకల్పించారు. వీనిలో ఒథెల్లో, మేక్‌బెత్ ఇదివరకే వచ్చాయి. ఇది మూడవది—హామ్లెట్!

"అట్టమీద అట్టహాసము"లో తెలిపినట్లు అకాడెమీ వారి ఉద్దేశ మిది:—హామ్లెట్ నాటకములోని సందేశాన్ని గురించి హామ్లెట్ స్వయంగా ఇలా పేర్కొన్నాడు: "ఎట్టి విచిత్ర సృష్టి మానవుడు! బుద్ధి విభవమునం దెంత యుదాత్తుడు! నిసర్గశక్తులందెంత నిరవధికుడు! బోధమందు భగవంతునితో నెంతసాటి సేయదగినవాడు! భూమండలమునకుశోభ—జీవకోటులలం దప్రతిమానుడు!" ఈ యణుశక్తియుగంలో షేక్స్పియర్ మనకిస్తున్న సందేశం ఇదే. ఈ సందేశంవినిపించ డానికీ తెనుగు అనువాదం ప్రకటించారు. ఆంగ్ల సాహిత్య చరిత్రలో ఎలిజెబెతెన్ యుగమును స్వర్ణయుగం చేసిన షేక్స్పియర్ మహాకవి ప్రత్యేక ప్రతిభను గురించికాని, ఆయన రచించిన విషాద నాటకముల విశిష్టతను గురించికాని, ఆ నాటకములలో 'హామ్లెట్' నాటక మిచ్చిన సందేశమును గురించికాని, ఇచ్చట ప్రత్యేకముగా నుగ్గడింప నవసరములేదు. ఈ మహా దృశ్య కావ్యమును తెలుగులో అనువాదము చేయుటలో పొందిన పోకడలు ఎట్లున్నదియును పరామర్శ చేసిన ఈ పుస్తకమును పరిచయము చేసినట్లే!

అనువాదకళ, నూతన సృష్టికంటె అతి సున్నితమైనది; మూలములోని భావగ్రహణమేకాక, అనువదిత భాషలో అధికారముండి, సృజనాత్మకమైన సుకుమార భావ శబలత కల వారే మంచి అనువాదములం దీయగలరు. మూలములోని అర్థమును, భావమును ఏదో రీతిగా క్రొత్త భాషలో చెప్పిన రాతలో బాధ్యత తీరిపోదు. మూలములో మొదటి రచయిత, సృజన చేసినట్లే—ఈ క్రొత్త భాషలో కూడ క్రొత్త కల్పన చేయవలయును. ఒక బంగారు నగను కరగించి క్రొత్త నగను చెక్కినట్లు, మొదటి వస్తువును కరగించి మూసలో పోసినంత మాత్రాన చాలదు. దీనిమీద తిరిగి చెక్కడముపని, చికిలీసేత, పోగారు పని జరుగవలెను. ఇది నూతన సృష్టి. ఒక జీవిత భావానుభూతి. అలాగ చేసినపుడే మంచి అనువాదము రాగలదు. హామ్లెట్ అనువాదము చేసిన దుర్భా రామమూర్తిగారు ఆంగ్లాంధ్ర భాషలలో పండితులు; అధ్యాపకులు; అధ్యయనము చేసిన అగ్రశ్రేణి ఆచార్యులు. రెండు భాషలపైనను అధికారమున్నది. అది అనువాదములో ఆమూలాగ్రము, ప్రస్ఫుటముగా కనిపించుచున్నది. కాని, నూతన సృజన చేసిన కవికాని, నాటక కర్తకాని తెనుగు అనువాదములో కనిపించడు. షేక్స్పియరు మహాకవిలోని భావ శబలతకాని, అది అందించిన భాషా సులభతకాని ఈ యనువాదములో గోచరించవు. ఈ నాటకమంతయు—గ్రాంధిక భాషలో అనువాదకులు రచించివారు. మంచిదే. కాని

పలుకుబడులలో తెనుగుతనములేదు. ఆంగ్ల వాక్య కారకములోని అన్వయ విరోధము పూర్తిగా త్రెంపుకొని, స్వతంత్రమైన తెనుగు పలుకుబడి తేలేకపోయినారు. కాని, షేక్స్పియరు భావల హరిని అవగాహన చేసికొనుటకు వారు చేసిన ప్రయత్నము నిరుపమానమైనది, నిర్దుష్టమైనది. ఇంగ్లీషులోని మూల గ్రంథాపేక్ష లేకుండ స్వతంత్రముగా ఈ "హామ్లెట్" నాటకము చదివినవారికి ఆ డెన్మార్కుదేశపు రాజకుమారి జీవితములో తటస్థించిన నిగూఢ సమస్యలు, వానిని పరిష్కరించుటకు చిత్త విభ్రాంతి పొందిన ఈ మహా మానవుడు పొందిన పరివర్తనము ఎంతవరకు అవగాహనమగునో చూడవలయును. హామ్లెట్ జీవన్ మరణ సమస్యలో చిక్కుకున్నప్పుడు అతడు చెప్పిన స్వగతము "To be or not to be" లోకప్రసిద్ధము. దానికి ఈ తెనుగు అనువాదము చూడండి.

"జీవించుటయా—లేక మరణించుటయా?
ఎట్టి విషమ సమస్య! విధి ప్రయుక్త దారుణాస్త్రపాతమును
సహించి యూరకుండుటయా, లేక పౌరుషాస్త్రధారినై
కష్టపారావార తరంగ సహస్రములపై కుతికి,

ప్రతిఘటించి, యంత మొందించుటయా? ఏది ఉత్తమ మార్గము—ఎవరు నిర్ణయింపగలరు? మరణము—నిద్ర—వేరుకాదు. అట్టి గాఢ సుప్తిలో హృదయ బాధలు మరచి, జన్మానుగతములైన సమస్త యాతనా ఘాతములు విస్మరించి విశ్రమించుట కంటెను కోరదగిన శ్రేయమేమిగలదు? మరణించుట నిద్రించుటయే— ఔను నిద్రించుట—నిద్రలో శాంతి—కాదు కాదు నిద్రలో కలలు—భయంకర స్వప్నములు!"

ఈ ధోరణిలో నడచిన ఈ శైలిలో భావము వ్యక్తమగుచున్నది. కాని జీవము లుప్తమై పోయినది. ఇలాగ యెన్ని ఉదాహరణములైనను చూపవచ్చును. నాటకీయతగల ఒక ఘట్టములో—

రాజు:—వారిని దూరముగా లాగివేయుడు.

రాణి:—హామ్లెట్! హామ్లెట్!

అందరు:—అయ్యలారా—విరమింపుడు.

హోరే—ప్రభూ! శాంతింపుము—శాంతింపుము.

[పరిచారకులు వారిని విడదీయుదురు—గుండములో నుండి వెలుపలికి వత్తురు].

హామ్లె:—విడువుడు. వీని అంతము చూచెదను. ఈ విషయమున నాకను రెప్పలు చలన రహితములగునంతవరకు పోరాడెదను.

రాణి:—అయ్యో! కుమారా! ఏమి విషయము.

హామ్లె : నేను ఒఫీలియాను ప్రేమించితిని. నలువది వేల అన్నదమ్ముల సహజ వాత్సల్యముకూడ గట్టినను, నా ప్రేమతో తులతూగజాలదు.... ఆమెకొఱకు నీ వేమిచేయగలవు?

రాజు : లియార్టెస్ ! అతనికి మతిచెలించియున్నది.

రాణి : అతని మాటలకు కోపగించుకొనకుము.

హామ్లె : నీ వేమి చేయగలవో చెప్పుము. దుఃఖింతువా ? పోరాడుదువా ? నిరాహారివగుదువా ? శరీరము ఛేదించుకొందువా ? విషముత్రాగుదువా ? మొసలిని తినివేయుదువా ? తిమింగలమును మ్రింగుదువో ? ఏమి చేయుదువో చూపింపుము—నేను చేసెదను! ఊరక శోకాలాపములాడ వచ్చితివా ? నన్ను ధిక్కరించి సమాధిలోనికి దూకువాడవా నీవు ? ప్రాణముతో పూడ్చివేయబడుదువా ?

ఈ ఘట్టములో ప్రతివాక్యములోను ఇంగ్లీషువాసన—ప్రతి మాటలోను ఇంగ్లీషు పలుకుబడి గుర్తించవచ్చును. ఈ యనువాదకులకు గద్యరచనకంటె పద్యరచన కొంతబాగుగా తెలిసినట్లున్నది. అందులకే—అంతర్నాటకమునుపొందుపరచిన ద్విపదలు, అక్కడక్కడ ఇంగ్లీషు గీతములకు అనువాదములుగా చేసిన పాటలు వచనరచనకంటె మెఱుగులు తీరినవి.

కల్యాణదేవత కనక సూత్రమున
నీ చేయి నాచేయి నెమ్మిబంధించె
ఏనాడు—
ప్రేమ రసావేశ వివశతన్ బొరసి
నీ మానసమ్మును నా మానసమ్ము
ఉజ్జ్వలానంద సంయుక్తినిబొందె—

ఈ రీతిగా ద్విపద చక్కగా నడచినది. అలాగే 'ఒఫీలియా' పాటలలో ఒకటి.

పాట : ఇతరులా నీ కెఱుక పఱచుట
అతివరో నా కన్నె వలపును
నత్తగుల్లల గుర్తుటోపీ
నెత్తిపై, హస్తమున దండము
హత్తుకొన—అడుగులకు మెట్టులో
గుత్తముగ వర్తిల్లు నతనికి—

ఇలాగ పాటలు లయతో గుత్తముగా, మెత్తమెత్తగానే ఉన్నవి. కాని వచన సంభాషణలే మాతృకలోని మార్దవమునుగాని, మాధుర్యమునుగాని, గాంభీర్యముకాని, కలస్వనమునుగాని తేలేకపోయినవి. అనువాద మెట్లున్నను— ఆంధ్ర పాఠకులు షేక్స్పియరు తెనుగులో నెట్లుండునో తెలిసికొనుటకీ నాటకము చదువవలసినదే. ఈ యనువాదకులు వ్యక్తినామవాచకము (Proper nouns) లందున "గెర్ట్రూడ్" వంటివి జెర్ట్రూడ్ (రాణి) అని అనువాదముచేయుట—షేక్స్పియర్ నాటకాభిమానులెవ్వరును హర్షించరేమో !

—శ్రీవాత్సవ.

తెలుగుభాషలో ఛందోరీతులు

(రచన : విద్వాన్ రావూరి దొరసామి శర్మ, ప్రధానాంధ్ర పండితులు, హిందూ హైస్కూలు, మదరాసు—5; వెల పది రూపాయలు; పుటలు 14+463).

అప్పకవికఖండయతి సమ్మతము గాకపోవుటచే నాతఁడు మార్గాంతరమును ద్రొక్కి యుభయ యతులను నిరూపించెను. భీమనకవి జనాశ్రయమందలి పద్యము నుదాహరించి (భాను సహస్రభాసి వృషభాధిపుఁ డన్నటు లర్థయుక్తమై) తద్గత విశ్రామము నుపసర్గసంధి యతిగా సమన్వయించెను. ప్రాచీన లాక్షణికు లుదాహరించిన ప్రయోగములకుఁ బాఠాంతరము లను బ్రదర్శించెను. ఇట్లాతఁడు ద్రొక్కిన యపమార్గమును గూచిమంచి వేంకటాయకవి 'సుకవిజన మనోరంజనము' నం దిరువదినాల్గు పద్యము లఖండయతులు గలవి ప్రదర్శించి క్రింది విధముగా నిరసించెను.

"భారత ప్రయోగ మొకటియు లేనందున నఖండవడి మంచిదికాదను కొందురు. భారత ప్రయోగములు ననేకములు గలవు. అప్పకవిగారు భారతాదులయందు దిద్దినవి కొన్నిన్ని వ్రాసికొన్నాము. చూవె మనంబునఁ దలంచుచుండెద నేనున్— ఈ ప్రకారముగానే నన్నయభట్టుగారు చెప్పినదిన్ని లాక్షణికులు నఖండవడికి లక్ష్యములు వ్రాసినదిన్ని. ఇందుకు అప్పకవిగారు దిద్దినది—సూవె మనంబునఁ దలంతు సుందరి యెపుడున్. తాము దిద్దినదే కవి కవిత్వ మందురు. వ్యాసకృత శ్లోకము—మమాప్యే హసదామ్రాద్రి హృద్యర్థః పరివర్తతే—నాయొక్క హృదయమందున్ను ఈ యర్థమే యెప్పుడు నుండువని యర్థముగదా ! ఏ షోర్థ స్సదా పరివర్తతే—అనినందు వలననే 'తలంచుచుండెద' నని నన్నయభట్టుగారి తాత్పర్యము. కవితాశయ్య విచారించితే 'తలంచుచుండెద నేనున్' అంటే సొఫుగా నున్నదో 'తలంతు సుందరి' అంటే సొఫుగా నున్నదో కవిత్వ కళా దురంధరులకు స్పష్టము కాఁగలదు. అప్పకవిగారు మాత్రము కవితాశయ్య నెరుంగనివా రనరాదు. అఖండవడియం దఖండ ద్వేషము గానఁ గామక్రోధములు గ్రమ్మినపుడు తత్త్వము పట్టువడదు. కాకపోతే యే మహాకవి ప్రయోగము లున్నవని మవర్ణ విరామము నిలిపిరి ? ఏ మహాకవి ప్రయోగములు లేవని యఖండవడి ఖండించిరి ? ఈయన ఖండించినంత మాత్రమున నఖండవడి ఖండ మగునా ?" పై పంక్తులన ముద్రితమును బ్రాచ్యలిఖిత పుస్తకాగారములలో మాత్రమే ననమగ్రముగా లభించుచున్నదియు నగు 'సుకవిజన మనోరంజనము' నుండి ప్రకృత గ్రంథకర్త లుదాహరించినారు. గిడుగు వేంకటరామమూర్తిగారు నప్పకవీయ విమర్శనావసరమునఁ బ్రసక్త లక్షణ గ్రంథగత విషయములను గొన్నింటిని బ్రమాణీకరించినారు. ఈ ప్రకారముగా ముద్రితా ముద్రిత లక్షణ గ్రంథములను బరిశీలించి, వలసిన మేరకు లక్ష్యములను శోధించి, ఆధునిక లక్షణ వేత్తల విమర్శనములను బఠించి శ్రీ రావూరి దొరసామిశర్మ పదుమూఁడు ప్రకరణములలోఁ దెలుఁగులోని ఛందోరీతులను బ్రకృత గ్రంథమున వివరించిరి. లక్షణ గ్రంథములను బరిశీలించి వాని సారమును సముచితమగు ప్రకరణ విభాగముచేసి వివరించుటయే గాక పెక్కు మూత్నాంశములను దమ పరిశోధనమునకు ఫలముగా నిరూపించినారు. 'క్రౌంచ పదవృత్త లక్షణ విశేషము' (పు. 109—113) 'ఒకొండు శబ్దము—ఉభయ యతి' (పు. 291—292) మున్నగు శీర్షికల నుదాహరణములుగా గ్రహింపవచ్చును. కవి జనాశ్రయమునఁ గ్రౌంచ పదవృత్త లక్షణము "పంచ శరాభాసంచిత పుణ్యాభమ సభన నయ పరిమితమై నన్ క్రౌంచ పదాఖ్యం బంచితమయ్యెం గ్రమ యతి దశవసుకలితముగాఁ గన్"—అని నిర్దేశింపఁ బడినది. ఈ లక్షణమును గావ్యాలంకార చూడామణి ఛందోదర్పణ లక్షణ సార సంగ్రహము లందలి లక్షణ లక్ష్యములను బరిశీలించినచో నీ వృత్తమునం దైదవ యక్షరముపైఁ బ్రాసయతి నియతముగాఁ గానవచ్చును. తర్వాతి 5 వ, 8 వ యక్షరములపైఁ బాదప్రథ మాక్షరముతో నక్షర సాజాత్య రూపయతి మైత్రి సంఘటింపఁ బడినది. తిక్కన స్త్రీ పర్వమందలి 1—136, 2—37 పద్యములు తల్లక్షణానుగుణములు. పూర్వోక్త లాక్షణికులు లక్షణమున నిర్దేశింపక పోయినను లక్ష్యములం దనివార్యముగాఁ బాటించిన తిక్కన యనుసరించిన 5 వ యక్షరముపైఁ బ్రాసయతి నప్పకవి చెప్పలేదు. ఈ ప్రాసయతి కర్ణాట సంప్రదాయము. పారిజాతాపహరణమునందలి క్రౌంచ పదవృత్త మప్పకవి లక్షణము ననుసరించి యున్నది. నన్నెచోడుని క్రింది క్రౌంచపదమీ రెండు పద్ధతుల నుల్లంఘించినది.

> 'చంచుల నాస్వాదించుచు లే దూండ్ల కరువు ప్రియ
> లకు నలందుచు మైరో
> మాంచములోలిం గంచుకితంబై పొదమఁగ నలరుచుఁ
> బులినము లంగ్రీ.'

ఇందు 5 వ యక్షరముపైఁ బ్రాసయతియు 11 వ అక్షరమునకు 19 వ అక్షరమునకు యతి మైత్రియుఁ గానవచ్చుచున్నవి. లక్షణ లక్ష్యములను సమగ్రముగాఁ బరిశీలించి సారము నీ తీరున ప్రకృత గ్రంథకర్త సంగ్రహించి ప్రదర్శించెను.

తెలుఁగు క్రౌంచ పదము (24 వ చం)

1. భమసభ నన నయ—5 పై ప్రాస, 10—18 పై యతులు.
2. ,, 5—10—18 పై మూఁడు యతులు.
3. ,, 10—18 పై రెండు యతులు.
4. ,, 5 పై ప్రాస, 11—19 అక్షరములకు యతి మైత్రి పాదాద్యక్షరానుగుణ యతిలేదు.

గ్రంథ విమర్శనము

అప్పకవి భారతమందలి 'మా, కౌరవ సైన్యము లేదు నొకంటికిఁ బ్రాభవ మాచరింపఁ జొచ్చిన (ఉద్యోగ 4—140) యను పద్య పాదము నుదాహరించి 'దీని మూఁడవ పాదంబు నందు 'పదునొకొంటికి' నని యున్నచోట సంధిఁ గూర్చి స్వర ప్రధాన వడిగాను సోమయాజులు ప్రయోగించినారు. ఇది తెలియక కొందరు మూఢులు దేశ్య నిత్య సమాసవడియని యను కొందు' రని విమర్శించెను. ఈ విమర్శనముచే 'ఒకొండు' సమాస పదము కాదనియు 'ఒక+ఒండు' అను రీతిభేద మిట ప్రసక్తమనియు నప్పకవి నిరూపణమని స్పష్టము. 'పాండవుల వలనఁ గీడొక్కొండును లే దధిప నీదు కొడుకులు తరుణీ' యను భారత స్త్రీపర్వ గత పద్యభాగమునందీ భేదమును బ్రవర్తింప జేసినచో బ్రాణి విశ్రామము చెల్లనేరదు. పదద్వయ విభాగమునకుఁ బ్రసక్తి కనిపించదని యెంచి లింగముగుంట తిమ్మన, ముద్దరాజు రామన, కూచిమంచి వేంకటరాయ కవి పూర్వోదాహృత పద్యము నఖండవడికి లక్ష్యముగాఁ బ్రదర్శించిరి. గిడుగు వేంకటరామమూర్తిగారు నప్పకవీయోపోద్ఘాతములో నా యభిప్రాయమునే ప్రకటించినారు. అప్పకవిచే నుక్తమైన పదవిభాగము అంగీకార్య మనుటకుఁ గ్రింది పద్యమును బ్రకృత గ్రంథకర్తలు ప్రమాణముగా నుదహరించుచున్నారు.

వాసుదేవాది నవశక్తి వైభవంబు
రుక్మిణీ సత్యభామల రూపరేఖ
యిదియె వహియించు నని నల్వయిడిన పదునొ
కొంటి లెక్కనఁ గనుబొమ్మ లువిద కమరు'

పాండురంగ మాహాత్మ్యము 3—198.

ఇందఖండ విశ్రామము చెప్పుటకు వీలులేదు. స్వర ప్రధాన విశ్రాంతి యనక తప్పదు. కావున 'ఒకొండు' ను దేశ్యా ఖండములలోఁ బరిగణింపవలెనని నిరూపణము. ఈ రామకృష్ణుని ప్రయోగము నేఁటిదాఁక లాక్షణికుల కన్ను గప్పినది.

ఈ విధముగాఁ దాము చేసిన పరిశ్రమమునకు ఫలముగా వీ రనేక నూత్నాంశములను నిరూపించి లక్షణజ్ఞులకు ముదమును గూర్చిరి. కాని యుపజ్ఞావిరహితులగు పరిశోధకులు సేకరించిన ప్రయోగముల నాధారముగా గ్రహించుటచేతను, ప్రాచీన లేఖన పద్ధతిని గూర్చిన సమగ్ర జ్ఞానము లేకపోవుట చేతను, తెలుఁగు వ్యాకరణమునఁ బ్రామాణిక జ్ఞానము కలుగకపోవుట వలనను బెక్కు స్థలములలో భ్రమ ప్రమాదముల పాల్పడిరి. అప్పకవి స్పృశింపని యతి విశేషములను బ్రదర్శించుట కుపక్రమించి వీరు 'ఋ' వర్ణమునకు 'రు' వర్ణమునకు విశ్రామము చెల్లిన 'గృహధర్మ నిరతులు కొని వచ్చి భక్తిపూర్వకముగాఁ దగ సమర్పణము చేయు' (భోజరాజీయము 3—27) 'క్రూరార్ధ చంద్రాస్త్ర కృత్తోరు బాహులై' (భాస్కర రామాయణము - యుద్ధకాండము 1448) ప్రభృతి లక్ష్యముల నుదాహరించిరి. ఈ లక్ష్యములు ప్రకృత గ్రంథకర్త సేకరించినవి కావు. 'భాషా పరిశోధన—ప్రయోగ విశేషములు' 'ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారికభాష' యను గ్రంథములను బరిశీలించినవారికిది తెల్లము. 'భాషా పరిశోధనము—ప్రయోగ విశేషములు' అను చిరు పొత్తమునం దీ విశ్రామ మనంతునికి సమ్మతమని ప్రతిపాదితము. ఈ ప్రతిపాదనము శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యచే 'ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష' యను గ్రంథములో బ్రమాణ పురస్సరముగా నిరాకృతము. ప్రకృత గ్రంథకర్తయు నీ యతి ఛందోదర్పణమునం దంగీకరింపఁబడిన దను ప్రతిపాదనమునకుఁ బ్రాతికూల్యమునే ప్రకటించెను. 'ఋ' 'రు' లకు యతి చెప్పవలెనన్నచో స్వరములలో 'ఉ, ఊ, ఒ, ఓ' లకు 'ఋ' 'ౠ' లకు మైత్రిని ముం దంగీకరింపవలె ననుట, ఋవళి, ఋత్వసామ్యవళి, ఋత్వసంబంధవళియును వానిని బరిశీలించినచో స్పష్టము గాకపోదు. ఈ స్వరమైత్రి లాక్షణికాంగీకృతము కాదు. 'ఋ' కార 'రు' వర్ణములకు మైత్రి చెల్లనేరదని తాతంభట్టు స్పష్టముగా నిర్దేశించినాఁడు.

కేవల రుకారమునకున్,
గోవిదు లలవ్రట నుడికిఁ గొందరువడిగాఁ
గావింతు, రదియుఁబొసఁగదు,
పోవకుఁడనుచితములై నపోకల నడుమన్.'

ఈ యతి నన్నయగారి భారత భాగమునందే కానవచ్చుచున్నదని శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య క్రింది పద్యము నుదాహరించిరి.

'రంగ దుత్తుంగ తరంగ హస్తంబుల
నాడెడు నదివోలె నతుల వేగ
వాత విధూతమై పఱెడు నదివోలెఁ
బర్వత కందరోపాంత తటులఁ
దొడరెడు నదివోలె ధృత ఫేన వితతుల
నగియెడు నదివోలె నాగనక్ర.'   అర. 3—38.

ఈ లక్ష్యమును నిరాకరించు టెట్లను ప్రశ్న ముదయింపవచ్చును. నన్నయగారికిఁ బ్రాచీనములగు శాసనములలో నుడికి మారుగా నిత్య విశిష్టరేఫను వ్రాయుట కానవచ్చును. (మృగాంక—మ్రిగాంక, గుణాలంకృత—గుణాలంక్రిత). తరవాత 'ఋ' వర్ణమునకు మారుగా 'రు' వర్ణము వ్రాఁతలలోఁ గానవచ్చును. లాక్షణికులీ భ్రాంతిని నివారించుటకుఁ గృషి చేసిరి. కాని వ్యవహార ప్రాబల్యముచే భ్రాంతివశ్యులైరి. 'ధ్రువ శబ్దమునందు విశిష్ట రేఫమే గాని ప్రటువ నుడి లేదని కందోక్తిగాఁ జెప్పిన అప్పకవి (2—66) క్రింది పద్యమునందా శబ్దమును 'ధృవ' శబ్దముగాఁ బ్రయోగించినాఁడు.

'దావపావక ఖాది మాధవ దాశార్హ దనుజాంతకా
దేవకీ ప్రియనందనా దివిషద్వ్యంద్యాధ్రు('ధృ')వసన్నుతా.'

వ్యవహార విషయమునఁ గలిగిన యీ అప్పకవి భ్రాంతిని బ్రమాణీకరించి 'ఉ' కారమునకు 'ఇ, ఈ, ఎ, ఏ' లతో స్వర

మైత్రి నంగీకరింప నేరము గదా? ఈ సర్వమైత్రి నప్పకవి విధింపలేదు. లేదా 'ధ్రువ' శబ్దమును 'ధృవ' శబ్దముగా వ్రాయవచ్చునని సమ్మతింతమన్నచో నదియు నప్పకవి మతమునకు విరుద్ధమే గదా! ఉదాహృత లక్ష్యములను బురస్కరించుకొని 'ఋ' 'రు' మైత్రిని నూత్నముగా నంగీకరింపవలెననుట సముచితముగాదు. ప్రాచీన లేఖన పద్ధతిని గూర్చి సమగ్రజ్ఞానము లేకపోవుటచే ఖండాఖండ ప్రాస మెట్లేర్పడినదో గ్రంథకర్త వివరింపఁజాలక పోయెను. 'ప్రాచీన కాలమున నేఁటివలె అరసున్న లేఖన పద్ధతి లేదు. అరసున్న యుండఁదగినచోటఁ బూర్ణ బిందువును వ్రాయుటయు, నిండుసున్న యున్నచోటఁ బూర్ణ బిందువును, దానిపై హల్లును ద్విరుక్తముగా వ్రాయుటయు సంప్రదాయసిద్ధ మయి యున్నది.' (పు. 313) అని గ్రంథకర్త వివరణము. ఈ సంప్రదాయము సార్వకాలికము, సార్వత్రికము కాదు. ఈ సంప్రదాయము నియతము గాకపోవుట వలనను, ప్రాచీనకాలమునం దర్ధానుస్వారమునకుఁ బ్రత్యేక లిపి లేకపోవుటవలనను (అప్పకవియే అర్ధానుస్వారమునకుఁ బ్రత్యేక లిపి నేర్పరచెనని శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య నిరూపణము) అర్ధానుస్వారమునకు మారుగాఁ బూర్ణానుస్వారమును వ్రాయుచుఁ బూర్వాక్షరము సానునాసిక్యముతో నుచ్చరించుచుండెడివారనియు సంస్కృతమునం దానునాసిక్య చిహ్నముగాఁ బూర్వాక్షరము తలపై నర్ధచంద్రాకారమును వ్రాయు పద్ధతి తెలుఁగులోఁ గాలక్రమమున నక్షరము ప్రక్క వ్రాయఁబడుటగాఁ బరిణమించినదనియు శ్రీ గంటి జోగిసోమయాజి ఆంధ్రభాషా వికాసమునఁ బ్రతిపాదించిరి. ఈ పరిణామమును బ్రసక్త గ్రంథకర్త గ్రహింపక పోవుటచేతనే పూర్ణార్ధ బిందు ప్రాసమును నిరూపించుటయు 'సకల వసుమతీశ మకుట లసద్రత్న, కిరణ రుచి విరాజ చరణుఁడయిన, నిజభుజ ప్రధాని బెజయితదేవని కూఁతు సరియె పోల్పఁ గాంత లెందు,—ఇది రాజనరేంద్రుని కూతురు సోమలదేవి చెక్కించిన దాక్షారామ శాసనములోని పద్యము. నాల్గవ పాదమున పూర్ణార్ధబిందు ప్రాసము గలదు. 'కూఁతు' అని పూర్ణబిందు రూపము నిందు గ్రహింప వీలులేదు. అప్పట్టున 'కూంత్తు' అని శాసనమున లిఖితమై యుండవలె. 'కూంతు' అని యున్నది గాన 'కూఁతు' అని మనము గ్రహింపఁజను' (పు. 351) నని వ్రాయుటయు సంభవించినది. దీర్ఘముమీఁద నుండఁదగు నర్ధానుస్వారమునకు మారుగా బూర్ణానుస్వారము లిఖించుకొనుటచేతనే నన్నెచోడాది కవు లట్టి పదములతోఁబాటు ప్రాసస్థలములలో సిద్ధ పూర్ణానుస్వారము గల పదములను బ్రయోగించి దానిని సమప్రాసముగా గ్రహించినారనఁజెల్లును. (పింగు—వామాంగము) అట్టి స్థలములలో సరఁగా నర్ధానుస్వార ముండవలసినచోట్ల పూర్ణానుస్వారమును వ్రాసి దాని ప్రక్క ద్విత్వాక్షరమును నియతముగా వ్రాసెడివారని గ్రంథకర్త భ్రాంతి పడుటచేతనే పూర్ణార్ధబిందు ప్రాసమును నిరూపించుట జరిగినది. పద్యములలో దీర్ఘాక్షరముపై పూర్ణానుస్వార ముండుటను వానితో సిద్ధ పూర్ణానుస్వార పూర్వాక్షరములతోఁ బ్రాసము సంఘటించిన ప్రయోగమ్ములను బరిశీలించుట వలననే కేతన ఆంధ్రభాషా భూషణమునం దీ క్రింది విధముగా నిర్దేశించెను.

'కుఱుచలపై నరబిందులు
నెఱయగ నాదినను జెల్లు నిడుపుల మీఁదన్
నెఱయవు గద్యంబులలో
నెఱిబిందువు లూదుఁ బద్య నికరములోనన్.'

58 వ ప.

అప్పకవి సంయుతా సంయుత ప్రాస లక్ష్యము గూడ దీర్ఘాక్షరముమీఁద పూర్ణానుస్వార లేఖనము పూర్వము సమ్మతమనుటనే నిర్ధారణ చేయును. (పాండి ద్రచ్ఛఁగ నిమ్ము నా తండ్రి కృష్ణ, వేండుకొనియెద నందాఁకఁ బండ్లు దినుము, దుండగపుచేష్టలును నోటిగాంఢ్ర తనము, మెండుగాఁజొచ్చె నీకు నైదేండ్ల కనఁగ—3—315) అనునాసిక ప్రాస వివరణమున గూడ నిట్టి ప్రవాదమునకు వీరు వశులైరి. 'లతాంతములకున్—మొనసి' అనుచో 'ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు' నను ప్రౌఢ వ్యాకర్త సూత్రముచే 'కుమ్మొనసి' యను రూప మేర్పడునని గ్రంథకర్తలు వివరించిరి. సరళ స్థిర పరకత్వమున ద్రుతమునకుఁ గ్వాచిత్కముగా బిందువు వచ్చునని ఆంధ్రశబ్ద చింతామణి వివరించినదనియు వ్రాసిరి. ఈ నియమమునే అప్పకవియు ననుసరించినాఁడని గ్రంథకర్తలు గమనింపలేదు. (చూ—ద్రుత ప్రకృతికాంత బింద్వాదేశము. పు. 324, 325). 'అ ఆ ఐ ఔ లకు మఱి, ఇ ఈ లు ఋకార సహితమె ఏ లకు నౌ, ఉ ఊ ల్తమలో నాడఁబడి, ఒ ఓ లకు వళ్ళగు న్నయోన్నత చరితా' అను పద్యము నుదాహరించి 'ఇందు అ ఆ, ఇ ఈ, ఉ ఊ, ఒ ఓ అను చోట్ల ద్వితీయాక్షరములు ద్విత్వాక్షరములవలె నుచ్చరింపఁబడుఁ గావఁ బ్రథమాక్షరములు హ్రస్వములుగా నున్నను గురువులుగాఁ బ్రయుక్తములని యెన్నవగు' (పు. 324) నని శ్రీ రావూరి దొరసామిశర్మ నిరూపణము. ఇవి హ్రస్వాక్షరములు గావు. దీర్ఘాక్షరములే! (దీర్ఘస్యాద్వర్ణ నిర్దేశే—ఒకచో హ్రస్వంబు దీర్ఘంబగు—నిర్దేశ విధానంబులంగాని రేఫ ప్రత్యయములు రానియెడల హ్రస్వమునకు దీర్ఘమువచ్చునని యర్థము. ఉః ఆ కు ఊ వచ్చును. కా కు గా వచ్చును. లా కు రా వచ్చును. ప్రౌ. వ్యా. సంజ్ఞా సూ. 3). ఈ దీర్ఘాక్షరములను వర్ణ సమామ్నాయమందలి అకార విశిష్టవ్యంజనములను కేవల వ్యంజనములుగా గ్రహించినట్లే హ్రస్వాక్షరములుగా గ్రహించుట జరుగును.

ఈ గ్రంథము ఛందశ్శాస్త్రాభిమాను లెల్ల రవశ్యము పఠింపఁ దగినది. పఠనావసరమున అప్రమత్తత నవలంబించుటయు నావశ్యకము.

—వి. జి. కె.

అభావంలో అబల

రచన : శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి; వెల : మూడు రూపాయలు; ప్రచురణ : నవ్యభారతి, 760, హిమాయత్ నగర్, హైదరాబాదు.

భర్త చెప్పకుండా దేశంమీద పడిపోగా అనాథయైపోయిన ఒక నిర్భాగ్యురాలి కథ ఈ నవల. ఒక్క ఆమే కాదు, ఆ కుటుంబంలో యే వ్యక్తీ అదృష్టానికి నోచుకున్నట్లు కన్పించరు. నవ్వినా విషాదం వ్యక్తమయ్యే వ్యక్తులు అంతా ! కథ ఆరంభం కావడమే కష్టాలతో—దానికి మలుపు యిచ్చే సంఘటనలేవీ లేకపోవడంచేత సగంవరకు చదివేసరికి కొంత విసుగు కలుగుతుంది. చివర ఒక మలుపు ఉంది, కాని దానివల్ల ఏమీ తీరినట్లు కన్పించదు. అత్తగారి ఆరళ్లు, ఆడబిడ్డల పోకిళ్ళూ పడలేక కథానాయకి మాలతి వేరే ఉంటుంది. పోనీ అలా ఆమె అభిమానంగా జీవించేట్టు రచయిత చేశాడా అంటే అదీ లేదు. ఆమెకొక అకస్మాత్తు సుస్తీ తెచ్చిపెట్టి ఆమె నిస్సహాయత్వాన్ని ప్రస్ఫుటింప జేశాడు. చివరకు ఆపరేషన్ తరువాత ఆమె బ్రతికిందో లేదో సరిగా తెలీదు. పాఠకులు వూహించుకోవలసిందే. కాని ఆ సమయానికి మాత్రం భర్త ఆసుపత్రికి చేరుకుంటాడు. అతని పశ్చాత్తాప ప్రకటనకు వీలే లేకుండా కథ తెంపినట్లుగా ముగిసింది.

ఈ కథ చాలావరకు సంభాషణల పూర్వకంగా చెప్పబడింది. సంభాషణలు చాలాచోట్ల అర్థవంతంగా ఉన్నా, మాలతి మాట్లాడిన పట్టులలో స్టేజిపై పాత్ర తన పోర్షన్‌ను వల్లిస్తున్నట్లనిపిస్తుంది. కథలో కొన్ని పాత్రలకు పేర్లు పెట్టడంలో కొంత ఆలోచించి పెడితే బాగా ఉండేది. నవల ఆరంభంలో 'రైలు కూత వినిపించింది., ఉలిక్కిపడింది రేణుక' అన్నప్పుడు ఆమె అత్తగారన్న భావం పాఠకుడికి కలుగదు. అల్లుళ్ళూ, కోడళ్ళూ గల పెద్ద వయస్సు స్త్రీలకు వారి పెద్దతనాన్ని సూచించే పేర్లు పెట్టడం సముచితంగా ఉంటుందేమో.

ఏమైనా కేవలం కల్పితమైన ఇతివృత్తాన్నిగాక, యదార్థమైన మన కుటుంబాల పరిస్థితులను వస్తువుగా తీసుకొని, పూటకు బియ్యం కోసం రాద్ధాంతపడే వ్యక్తుల జీవితాలలోని సంఘర్షణను రచయిత చిత్రించడం ముదావహం.

న వ మి

రచన : దాశరథి; ప్రకాశకులు : దాచేపల్లి కిష్టయ్య అండ్ సన్సు, సికింద్రాబాదు; వెల : నాలుగు రూపాయలు.

రచయితే చెప్పుకున్నట్లు ఇవి ఆకాశవాణి ఆయనచేత వ్రాయించిన నాటికలు. కనుక చాలా మేరకు వ్రాయించినట్లే ఉన్నాయి, గాని రచయిత కళకోసం స్వయంగా వ్రాసినట్లు లేవు. శ్రావ్యత కోసం యమకాలతో మాటల గారడీ చేసి ప్రసారం రక్తికట్టేటట్లు చేసిన ప్రయత్నం కన్పిస్తుంది గాని, పాత్రల పోషణ, సంభాషణలలో ఔచిత్యం సంగతి పట్టించుకున్నట్లు లేదు. ఎంతో సామగ్రి సేకరించి వ్రాసిన 'యశోధర' నాటికలో ఉత్తర కోసల ప్రస్తావన వచ్చినప్పుడు బుద్ధుడు "శాక్యుల పరాక్రమం వేళ్లు తన్నిన స్థలం" అనడం అప్రస్తుతం. లోకమంతా ఆయనదే కదా ! బుద్ధుడు సమాధి నిమగ్నుడై ఉండగా సుందరి, రాహులుడు అక్కడికి చేరుకున్నప్పుడు ఒక శిష్యుడి వాచాలతను హాస్యం కోసం ప్రవేశపెట్టడం ఉచితంగా కన్పించదు. స్త్రీని చూడగానే రిమ్మతెగులు పుట్టే శిష్యుడు అక్కడ ఎలా ఉన్నాడో ! హాస్యం పనికిరాని గంభీరమైన సన్నివేశం అది. అలాగే 'గోల్కొండ' అనే నాటికలో మహమ్మదీయులు గంధర్వలోకమని అనడం, సలాములకు బదులు నమస్కారాలు చెప్పుకోవడం సబబుగా లేదు. అసలు ఈ నాటికకు పెట్టిన పేరే తగింది కాదు. ఇది అనార్కలీ వంటి విషాదాంత ప్రేమగాథ. త్యాగమూర్తి ఒక హైందవ యువతి—శ్యామల. ఇందలి సంభాషణలలో టాగూరు ప్రభావం కన్పిస్తుంది. ఈ సంపుటిలో ఇంకా దేశ స్వాతంత్ర్యోద్యమం, గ్రామ సేవకులకు సంబంధించిన ప్రచార నాటికలు కూడా ఉన్నాయి. ఒక కన్నడ నాటికను అనువదించి చేర్చారు. అది ఏమంత బాగుందని ! రవీంద్రుని 'చిత్రాంగద' అనువాదంలో దాశరథి కవితాశక్తి వ్యక్తమైంది. మాతృకలో ఉన్న స్నిగ్ధత, శృంగారభావ బాహుళ్యము, రామణీయకత తెనుగుసేతలోనూ వచ్చాయి. ఇది ప్రదర్శనయోగ్యంగా కూడా ఉంది.

ఈ సంపుటికి కీ. శే. గోపీచంద్ పీఠిక వ్రాయబోయి కవిగా, రచయితగా దాశరథి వ్యక్తిత్వాన్ని గూర్చి వ్రాసిన రమారమి 30 పేజీల వ్యాసం చదువదగింది.

—డి. రా.

దక్షిణభారత సాహిత్యములు

స్వాతంత్ర్యభాగ్యము బడసినవెనుక భాషాప్రయుక్త రాష్ట్ర విభజనమైనది. దానితో దేశభాషలకు ప్రాధాన్యత హెచ్చినది. ఆయా ప్రదేశములవారు, తమసాహితీ చరిత్రలనే గాక తమ యిరుగుపొరుగుల నున్నవారి సాహితీ చరిత్రలనుగూడ తెలిసికొనుటకు—తన్మూలముగా తమదేశ భాషాభివృద్ధి గావించుకొనుటకు కుతూహలులై యుండుట సహజము. ఇట్టి తరుణమున— వాంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు— తెలుగునకు సంబంధించిన తమిళ, కన్నడ, మళయాళ, మహారాష్ట్ర

సాహిత్యముల చరిత్రలను నందజేయుట యభినందింపదగిన యుద్యమము.

ఇందున్న నాలుగు సాహిత్య చరిత్రలలో, తమిళ మళయాళ సాహిత్యములగూర్చి శ్రీ చల్లా రాధాకృష్ణ శర్మగారు వ్రాసిరి. మళయాళ సాహిత్య చరిత్రయను వాదమే[1]యైనను, నందు స్వతంత్ర రచన యున్నది. శ్రీ శర్మ గారు తమిళ మళయాళ భాషలయందు మంచిప్రవేశము గల వారు. తమిళమున వారు రచయితలు— కావుననే మూల గ్రంథములను గూర్చిన విశేషములను ముఖ్యముగా 'మణిప్రవాళము, మున్నగు రచనలగూర్చి — సప్రమాణముగా, చారిత్రకముగ నాయా సాహితీ చరిత్రలను వ్యక్తముచేసిరి. ఇందలి శైలి సులభగ్రాహ్యము.

కన్నడ సాహిత్య చరిత్ర రచయితలు గడియారము రామ కృష్ణశర్మగారు—వాఙ్మయ చరిత్రయందున్న యుగవిభాగముల ననుసరించి సాహిత్యచరిత్ర వివరించియున్నారు. ఇందు కన్నడ రత్నత్రయము అని పేరందిన పంప, పొన్న, రన్న కవుల కృతులనుగూర్చి సంగ్రహమగు చక్కని రచనగలదు. ఆ వెనుక ప్రసిద్ధులగు కుమారవ్యాసలక్ష్మీశుల రచనా విశేషములు తెలుపబడినవి. ఆధునిక యుగమునందలి వివిధ నూతన సాహిత్య ప్రక్రియల యుదంతము వివృతమైనది. కన్నడ సాహితీ చరిత్రక్రమవికాస మెఱుంగగోరువారికీ వ్యాస మత్యం తోపయుక్తము.

తమిళ, కన్నడ, మళయాళ, సాహిత్య చరిత్రలు కొం చెమో గొప్పయో మనకీవరకు పరిచితములై యున్నవిగాని, మహారాష్ట్ర సాహిత్యచరిత్ర పరిచితముగాలేదు. ఈ లోపము నీ గ్రంథమునగల మహారాష్ట్ర సాహిత్యచరిత్ర తీర్చినది. ఇది సంగ్రహమైనను నిందలివ్యాసములలో పెద్దది. దీనిని రచించిన వారు గుండేరావు హర్కారేగారు. ఈ మహానుభావులు తెలంగా ణాలో పూర్వము నిజాముగారి హయాములో న్యాయాధీశులు. సంస్కృత భాషలో మహామహోపాధ్యాయులచే పూజలందిన మహా విద్వాంసులు. దార్శనికులు. ఆంధ్రమహారాష్ట్ర—ఉర్దూ భాషలయందు పండితులు— తమ మహోన్నత విజ్ఞానమును, తక్కినవారివలెగాక, తెలుగుభాషలో, తెలుగువారి కందజేయు సదుద్దేశము గలవారు. యాస్కాచార్యుని నిరుక్తము తెలుగున రచించియున్నారు. అఖిలభారత ప్రాచ్య విద్వన్మహాసభలలో వీరు ప్రముఖులు. ప్రస్తుత గ్రంథమున మహారాష్ట్ర సాహి త్యము, ఉత్పత్తి, వికాసములు, ఆధునిక చరిత్ర సరళమైన భాషలో సమీక్షితములైనవి.

ఈ గ్రంథమున నాయా రచయితల గూర్చిన తెలివిడి యొకటి యుండదగును. ఇట్టి గ్రంథముల మూలమున, భిన్న భిన్న భాషాసాహిత్యములకు సన్నిహితత్వమేర్పడును. జాతీయ సమైక్యతా సాధన కిట్టి రచనలు ప్రాతిపదికలు.

ఇట్లే, తెలుగునకు సన్నిహితములగు గుజరాతీ, ఉత్కళ, వంగ భాషలలోను, హిందీ మొదలగు నౌత్తరాహిక భాషల సాహిత్యచరిత్రలను సాహిత్య అకాడమీవారు సంతరింపజేసి యాంధ్రభారత సాహిత్య సమైక్యతకు తోడ్పడుదురుగాత.

—రావు.

---

1 ఇది కేంద్రసాహిత్య అకాడమీ దక్షిణ ప్రాంతీయ కార్యాలయాధ్యక్షులు, ప్రసిద్ధ మళయాళభాషా విద్వాంసులునగు శ్రీ డాక్టర్ కె. యమ్. జార్జి, ఎమ్. ఏ., పి. హెచ్‌డి, గారి యాంగ్లవ్యాసమునకు అనువాదము. పుటలు 220 వెల: రు. 3/ ప్రచురణ ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి తిలక్‌రోడ్ హైదరాబాద్.'


ఆంధ్రపత్రిక శోభకృతు సంచిక ఉగాదినాటికి రాగలదు. కాబట్టి తమ రచనలను పంపవలసినదిగా రచయితలను, చిత్రములను పంపవలసినదిగా చిత్రకారులను కోరుచున్నాము. వ్యవధి తక్కువగా నున్నందున ఫిబ్రవరి 20 వ తేదీలోగా పంపవలసినదని ప్రార్థన..

—సంపాదకుడు.]

రాబర్ట్ ఫ్రాస్ట్

సామాన్య మానవుల జీవితాలను తన కవితాగానంతో కలచి వైచిన మహాకవి రాబర్ట్ ఫ్రాస్ట్. ఆయన అమెరికా అనధికార ఆస్థానకవి; ఆయన ఇక లేరు. 88 వ ఏట (జనవరి 29-న) కీర్తిశేషు డయాడు.

ఆయన కవిత—ప్రకృతిని ప్రేమానురాగాలతో ఆరాధించి నప్పు డేమి, మృత్యువును ఎదుర్కొనేటప్పుడేమి ఆయన



రాబర్ట్ ఫ్రాస్ట్

క్షుణ్ణంగా అర్థం చేసుకొని, మనం అర్థం చేసుకొనేట్టు చెప్పిన అమరగేయాలుగా నిలిచిపోయాయి. ఆ మహాకవి మూర్తిని మనం మననం చేసుకోవటమే ఇక మిగిలింది. అమెరికా ప్రెసిడెంటు పదవీ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న తొలి కవి ఫ్రాస్ట్.

రాబర్ట్ లీ ఫ్రాస్ట్ 1874 మార్చి 22 వ తేదీన శాన్ ఫ్రాన్సిస్కో (కాలిఫోర్నియా) లో జన్మించాడు. యువకుడ గా ప్రశాంత జీవితం గడిపాడు. 1913 లో ఆయన పద్యాలు తొలి సారి పుస్తకరూపంలో ప్రచురించారు. అంతకుపూర్వం ఫ్యాక్టరీ కార్మికుడు, పాఠశాల ఉపాధ్యాయుడు, వార్తాపత్రిక సంపాదకుడుగా పని చేశాడు. ఏ ఉద్యోగం చేసినప్పటికీ రైతుగానే జీవిత యాత్ర కొనసాగించాడు.

తన కవితను అమెరికన్ ప్రజలు హృదయంగమంగా ఆలాపించగా కని విని తనివితీర్చుకొన్న వ్యక్తి రాబర్ట్ ఫ్రాస్ట్. ఈ అదృష్టం సాధారణంగా అందరికీ దక్కదు. ఆయనను 76-వ ఏట అమెరికా కాంగ్రెసు (పార్లమెంటు) ముక్తకంఠంతో ఇలా శ్లాఘించింది:

"బహుళంగా ఉన్న ఆయన కథలు, గాథలు, పద్యాలు, గేయాలను అమెరికన్ ప్రజలు – ఆబాలగోపాలం – పదే పదే చదివి వాటిలోని మాధుర్యాన్ని ప్రతిభనూ కూలంకషంగా అర్థం చేసుకొన్నారు."

సన్మానాలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చినవి. ప్రెసిడెంటు కెనెడీ పదవీ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. కాంగ్రెసు లైబ్రరీలో కవితా సలహాదారు పదవిని ఆయనకు ఇటీవలే తిరిగి సొడిగించారు. ఆయన రష్యా సందర్శనం అపూర్వమైనది. పద్య రచనకు రాబర్ ఫ్రాస్ట్ కవికి నాలుగుసార్లు పులిట్జర్ బహుమానం వచ్చింది. యేల్ యూనివర్సిటీ కవిత కోసం ఏర్పాటు చేసిన బొలింజన్ బహుమానం జనవరి ఆరంభంలోనే ఆయనకు ఇచ్చారు.

గత డిసెంబరులో శ్రీ ఫ్రాస్ట్‌కి పెద్ద శస్త్ర చికిత్స చేశారు. పిమ్మట చిన్న శస్త్ర చికిత్స కూడా జరిగింది. ఆయన బాగా కోలుకొంటున్నాడని 10 రోజుల క్రితమే ప్రకటించారు.

కాని జనవరి 29 న ఆయన కన్ను మూశాడు. ఆయన ఒకప్పుడు ఇలా వ్రాశాడు:

"సమాధి ఫలకమే నా కథ (అయితే)
అది క్లుప్తంగా నేనే సొంతంగా
వ్రాసి పెట్టుకుంటాను ఆ ఫలకంమీద"

రాబర్ట్ ఫ్రాస్ట్ అమెరికన్ మహాకవి, యుగపురుషుడని ప్రెసిడెంట్ కెనెడీ శ్లాఘించారు. ఈ మహాకవి మరణంతో అమెరికన్ సాహితీప్రపంచంలో పెద్ద వెలితి ఏర్పడిందని ఖేద పడ్డార

"ఆయన మరణం మనందరకూ లేమిని కలిగించింది అయితే అమెరికన్ ప్రజలు శాశ్వతంగా గానం చేసి అవగాహన చేసుకొనే అమరగేయాలను మనకు ఇచ్చి పోయారు" అని ఊరట చెందరు.

"ఆరోగ్యవంతు డవుతాడనీ, "ఆయన తీర్చవలసిన వాగ్దానాలెన్నో ఉన్నవి; తిరగవలసిన ప్రదేశమెంతో ఉంది; కాని ఆయన శాశ్వతంగా కన్ను మూశాడు" అనీ ఆ మహాకవిపద్యం లోని ఒక పదాన్ని శ్రీ కెనెడీ ఉదహరించారు.

కొలంబో ప్రతిపాదనలు

'పరిశీలక్'

1962 నవంబరు 20 వ తేదీన కమ్యూనిస్టు చైనా ఏక పక్ష యుద్ధ విరమణ చేసిన తర్వాత భారత సరిహద్దుల్లో సైనిక సంఘర్షణలు ఆగినా, భారత ప్రభుత్వంమీద రక రకాలుగా రాజకీయమైన వత్తిడి 1963 జనవరినెలాఖరువరకూ సాగుతూ వచ్చింది. చివరకు చైనా—భారత్ సరిహద్దు వివాదం సామరస్యంగా పరిష్కారం కావడానికి అనువుగా కొలంబో రాజ్యాలు చేసిన ప్రతిపాదనలను భారత ప్రభుత్వము, పార్లమెంటు కూడా ఆమోదించినా, రాజకీయ వత్తిడి తగ్గలేదు. సైనికంగా యుద్ధరంగంలోనేకాక, రాజకీయంగా దౌత్య రంగంలో కూడా భారతదేశం ఇంకా పరిస్థితుల ప్రభావానికి తలొగ్గవలసి వస్తున్నది.

చైనా ఏకపక్ష యుద్ధ విరమణచేస్తూ, రెండు షరతులు పెట్టింది—(1) ఉభయ పక్షాలు పోరు విరమించి 1959 నవంబరు 7 వ తేదీనాటి అధీన శ్రేణినుంచి చెరి 12½ మైళ్ళ వెనక్కు తగ్గడం; (2) సాయుధ బలాల ఉపసంహరణ సమస్యలు, నిస్సైనిక మండల నిర్మాణం, తదితర అంశాలపై ఉభయ పక్షాల అధికారుల మధ్య చర్చలు జరగడం అనేవే ఆ షరతులు. వీని సారాంశమేమంటే, భారత సైన్యాలను చైనా సైన్యాలు ఎంతవరకు వెనక్కు గెంటినవో, అక్కడినుంచి అవి 12½ మైళ్ళ స్వచ్ఛందంగా వెనక్కు తగ్గడం. చైనా సైన్యాలు ఎంతవరకు చొచ్చుకొని వచ్చినవో అక్కడనుంచి అవి 12½ మైళ్ళ వెనక్కు తగ్గడం. ఇలా ఉభయ సైన్యాలమధ్య 25 మైళ్ల వెడల్పున నిస్సైనిక మండలం ఏర్పడడం. అంటే చైనా అప్రకటిత యుద్ధం ద్వారా ఆక్రమించిన సుమారు 2,500 చదరపు మైళ్ళ భారత భూభాగాన్ని వివాదాస్పదమైనదిగా చిత్రించి, నిస్సైనిక మండలంగా అంగీకరించమన్నది. ఇందుకు భారత ప్రభుత్వం అంగీకరించకపోతే ఆత్మరక్షణకోసం చైనా సరిహద్దు రక్షక దళాలు తిరిగి పోరును ప్రారంభించగలవని బెదిరించింది. కాని, భారత ప్రభుత్వం దీనికి అంగీకరించలేదు. 1962 సెప్టెంబరు 8 న చైనా సైన్యాలు పెద్ద ఎత్తున భారత సరిహద్దులపై దాడి ప్రారంభించినవి కనక, ఆ తేదీకి పూర్వంవున్న స్థితి సరిహద్దుల్లో ముందుగా ఏర్పడాలని, ఆ తర్వాతనే సమాలోచనలనేవానికి తాను అంగీకరించగలనని స్పష్టం చేసింది. దీని అర్థం ఏమంటే 1962 సెప్టెంబరు 8 తర్వాత చైనా దురాక్రమణ ద్వారా కైవశం చేసుకున్న 2,500 చదరపు మైళ్ళ భూభాగాన్ని ముందుగా ఖాళీ చేయడం. దానిని భారత ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకొనడం. కాని, ఇందుకు చైనా అంగీకరించలేదు. కనక 1962 నవంబరు 20 నుంచి చైనా—భారత సరిహద్దులో హఠాత్తుగా జరిగిన యుద్ధ విరమణ ఏ నిముషంలోనైనా సమాప్తమై, తిరిగి యుద్ధం సంభవమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులలోనే కొలంబో రాజ్యాలు ముందుకువచ్చి, శాంతి సాధనకు ప్రయత్నాలు ప్రారంభించాయి.

చైనా యుద్ధ విరమణ చేసిన వెంటనే సింహళప్రధాని శ్రీమతి సిరిమావో సూచనపై అరబ్ రిపబ్లిక్, ఘనా, బర్మా, కంబోడియా, ఇండొనీసియా ప్రతినిధులు కొలంబోలో సమావేశమై చైనా—భారత సరిహద్దు వివాద పరిష్కార మార్గాన్ని గురించి సమాలోచనలు చేశారు. అసలు ఇలాంటి సమావేశం జరగాలని, ఆసియా రాజ్యాలకు ఈ వివాదంలో జోక్యం కలిగించాలని కమ్యూనిస్టు చైనా తెరచాటు ప్రయత్నాలు చేసింది. భారతదేశానికి ఇలాంటి సమావేశం జరగడం ఇష్టంలేదని, అసలు శాంతియుతంగా సామరస్య సాధనకు అది సిద్ధపడడం లేదని కూడా ప్రచారం చేసింది. యుద్ధ విరమణ చేస్తూ, తాను చేసిన ప్రతిపాదనలు న్యాయమైనవని, సమంజసమైనవని వాదించుకున్నది. ఇలా సోదర ఆసియా రాజ్యాలలో కమ్యూనిస్టు చైనా సృష్టించిన వ్యతిరేక వాతావరణాన్ని సరిదిద్దుకొనడమనేది భారత ప్రభుత్వానికి తప్పనిసరి అయింది. అప్పుడు ఆరు కొలంబో రాజ్యాలకు భారత ప్రభుత్వం తన ప్రతినిధులను పంపి, తన వాదనలను వివరింపజేసింది. ఇలా చైనా, భారత దేశాల వాదనలను పూర్తిగా విన్నపిమ్మట కొలంబోలో ఈ ఆరు ఆసియా రాజ్యాల ప్రతినిధులు సమావేశమై, సమగ్రంగా చర్చలు జరిపి, కొన్ని రాజీ ప్రతిపాదనలను రూపొందించారు. అయితే వానిని ముందుగా ప్రచురించలేదు. సింహళ ప్రభుత్వ అధికారి ద్వారా వానిని భారత, చైనా ప్రభుత్వాలకు అందజేశారు. ఆ తర్వాత సింహళ ప్రధాని శ్రీమతి బండారు నాయకేను కొలంబో రాజ్యాల ప్రతినిధిగా పెకింగ్‌కు, ఢిల్లీకి పంపి, తమ ప్రతిపాదనలపై ముఖాముఖి చర్చలు కొనసాగింపజేశారు. ఆమె పెకింగ్‌లో పదిరోజులు, ఢిల్లీలో వారం రోజులువుండి ఈ చర్చలు సాగించారు. ఇండొనీసియా ప్రతినిధి శ్రీ సుబంద్రియో పెకింగ్ చర్చలలోను, అరబ్ రిపబ్లిక్ ప్రతినిధి శ్రీ ఆలీసాబ్రి, ఘనా ప్రతినిధి శ్రీ అటా ఢిల్లీ చర్చలలోను శ్రీమతి బండారునాయకేకు సహాయపడ్డారు. కొలంబో ప్రతిపాదనలపై చైనాకు, భారత దేశానికి అవసరమైన విపులీకరణలను వ్రాతమూలకంగా అందజేశారు.

ఈవిధంగా సుమారు రెండు వారాలు పెకింగ్‌లోను, ఢిల్లీలోను కొలంబో రాజ్యాల ప్రతినిధులు రహస్య సమాలోచనలు కొనసాగించినా, అసలు ప్రతిపాదనలు అతి రహస్యంగా వుంచారు. ఉభయ పక్షాలు మూజువాణీగా అంగీకారానికి వచ్చిన తర్వాతనే వానిని ప్రచురించగలమని చెప్పారు. అంద

వల్ల కొలంబో ప్రతిపాదనలను చైనా, భారత దేశాలలో ఎవరు ఎలా ఆమోదిస్తారనేదానిమీద రక రకాల వదంతులు వచ్చాయి. చివరకు "సూత్రప్రాయంగా" చైనా ఆమోదించిందని పెకింగ్ నుంచి ప్రకటన జరిగింది; "ప్రతిపాదనలపై విపులీకరణలతో పూర్తి ఆమోదానికి" పార్లమెంటు నిర్ణయానికి లోబడి, భారత ప్రభుత్వం ఆమోదిస్తున్నదని ఢిల్లీనుంచి అధికార ప్రకటన వచ్చింది. ఆ తర్వాత జనవరి 21 వ తేదీన కొలంబో నుంచి అసలు ప్రతిపాదనలు అధికారపూర్వకంగా వెలువడడంతో ఆసియా రాజ్యాల శాంతి సాధన ప్రయత్నాలలో తొలి ఘట్టం ముగిసింది.

అధికారపూర్వకంగా వెలువడిన కొలంబో ప్రతిపాదనలు ఇవి:—(1) పశ్చిమ రంగంలో (లడక్‌లో) చైనా ఉద్దేశించిన విధంగా ప్రస్తుతం తాము వున్న సైనిక స్థావరాలనుంచి 12½ మైళ్లు వెనక్కు తగ్గాలి. భారత సైన్యాలు తాము వున్న చోటనే ఉండాలి. సరిహద్దు వివాదం తుది పరిష్కారానికి లోబడి, చైనా సైన్యాల ఉపసంహరణతో ఏర్పడిన నిస్సైనిక మండలాన్ని ఉభయ పక్షాలు ఆమోదించిన పౌర గస్తీ కేంద్రాల నిర్వహణకింద ఉంచాలి. ఇందువల్ల ఈ ప్రాంతంలో ఉభయుల పాత హక్కులకు భంగం ఉండదు. (2) తూర్పురంగంలో (నీఫాలో) ఉభయ పక్షాలు అధీన రేఖగా గుర్తించిన ప్రాంతాలు యుద్ధ విరమణ సరిహద్దు కావాలి. మిగిలిన ప్రాంతాల సంగతి చర్చల ద్వారా తేల్చుకోవాలి. (3) మధ్యరంగంలో (బారాహోతీ ప్రాంతంలో) సైనిక బలప్రయోగంతో నిమిత్తం లేకుండా శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. ఈ ప్రతిపాదనలకు అనుకూల వైఖరిని కనబరచినంతమాత్రాన, ఉభయ ప్రభుత్వాలకు, సరిహద్దుల స్థిరీకరణకు సంబంధించిన హక్కులకు ఎలాంటి భంగం కలగదు.

కొలంబో రాజ్యాలు చేసిన ఈ ప్రతిపాదనలలో నిజానికి పెద్దగా చెప్పుకొనవలసినదేమీలేదు. కమ్యూనిస్టు చైనా తనకు తానుగానే తూర్పు రంగంలో మెక్‌మాహన్ రేఖ వరకును, పశ్చిమ రంగంలో తాము అప్పటికివున్న చోటనుంచి 12½ మైళ్లు వెనక్కు తగ్గగలవని ఆదినుంచి చెబుతున్నది. కొలంబో రాజ్యాలు కూడా తమ ప్రతిపాదనలలో చైనాను అంతకు మించి అదనంగా మరేదీ చేయుమనలేదు. అయితే తాము వెనక్కు తగ్గినప్పుడు భారత సైన్యాలు ముందుకువచ్చి, వాని పూర్వపు సైనిక స్థావరాలను ఆక్రమించరాదని ఆదినుంచి చైనా అంటున్నది. అది సైనిక విజయం పొందినందున ఒక ఆదేశంగా చెబుతున్నది. దీనిని భారత ప్రభుత్వం అంగీకరించనన్నది. కొలంబో రాజ్యాలు కూడా సరిగ్గా అదే అన్నవి. భారత సైన్యాలు తమ పూర్వపు ప్రాంతాలను ఆక్రమించవచ్చునన్నవి. కాని, ఇందులో కొన్ని మినహాయింపులు పెట్టాయి. మెక్‌మాహన్ రేఖవద్ద తాగ్లా కనుమ, లాంగ్జూ అనే ప్రాంతాలలో అధీనరేఖ ఎక్కడ వుంది అనే దానిని గురించి తగాదా వున్నది కనక, ఆ రెండు ప్రాంతాలు మినహా మిగిలిన అన్ని చోట్లను భారత సైన్యాలు పునరాక్రమణ చేయవచ్చు నన్నది. పశ్చిమ రంగంలోని లడక్‌లో భారత సైన్యాలు ఇంతవరకు ఎక్కడ వున్నవి అక్కడే ఉండాలని, చైనా సైన్యాలు ఖాళీ చేసిన ప్రాంతాలలో ఉభయుల సమ్మతి మీద పౌర గస్తీ కేంద్రాలను నెలకొల్పుకోవాలని సూచించింది. అంటే లడక్ స్థావరాలను గురించి చైనా వాదనను మెక్‌మాహన్ రేఖవద్ద స్థావరాలను గురించి భారత్ వాదనను కొలంబో ప్రతిపాదనలు అంగీకరించాయన్న మాట: ఇంకా చెప్పుకోవాలంటే వివాదాస్పదంగావున్న రెండు అంశాలను చెరిసగంగా సమర్థించి, ఎవరిది విజయం, ఎవరిది అపజయం అనేమాటకు తావులేకుండా చేశాయి.

అయితే కొలంబో రాజ్యాల ప్రతిపాదనలలో వివరంగా ఈ అంశాలన్నీలేవు. విభిన్నార్థాలకు అవకాశమివ్వగల విధంగా వాని రచన జరిగింది. ఏ అర్థంలో ఏ ప్రతిపాదన జరిగిందే, అమలులో దాని ఫలితం ఎలా ఉండగలదనేది సందేహాలకు తావులేకుండా మధ్యవర్తులైన కొలంబో రాజ్యాలనుంచి తెలుసుకొనడం అవసరమైంది. ఆ దృష్టితోనే భారతప్రభుత్వం కొలంబో రాజ్యాల ప్రతినిధులను కొన్ని విపులీకరణలను కోరింది. వారు వ్రాతమూలకంగా వానిని తెలియజేశారు. ఆ వివరాలను ఘనా ప్రతినిధిద్వారా పెకింగ్‌కు పంపించారు. వాటి వివరాలు ఇవి:—

(1) పశ్చిమ రంగంలో చైనా ప్రభుత్వం అందజేసిన మూడు, అయిదు నెంబరు చిత్ర పటాలలో నిర్వచించినట్లు 1959 నవంబరు 7 నాటి వాస్తవిక అధీన రేఖనుంచి 12½ మైళ్లు చైనా సైన్యాలు వెనక్కు తగ్గాలి.

(2) పైన సూచించిన రేఖవరకు ఇప్పుడున్న భారత ప్రభుత్వపు సైనిక స్థావరాలు యథాతథంగా ఉండాలి.

(3) చైనా సైన్యాల ఉపసంహరణవల్ల ఏర్పడిన 12½ మైళ్ళ నిస్సైనిక మండల నిర్వహణ ఉభయ పక్షాల పౌర గస్తీ కేంద్రాల ద్వారా జరగాలి. అయితే ఇవి ఎక్కడ, ఎన్నిగా ఎలాంటి ఏర్పాట్లతో ఉండాలనేది చైనా—భారత ప్రతినిధుల మధ్య సమాలోచనలద్వారా నిర్ణయం కావాలి.

(4) తూర్పురంగంలో భారత సైన్యాలు వాస్తవిక అధీన రేఖగావున్న మెక్‌మాహన్ రేఖకు దక్షిణదిశ వరకు (విభిన్నాభిప్రాయంవున్న రెండు చోట్ల మినహా) ముందుకు పోగవచ్చు. అలాగే చైనా సైన్యాలు కూడా వివాదంవున్న రెండు ప్రాంతాలు మినహా, మెక్‌మాహన్ రేఖకు ఉత్తరదిశవరకు రావచ్చు. తాగ్లా కనుమ, లాంగ్జూ అనే ప్రాంతాలలో వాస్తవిక అధీన రేఖ ఎక్కడ ఉన్నదనేది వివాదాస్పదంగా ఉన్నందున, ఉభయుల ప్రతినిధుల సమాలోచనల ద్వారా ఈ సంగతి తేల్చుకోవాలి.

(5) మధ్యరంగంలో ఇప్పటి పరిస్థితి యథాతథంగా ఉండాలి. దీనిని మార్చడానికి ఉభయులు ఎలాంటి ప్రయత్నం చేయరాదు.

ఇలా వున్న ఈ విపులీకరణలను, మూల ప్రతిపాదనలను చేయడంలో కొలంబో రాజ్యాల లక్ష్యమేమిటనేది తెలుసుకొవడం అవసరం. 1962 నవంబరు 20 న చైనా ఏకపక్షంగా చేసిన యుద్ధ విరమణను భారత ప్రభుత్వంకాదనలేదు కనక, చైనా సైన్యాల ఉప సంహరణను అమలు జరగనిచ్చి, తన సైన్యాలను

భారత ప్రభుత్వం ముందుకు పంపలేదు కనక, ఆచరణలో జరిగిన యుద్ధ విరమణ స్థితిని స్థిరపరచడం అంటే తిరిగి యుద్ధ ప్రజ్వలనకు అవకాశం లేకుండా చేయడమనేది కొలంబో రాజ్యాల తక్షణ లక్ష్యంగావుంది. అందుకుగాను ఉభయ పక్షాల సైన్యాల మధ్య నిస్సైనిక మండలం ఏర్పాటు అవసరం. ఈ మండలం 25 మైళ్ల వెడల్పున ఉండాలని చైనా, భారత దేశాల మధ్య నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలలో అంగీకారం కుదిరింది. అయితే అది ఎక్కడనుంచి ఎవ్వరివైపున ఎన్నేసి మైళ్ళు అనేది వివాదాస్పదమైంది. అది ఇక్కడనుంచి, ఇన్నేసిమైళ్ళు అని చెప్పడానికి కొలంబో రాజ్యాలు ప్రయత్నించాయి. ఇందుకుగాను లడక్ రంగంలో చైనా వాదనను సమర్థించాయి. నీఫా రంగంలో భారత వాదనను అంగీకరించాయి. తాము సూచించిన ప్రకారం నిస్సైనిక మండలం ఏర్పాటు చేసుకొని, యుద్ధ విరమణ ఒడంబడిక చేసుకొనడానికిగాను ఉభయుల ప్రతినిధులు సమాలోచనలు ప్రారంభించాలని కొలంబో రాజ్యాలు కోరుతున్నాయి. ఆ సమాలోచనల అంశాలను కూడా (ఎక్కడ ఎన్ని సైనిక స్థావరాలు నెలకొల్పాలి; తాగ్లాకనుమ, లోంగ్జూలలో వాస్తవిక అధీనరేఖ ఎక్కడవుంది) వీరు స్థిరపరచారు.

ఇలా వున్న కొలంబో ప్రతిపాదనలపై పెకింగ్‌లో సది రోజుల చర్చ తర్వాత "సూత్రప్రాయంగా" వీనికి చైనా ఆమోదించిందనే అధికార ప్రకటన జరిగింది. ఢిల్లీలో వారం రోజుల చర్చ తర్వాత పార్లమెంటు నిర్ణయానికిలోబడి "విపులీకరణలతో సహాపూర్తిగా "ఈ ప్రతిపాదనలను భారత ప్రభుత్వం ఆమోదించినట్టు ప్రకటన వచ్చింది. అంతటితో కొలంబో రాజ్యాల కృషి కొంతవరకు ఫలించింది. పూర్తిగా ఎందుకు ఫలవంతం కాలేదో ఆ తర్వాత పరిణామాలవల్ల తెలియవచ్చింది.

భారత దేశానికి సంబంధించినంతవరకు కొలంబో ప్రతిపాదనలమీద రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమైనాయి. ఈ ప్రతిపాదనలను పూర్తిగా నిరాకరించాలని కమ్యూనిస్టు పార్టీ, అతివాద వర్గానికి చెందిన స్వతంత్రులు మినహా మిగిలిన ప్రతిపక్షాలన్నీ ప్రకటించాయి. కమ్యూనిస్టులు, అధికార పక్షమైన కాంగ్రెసుమాత్రం వీనిని ఆమోదించాలన్న వాదన చేశాయి. జనవరి చివరి వారంలో జరిగిన పార్లమెంటు చర్చలలో కూడా ఈ ధోరణులే వ్యక్తమైనాయి. అయితే ఇందులో గమనార్హమైన అంశాలు కొన్ని బయట పడ్డాయి.

మొదటి అంశం, అసలు కొలంబో ప్రతిపాదనలను కమ్యూనిస్టుచైనా ఆమోదించిందా లేదా? ఈ ప్రశ్నకు కొలంబో రాజ్యాలుకూడా సూటిగాసమాధానంచెప్పలేదు. యథాతథంగాఆమోదించలేదని, స్వంతనిర్వచనాలతోఆమోదిస్తున్నదని ప్రధాని నెహ్రూ ప్రకటించారు. చైనా ఆమోదించని ప్రతిపాదనలను భారత దేశంమాత్రం ఎందుకు ఆమోదించాలి? ఆమోదించి ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న మరొకటి వచ్చింది. అంతేకాదు. భారత ప్రభుత్వం ఆమోదాన్ని సూచిస్తూ, ప్రధాని నెహ్రూ సింహళ ప్రధానికి ఎందుకు ఒక నివేదికను అందజేశారని ప్రతిపక్షం ప్రశ్నించింది. ఆ నివేదికను పార్లమెంటుముందు పెట్టమని కోరింది. దానిని వెల్లడించడానికి ప్రధాని నెహ్రూ నిరాకరించారు. కొలంబో ప్రతిపాదనలను ఆమోదించినందున, అంతర్జాతీయ రంగంలోను, భారతదేశం శాంతిప్రియత్వం, సమైక్యత బలపడగలదని వాదించారు. రష్యాతో సిద్ధాంత సంబంధమైన వివాదం తెచ్చుకొని కమ్యూనిస్టు రాజ్యాలమధ్య ఏకాకిగా నిలచిన చైనా, ఇప్పుడు కొలంబో రాజ్యాల మాటను కూడా విననప్పుడు ఆసియా రాజ్యాలనుంచి కూడా వేరుపడిపోగలదని వాదించారు. కమ్యూనిస్టు చైనాను రాజకీయంగా అంతర్జాతీయ రంగంలో దెబ్బతీయడం ప్రధాని నెహ్రూ లక్ష్యంగా ఉన్నప్పటికి, జాతీయంగాను, సైనికంగాను భారతదేశం సరిహద్దుల్లో పొందిన అవమానం, అపజయం సంగతిని ప్రధాని విస్మరించడం శోచనీయమని ప్రతిపక్షాలు విమర్శించాయి. రాజకీయ ఆశయాలు, అంతర్జాతీయ విధానాల సంగతికంటె, దేశ సరిహద్దుల భద్రత, భౌగోళిక రక్షణల సంగతి ప్రముఖంగా ఆలోచించాలన్నారు. అందువల్లనే పార్లమెంటు చర్చలు చివరి రెండు రోజులు చాలా ఉధృతంగా సాగాయి. ప్రధాని నెహ్రూ విధానాలు తీవ్ర విమర్శకు గురిఅయినాయి.


రెండవ అంశం, సెప్టెంబరు 8 కి పూర్వం వున్న పరిస్థితులు ఏర్పడితే చైనాతో చర్చలకు సిద్ధమని భారత ప్రభుత్వం చేసిన ప్రకటన పార్లమెంటు ఆమోదాన్ని పొందలేదు కనక, ఆ విధానంతో పార్లమెంటుకు సంబంధం ఎందుకు ఉండాలన్నది. పార్లమెంటు నవంబరు 14 సమావేశాలలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం భారత భూభాగంమీద జరిగిన దురాక్రమణను పూర్తిగా తొలగించడం జాతీయ లక్ష్యమని చెబుతున్నది. ఆ తీర్మానంలో సెప్టెంబరు 8 కి పూర్వం స్థితి ఏర్పడితే చైనాతో సమాలోచనలను భారత ప్రభుత్వం కొనసాగించాలని ఉదాహరించలేదు. అయితే సోషలిస్టుపార్టీవారు అప్పుడొక సవరణ తెచ్చారు. సెప్టెంబరు 8 కి పూర్వపు స్థితి ఏర్పడినా చర్చలు కొనసాగించరాదు, అని ఆ సవరణ కోరుతున్నది. దానిని పార్లమెంటు అప్పుడు నిరాకరించింది. కనక ప్రభుత్వ విధానాన్ని పరోక్షంగా పార్లమెంటు ఆమోదించిందని ప్రధాని నెహ్రూ వాదించారు. ఈ వాదన ప్రతిపక్షాలకు కష్టం కలిగించింది. ప్రత్యేకంగా పార్లమెంటు అనుమతి పొందకుండా ప్రధాని ఇలా పరోక్ష నిర్ణయాలకు అనుకూలమైన అన్వయాలు చెప్పడం శోచనీయమని ప్రతిపక్షాలు విమర్శించాయి. అంతే కాదు. కొలంబో ప్రతిపాదనలను గురించి పార్లమెంటులో అధికార తీర్మానానికి ఎలాంటి సవరణలు ప్రతిపాదించకుండా, ప్రభుత్వానికి అనువగు అవకాశమివ్వాలన్న భావాన్ని మార్చుకొని, కొలంబో ప్రతిపాదనలు భారత జాతి గౌరవానికి విరుద్ధంగా ఉన్నందున నిరాకరించాలంటూ సోషలిస్టుపార్టీ తెచ్చిన సవరణను వోటింగ్‌కు పెట్టించాయి. సవరణకు అనుకూలంగా 59 మంది, వ్యతిరేకంగా 349 మంది వోటు చేశారు. పార్టీ బలంతో ప్రభుత్వ విధానం నెగ్గినప్పటికి, చైనా దురాక్రమణను ఎదుర్కొనడంలో అంతవరకు కానవచ్చిన అన్ని పార్టీల సమైక్యత అనేది ఇప్పుడు లోపించింది. కాంగ్రెసు పార్టీని కమ్యూనిస్టులు బలపరచడమనేది దేశంలో భవిష్యత్ రాజకీయ పరిణామాలక

సూచన కాగలదా అన్న వ్యాఖ్యానం వినవచ్చింది. చైనాతో సమాలోచనలు కొనసాగించడం అనేది కాంగ్రెసు (పాలక) పార్టీ విధానమే కాని, భారత ప్రజల అభీష్టం కాదని వెల్లడైనది.

మూడవ అంశం, సెప్టెంబరు 8 కి పూర్వం వున్న పరిస్థితులు ఏర్పడితే చైనాతో చర్చలకు సిద్ధమనే విధానం ప్రకారం చూచినా కొలంబో ప్రతిపాదనలు భారతదేశపు కనీసపు కోర్కెనైనా తీరుస్తున్నదా అనేది. ఈ విధానం ప్రకారం అటు లడక్‌లోను, ఇటు నీఫాలోను సుమారు 2,500 చదరపు మైళ్ల ప్రాంతంలో భారత సార్వభౌమాధికారం తిరిగి నెలకొనాలి. ఆ ప్రాంతాలలోని స్థావరాలు భారత సైన్యాల అధీనం కావాలి. కొలంబో ప్రతిపాదనల ప్రకారం లడక్ రంగంలో భారత సైన్యాలు ఇప్పుడున్న చోటునుంచి ముందుకు కదలడానికి వీలుపడదు. కాని, చైనా సైన్యాలు అవి ఇప్పుడున్న చోటనుంచి 12½ మైళ్లు వెనక్కు తగ్గినప్పుడు మూడు చోట్ల మినహా తక్కిన చోట్ల సెప్టెంబరు 8 కి పూర్వం అవి వున్న స్థావరాలలో ఉంటాయి. కనీసం ఈ మూడుచోట్లనుంచి కూడా మరి కాస్త వెనక్కు తగ్గమని కొలంబో రాజ్యాలు చైనాకు చెప్పడంలేదు సరికదా, భారత సైన్యాలు ముందుకు వచ్చి, సైనిక స్థావరాలను నెలకొల్పరాదంటున్నవి. కాగా, భారత దేశానికి చెందిన భూభాగాన్ని నిస్సైనిక మండలంచేసి, ఉభయుల సమ్మతిమీద పౌర గస్తీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నవి. అంటే పరోక్షంగా ఈ సరిహద్దుభాగం వివాదాస్పదమైనదని, దానిలో చైనాకు హక్కుకలదని గుర్తించమంటున్నవి. ఇక నీఫాలో మెక్‌మోహన్‌రేఖ అనేది చిరకాలపు సరిహద్దుగావుంది. ఈ రేఖకు దక్షిణంగా లోంగ్జు, తాగ్లా కనుమ అనేవి ఉన్నాయి. కాని, అవి తమ వైపున ఉన్నాయని చైనా వాదిస్తున్నది. కనక ఆ రెండు ప్రాంతాలు మినహా మిగిలినచోట్ల మెక్‌మోహన్‌రేఖవరకు భారత సైన్యాలు ముందుగా రావచ్చునని కొలంబో రాజ్యాలు సూచిస్తున్నవి. అంటే ఈ రంగంలో కూడా సెప్టెంబరు 8 కి పూర్వంవున్న స్థితి ఏర్పడదన్నమాట. చైనా—భారత సరిహద్దులను రంగాల వారీగా పరిశీలిస్తే కానవచ్చే పరిస్థితి ఇది. కాని, ప్రధాని నెహ్రూ మాత్రం ఈ దృష్టితో వీనిని పరిశీలించడంలేదు. అంతర్జాతీయ దృష్టికితోడు, చైనా విజయగర్వంతో చేసిన ప్రతిపాదనలతో పోల్చి, కొలంబో ప్రతిపాదనలు భారత వాదనకు అనువుగా ఉన్నవంటున్నారు. అటు లడక్‌లోకాని, ఇటు నీఫాలోకాని భారత సైన్యాలు ఒక్క అడుగు ముందుకు వేయరాదు సరికదా ఇంకా 12½ మైళ్లు వెనక్కు తగ్గాలనేది చైనా ఆదిలో చేసిన ప్రతిపాదనగావుంది. ఇలా భారత సైన్యాలు వెనక్కు తగ్గవలసిన అవసరంలేదని భారతదేశం చెప్పింది. కొలంబో రాజ్యాలూ చెప్పాయి. అది మనకు అనుకూలమైన మాటకింద ప్రధాని లెక్క కట్టారు. అటు లడక్‌లోను, ఇటు నీఫాలోను భారత సైన్యాలు ముందుకుపోరాదనేది చైనా వాదన. అయినా, ఇటు నీఫాలో మెక్‌మోహన్‌రేఖవరకు (రెండు చోట్లు మినహా) భారత సైన్యాలు ముందుకు పోవచ్చునని, అటు లడక్‌లో మాత్రం ఉభయుల సమ్మతిమీద పౌర గస్తీ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని, ఉభయుల సైన్యాలు ఉండరాదని కొలంబో రాజ్యాలు సూచించడం "చాలవరకు భారత్ వాదనకు అనుకూలం" అని ప్రధాని భావించారు. ఆ ప్రకారమే పార్లమెంటులో తన విధానానికి ఆమోదం పొందారు.

అయితే కమ్యూనిస్టు చైనామాత్రం ఇలా భావించడం లేదన్నది క్రమ క్రమంగా బయటపడుతూ వచ్చింది. కొలంబో ప్రతిపాదనలకు "అనుకూల వైఖరి" అంటే "సూత్రప్రాయంగా ఆమోదం", అంటే భారత్‌తో చర్చలు కొనసాగించడానికి ఆ ప్రతిపాదనలను కేవలం ప్రాతిపదికగా మాత్రమే తాము అంగీకరిస్తున్నట్టు అర్థం తీశారు. ఆ విధంగా సింహళ ప్రధాని సిరిమావో బండారు నాయకేకు చైనా ప్రధాని చౌ—ఎన్—లై లేఖ వ్రాయడంతో కొలంబో ప్రతిపాదనలను చైనా ఆమోదించడం లేదన్నది తెలియ వచ్చింది. అంతేకాదు. కొలంబో ప్రతిపాదనల ప్రకారం లడక్ రంగంల వలెనే, నీఫా రంగంలో కూడా భారత సైన్యాలు ఎక్కడ వున్నవి అక్కడే ఉండాలని, ముందుకువచ్చి సైనిక స్థావరాలను నెలకొల్పరాదని ఇంకా పట్టుబడుతున్నది బయట పడింది. సైనిక విజయాలద్వారా ఆక్రమించిన ప్రాంతాలను తన సైన్యాలు కాళీ చేసినప్పుడు భారత సైన్యాలు ముందుకు వచ్చి, వానిని ఆక్రమించరాదు అనేది ఆదినుంచి చైనా వాదనగావుంది. ఆ వాదనను లడక్ రంగానికి సంబంధించినంతవరకు కొలంబో రాజ్యాలు అంగీకరించాయి. కాని, ఇప్పుడు నీఫా రంగంలో కూడా తన వాదనకు కొలంబో రాజ్యాలు అంగీకరించాలని చైనా కోరుతున్నది. అంతేకాదు. తాను కాళీ చేసిన ప్రాంతాలలో చివరకు పౌర గస్తీ కేంద్రాలను కూడా తాను నెలకొల్పునని, భారతదేశం కూడా అలాగే చేయాలని ప్రతిపాదిస్తున్నది. అంటే సైనిక విజయాల ద్వారా ఆక్రమించిన 2,500 చదరపు మైళ్ల ప్రాంతం నిస్సైనిక మండలంగా ఉండాలని, అందులో తన తరఫున భారతదేశం తరపున సైనిక స్థావరాలు మాత్రమేకాక, పౌర గస్తీ కేంద్రాలు కూడా ఉండరాదని పట్టుబడుతున్నది. కొలంబో రాజ్యాలు భారత ప్రభుత్వానికి ఇచ్చిన వివరీకరణలు భారత ప్రభుత్వం "చెప్పుకుంటున్నవి"గా చైనా చిత్రిస్తున్నది. ఈ పరిస్థితులలో కొలంబో రాజ్యాలు తిరిగి మరికొన్ని ప్రయత్నాలు చేయవలసిన అవసరం ఏర్పడింది.


మా వ్యాసకర్తలు



శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావు

రాష్ట్రంలోని అగ్రశ్రేణి విద్వత్ గాయకులలో ఒకరు సత్సంప్రదాయబద్ధమైన కర్ణాటక సంగీత శాస్త్ర మర్మ మెరిగినవారు. చదివింది న్యాయవాదవృత్తికి (బి. ఏ. బి. ఎల్); చేస్తున్నది గాయక ఉద్యోగం. సంగీత సాహిత్యాలలో సమాన ప్రతిభావంతులైన శ్రీనివాసరావుగారు జన్మించింది రాయల సీమలో (21—8—1918 జననం. పెనుకొండ; అనంతపురం జిల్లా; తండ్రి: శ్రీ నారాయణరావుగారు; తల్లి శ్రీమతి గంగా బాయ్‌గారు) ఉత్తమ గాయకుడుగా ఖ్యాతి నార్జించింది యావ ద్దక్షిణ భారతంలో.

అనంతపురం కలెక్టరు ఆఫీసులో స్వల్పకాలం గుమాస్తాగిరి చేశారు. సంగీత సరస్వతి అక్కడ వారికాలు నిలవకుండాచేసి, టైగర్ వరదాచారిగారి వద్ద శిష్యరికానికి పంపించింది. వారే వీరి గురుపాదులు. శ్రద్ధతో, ఉత్సాహంతో, పట్టుదలతో, అనేక ప్రాచీన సంప్రదాయ కీర్తనలు సేకరించి, స్త్రీల పాటలు, పల్లె పదాలు అనేకం ప్రోగుచేసి వాటి ద్వారా ప్రాచీనమైన కొన్ని రాగాల స్వరూపాలను కల్పన చేయగలిగారు. తెలుగు, తమిళ, కన్నడ, మరాఠీ, సంస్కృతాంగ్ల భాషలలో పాండిత్యం కలిగిన సంగీత రస హృద యులు. కర్ణాటక సంగీతాన్ని మించినదిలేదంటారు. ప్రస్తుతం ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో శాస్త్రీయ సంగీత కార్యక్రమ నిర్వాహకులు.



శ్రీ వంతరాం రామకృష్ణారావు

శ్రీ వంతరాం రామకృష్ణారావుగారు—తల్లిదండ్రులు వరసమాంబా చిరంజీవులు. జననము 21—3—1934. జన్మస్థానము శ్రీకాకుళంజిల్లా వంతరాం గ్రామం. 1956 సం. ఆంధ్ర విశ్వ విద్యాలయ తెలుగు ఆనర్సులో ఉత్తీర్ణ లయ్యారు. ప్రస్తుతం శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా ఉన్నారు. గాండీవి నామంతో వ్రాసిన వీరి వ్యాసాలు అనేకం ప్రకటితమైనాయి. వ్యాకరణంలో ప్రత్యేక కృషి చేశారు. భాషా పరిశోధన, కావ్య విమర్శ అభిమాన విషయాలు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.